త్యాగాల గుర్తుల్లో

సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుల జీవిత చరిత్రలు

సంకలనం -3

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)



త్యాగాల గుర్తుల్లో

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
కేంద్ర కమిటీ సభ్యుల జీవిత చరిత్రలు

సంకలనం – 3

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

ముందుమాట

అమరులు చూపిన వెలుగుల బాటలో పయనిద్దాం

2026 అమరవీరుల సంస్మరణ దినం (జూలై 28) సందర్భంగా... 'ఆపరేషన్ కగార్' ప్రారంభమైన తర్వాత వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన కొంత మంది సిసి (CC) నాయకుల సంక్షిప్త జీవిత చరిత్రలను ఈ సంకలనం ద్వారా మీ ముందుకు తెస్తున్నాము. ప్రపంచ సోషలిస్ట్ విప్లవంలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించే మహత్తర లక్ష్యం కోసం గత రెండేళ్లలో 900 మంది వరకు యోధులు అమరులయ్యారు. వీరిలో ఎందరో వీరనారీమణులు ఉన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో మొదలైన లొంగుబాట్ల ద్రోహపూరిత పర్వం వైపు వారు కన్నెత్తి అయినా చూడలేదు; చివరి శ్వాస వరకు పోరాడేందుకే సిద్ధపడ్డారు. ఓటమి ముంగిట నిలిచినా లొంగిపోవడానికి వారు అంగీకరించలేదు. ఎందుకంటే, తమ లొంగుబాటు దేశ ప్రజానీకాన్ని, విప్లవోద్యమాన్ని నైతికంగా దెబ్బతీస్తుందని వారు భావించారు. ఆ అమర వీరుల విప్లవ స్మృతికి వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం! దోపిడీ, పీడనలు లేని కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించాలనే వారి కలలను సాకారం చేసేందుకు, విప్లవోద్యమాన్ని తిరిగి నిర్మించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తామని శపథం చేద్దాం.

1967 నక్సల్బరీ తిరుగుబాటు కాలం నుండి, మన పార్టీ వ్యవస్థాపకులు, భారత విప్లవ మహా నాయకులైన కామ్రేడ్ సీఎం, కామ్రేడ్ కేసీలు చూపిన 'దీర్ఘకాలిక ప్రజా యుద్ధ' మార్గాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా దాదాపు 20,000 మంది యోధులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేశారు. ఈ కగార్ యుద్ధంలో కామ్రేడ్ కేశవరావు అమరత్వంతో పార్టీ మరో ప్రధాన కార్యదర్శిని కోల్పోయింది. మే 21, 2025 లో గుండెకోట్ వద్ద మరో 27 మంది కామ్రేడ్లతో కలిసి శత్రు సైన్యంతో వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్ నంబళ్ల కేశవరావు (బసవరాజు) అమరుడయ్యారు. కా. చారు మజుందార్, కా. జవహర్‌ల తరువాత శత్రు దాడిలో అమరుడైన ప్రధాన కార్యదర్శి. ఆనాడు కామ్రేడ్ చారు మజుందార్‌కు జైల్లో వైద్యం నిరాకరించి, పోలీస్ కస్టడీలోనే ఆయన ప్రాణాలు తీశారు. అలాగే, సిపిఐ (మావోయిస్టు) పొలిట్ బ్యూరో సీనియర్ సభ్యుడు, భారత విప్లవం సృష్టించిన మరో మహా నాయకుడు కామ్రేడ్ కిషన్ దా (ప్రశాంత్ బోస్) కూడా రాంచీ జైలులో అమానవీయ పరిస్థితుల నడుమ ఐదు సంవత్సరాల పాటు బందీగా ఉండి, సరియైన వైద్యం అందక దాదాపు 75 ఏళ్ల పైబడిన వయసులో కన్నుమూశారు.

మోదీ-షా నాయకత్వంలోని 12 ఏళ్ల ఫాసిస్ట్ బీజేపీ పాలనలో దళారీ పెట్టుబడిదారులు, విదేశీ సామ్రాజ్యవాదుల దోపిడీ మితిమీరిపోయింది. ఈ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కొద్దిమంది కార్పొరేట్ శక్తులకు దేశ సహజ సంపదనంతటినీ ఉచితంగా దోచిపెడుతోంది. నయా-వలసవాద దోపిడీ, పీడనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఫలితంగా దేశీయంగా, అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభం మరింత ముదిరి, ప్రాథమిక వైరుధ్యాలు తీవ్రమయ్యాయి. ఈ బడా కార్పొరేట్ సంస్థల దోపిడీకి మరింత వెసులుబాటు కల్పించేందుకే ఉన్న చట్టాలను తుంగలో తొక్కడమే కాకుండా వ్యవసాయ, కార్మిక, పర్యావరణ చట్టాలను యథేచ్ఛగా సవరించారు.

ఆర్థిక సంక్షోభం వల్ల సామాన్యుల బతుకు భారమైపోవడంతో పీడిత వర్గాల్లో, వివిధ సెక్షన్లలో మునుపెన్నడూ లేనంత అసంతృప్తి రగులుతోంది. ప్రజలు మిలిటెంట్ పోరాటాలకు సన్నద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వాలు మాత్రం ప్రజల కనీస ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ఈ ఉద్యమాలను క్రూరంగా అణచివేస్తున్నాయి. ప్రజల ఈ మహత్తర పోరాటాలకు సరైన నాయకత్వం లేకుండా చేయడం కోసం విప్లవ, ప్రజాస్వామ్య, ప్రగతిశీల, దేశభక్త శక్తులపై సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకులంతా కలిసి వ్యవస్థీకృత దాడులకు తెగబడుతున్నారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులు, దళారీ పాలక వర్గాల ప్రయోజనాల కోసం 'వికసిత్ భారత్' అనే నినాదంతో హిందుత్వ ఫాసిజాన్ని, నకిలీ దేశభక్తిని రేకెత్తిస్తూ నిరసన గళాలను నలిపేస్తోంది. బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజం నగ్నంగా పీడిత కులాల ప్రజలను ఒక వైపు అణచివేస్తూనే మరొకవైపు హిందూత్వ మతోన్మాద భావజాలం, కుహనా దేశభక్తితో మత మైనారిటీలపైకి రెచ్చగొట్టి తమ దోపిడీ అణచివేతలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే, విప్లవోద్యమాన్ని సర్వనాశనం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతీఘాతుక యుద్ధాన్ని తీవ్రతరం చేశాయి. సూరజ్‌కుండ్ ప్రణాళికలో భాగంగా 'ఆపరేషన్ కగార్' పేరిట సాగుతున్న ఈ దాడి, గతంలోని 'ఆపరేషన్ గ్రీన్ హంట్', 'సమాధాన్'ల తీవ్ర రూపమే. అసలు 'ఆపరేషన్ కగార్' అనేది మావోయిస్టు ఉద్యమంపై సాగుతున్న యుద్ధం మాత్రమే కాదు, అది ఆదివాసీల ఊచకోత. ఈ వేట కోసం లక్షలాది సాయుధ బలగాలను మోహరించి, వైమానిక, డ్రోన్ దాడులకు తెగబడ్డారు. ఈ మారణకాండను తిప్పికొట్టే పోరాటంలో వందలాది మంది పార్టీ నాయకులు, పిఎల్‌జిఎ కమాండర్లు, ఆదివాసీ ప్రజా సంఘాల నేతలు అమరులయ్యారు. అయితే కొన్ని ద్రోహుల వల్ల, పార్టీ చేసిన కొన్ని రాజకీయ, సైనిక తప్పిదాల వల్ల ఈ వీరోచిత పోరాటాలు మాత్రమే

ఉద్యమాన్ని రక్షించడానికి సరిపోలేదు. ఈ పరిణామాల నుండి మనం సైద్ధాంతిక, రాజకీయ, సైనిక పాఠాలను నేర్చుకోవలసి ఉంది. ఆ పనిని మనం తప్పక పూర్తి చేద్దాం. కానీ, ఈ అమరవీరుల దినోత్సవం వేళ, విప్లవ పతాకాన్ని చేతబూని చివరి శ్వాస వరకు పోరాడిన ఆ విప్లవ నాయకుల, సేనానుల జీవితాల నుండి మొదటగా మనం స్ఫూర్తిని పొందుదాం.

వారి జీవిత చరిత్రలను చదివితే భారత విప్లవోద్యమ ప్రస్థానం మన కళ్లముందు కదలాడుతుంది. ఎన్నో ఒడిదుడుకులు, మలుపులు, ముందడుగులు, వెనకడుగులను దాటుకుంటూ ఉద్యమం ఎలా సాగిందో మనకు అర్థమవుతుంది. సామ్రాజ్యవాదం, దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత వర్గ పోరాటాలు మనకు గుర్తుకు వస్తాయి. స్పార్టకస్, పారిస్ కమ్యూనార్డ్స్ తిరుగుబాట్లు ఓడిపోయినా అవి ఎలా చరిత్రలో నిలిచిపోయి ఈనాటికీ స్ఫూర్తిని ఇస్తున్నాయో అట్లాగే ఈ అమరుల పోరాటం కూడా మనకు స్ఫూర్తినిచ్చి నడిపిస్తుంది. మన నేలను అన్ని రకాల దోపిడీల నుండి విముక్తి చేసే వరకు మనం విశ్రమించకూడదు. భారత విప్లవ ఉజ్వల భవిష్యత్తుపై నమ్మకాన్ని గుండెల్లో పదిలంగా ఉంచుకుందాం.

అమరులైన కామ్రేడ్ బసవరాజు, కిషన్ దా వంటి నాయకులు దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో ఎదురైన ఎన్నో సిద్ధాంత, ఆచరణాత్మక సవాళ్లను పరిష్కరించడానికి శ్రమించారు. ఉద్యమంతో పాటే వారి శ్రామికవర్గ వ్యక్తిత్వం కూడా రాటుదేలింది. మార్క్సిజం–లెనినిజం–మావోయిజం (ఎమ్.ఎల్.ఎమ్.) సిద్ధాంతంపై వారు నిరంతరం అవగాహనను పెంచుకున్నారు, దానికి కట్టుబడి తమ ఆచరణ కొనసాగించారు. సిద్ధాంతాన్ని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అన్వయిస్తూ సమర్థవంతంగా పనిచేసి గొప్ప అనుభవాన్ని గడించారు. వారు ప్రజలను, విప్లవాన్ని నమ్మి, దానికోసమే బతికి, దానిపై చెరగని ముద్ర వేశారు. అలాగే అమరవీరులైన కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్స్ కోసా, ప్రయాగ్ మాంఝీ (వివేక్), మోడెం బాలకృష్ణ, చలపతి, పతీరామ్ మాంఝీ (అనల్), గాజర్ల రవి, పాక హనుమంతు, ఖాతా రామచంద్రారెడ్డి, సహదేవ్ సోరేన్, హిడ్మాల జీవిత చరిత్రలను ఇందులో పొందుపరిచాము. కా. అనల్, సహదేవ్‌ల జీవిత చరిత్రలను మాత్రం రేఖామాత్రంగా మాత్రమే పరిచయం చేయగలుగుతున్నాము. భవిష్యత్తులో ఈ లోపాన్ని పూరించుకో గలుగుతామని ఆశిస్తున్నాము.

వీరంతా విభిన్న విప్లవ తరాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, గత ఐదు దశాబ్దాలుగా ఉద్యమాన్ని విభిన్న స్థాయిల్లో నడిపించారు.

ఈ అమరవీరులైన నాయకులకు పీడిత ప్రజలకు సేవ చేయడం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడే దృఢ సంకల్పం, శత్రువును సిద్ధాంతపరంగా, సైనికపరంగా ఎదుర్కొనే

అచంచలమైన ధైర్యం ఉండేవి. వారు అజ్ఞాతవాసంలో గడుపుతూ, బుర్జువా భావజాలాన్ని ఎదుర్కొంటూ కఠినమైన పరిస్థితులను చిరునవ్వుతో తట్టుకున్నారు. విభిన్న కమిటీల బాధ్యులుగా, కార్యదర్శులుగా, గెరిల్లా సైనిక కమిషన్ల సభ్యులుగా వారు విప్లవ రథాన్ని నడిపించారు.

కొందరు కామ్రేడ్లు జైల్లో అత్యంత భయంకరమైన పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ లొంగలేదు. కష్టాలు వారిని మరింత ఉక్కులా మార్చాయి. ఉద్యమం తాత్కాలికంగా ఎదురుదెబ్బలు తిన్నప్పుడు కూడా వారు చెదరని గుండె నిబ్బరంతో ఉద్యమాన్ని ముందుకు నడిపారు. శత్రువుల దాడులను తిప్పికొట్టే వ్యూహాలను రచిస్తూనే, ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశారు.

మార్క్సిజాన్ని వక్రీకరిస్తూ, దోపిడీదారులకు వత్తాసు పలికే కుహనా విప్లవకారులను, సంస్కరణ వాదులను ఎండగట్టడంలో ఈ అమరవీరులు ముందున్నారు. అవకాశవాదులకు, ద్రోహులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిన కామ్రేడ్స్ సీఎం, కేసీల మహోన్నత వారసత్వాన్ని వారు కాపాడారు.

కేంద్ర కమిటీ సభ్యులుగా వారు క్లిష్టమైన బాధ్యతలను భుజాలకెత్తుకుని, వ్యూహాలను, విధానాలను, ప్రణాళికలను రూపొందించడంలో, వాటిని అమలు చేయడంలో అగ్రభాగాన నిలిచారు. వారి గుండెల్లో దోపిడీ వర్గాల పట్ల తీవ్రమైన వర్గ ద్వేషం, శ్రామిక ప్రజల పట్ల అనంతమైన ప్రేమ ఉండేవి. 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అనే మార్క్సిస్ట్ సూత్రాన్ని వారు బలంగా నమ్మారు. ప్రజల ప్రయోజనాలను, శ్రేయస్సును తమ స్వంత ప్రయోజనాలుగా భావించారు. ఎంతో సాదాసీదాగా జీవిస్తూ నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచారు. "ప్రజల కోసం ఎందరో విప్లవకారులు ప్రాణాలర్పించారు. వారి స్మృతి మన హృదయాలను కలచివేస్తుంది. అలాంటప్పుడు మనం త్యాగం చేయలేని స్వార్థం ఏముంటుంది? సరిదిద్దుకోలేని తప్పు ఏముంటుంది?" అన్న మావో సూక్తులను వారు అక్షరాలా ఆచరించారు. తమను తాము నిరంతరం సరిదిద్దుకుంటూ, ఆత్మవిమర్శ చేసుకుంటూ కేడర్ల, ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు.

"ఒక మంచి పని చేయడం సులభం, కానీ జీవితాంతం మంచిగా జీవించడం కష్టం. కొంతకాలం విప్లవకారులుగా బతకడం సులభం, కానీ జీవితాంతం విప్లవకారులుగా జీవించి, విప్లవకారులుగానే ప్రాణాలు విడవడం అత్యంత కష్టం" అన్న మావో మాటలను ఈ అమరవీరులు తమ మరణంతో నిరూపించి విప్లవ శిఖరాలయ్యారు.

అమరులైన కామ్రేడ్లు శ్రామికవర్గ ఎర్రజెండాను చేతబూని మృత్యువుకు ఎదురొడ్డి నిలిచారు. వారి జీవితాన్ని, వారి బలిదానాన్ని అధ్యయనం చేస్తే మనం ఎన్నో విషయాలను

నేర్చుకుంటాము. వారి త్యాగాల నుండి పొందే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడానికి కృషి చేయాలి. మన ప్రియతమ నేతల స్మృతులు విప్లవ శ్రేణులను నిరంతరం నడిపిస్తాయి.

ఈ మహోన్నత విప్లవ నేతల జీవితాలే భారతదేశంలో విప్లవ మార్గాన్ని తెలుసుకోవడానికి, దానిని ముందుకు తీసుకెళ్లడానికి ఒక బలమైన పునాది. కాబట్టి, విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడానికి ఈ అమరవీరుల జీవిత చరిత్రలను లోతుగా అధ్యయనం చేద్దాం. వారు చూపిన వెలుగుల బాటలో పయనిద్దాం. వారి రక్తంతో తడిసిన ఆ ఎర్రజెండాను మరింత ఎత్తుకు ఎగురవేస్తూ, వర్గ పోరాటాలను తీవ్రతరం చేస్తూ విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడమే ఆ అమరులకు మనం అర్పించే నిజమైన నివాళి!

– భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

ప్రజా యుద్ధ సేనాని, ప్రజా పోరాటాల చుక్కాని

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి, పీడిత ప్రజల అగ్రగామి నాయకుడు, కామ్రేడ్ నంబాళ్ల కేశవరావుకు ఎర్రెర్ర జోహార్లు!



2025 మే 21వ తేదీ భారత విప్లవోద్యమంలో ఒక చీకటి రోజు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాళ్ల కేశవరావు శత్రు బలగాల చుట్టివేత–దాడిలో అమరులయిన రోజది. మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాట పంథాలో, గడచిన అర్ధ శతాబ్ద కాలానికి పైగా సాగుతున్న భారత కార్మికవర్గ అగ్రగామి పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర సుసంపన్నతా క్రమంలో నాయకత్వ పాత్ర పోషించిన కామ్రేడ్ నంబాళ్ల కేశవరావు అమరత్వం భారత విప్లవోద్యమానికి, పార్టీకి, కేడర్‌లకు, ప్రజలకు తీర్చలేని లోటుగా మిగిలిపోతుంది. 60 గంటలకు పైగా శత్రు చుట్టుముట్టు దాడిని నిబ్బరంగా ఎదుర్కొంటూ జరిగిన భీకర సమరంలో కామ్రేడ్ బసవరాజు (గంగన్న, ప్రకాశ్, క్రిష్ణ), కేంద్ర కమిటీ స్టాఫ్ కామ్రేడ్స్, ఆయన రక్షణ సిబ్బందితో సహా 28 మంది భారత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలు అర్పించారు. కంపెనీ కామ్రేడ్స్ బి.ఆర్. ను కాపాడుకోవడానికి శత్రువును ధైర్యంగా ప్రతిఘటించారు. ఈ పోరాటంలో శత్రు తూటాలు, షెల్స్ తగిలి బి.ఆర్. అమరుడయ్యాడు. భారత దేశ విప్లవోద్యమ చరిత్రలో, భారత విప్లవ నాయకుడు, ఉపాధ్యాయుడు, సంస్థాపక నాయకులలో ఒకరైన కామ్రేడ్ చారుమజుందార్, తదుపరి కా.జవహర్‌ల తరువాత, అమరత్వం చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు.

కామ్రేడ్ నంబాళ్ల కేశవరావు 71 సంవత్సరాల క్రితం శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, జియ్యన్నపేట గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. ఆయనకు ఇద్దరు సోదరులు, ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వారి తండ్రి ఉపాధ్యాయుడు. పిల్లలను శ్రద్ధగా చదివించారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లి అన్ని రకాలుగా మద్దతు అందించారు. అన్నదమ్ములు ముగ్గురూ ఉన్నత చదువులు చదివారు.

కామ్రేడ్ కేశవరావు ప్రాథమిక విద్య మొదట స్వగ్రామంలో, తరువాత టెక్కలిలో జరిగింది. కామ్రేడ్ కేశవరావు చదువులో ప్రతిభావంతుడైన విద్యార్థిగా రాణించడమే కాకుండా, క్రీడలలోనూ రాష్ట్ర స్థాయి కబడీ, వాలీబాల్ క్రీడాకారుడిగా, జాతీయ క్రీడా పోటీలలో గుర్తింపు తెచ్చుకున్నారు. కామ్రేడ్ కేశవరావు గజ ఈతగాడు కూడా. స్కూలు ఉపాధ్యాయులకు అభిమాన విద్యార్థి. చదువుపై అత్యంత శ్రద్ధతో ఉన్న కేశవరావు ఇంజినీరింగ్ చదవాలని అభిలషించారు. దూర ప్రాంతం పంపడం ఇష్టం లేక వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజ్ (ఆర్ఈసీ)లో సీటుకు దరఖాస్తు చేసేందుకు తండ్రి అంగీకరించలేదు. తల్లి మద్దతుతో దరఖాస్తు చేసి, సీటు లభ్యమై 1974లో అందులో చేరారు. బీ.టెక్, ఆ తరువాత యం.టెక్ అభ్యసించారు. కామ్రేడ్ నంబాళ్ల కేశవరావు జీవితం విప్లవోద్యమం వైపు మలుపు తిరిగింది అక్కడే.

మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాట జ్వాలలు భారతదేశం నలుమూలలా

వ్యాపించి యావత్తు పీడిత ప్రజలను, పీడిత సెక్షన్‌లను కదిలించాయి. ఈ ప్రభావంతో విద్యార్థులు, యువత మార్క్సిజం వైపు ఆకర్షితులయ్యారు. ఈ భావాలతో దేశవ్యాప్తంగా విప్లవానికి అనుకూలంగా ఉద్యమాలు, సంఘాలు నిర్మాణం కాసాగాయి. ఈ ఉద్యమాలను సంఘటితం చేస్తూ కామ్రేడ్ చారు మజుందార్ 1969లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లెనినిస్టు) స్థాపించారు. ఈ పార్టీ కాంగ్రెస్ జరుపుకుంది. అప్పటికి శ్రీకాకుళం, లఖింపుర్-ఖేరీ మొదలయిన ప్రాంతాలలో నక్సల్బరీ మార్గంలో పోరాటాలు ఎగిసాయి. తీవ్రమైన నిర్బంధంతో వెనకపట్టు పట్టినప్పటికీ పార్టీ ఒక వ్యూహంతో నిర్మాణం కాసాగింది. అయితే 1972లో కామ్రేడ్ చారు మజుందార్ అమరత్వం తరువాత భాకపా (మాలె) అనేక గ్రూపులుగా చీలిపోయింది. ఆయా రాష్ట్రాలలో, ప్రాంతాలలో వేర్వేరు విప్లవ కమ్యూనిస్టు నాయకత్వాల కింద పార్టీ పునర్నిర్మాణం ప్రారంభమయిన రోజులవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ కేంద్రంగా ఈ కృషి సాగుతున్నది. 'ప్రగతిశీల విద్యార్థులు' పేరుతో పనిచేస్తూ ఉన్న విద్యార్థులు 1974 అక్టోబర్‌లో రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) ఏర్పాటు చేసారు. 1975 ఫిబ్రవరిలో ఆర్ఎస్‌యూ ప్రథమ మహాసభ జరిగింది. కా.కేశవరావుకు ఆర్ఈసీలోనే ఆర్ఎస్‌యూతో పరిచయమైంది. ఆర్ఎస్‌యూ నాయకులుగా ఉన్న అమరులు కామ్రేడ్ గజ్జల గంగారాం, కామ్రేడ్ చెరుకూరి రాజ్ కుమార్‌లతో పరిచయం అయింది. ఆర్ఎస్‌యూ కార్యకలాపాలలో క్రియాశీలంగా పాల్గొనసాగారు. ఈ క్రమంలో దాని ఆవిర్భావంలో భాగమయ్యారు.

పార్టీ పిలుపు మేరకు ఆర్ఎస్‌యూ 'గ్రామాలకు తరలండి' కేంపెయిన్ చేపట్టింది. పార్టీ నిర్వహించిన రాజకీయ తరగతులకు హాజరయ్యారు. నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమాన్ని అర్థం చేసుకుని ఈ కేంపెయిన్‌లో భాగమయ్యారు. గ్రామీణ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. భూమి సమస్యను అర్థం చేసుకున్నారు. ఆయన ఆలోచనలు పదునెక్కసాగాయి. చదువు కొనసాగిస్తూనే మార్క్సిజాన్ని అధ్యయనం చేయసాగారు. అప్పటికి పార్టీ వర్గ శత్రు నిర్మూలనా కార్యక్రమాన్ని సమీక్షించుకుని, ఆత్మవిమర్శనా నివేదికను రూపొందించుకుంది. ప్రజలను వర్గ సంఘాలలో సంఘటితం చేయసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కా. కేశవరావు 1979లో సబ్-అర్బన్ గ్రామాలలో విద్యార్థి యువజనులను సంఘటితం చేసేందుకు కృషి చేశారు. రాజకీయంగా మరింత చైతన్యవంతులయ్యారు. భారత దేశ పరిస్థితిని, ప్రజల విముక్తికి మార్గాన్ని స్పష్టంగా అర్థం చేసుకోసాగారు.

ఆనాడు విప్లవానికి, విప్లవ ప్రతీఘాతుకత్వానికీ మధ్య పోరాటం ఆర్ఎస్‌యూకు, భారతీయ జనతా పార్టీ అనుబంధ సంస్థ అయిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)కి మధ్య పోరాటం రూపంలో కూడా ఉండేది. పేద, మధ్య తరగతి రైతాంగ

కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆర్ఎస్యూలో చేరితే, పాలక వర్గాల రాజకీయాలను సమర్థించే ధనిక వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు ఏబీవీపీలో చేరేవారు. ఏబీవీపీ గూండాయిజాన్ని ఎదుర్కోవడంలో కామ్రేడ్ కేశవరావు ముందుండేవారు. ఆ గూండాలకు బుద్ధి చెప్పడంలో భాగంగా రాడికల్ విద్యార్థుల చేతిలో హతుడైన ఒక గూండా హత్య కేసులో కామ్రేడ్ కేశవరావును అరెస్టు చేశారు. బెయిలుపై విడుదల అయిన తరువాత కామ్రేడ్ బసవరాజు తల్లిదండ్రులను కలిసారు. తాను విప్లవానికే అంకితం కాదలుచుకున్నానని చెప్పారు. ఇక తిరిగి ఇంటికి వెళ్లలేదు.

1980లో భాకపా (మాలె)(పీడబ్ల్యూ) గెరిల్లా జోన్ పర్స్పెక్టివ్‌ను రూపొందించుకుంది. దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాను అనుసరించి చేపట్టాలన్న వ్యూహాత్మక అవగాహనతో కార్యకర్తలను అటవీ ప్రాంతానికి పంపింది. 1980లో ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలో గడ్‌చిరోలి జిల్లాలోకి, ఖమ్మం ప్రాంతంలోకి, విశాఖపట్నం–తూర్పు గోదావరి జిల్లాల అటవీ ప్రాంతమైన మన్యంలోకి పార్టీ కార్యకర్తలు అడుగు పెట్టారు. అలా మన్యంలో ప్రవేశించిన వారిలో అమరుడు కామ్రేడ్ చంటితో పాటు కామ్రేడ్ కేశవరావు ఒకరు. కుయి, భగత, కొండరెడ్డి మొదలయిన ఆదివాసీ తెగల ప్రజలు నివసించే మన్యం ప్రాంతంలో క్రిష్ణగా పరిచయమయ్యారు. అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన మన్యం పితూరీ వారసత్వం ఉన్న ప్రజలు వాళ్లు. ఈ వారసత్వంలో మలేరియా డాక్టర్ల పేరుతో మన్యంలో ప్రవేశించిన కార్మికవర్గ పార్టీ కార్యకర్తలు ప్రజల జీవన పరిస్థితులు, భాష, ఆచార వ్యవహారాలు తెలుసుకుంటూ వారిలో మమేకం కాసాగారు. ప్రభుత్వ అటవీ శాఖ నుంచి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. మహిళలపై అత్యాచారాల గురించి తెలుసుకున్నారు. కాఫీ ఎస్టేట్ ల పేరుతో ప్రజల భూములు ఆక్రమించడానికి వ్యతిరేకంగా పోరాడడం హక్కని చెప్పారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని వివరించారు. వారికి విప్లవ రాజకీయాలు బోధించి పోరాట చైతన్యం పెంపొందించసాగారు. ప్రజలు సంఘాలలో సంఘటితం అవుతూ పార్టీ నాయకత్వంలో పోరాటాలు చేయసాగారు. ఈ పోరాటాల పునాదితో పార్టీ ప్రజలకు రాజ్యాధికార రాజకీయాలు నేర్పసాగింది. క్రమంగా యువత దళంలోకి భర్తీ కాసాగింది. మన్యంలో, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో పార్టీ విస్తరించసాగింది. దండకారణ్యంలో భాగంగా మన్యం ప్రాంతం ఈస్ట్ డివిజన్‌గా నిర్మాణమయింది. రెండు దళాలుగా ఏర్పడిన ఈ ప్రాంతంలో 1984లో కామ్రేడ్ క్రిష్ణ కోఆర్డినేటర్ గా బాధ్యతలు చేపట్టారు. 1986లో జరిగిన డివిజన్ ప్రథమ మహాసభలో డివిజనల్ కమిటీలోకి ఎన్నికై, కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.

రైతు కూలీ సంఘం ఏర్పాటయింది. ఈస్ట్ డివిజన్ అంతటా ప్రజలు వెట్టి రద్దు చేసుకున్నారు. సంఘం నాయకత్వంలో తమ మూలుగులను పీలుస్తున్న ప్రభుత్వం మీద,

ఫారెస్టు అధికారుల మీద మన్యం ఆదివాసీ ప్రజలు తిరగబడ్డారు. అక్రమాలకు, దోపిడీకి, దౌర్జన్యానికీ పాల్పడ్డ ఫారెస్టు అధికార్లను తమ సంఘం ముందు నిలదీసారు. అక్రమంగా తమ నుంచి వసూలు చేసిన వేలాది రూపాయల ధనాన్ని వారి చేత కక్కించారు. పుల్లెరను మాఫీ చేయించారు. కోళ్లు, గొర్రెలు, కల్లు, లంచాలు ఇవ్వడం ఆపేసారు. పోడు వ్యవసాయం విస్తృతం చేసుకున్నారు. తమను తిట్టడం, కొట్టడం, ఇళ్లు తగులబెట్టడం చేసిన కొందరు నిరంకుశ అధికారులకు దేహశుద్ధి చేసారు. ఫారెస్టు గార్డులను, వాచర్లను ప్రజలు తమ సంఘాల ముందు నిలబెట్టి, వాళ్లు చేస్తున్న దుర్మార్గాలకు సంజాయిషీ అడిగారు. ప్రజల సంఘటిత చైతన్యానికి తలలు వంచి గార్డులు, వాచర్లు తమ తప్పుల్ని అంగీకరించారు, లెంపలేసుకున్నారు, క్షమించమని ప్రాధేయపడ్డారు. గిరిజన రైతు కూలీ సంఘాలు వారిని హెచ్చరించి, తిరిగి అటువంటి దౌర్జన్యాలకు, దోపిడీకి పాల్పడం అనే హామీ పత్రాలు రాయించుకుని వదిలారు. ఈ క్రమంలో స్థానిక నాయకత్వంతో పాటుగా పార్టీ పై స్థాయి నాయకత్వం కూడా పెంపొందింది. రైతాంగం నుంచి, విద్యార్థుల నుంచి కార్యకర్తలు దళాలలో చేరారు.

మరో పక్క తెలంగాణా రాష్ట్రంలో నాటి ఆదిలాబాద్ జిల్లా నుంచి గోదావరి దాటి మరి కొందరు కార్యకర్తలు మహారాష్ట్ర గఢ్‌చిరోలి జిల్లా సిరొంచ ప్రాంతంలో అడుగు పెట్టారు. వీరు ఇక్కడి నుంచి అనతి కాలంలోనే కొండగామ్ వరకు విస్తరించారు. మరో పక్క ఖమ్మం నుంచి దక్షిణ బస్తర్ ప్రాంతంలో విస్తరించారు. ఈ ప్రాంతాలంతటా సాయుధ దళాలుగా ఉన్న కార్యకర్తలు ప్రజలను వివిధ పోరాటాలలో కదిలించారు. పార్టీ నిర్మాణం కాసాగింది. తూర్పు కనుమల నుంచి పశ్చిమం వరకు, విశాఖ–తూర్పు గోదావరి–ఖమ్మం–కోరాపుట్ వరకు జరుగుతున్న ఉద్యమాన్ని సంఘటితం చేసేందుకు పార్టీ ఫారెస్ట్ లైజాన్ కమిటీ (ఎఫ్ఎల్సీ)ని ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతాల కార్యకలాపాలను ఈ లైజాన్ కమిటీ ద్వారా సమన్వయించింది. 1987లో ఇది ఫారెస్ట్ కమిటీ (ఎఫ్‌సీ)గా మారింది. అప్పటికి వివిధ ప్రాంతాలలో దళాలు పని చేయసాగాయి. ఎఫ్‌సీ నాయకత్వంలో ఈ ప్రాంతమంతటా రాజకీయ, సైనిక కార్యకలాపాలు ఊపందుకున్నాయి. పార్టీ నిర్మాణం బలోపేతం కాసాగింది. ఉద్యమాన్ని పురోగమింపజేసేందుకు పార్టీ దండకారణ్య ప్రాంత మహాసభ నిర్వహించింది. 1987లో జరిగిన తొలి మహాసభకు కామ్రేడ్ గంగన్న ప్రతినిధిగా హాజరయ్యారు. ఫారెస్ట్ కమిటీ (ఎఫ్.సి.)లో సభ్యునిగా ఎన్నికయ్యారు.

సమన్వయం క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మధ్య భాగమైన మాడ్ ప్రాంతంలో పార్టీ అడుగు పెట్టింది. ఎఫ్‌సీ మార్గదర్శకత్వంలో 1988–89లో మాడ్‌లో రెండు దళాలు నిర్మాణమయ్యాయి. మాడియా గోండ్ ప్రజలు సాపేక్షికంగా వెనుకబడిన ఉత్పత్తి విధానంలో ఉన్నవారు. పోడు వ్యవసాయం చేసే ఈ ప్రాంతం భౌగోళికంగా కఠినమైనది. ప్రజల

భాష, ఆచార వ్యవహారాలు, ఆహార అలవాట్లు భిన్నంగా ఉంటాయి. పోషకాహారం తక్కువ. అటువంటి వాతావరణంలో గెరిల్లాలు దృఢంగా నిలబడేందుకు, ప్రజలతో మరింత మమేకమయ్యేందుకు కామ్రేడ్ గంగన్న గెరిల్లాలకు మార్గదర్శకత్వం అందించారు. ఈ దళం మాడియా గోండ్ ప్రజలను విప్లవంలో సంఘటితం చేయసాగింది. మాడ్ ప్రాంతంలో ప్రజల వ్యవసాయ అభివృద్ధి కోసం పార్టీ విశేష కార్యక్రమాలు చేపట్టింది. మాడియా, మురియా, రాజ్ గోండు ప్రజలతో మమేకమైన కామ్రేడ్ గంగన్న వారి హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు.

నిర్బంధం-ప్రతిఘటన

మన్యం, దండకారణ్యంలలో సాగుతున్న విప్లవోద్యమం దేశ పాలక వర్గాలకు భీతి గొల్పించింది. ప్రకృతి వనరులకు సంపదయిన ఈ ప్రాంతాలను దోచుకునేందుకు విప్లవ పార్టీ అడ్డుగా నిలుస్తుందని భావించిన భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ పాలక వర్గాలు పార్టీని, తద్వారా విప్లవాన్ని తుదముట్టించాలన్న లక్ష్యంతో నిర్బంధకాండ చేపట్టాయి. దండకారణ్యంలో దళం అడుగు పెట్టిన రెండో నాడే ఎదురుకాల్పులు జరిగి పెద్ది శంకర్ అమరులు కాగా, మన్యంలో కొద్ది కాలంలోనే ఎదురుకాల్పులు జరగసాగాయి. కామ్రేడ్ చంటి అమరులయ్యారు. దళం కదలికలకు ప్రభుత్వ సాయుధ బలగాల గస్తీలు అడ్డం కాసాగాయి. భారత రాజ్యం కొనసాగిస్తున్న అణచివేత చర్యలను సైనికంగా ఎదుర్కొనేందుకు పార్టీ సైనిక చర్యలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ నిర్ణయంలో భాగంగా 1987 వర్షాకాల ప్రారంభంలో ఈస్ట్ డివిజన్ లో విశాఖపట్నం జిల్లా దారగడ్డలో మొదటి ఆంబుష్ జరిగింది. ఆ తరువాత ఆదిలాబాద్ జిల్లా ఆలంపెల్లిలో రెండో ఆంబుష్ జరిగింది. దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాను అనుసరించిన నక్సల్బరీ మార్గంలో ప్రజా సైన్య ప్రాధాన్యతను ఎత్తిపడుతూ ఈ తొలి సైనిక చర్యలు ఒక ఉజ్వల అధ్యాయాన్ని ప్రారంభించాయి. 1972లో తాత్కాలిక సెట్ బ్యాక్ కు గురైన నక్సల్బరీ విప్లవ రాజకీయాల పతాకం తిరిగి పైకెగిసింది. ఈ రెండు ఆంబుష్ లలో ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంతో భారత దోపిడీ పాలకవర్గాలలో విప్లవోద్యమం పట్ల భయం పెరిగింది.

ఈ భయంతో ప్రజలలో విప్లవం పట్ల భయం సృష్టించాలన్న ఉద్దేశ్యంతో 1985-86 కాలంలో ప్రభుత్వ ఆదేశం మేరకు విశాఖపట్నం జిల్లా రూరల్ ఎస్పీ పోతారెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ సాయుధ బలగాలు ఈస్ట్ డివిజన్ లో కొన్ని గ్రామాలకు గ్రామాలను కాల్చి బుగ్గి చేసారు. ప్రజలకు ఉన్న ధాన్యం, గొడ్డూ, గోదా నాశనమయ్యాయి. ఈ అన్యాయాన్ని ప్రపంచం దృష్టికి తీసుకురావడం కోసం పౌరహక్కుల సంఘం పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులతో ప్రత్యామ్నాయ కోర్టు నిర్వహించాయి. ఒక పుస్తకం విడుదల చేసాయి. ఆ తరువాత కాలంలో, ప్రజల డిమాండ్ మేరకు ఈ పోలీసు అధికారికి

పీఎల్‌జీఏ మరణశిక్ష విధించింది. ఈ ఘటనను బహిర్గతం చేయడంలో, పీఎల్‌జీఏ చర్యకు పథకం రచించడంలో కామ్రేడ్ గంగన్న పాత్ర ఉన్నది.

ప్రజా సైన్యాన్ని ప్రజాయుద్ధంలో మరింత పదును పెట్టేందుకు పార్టీ సైనిక శిక్షణకు పూనుకుంది. 1987 వర్షా కాలంలో దండకారణ్యంలో పార్టీలో వివిధ స్థాయిలలో నాయకత్వ కేడర్లకు మొదటి సారిగా గెరిల్లా శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఆ శిక్షణా శిబిరానికి హాజరైన వారిలో కామ్రేడ్ గంగన్న ఒకరు. ఈ శిక్షణను వివిధ ప్రాంతాల గెరిల్లాలకు అందించడంలో భాగంగా 1988 జూన్-జూలై నెలలలో ఈస్ట్ డివిజన్‌లో జరిగిన సైనిక శిక్షణా శిబిరంలో కూడ కామ్రేడ్ గంగన్న పాల్గొన్నారు. ఈ శిబిరాలలో గెరిల్లాలు మాటుదాడులు, విధ్వంస చర్యలు, మందుపాతరలు పేల్చడం, గురిచూసి కాల్చడం మొదలయిన విషయాలలో శిక్షణ పొందారు. ఆ తరువాత కాలంలో వివిధ సైనిక చర్యలలో ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడింది. శిక్షణ పొందిన గెరిల్లాలకు ఆయుధాలు అందించేందుకు పార్టీ ఆయుధాల ఉత్పత్తి ప్రారంభించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలోనూ ప్రారంభమై సాగుతున్న పార్టీ కార్యక్రమాలను నిర్మాణపరంగా సమన్వయించేందుకు, సంఘటితం చేసేందుకు పార్టీ కేంద్ర ప్లీనం నిర్వహించింది. 1990 సెప్టెంబర్‌లో జరిగిన ఈ కేంద్ర ప్లీనంలోనే కామ్రేడ్ గంగన్న కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఎఫ్‌సీ కార్యదర్శిగా ఉన్న కామ్రేడ్ కేంద్ర కమిటీ సభ్యునిగా పూర్తి బాధ్యతలు చేపట్టడంతో 1991 ప్రారంభంలో కామ్రేడ్ గంగన్న ఎఫ్‌సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1995లో ఫారెస్ట్ కమిటీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీగా ఏర్పడింది. 1995-96లలో పార్టీ దండకారణ్యంలో టెక్నికల్ యూనిట్ ను ఏర్పాటు చేసింది. ఈ యూనిట్ ప్రారంభంలో చేతి బాంబులు, తపంచాలు తయారు చేసేది. కమిటీ సభ్యులతో కలిసి ఆ యూనిట్ కు కామ్రేడ్ గంగన్న బాధ్యత వహించారు.

ఆయుధాల ఉత్పత్తితో పాటుగా సైనిక విధానం గురించి, యుద్ధ కళల గురించి, వివిధ దేశాల, మన దేశ సాయుధ పోరాటాల అనుభవాలను కేడర్‌లకు అందించేందుకు కేంద్ర కమిటీ 1989 జనవరిలో కేంద్ర సైనిక పత్రిక 'జంగ్' ను ప్రారంభించింది. 1995 నుంచి పార్టీలో క్రమంగా సైనిక అంశాలపై అధ్యయనం ప్రారంభమయింది. సీఎంసీ బాధ్యతలు చేపట్టిన తరువాత కామ్రేడ్ గంగన్న పత్రికకు ప్రత్యక్షంగా బాధ్యత వహించారు. జంగ్ పత్రికతో పాటుగా సైనిక అవగాహనను పెంపొందించేందుకు, యుద్ధ కళల గురించిన సాహిత్యాన్ని విరివిగా సేకరించి, అనువాదాలు చేయించి ప్రచురించారు. బేసిక్ మిలిటరీ కోర్స్ మొదలుకుని, వివిధ రకాల ఆయుధాల గురించి, విస్ఫోటక పదార్థాల గురించిన అవగాహన కల్పించేందుకు పుస్తకాలు ప్రచురించారు.

అఖిల భారత ప్రత్యేక మహాసభ (ఏఐఎస్‌సీ)

బలోపేతం అవుతున్న విప్లవోద్యమాన్ని నిర్మాణపరంగా మరింతగా సంఘటితం చేసేందుకు పార్టీ 1995లో అఖిల భారత ప్రత్యేక మహాసభ (ఏఐఎస్‌సీ) జరిపింది. ఈ మహాసభలో ఫారెస్ట్ కమిటీ నాయకత్వంలో ఉన్న మన్యం–ఆదిలాబాద్ ప్రాంతాలను పునస్సంఘటితం చేసింది. ఆదిలాబాద్ మొదలయిన జిల్లాలతో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ ఏర్పడింది. ఈస్ట్ డివిజన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నాయకత్వంలో భాగమయింది. అలా సంఘటితం అయిన ఉత్తర తెలంగాణ, దండకారణ్య ఉద్యమాలను గెరిల్లా జోన్ స్థాయి ఉద్యమాలుగా అభివృద్ధి చేయడంలో తన సహ కమిటీ సభ్యులతో కలిసి కామ్రేడ్ గంగన్న ప్రత్యక్ష నాయకత్వం అందించారు.

దండకారణ్యం ప్రాంతాన్ని స్పెషల్ జోన్‌గా అభివృద్ధి చేయాలన్న కేంద్ర కమిటీ మార్గదర్శకత్వాన్ని తన సహ కమిటీ సభ్యులతో కలిసి కా. గంగన్న అమలు జరిపారు. అదే సంవత్సరం దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ అధికార పత్రికగా అప్పటికి పట్టణాల నుంచి వెలువడుతున్న ప్రభాత్ పత్రికను గెరిల్లా జోన్‌లోనే అచ్చు వేసేందుకు పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి కా. గంగన్న కృషి చేసారు. పత్రిక, తదితర ప్రచురణల కోసం ఒక విభాగంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దళాన్ని ఏర్పరచి దానికంటూ పని విధానాన్ని రూపొందించారు. తరువాత కాలంలో కేంద్ర కమిటీ సైనిక పత్రిక అవామీ జంగ్ తో పాటుగా ఈ విభాగం పార్టీ అనేక ప్రచురణ అవసరాలను నెరవేర్చింది.

సైనిక రంగంలో అధ్యయనానికి కేంద్ర కమిటీ 1995 చివరిలో 'స్కోమా (సబ్–కమిటీ ఆన్ మిలటరీ అఫైర్స్) ను ఏర్పరిచింది. అలాగే పార్టీ కేడర్‌లకు రాజకీయ శిక్షణను అందించడానికి 'స్కోప్' (సబ్–కమిటీ ఆన్ పొలిటికల్ ఎడుకేషన్)ను ఏర్పర్చింది. ఈ రెండు విభాగాలూ కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుల నాయకత్వంలో ఆయా రంగాలలో పార్టీ, ఉద్యమ అవసరాలను నెరవేర్చాయి.

ఏఐఎస్‌సీ నిర్ణయం మేరకు పార్టీ దేశంలో ఇతర విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో ఐక్యతా కృషి ప్రారంభించింది. నాటి బీహార్ రాష్ట్రంలోని మగధ ప్రాంతం, కోయల్–కైమూర్, పలాము ప్రాంతాలు కేంద్రంగా పని చేస్తున్న భాకపా (మాలె) పార్టీ యూనిటీ గ్రూపుతో చర్చలు సాగించింది. కేంద్ర కమిటీ సభ్యునిగా కామ్రేడ్ గంగన్న ఈ చర్చలలో పాలు పంచుకున్నారు. ఇరు పార్టీలు తమ అనుభవాలను ఇచ్చి పుచ్చుకున్నాయి. ఈ చర్చలు ఫలించి 1998 ఆగస్ట్–సెప్టెంబర్ నెలలలో భాకపా (మాలె)(పీపుల్స్ వార్), భాకపా (మా–లె) పార్టీ యూనిటీలు విలీనమై భాకపా (మాలె) (పీపుల్స్ వార్) గా ఏర్పడ్డాయి. ఐక్య పార్టీ 2001లో కాంగ్రెస్ నిర్వహించింది.

ఈ కాంగ్రెస్‌లోనే పార్టీ కేడర్‌లకు ప్రాథమిక, రాజకీయ విద్య గరిపేందుకు మొబైల్ ఎకడమిక్ స్కూల్ (మాస్), మొబైల్ పొలిటికల్ స్కూల్ (మోపోస్) విభాగాలను ఏర్పరచాలని నిర్ణయించింది. పట్టణ కమిటీ కామ్రేడ్స్ సహాయంతో దండకారణ్యంలో ఈ రెండు విభాగాలు ఏర్పడి పని చేస్తూ వచ్చాయి. తరువాత కాలంలో దండకారణ్యం విద్యా విభాగ కమిటీ (ఈడీసీ)ని ఏర్పాటు చేయడంలో, దానికి సైద్ధాంతిక, రాజకీయ మార్గదర్శకత్వం అందించడంలో కేంద్ర కమిటీలో భాగంగా కా. బీఆర్ కృషి చేసారు. ఈ విభాగాల ద్వారా జరిగిన ప్రాథమిక తరగతులు వివిధ స్థాయి కేడర్‌లకు చరిత్ర, విజ్ఞాన శాస్త్రం, సామాజిక, భౌగోళిక జ్ఞానాలను అందించేందుకు ఉపయోగపడ్డాయి. రాజకీయ తరగతులు పార్టీ ప్రాథమిక డాక్యుమెంట్లు, మౌలిక సిద్ధాంతం గురించిన అవగాహన పెంపొందించేందుకు ఉపకరించాయి.

ఈ కాంగ్రెస్ చేసిన మరో ముఖ్యమైన నిర్ణయం అప్పటికి మూడు దశాబ్దాలుగా సాగుతున్న ఉద్యమం ఆయా ప్రాంతాలలో కలిగించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మార్పులను అధ్యయనం చేయడం. ఈ సామాజిక పరిశోధనను నిర్వహించవలసిన తీరు తెన్నులను రూపొందించడంలో, ఆయా రాష్ట్ర కమిటీలకు దీనిని వివరించడంలో, అమలు పరచడంలో కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి కా. బీఆర్ కృషి చేసారు. తాను ఉన్న ప్రాంతాలలో ఈ అధ్యయనంలో పాలు పంచుకున్నారు. ఆయా జోన్లలో ఎంపిక చేసిన ప్రాంతాలలో అధ్యయనం కోసం పథకం రూపొందించారు. ఆ నిర్ణయం మేరకు దండకారణ్యంలో గఢ్‌చిరోలి, ఉత్తర బస్తర్, పశ్చిమ బస్తర్, దక్షిణ బస్తర్, మాడ్ ప్రాంతాలలో, ఏఓబీ ప్రాంతంలో సామాజిక పరిశోధనలు జరిగాయి. కేంద్ర కమిటీ ఈ పరిశోధనా నివేదికలను అధ్యయనం చేసి, యావత్తు ఉద్యమ ప్రాంతాల పరిస్థితులను విశ్లేషించింది. అందుకు తగిన ఎత్తుగడలను రూపొందించేందుకు ఈ కృషి ఉపకరించింది.

దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్ ప్రాంతాలను విముక్తి ప్రాంతాలుగా ఎదిగించాలని కాంగ్రెస్ రూపొందించిన కేంద్ర కర్తవ్యాన్ని అమలు చేయడంలో భాగంగా పార్టీ బేస్ ఏరియాల నిర్మాణం చేపట్టింది. పార్టీ కేంద్ర, ప్రధాన, తక్షణ కర్తవ్యాలను కేంపెయిన్‌ల రూపంలో నిర్వహించసాగింది. సైనిక రంగంలో ఎత్తుగడల ఎదురు దాడులు (టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ కేంపెయిన్–టీసీఓసీ) చేపట్టింది. ఈ దాడుల తొలి దశలో ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల–మోటు పోలీసు స్టేషన్‌లపై సంయుక్త రెయిడ్‌కు పథకం రూపొందించింది. ఈ రెయిడ్ పథక రచనలోనే కాక, కా. బీఆర్ దీనికి ప్రత్యక్ష నాయకత్వం అందించారు.

కార్మికవర్గ అగ్రగామి సంస్థగా పని చేసే విప్లవ కమ్యూనిస్టు పార్టీకి కార్మికవర్గ

అంతర్జాతీయతా కర్తవ్యం ఉంటుందన్న అవగాహనతో పార్టీ దక్షిణాసియా దేశాలలో, దక్షిణ అమెరికా దేశాలలో సోదర పార్టీలతో సంబంధాలు నెలకొల్పుకుంది. ఇందులో భాగంగా నేపాల్‌లో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం సాగుతున్న రోజులలో కా. బీఆర్ కొందరు పార్టీ కార్యకర్తలతో కలిసి ఆ దేశం వెళ్లారు. అప్పటికే ప్రజా సైన్యానికి అందిస్తూ వస్తున్న 'అన్‌ఆర్మ్ డ్ కంబాట్' మొదలయిన అంశాలలో నేపాల్ గెరిల్లాలకు శిక్షణ గరిపారు. ఆయుధాల గురించిన అవగాహనను అందించారు. వారి ప్రజాయుద్ధ అనుభవాలను అధ్యయనం చేసారు.

దీంతో పాటుగా కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు కా. బీఆర్ భారత పాలక వర్గాల విస్తరణవాదానికి వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాలలో సాయుధ పోరాటం చేస్తున్న జాతుల ఉద్యమ సంస్థల నాయకత్వాన్ని కలిసారు. దేశంలో పీడిత ప్రజలకు, పీడిత జాతులకు దేశ భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలు, ఈ వర్గాలు సేవ చేస్తున్న సామ్రాజ్యవాదం శత్రు వర్గాలని, అందువల్ల దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో జాతుల ఉద్యమాలు భాగం కావాలన్న పార్టీ అవగాహనను వారితో చర్చించారు. భారత రాజ్యానికి వ్యతిరేకంగా వారు సాగిస్తున్న ప్రజా, సాయుధ పోరాటాలలో వారి అనుభవాలను తెలుసుకుని వచ్చారు. వాటిని పార్టీకి అందించారు. సైనిక రంగంలో అధ్యయనాన్ని, అనుభవాన్ని సంశ్లేషించి 'రాజకీయ పంథా–సైనిక పంథా' అనే పుస్తకం రాసారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటు

2001 కాంగ్రెస్ అనంతరం భాకపా (మా–లె)(పీపుల్స్ వార్), ఎంసీసీఐ పార్టీల మధ్య నిలిచిపోయిన ఐక్యతా చర్చలను తిరిగి నిర్వహించాలని నూతన కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు జరిగిన కృషిలో కేంద్ర కమిటీ సభ్యునిగా కా. బీఆర్ పాల్గొన్నారు. ఇరు పార్టీల సుదీర్ఘ రాజకీయ ఆచరణ అనుభవాలను ఇచ్చి పుచ్చుకున్న ఈ చర్చల క్రమంలో సైద్ధాంతిక, రాజకీయ, ఆచరణపర స్పష్టత పెంపొందింది. కొన్ని భిన్నాభిప్రాయాలతో ఐక్యం కావాలని ఇరు పార్టీలు నిర్ణయించాయి. 2004 సెప్టెంబర్‌లో ఈ క్రమం పరిపూర్తి కావడంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. ఈ నూతన పార్టీ ఆవిర్భావానికి కొనసాగింపుగా మరి కొన్ని మా–లె గ్రూపులతో ఐక్యతా చర్చలు జరిపి వాటిని కూడా విలీనం చేసుకుంది. రెండు ప్రధాన పార్టీల, ఇతర గ్రూపుల అనుభవాలను సంశ్లేషించడంలో, ఐక్య పార్టీ అవగాహనను సుసంపన్నం చేయడంలో కేంద్ర కమిటీతో పాటుగా ఝార్ఖండ్ ప్రాంతంలో కా. ప్రకాష్‌గా పరిచయం అయిన కామ్రేడ్ బీఆర్ పాత్ర చెప్పుకోదగినది.

నూతన ఐక్య పార్టీని దేశవ్యాప్తంగా ఏకీకృతం చేసే కృషిలో భాగంగా ప్రధాన కార్యదర్శి, కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులతో కలిసి కా. బీఆర్ వివిధ రాష్ట్రాలు

పర్యటించారు. ఆయా రాష్ట్రాలలో ఇరు పార్టీ కమిటీలతో సమావేశాలు నిర్వహించి కేంద్ర కమిటీ కేడర్‌లకు ఏకీకృత అవగాహనను అందించింది. పార్టీ దస్తావేజులను, విధాన పత్రాలను వివరించి, నూతన పార్టీ అవగాహనను కేడర్‌లకు అర్థం చేయించింది. దేశవ్యాప్త పార్టీగా అభివృద్ధి చెందడంలో, సైద్ధాంతిక, రాజకీయ, సైనిక, నిర్మాణపర ఐక్యత సాధించడంలో ఈ కృషి ఎంతగానో ఉపయోగపడింది.

నూతన పార్టీ ఏర్పాటుతో భారత పాలక వర్గాలు పార్టీని దేశ భద్రతకు పెను ప్రమాదంగా పేర్కొన్నాయి. సైనిక క్యాంపెయిన్‌లు చేపట్టాయి. అందులో భాగంగా వివిధ రాష్ట్రాలలో శ్వేత మిలిషియాలను ఏర్పాటు చేసాయి. 2005లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సల్వా జుడుం, ఝార్ఖండ్ రాష్ట్రంలో సేంద్ర, ఒడిశా, మహారాష్ట్రలలో శాంతి కమిటీ మొదలయిన పేర్లతో వివిధ రాష్ట్రాలలో ఈ క్యాంపెయిన్‌లను ప్రారంభించాయి. ఈ ప్రాంతాలు తీవ్ర నిర్బంధాన్ని, అన్యాయాలను, మహిళలపై అత్యాచారాలను చవి చూసాయి. ప్రభుత్వ సాయుధ బలగాలు గ్రామాలపై దాడులు చేసి ప్రజల ఆస్తి, ఇళ్లు కాలబెట్టారు. ఎందరో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ కఠిన పరిస్థితిలో ప్రజల మద్దతుతో పీఎల్‌జీఏ ప్రతిఘటనతో పార్టీ సల్వా జుడుం తదితర శ్వేత మిలిషియాలను ఓడించింది. తిరిగి ప్రజాయుద్ధానిది పై చేయి అయింది.

ఐక్యతా కాంగ్రెస్ – 9వ కాంగ్రెస్

ఐక్యతా క్రమాన్ని సంఘటితం చేసేందుకు 2007 ఫిబ్రవరి–మార్చ్‌లో పార్టీ ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ జరిపింది. పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, సైనిక, నిర్మాణపర అవగాహన సుసంపన్నం అయింది. మౌలిక దస్తావేజులను, విధాన పత్రాలను సుసంపన్నం చేసుకుంది. దేశవ్యాప్త పార్టీగా అంతర్జాతీయంగా పేరు పొందింది. ఈ కాంగ్రెస్‌లో కా. బీఆర్ తిరిగి కేంద్ర కమిటీలోకి, పొలిట్ బ్యూరోలోకి ఎన్నికయ్యారు. కేంద్ర సైనిక కమిషన్ బాధ్యునిగా తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ బాధ్యతలను నెరవేర్చేందుకు బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో రూపొందిన తూర్పు రీజనల్ బ్యూరోలో భాగంగా ఉన్న బీహార్–ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా ప్రాంతంలోను, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో రూపొందిన మధ్య రీజనల్ బ్యూరోలో భాగంగా ఉన్న దండకారణ్యం స్పెషల్ జోన్ ప్రాంతంలోనూ కా. బీఆర్ విస్తృతంగా పర్యటించారు. రాజకీయ, సైనిక మార్గదర్శకత్వం అందించారు. కేంద్ర కమిటీ నేతృత్వంలో పార్టీ యావత్తు అన్ని రంగాలలో పురోగమనం సాధించింది.

ప్రజా యుద్ధం సల్వా జుడుం, సేంద్రలను ఓడించిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో మరో సైనిక నిర్బంధ కేంపెయిన్‌ను ప్రారంభించాయి. గతం నుండి అమలు చేస్తూ వచ్చిన మంద్రస్థాయి యుద్ధ తంత్రాన్ని

(ఎల్ఐసీ) ఈ కాంపెయిన్ మరింత మెరుగ్గా అన్వయించుతూ దాడులు చేసాయి. సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడి భారతదేశంలో భారీగా ప్రవేశించసాగింది. దీని నుంచి లాభాలు పొందడం కోసం దేశంలో పీడిత ప్రజలను, పీడిత జాతులను దోచుకోవడం కోసం దేశ భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలు విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టేందుకు బహుముఖ వ్యూహం అమలు చేయసాగాయి. ఈ నిర్బంధ క్యాంపెయిన్‌లను ప్రతిఘటిస్తూ, పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలను కాపాడుకుంటూ విప్లవోద్యమం నిలదొక్కుకుంటూ వచ్చింది. అయితే కాంగ్రెస్ అనంతరం నాయకత్వం అమరులయ్యారు, అరెస్టయ్యారు. వివిధ ప్రాంతాలలో స్థానిక నిర్మాణాలు దెబ్బ తిన్నాయి. గ్రామాలలో అధికార వ్యవస్థగా వ్యవహరించే సెక్షన్‌ను శత్రువు తన పక్షం తిప్పుకునే ప్రయత్నంలో ప్రజలలో వైరుధ్యాలు ఏర్పడ్డాయి. ప్రజా వ్యతిరేకులు పోలీసు ఇన్‌ఫార్మర్‌లుగా తయారయ్యారు. పోలీసు బలగాల గస్తీ పెరిగింది. మరో పక్క శత్రు వర్గాలు మానసిక యుద్ధం చేస్తూ ప్రజలలో పార్టీ, విప్లవోద్యమ వ్యతిరేక ప్రచారం చేయసాగాయి. పరిస్థితులకు అనుగుణంగా పార్టీని మలిచే ప్రయత్నాలు చేసినప్పటికీ క్రమంగా ఉద్యమంలో ప్రతికూలతలు ఏర్పడసాగాయి.

2011 నాటి నుంచి ఉద్యమం క్రమంగా బలహీనపడసాగింది. 2012 నాటికి ఉద్యమం మరింత బలహీనపడింది. 2013 ఏప్రిల్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం దండకారణ్యం స్పెషల్ జోన్ ప్రాంతం ఉద్యమంలో గడ్డు పరిస్థితి ఏర్పడిందన్న దండకారణ్యం ప్లీనం అంచనాను అంగీకరిస్తూ, బీహార్–ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా ప్రాంతం తాత్కాలిక వెనకడుగులోకి వెళ్లిందని కూడా సమీక్షించింది. పార్టీ అంతటా బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను నిర్వహించి, కేడర్‌లను పరిస్థితికి తగిన విధంగా మలచాలని నిర్ణయించింది. ఈ దిద్దుబాటు క్యాంపెయిన్ కోసం సీసీ సైద్ధాంతిక వివరణతో ఒక సర్కులర్, పీఎల్‌జీఏ ఆచరణలో జరుగుతున్న పొరపాట్లను దిద్దుకోవడం గురించి ఒక సర్కులర్ విడుదల చేసింది. ఈ సర్కులర్‌ల రూపకల్పనలో, కేడర్‌లలోకి ఈ అవగాహనను తీసుకువెళ్లడంలో కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి కా. బీఆర్ ముఖ్యమైన పాత్ర వహించారు.

దేశంలో నిజమైన విప్లవశక్తులను సమైక్యం చేయడానికి పార్టీ నిరంతరం కృషి చేస్తూ వచ్చింది. అందులో భాగంగా 2013 నవంబర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (నక్సల్బరీ)తో ఐక్యతా చర్చలు జరిపింది. ఆ చర్చలలో ప్రధాన కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ యోగేష్‌లతో పాటు కామ్రేడ్ బసవరాజు పాల్గొన్నారు. 2014 మేలో పూర్తయిన ఈ ఐక్యతా ప్రక్రియతో దేశంలో విప్లవ పార్టీల సమైక్యత పరిపూర్తి అయింది.

పార్టీ సంఘటితీకరణ కృషిలో భాగంగా కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు 2014లో

కా. బీఆర్ దండకారణ్యం నుండి ఝార్ఖండ్ రాష్ట్రం సరండా అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ తో ఎదురైన నష్టాలను అధిగమించేందుకు తూర్పు రీజనల్ బ్యూరో (ఈఆర్‌బీ)తో కలిసి రెండు సంవత్సరాలు కృషి సలిపారు. ప్రత్యేక సమావేశం నిర్వహించి, బోల్షివీకరణ కేంపెయిన్ నడుపుతూనే, మాస్ వర్క్, మిలటరీ వర్క్ సమన్వయంతో కొనసాగించేందుకు యూనిఫైడ్ కమాండ్ లను నిర్మించారు. ఈ కర్తవ్యాన్ని ముగించుకొని 2016 ఏప్రిల్‌లో కేంద్ర కమిటీ సమావేశం కోసం ఒడిశా రాష్ట్రం కందమాల్ చేరుకున్నారు. అయితే శత్రు నిర్బంధం కారణంగా సమావేశం విడి విడిగా జరిగింది. తిరిగి పోలీసు కాల్పులను ఎదుర్కొంటూ 2016 జులైలో దండకారణ్యానికి చేరుకున్నారు.

నష్టాలను, గడ్డు పరిస్థితిని, తాత్కాలిక వెనుకడుగును అధిగమించేందుకు పార్టీ కృషి చేస్తూ వచ్చినప్పటికీ, విప్లవోద్యమంలో సాధారణంగా ఉండే ఎగుడు దిగుడులు, మలుపులు మెలికలు, విజయాలు వైఫల్యాల క్రమంలో పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలు సాపేక్షికంగా మరింతగా బలహీనపడుతూ వచ్చాయి. ఆపరేషన్ గ్రీన్ హంట్‌తో తాము ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చుకోలేని కేంద్ర ప్రభుత్వం 2017 మే నెలలో 'సమాధాన్' పేరుతో మరో సైనిక నిర్బంధ క్యాంపెయిన్‌ను చేపట్టింది. 'సమాధాన్' పేరుతో ఎల్ఐసీ బహుముఖ వ్యూహాన్ని మరింత బలంగా అమలు చేయసాగింది. విప్లవోద్యమంలో మరింత సంక్లిష్ట పరిస్థితి ఏర్పడింది. అటువంటి కాలంలో అనారోగ్యం, వయసు మీరుతున్న కారణంగా కేంద్ర కమిటీ కార్యదర్శి స్వచ్ఛందంగా బాధ్యతల నుంచి తప్పుకుంటూ తన స్థానంలో కామ్రేడ్ బీఆర్ ను ప్రతిపాదించారు. కమిటీ ఆమోదంతో కా. బీఆర్ 2017 ఏప్రిల్ నుంచి పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. కమిటీ నిర్ణయం మేరకు అంత కాలంగా ఆయన నిర్వహిస్తూ వచ్చిన కేంద్ర సైనిక కమిషన్ బాధ్యతలను మరో కామ్రేడ్ చేపట్టారు. ఆనాటి నుంచి అమరులయ్యే వరకు కా.బీఆర్ పెరుగుతున్న ఉద్యమ సంక్లిష్టతలను పరిష్కరించేందుకు తన కమిటీ సభ్యులతో కలిసి సైద్ధాంతిక కృషి సలిపారు. రాజకీయ, సైనిక, నిర్మాణపర ఎత్తుగడలను రూపొందిస్తూ, వాటి అమలు కోసం కింది కమిటీలకు మార్గదర్శకత్వం అందిస్తూ వచ్చారు.

అంతర్గత సంక్షోభాలలో పార్టీ పంథాను దృఢంగా ఎత్తిపట్టారు

1985లో కేంద్ర స్థాయిలో మొదటి అంతర్గత సంక్షోభం ఏర్పడింది. పార్టీలో మైనారిటీ వర్గం తప్పుడు సూత్రీకరణలతో తప్పుడు అవగాహనను ముందుకు తీసుకువచ్చింది. దీనిని అర్థం చేసుకుని, దీనికి వ్యతిరేకంగా కేడర్‌లలో సరైన అవగాహన ఏర్పరచేందుకు ఆనాటి కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి కా. బీఆర్ కృషి చేసారు. అదే కాలంలో పార్టీలో తప్పుడు ధోరణులు ప్రబలాయి. వీటికి వ్యతిరేకంగా 1987లో పార్టీ

దిద్దుబాటు క్యాంపెయిన్‌ను చేపట్టింది. ఆరు చెడులుగా గుర్తించిన ఈ కార్మికవర్గేతర ధోరణుల పట్ల కేడర్‌లలో అవగాహన కల్పించేందుకు కేంద్ర కమిటీ తీవ్రమైన కృషి చేసింది. ఈ సందర్భంగా దిద్దుబాటు దస్తావేజులు రూపొందించింది.

1991లో పార్టీలో కేంద్ర స్థాయిలో రెండో అంతర్గత సంక్షోభం ఏర్పడింది. పార్టీ నాయకుడి నుంచే ఏర్పడిన ఈ సంక్షోభంలో, ఆయన మార్గదర్శకత్వంలో నాయకులుగా రూపొందిన నూతన తరం నాయకులు ఆయన ముందుకు తీసుకువచ్చిన తప్పుడు పంథాను వ్యతిరేకించారు. పార్టీని సరైన పంథాలో నిలబెట్టారు. ఈ క్రమంలో కా. బీఆర్ కూడా పాల్గొన్నారు.

2001 కాంగ్రెస్‌లో ముందుకు వచ్చిన అతివాద, మితవాద పంథాలను కేంద్ర కమిటీ ఓడించింది. ఈ సందర్భంగా, ప్రపంచ విప్లవ చరిత్ర అనుభవాలను పేర్కొంటూ, ముఖ్యంగా రష్యా, చైనా దేశాల విప్లవాలలో ముందుకు వచ్చిన తప్పుడు ధోరణులు, వాటిలో లోపాలను వివరిస్తూ కాంగ్రెస్ ఈ పంథాను తిరస్కరించింది. ఇందులో కా. బీఆర్ పాలు పంచుకున్నారు. అలాగే 2007 కాంగ్రెస్‌లో ప్రత్యామ్నాయ దస్తావేజులపై కేంద్ర కమిటీ చర్చించి, వాటిని ప్రతినిధులలో చర్చకు పెట్టింది. వీటిలో ఉన్న లోపాలను వివరిస్తూ కేంద్ర కమిటీ సరైన పంథాను, అవగాహనను ముందు పెట్టింది. చర్చ అనంతరం కాంగ్రెస్ ఈ పంథాను తిరస్కరించింది. ఈ చర్చలలో కా. బీఆర్ దీర్ఘకాలిక ప్రజా యుద్ధ వ్యూహాన్ని దృఢంగా ఎత్తిపట్టారు. పార్టీ సరైన మార్గంలో విప్లవాన్ని పురోగమింపజేసేందుకు తన కమిటీ సభ్యులతో కలిసి కృషి చేసారు. ఆయా ధోరణులలో లోపాలను కేడర్‌లకు వివరిస్తూ, వారు దేశ కాల పరిస్థితులకు అనుగుణమైన అవగాహనకు వచ్చేందుకు తోడ్పడ్డారు.

సైద్ధాంతిక రంగంలో కృషి

సైద్ధాంతిక రంగంలో పార్టీ ఎల్లప్పుడూ కృషి కొనసాగించాలన్న అవగాహనతో ఉన్న పార్టీ కేంద్ర కమిటీ సమయానుకూలంగా అధ్యయనం జరిపి దేశ, అంతర్జాతీయ పరిస్థితి గురించిన స్పష్టమైన అవగాహన ఏర్పరచుకునేది. ఈ కృషిలో భాగంగా కా. బీఆర్ తన కమిటీ సభ్యులతో కలిసి సైద్ధాంతిక కృషి చేసారు. ఆయా సమయాలలో కేంద్ర కమిటీ రాజకీయ తీర్మానాలు రూపొందించేందుకు ఈ కృషి తోడ్పడింది. భారత దేశ నిర్దిష్ట పరిస్థితిపై పార్టీ స్పష్టమైన అవగాహనతో విప్లవోద్యమానికి నాయకత్వం అందించింది.

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో సే టుంగ్ అమరత్వం అనంతరం రివిజనిస్టు డెంగ్ నాయకత్వంలో చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగింది. తరువాత కాలంలో జరిగిన పరిణామాలపై అంతర్జాతీయంగా మార్క్సిస్టులలో చైనా సామ్రాజ్యవాద దేశంగా

మారిందా లేదా అన్న విషయంపై చర్చ ప్రారంభమయింది. ఈ విషయంపై అధ్యయనం చేయాలని, ఒక అవగాహనకు వచ్చిన తరువాత కేంద్ర కమిటీ నుంచి దస్తావేజును రూపొందించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ప్రారంభ కాలంలో కా. బీఆర్ ఈ అధ్యయనం చేపట్టారు. తన కమిటీ సభ్యులతో కలిసి చర్చించిన తరువాత 2017లో 'చైనా సోషల్ సామ్రాజ్యవాదం–ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగం' దస్తావేజు ముసాయిదాను రూపొందించారు.

ఇదే సమయంలో, భారత దేశంలో ఉత్పత్తి సంబంధాలలో వచ్చిన మార్పులను అధ్యయనం చేసి, నిర్దిష్ట పరిస్థితిని అంచనా వేసుకోవాలని కేంద్ర కమిటీ తీర్మానించింది. వివిధ రాష్ట్రాలలో చేస్తూ వస్తున్న సామాజిక పరిశోధనలను చర్చించింది. మార్క్సిస్టు మేధావులు, విద్యావేత్తలు జరిపిన, జరిపించిన అధ్యయనాలను తీసుకుని విస్తృతమైన అధ్యయనం జరిపింది. ఈ అన్నింటినీ విశ్లేషించి, సంశ్లేషించి అంతిమంగా 2021లో 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు–మన రాజకీయ కార్యక్రమం' దస్తావేజును రూపొందించింది. ఈ యావత్తు ప్రక్రియలో కా. బీఆర్ కీలక పాత్ర పోషించారు. విప్లవోద్యమ పురోగమనానికి ఈ దస్తావేజు ఒక మార్గదర్శకంగా ఉంటుంది. దీంతో పాటుగా 2017లో, ఆ తరువాత వచ్చిన అభిప్రాయాల మేరకు 2023 వరకు చేస్తూ వచ్చిన సవరణలతో రూపొందిన 'భారతదేశంలో కుల సమస్య–మన వైఖరి' దస్తావేజు, 2019లో రూపొంది, 2023లో సవరణలు జరిగిన 'భారత దేశంలో జాతుల సమస్య పట్ల పార్టీ అవగాహన' దస్తావేజులపై ఆధారపడి విప్లవోద్యమాన్ని తాత్కాలిక వెనకడుగు నుంచి అధిగమింప జేసేందుకు కృషి చేయాలి. ఈ విధంగా, 2001 నుండి 2025 వరకు కేంద్రకమిటీ రూపొందించిన యావత్తు దస్తావేజుల, విధాన పత్రాల రూపకల్పనలో కా. బీఆర్ కీలక పాత్ర పోషించారు. 2024 చివరిలో కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గం (సీబీబీ)పై దస్తావేజు ముసాయిదా రూపొందించారు. భారత విప్లవోద్యమానికి సైద్ధాంతిక, రాజకీయ నాయకత్వాన్ని అందించారు. ఈ కృషిలో భాగంగా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పార్టీ సిద్ధాంత పత్రిక 'పీపుల్స్ వార్' కు ప్రధాన సంపాదకుడిగా ఉంటూ సమర్థవంతంగా నడిపారు. ఈ పత్రిక ద్వారా పార్టీ సభ్యుల సైద్ధాంతిక అవగాహనను పెంపొందించేందుకు కృషి చేసారు. వివిధ స్పెషల్ జోన్, రాష్ట్ర కమిటీల అధికార పత్రికలకు మార్గదర్శకత్వం అందించారు.

కార్మికవర్గ అంతర్జాతీయతా కర్తవ్య సాధనలో

'పార్టీ అంతర్జాతీయ కమ్యూనిస్టు డిటాచ్ మెంట్‌లో ఒక భాగమనీ, ఈ పాత్రను మనం అత్యంత క్రియాశీలంగా నిర్వహించాలన్న' అవగాహనతో కేంద్ర కమిటీ గడచిన దశాబ్దాలుగా దీర్ఘకాలిక ప్రజా యుద్ధం సాగిస్తున్న కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫిలిప్పీన్స్

(సీపీపీ), టర్కీ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)(టీకేపీ-ఎంఎల్)లతో సంబంధాలు కొనసాగించింది. 1980వ దశకంలో టర్కీ పార్టీతో కలిసి కొన్ని సంవత్సరాల పాటు 'వాన్ గార్డ్ ఆఫ్ రెవల్యూషన్' పేరుతో అంతర్జాతీయ స్థాయిలో పార్టీ ఒక పత్రిక నిర్వహించింది. నేపాల్‌లో దీర్ఘకాలిక ప్రజా యుద్ధం నడుస్తున్న కాలంలో నేపాల్ పార్టీతో కలిసి 'దక్షిణాసియా మావోయిస్టు పార్టీ, సంఘాల సమన్వయ కమిటీ' (సీకంపోసా)ను నిర్మించింది భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు). సీకంపోసా విధి విధానాల రూపకల్పనలో, పత్రికా నిర్వహణలో, సంయుక్త కార్యాచరణలో కేంద్ర కమిటీ సభ్యునిగా కా. బీఆర్ పాత్ర ఉన్నది. నేపాల్ పార్టీ రివిజనిస్టు మార్గంలోకి వెళ్లడంతో సీకంపోసా పని నిలిచిపోయింది.

2010లో జర్మనీ దేశం హాంబర్గ్ పట్టణంలో ఒక సమావేశం జరిగి, మావోయిస్టు శక్తుల సమన్వయం తిరిగి పుంజుకుంది. సంఘాల రూపంలో, గ్రూపుల రూపంలో పని చేస్తున్న ఐరోపా, దక్షిణ అమెరికా మావోయిస్టు శక్తులతో సంబంధాలు పెంపొందించుకుంటూ మన పార్టీ వారితో సైద్ధాంతిక చర్చ జరుపుతూ వచ్చింది. 'భారతదేశ ప్రజాయుద్ధానికి మద్దతుగా అంతర్జాతీయ కమిటీ' (ఐసీఎస్ పీడబ్ల్యూఐ) ఏర్పడి, భారత విప్లవోద్యమం గురించి, ఉద్యమంపై నిర్బంధకాండ గురించి విస్తృతంగా ప్రచారం చేయసాగింది. ఈ కృషికి తోడ్పడే విధంగా కేంద్ర కమిటీ పార్టీ దస్తావేజులను, ఆయా సమయాలలో విడుదల చేసిన సందేశాలు, ప్రజల పరిస్థితులపై, నిర్బంధంపై రిపోర్టులు పంపిస్తూ వచ్చింది. కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యునిగాను, ఆ తరువాత కార్యదర్శి బాధ్యతలలోనూ కా.బీఆర్ ఈ కృషిలో క్రియాశీలక పాత్ర వహించారు.

కార్మికవర్గ అంతర్జాతీయతా కర్తవ్యాన్ని నెరవేర్చే ఈ కృషి ఈ పార్టీలు, సంఘాలు, గ్రూపులలో ఏకీకృత అవగాహన పెంపొందేందుకు ఎంతగానో తోడ్పడింది. గడచిన ఐదారు సంవత్సరాలుగా మేడే సందర్భంగాను, యుక్రెయిన్ పై యుద్ధం, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి మొదలయిన అంశాలపై వివిధ దేశాల మావోయిస్టు పార్టీలు కలిసి సంయుక్త ప్రకటనలు విడుదల చేస్తూ వస్తున్నాయి. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో సే టుంగ్ 130వ జన్మదిన వార్షికోత్సవ విశేష సందర్భంగా ఒక సంయుక్త ప్రకటన విడుదల చేసాయి. ఈ క్రమంలో కేంద్ర కమిటీ 2022లో అంతర్జాతీయ వ్యవహారాలు నిర్వహించేందుకు ఒకరికి బాధ్యతలు ఇచ్చింది. ఈ బాధ్యతల నిర్వహణలో కా. బీఆర్ సన్నిహిత మార్గదర్శకత్వం చాలా ముఖ్యమైనది.

2022లో 14 దేశాలకు చెందిన 15 పార్టీలు కలిసి అంతర్జాతీయ కమ్యూనిస్టు లీగ్ (ఐసీఎల్) ఏర్పాటు చేసి, తమ అవగాహనను ఒక డిక్లరేషన్ ద్వారా ప్రకటించాయి. ఆ డిక్లరేషన్‌లో మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు అవగాహనకు విరుద్ధంగా ఉన్న

అంశాలను కేంద్ర కమిటీ చర్చించింది. వాటిని వివరిస్తూ పత్రం రాసి పంపాలని నిర్ణయించింది. ఈ పత్రం రాయడంలో కా. బీఆర్ పాలు పంచుకున్నారు. గడచిన రెండు సంవత్సరాలలో 'సామ్రాజ్యవాదం–యుద్ధాలు', 'సామ్రాజ్యవాదం–ఆర్థిక సంక్షోభం' అంశాలపై సీపీపీ నిర్వహించిన థియరిటికల్ కాన్ఫరెన్స్ (సైద్ధాంతిక సదస్సు)లకు పత్రాలు రాసి పంపారు.

ప్రజాయుద్ధ సేనానిగా సైనిక రంగంలో కవాతు

ప్రజా యుద్ధ రాజకీయాలు లేకుండా ప్రజా సైన్యం మనజాలదని కా. బీఆర్ దృఢంగా విశ్వసించారు. ప్రజల మద్దతు లేకుండా సైనిక చర్యలు సఫలం కావన్న అవగాహనతోనే కోరాపుట్, నయాగఢ్ మొదలయిన పెద్ద చర్యల సందర్భంగా ముందు చూపుతో ఆ ప్రాంతంలో నిర్మాణ కృషి జరిగే విధంగా కేంద్ర కమిటీ పథకం రచించింది. ఈ కృషి పునాదిగా పరిస్థితులకు అనుగుణంగా ఆ చర్యలకు పథకం రూపొందించేవారు. గెరిల్లా యుద్ధం చేయకుండా ప్రజలకు రాజ్యాధికారం రాజాలదన్న పార్టీ అవగాహన మేరకు కా. బీఆర్ ఎల్లప్పుడూ గెరిల్లా యుద్ధ వ్యూహం గురించిన యోచన చేస్తుండేవారు. ఆయా ప్రాంతాలలో పార్టీ కమిటీలు, సైనిక కమిషన్‌లు, కమాండ్‌ల నుంచి సమాచారం సేకరిస్తూ, ఈ సమాచారాన్ని విశ్లేషిస్తూ వారికి మార్గదర్శకత్వం అందించేవారు. గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసే కృషిలో భాగంగా గెరిల్లాలను యుద్ధ విద్యలో నిపుణులను చేయడానికి నిరంతరం శ్రమించేవారు.

1987లో దారగడ్డ ఆంబుష్ నుండి మొదలుకొని 2010లో ముకరం ఆంబుష్ వరకు అనేక సైనిక చర్యల పథక రచనలో, బలగాల మోటివేషన్‌లో కా. బీఆర్ అగ్రగామి పాత్ర పోషించారు. కొన్ని చర్యల్లో ప్రత్యక్షంగా కమాండర్ గా వ్యవహరించారు. పీఎల్‌జీఏను సుశిక్షితమైన ప్రజా సైన్యంగా తీర్చిదిద్దడంలో, అవామీ జంగ్ పత్రికకు ప్రధాన సంపాదకుడిగా కా. బీఆర్ విశేష కృషి సలిపారు. అనేక మిలిటరీ శిక్షణా శిబిరాలను నడిపారు. దండకారణ్యం, ఏఓబీ స్పెషల్ జోన్ లలో, ఏపీలో, ఐక్యత అనంతరం బీహార్–ఝార్ఖండ్ స్పెషల్ ఏరియాలో సైనిక చర్యలకు పథకాలు రచించడంలో, మార్గదర్శకత్వం అందించడంలో కామ్రేడ్ బీఆర్ పాత్ర భారత ప్రజాయుద్ధ చరిత్రలో లిఖితమై ఉంటుంది. వీటిలో ముఖ్యమైనవి 2004 కోరాపుట్ క్యాంపెయిన్, 2006 నయాగఢ్ ఆపరేషన్, ఆర్. ఉదయగిరి రెయిడ్ మొదలయినవి.

2010లో దండకారణ్యంలో దక్షిణ బస్తర్ ప్రాంతం ముకరంలో 76 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మట్టు గావించిన ఘటన వెనుక కా. బీఆర్ పథక రచన ఉన్నది. ఈ సైనిక చర్య దేశ, అంతర్జాతీయ పీడిత ప్రజలలో ప్రజా సైన్యం పట్ల గొప్ప విశ్వాసం కలిగించింది. ప్రజా సైన్యం లేనిదే ప్రజలకు ఏమీ లేదన్న మావో మాటను ఆచరణపరంగా

ప్రజల ముందుంచింది. తరువాత కాలంలో పీఎల్‌జీఏ చేపట్టిన ఆంబుష్, రెయిడ్ వంటి అనేక సైనిక చర్యలకు ఈ ఘటనల అనుభవాలు అవగాహనను పెంపొందించాయి, ప్రేరణ కలిగించాయి.


కార్మికవర్గ విలువలకు నమూనా

'కమ్యూనిస్టుగా రూపొందడం కంటే, కమ్యూనిస్టుగా చివరి వరకు సాగడం కష్టతరమైన విషయం' అన్న ఎరుక ఉన్న కమ్యూనిస్టు కార్యకర్తలు అనునిత్యం తమపై తాము ఏ విధంగా సంఘర్షించుకోవాలో తన ఆచరణ ద్వారా ప్రకటించిన వ్యక్తి కామ్రేడ్ బీఆర్. కమ్యూనిస్టు క్రమశిక్షణకు, ఆదర్శాలకు కామ్రేడ్ బీఆర్ మారు పేరుగా నిలుస్తారనడం అతిశయోక్తి కాదు. తాను పాటించడమే కాకుండా పార్టీ కేడర్ లందరూ కమ్యూనిస్టు విలువలను ఎత్తి పట్టే విధంగా వారిని మలచడానికి అవసరమైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపరమైన కృషి సాగించారు. కఠినమైన శ్రమ-సాదా సీదా జీవన శైలి కా. బీఆర్ పాటించిన పద్ధతి. 'ఒక చేత్తో తుపాకి, మరో చేత్తో జొన్నల'తో గెరిల్లాలు యుద్ధం చేయాలన్న మావో మాటను ఆయన కేడర్‌లకు పదే పదే గుర్తు చేసేవారు. ఎంతటి కష్టానికైనా ఓర్చుకుని పని చేసే విధంగా వారిని ప్రోత్సహించేవారు.

ఒక మహత్తర కృషి, గొప్ప అనుభవం, ఉన్నత వ్యక్తిత్వం కలగలసిన కమ్యూనిస్టు కామ్రేడ్ బీఆర్ ఇక మన ముందు లేరు. కానీ ఆయన అందించిన సైద్ధాంతిక, రాజకీయ, సైనిక, నిర్మాణపర అవగాహన మనకు నిత్య మార్గదర్శిగా ఉంటుంది. ఈ మార్గదర్శితో విప్లవ కృషిని కొనసాగిస్తూ, ఆయన ఆదర్శాలను ఆచరించడమే ఆయనకు మనం ఇవ్వగలిగే నివాళి.

నక్సల్బరీ తొలి కెరటం

నక్సల్బరీ తొలి తరం విప్లవ కారుడు, సిపిఐ (మావోయిస్టు) పొలిట్ బ్యూరో సభ్యుడు, భారత దేశపు గొప్ప విప్లవ నాయకుడు కా. కిషన్ దా కు విప్లవ జోహార్లు



దాదాపు ఆరు దశాబ్దాల పాటు భారతదేశంలో విప్లవోద్యమ నిర్మాణం కోసం అంకితమై పనిచేస్తూ, విప్లవోద్యమాన్ని నిర్మించిన నాయకుడు కా. ప్రశాంత్ బోస్ 3 ఏప్రిల్ 2026 నాడు ఝార్ఖండ్ రాజధాని రాంచీలోని రాంచీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో చికిత్స పొందుతూ మరణించాడు. (సరియైన చికిత్స పొందక అనడం మరింత సరియైంది.) అప్పటికి దాదాపు నాలుగున్నర ఏళ్లుగా ఆయన రాంచీలోని బిర్సా ముండా జైలులో విచారణ ఖైదీగా ఉన్నాడు. ఆయన ఎంతో కాలంగా అనారోగ్యంతో ఉంటున్న కారణంగా చికిత్సకోసం తన జీవిత సహచరి కామ్రేడ్ శోభా దీదీ (కామ్రేడ్ షీలా మరాండీ)తో కలిసి వెళుతుండగా జరిగిన ద్రోహం వల్ల 12 నవంబర్ 2021 నాడు అరెస్టయ్యాడు. రాంచీలోని బిర్సా ముండా జైలులో ఉండగానే ఆయన పక్షవాతం బారిన కూడా పడి లేచి తిరగలేని స్థితిలో ఉన్నాడు. ఆయనకు ఏమాత్రం సరియైన చికిత్స అందలేదు. చివరికి రాంచీలోని ఆర్ఐఎంఎస్ ఆసుపత్రిలో చేర్చిన కొద్ది రోజులకే ఆయన మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలిసిన తరువాత కోల్‌కత్తా లోని ఆయన సోదరుడు, సోదరుని కుమారుడు, లాయర్లు, విప్లవాభిమానులు ఆయన భౌతిక కాయాన్ని కోల్‌కత్తా తీసుకువచ్చి విప్లవ సాంప్రదాయాలతో అంతిమ సంస్కారం జరపాలని భావించినా అందుకు భయపడిన ప్రభుత్వం ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు, విప్లవాభిమానులకు అందించకుండా తామే ఆయనకు అంత్యక్రియలు జరిపారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కా. నంబాళ్ళ కేశవ రావు భౌతిక కాయాన్ని కూడా ఎట్లాగైతే కుటుంబానికి అప్పగించకుండా పోలీసులు తామే అంత్యక్రియలు జరిపారో అట్లాగే మరో గొప్ప విప్లవకారుడైన కా. కిషన్ దా భౌతిక కాయాన్ని కూడా ప్రజల మధ్యకు తీసుకుపోవడానికి వెరచి తామే అంత్యక్రియలు నిర్వహించారు.

ఎనభై ఏళ్ల పై బడిన కా. కిషన్ దా తన అరవై ఏళ్ల జీవితాన్ని విప్లవోద్యమానికే అంకితం చేశాడు. జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఎంఏ చదివిన కా. ప్రశాంత్ బోస్ ఆనాటి కలకత్తా విద్యార్థిలందరి లాగానే నక్సల్బరీ మేఘ గర్జనతో ప్రేరణ పొంది విప్లవోద్యమంలోకి వచ్చాడు. నిర్మాణ పరంగా ఆనాడు కా. కన్హాయి చటర్జీ, అమూల్య సేన్ నాయకత్వంలో ఏర్పడిన 'దక్షిణ దేశ్ గ్రూప్' తో సంబంధాలు ఏర్పడ్డాయి. 1970లో సిపిఐ(ఎంఎల్) ఏర్పాటును కోల్‌కత్తాలోని షహీద్ మైదానంలో ప్రకటించినప్పుడు, ఆ సభలో యువ కామ్రేడ్ ప్రశాంత్ బోస్ కూడా ఉన్నాడు. అయితే దక్షిణ దేశ్ సమూహంగా ఆనాడు విప్లవోద్యమంలో భాగమైన విప్లవకారులు రాజకీయ, నిర్మాణపరమైన విభేదాల కారణంగా సిపిఐ(ఎంఎల్) లో అంతర్భాగం కాలేదు. 1970 అక్టోబర్‌లో ఆ విప్లవకారులు ఎంసిసి పేరుతో సంఘటితమయ్యారు. అప్పుడు గ్రామీణ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణానికి పూనుకున్న కామ్రేడ్ ప్రశాంత్ బోస్‌ను పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టడంలో భాగంగా ఆయనను తాడుతో బంధించి పోలీసు వాహనం వెనక కట్టి

లాక్కుపోవడం వల్ల, తుపాకీ బట్ తో దవడమీద బలంగా కొట్టడం వల్ల ఆయన దవడ ఒక వైపు బాగా దెబ్బతినిపోయింది. అందుకే ఆయన ముఖం ఒక వైపు దెబ్బతిని ఉంటుంది. జైలు నుండి విడుదల అయిన తరువాత ఆయన వెనువెంటనే రహస్య జీవితాన్నే ఎంచుకొని గిరిడీహ్ ప్రాంతంలో రైతాంగాన్ని, ఆదివాసీలను విప్లవోద్యమంలో సంఘటితపరిచే పనిలో నిమగ్నమయ్యాడు. అట్లా కా. కిషన్ దా ఎంసిసి ఏర్పడిన తొలినాళ్ళ నుండి విప్లవోద్యమంలో పూర్తి కాలం కార్యకర్తగా పనిచేయడం మొదలు పెట్టాడు. కొంత కాలం పాటు అస్సాంలో పని చేయడానికి వెళ్ళాడు.

ఎంసిసి ఏర్పడిన ప్రారంభ రోజుల్లో పశ్చిమ బెంగాల్‌లోని కాంగ్సా, సోనార్‌పూర్ ప్రాంతాలలోని గ్రామాలలో విప్లవోద్యమ నిర్మాణానికై నడుం కట్టారు. అక్కడ కొద్ది కాలంలోనే నిర్బంధం, తదితర ప్రతికూలతలు ఏర్పడ్డాయి. ఆ అనుభవాలను సంశ్లేషించిన తరువాత కా. కేసి, అమూల్య సేన్ లు బిహార్‌లోని మైదాన, అటవీ ప్రాంతాల్లో విప్లవ రైతాంగ పోరాటాలు నిర్మించడానికై పూనుకున్నారు. అప్పుడు వారితో పాటు కా. ప్రశాంత్ బోస్ కూడా గిరిడీహ్ ప్రాంతానికి చేరుకున్నాడు. ఇక అక్కడ నుండి మొదలై సారండా వరకు విప్లవోద్యమాన్ని నిర్మించడంలో మొత్తంగానే బీహార్–ఝార్ఖండ్ ఉద్యమ నిర్మాణంలో, సైన్య నిర్మాణంలో, పార్టీ నిర్మాణంలో కా. కిషన్ దా ది చాలా కీలక పాత్ర. ఎంసిసి సంస్థాపక నాయకులైన కా. కేసి, అమూల్య సేన్ లు 80 లలోనే అనారోగ్యంతో అమరులైన తరువాత కా. వరుణ్ దా పార్టీ కార్యదర్శిగా ఎన్నికయాడు. అయితే 1996 కల్లా అనారోగ్య కారణాల వల్ల కా. వరుణ్ దా కార్యదర్శి పదవి నుండి తప్పుకోగా, కా. కిషన్ దా ఎంసిసి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. అప్పటి నుండి పీపుల్స్‌వార్ పార్టీ, ఎంసిసిలు కలిసి సిపిఐ (మావోయిస్టు) పార్టీ ఏర్పడే దాకా ఆయనే కార్యదర్శి.

1980లలో పీపుల్స్‌వార్ పార్టీకి, ఎంసిసికి మధ్య కా. కేఎస్, కేసి ల నాయకత్వంలో ఐక్యతా చర్చలు ఒక మేరకు సాగి కొన్ని కారణాల వల్ల ఆగిపోయాయి. ఆ ప్రక్రియలో కా. కిషన్ దా కూడా ఒక భాగం. ఆ తరువాత మళ్ళీ 1990లలో ఈ ప్రక్రియ మళ్ళీ ఒక సారి కొనసాగి 1996 నాటికి రెండు పార్టీల విలీనం రాజకీయ విభేదాల వలన సాధ్యం కాలేదు.

ఆ కాలమంతటా ఎంసిసి పునాది వర్గాలైన రైతు కూలీల మధ్య, దళితులు, ఆదివాసీల మధ్య పనిచేస్తూ అత్యంత బలమైన విప్లవోద్యమాన్ని నిర్మించింది. భూస్వాములు రాజ్యం దన్నుతో ప్రైవేటు సేనలను నిర్మించుకొని విప్లవోద్యమాన్ని తుదముట్టించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కుల వ్యవస్థ దుర్మార్గాలకు పరాకాష్టగా నిలిచిన భూస్వాముల ప్రైవేట్ సైన్యాల అరాచకాలకు, దౌర్జన్యాలకు, దురాగతాలకు అనేక దళిత పల్లెలు అగ్గిపాలయ్యాయి, ఎన్నో ప్రాణాలు బలయ్యాయి.

కానీ పార్టీ యూనిటీ, ఎంసిసి పార్టీలు ఎన్నో సాహసోపేతమైన దాడులు చేసి

ఆ సేనలను మట్టికరిపించాయి. ఈ క్రమంలోనే గయా, ఔరంగాబాద్, గిరిడీహ్ ప్రాంతాలలో మొదలైన ఎంసిసి పార్టీ దాదాపు ఝార్ఖండ్ అంతటా విస్తరించింది. ఈ క్రమంలోనే 2002లో పిఎల్‌జిఏను కూడా ఏర్పాటు చేశారు.

మరో వైపు బీహార్-ఝార్ఖండ్‌లలో విప్లవోద్యమాన్ని నిర్మిస్తున్న సిపిఐ(ఎంఎల్)పార్టీ యూనిటీతో సుదీర్ఘకాలం పాటు ఎంతో సత్సంబంధాలు కొనసాగాయి. కానీ 1990లలో కొంత కాలం పాటు ఇరు పార్టీల మధ్య వైమనస్యాలు చోటుచేసుకొని, విభేదాలు పెరిగి పరస్పర దాడులకు దారి తీసాయి. వీటిలో ఇరు పార్టీలకు చెందిన కామ్రేడ్స్ అమరులయ్యారు. 1998లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పార్టీ యూనిటీ), భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) రెండూ విలీనమై, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్ వార్) ఏర్పడింది. రెండు పార్టీలు సమైక్యంగా 2001 లో పార్టీ 9వ కాంగ్రెస్‌ను జరుపుకున్నాయి. అక్కడ ఎంసిసితో కాల్పుల విరమణ పాటించాలనే నిర్ణయం జరిగింది. ఆ ప్రతిపాదనను ఎంసిసి కి పంపాలని నిర్ణయమైంది. కానీ ఆ ప్రతిపాదన వారికి అందడంలో విభిన్న కారణాల వల్ల చాలా ఆలస్యం అయ్యింది. ఆ తరువాత కొద్దికాలానికే పీపుల్స్‌వార్‌తో ఏక పక్షంగా కాల్పుల విరమణ పాటిస్తామని ఎంసిసి ప్రకటన వచ్చింది. ముఖ్యంగా అటువంటి ప్రయత్నాలకు తీవ్ర ప్రతిబంధకంగా ఉన్న భరత్ ముఠాకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేసి ఈ నిర్ణయం తీసుకోవడంలో కామ్రేడ్ కిషన్ దా, కా.వరుణ్ దా చాలా ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించారు. దీనికి ప్రతిస్పందనగా పీపుల్స్ వార్ పార్టీ కూడా ప్రతిస్పందించి కాల్పుల విరమణను ప్రకటించింది.

ఎంసిసి పార్టీ కా. కిషన్ దా నాయకత్వంలో రెవెల్యూషనరీ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ (రిమ్) లోనూ, సీ-కంపోసా లోనూ భాగమయ్యింది. సీ-కంపోసాలో పీపుల్స్ వార్ కూడా భాగం. ఈ వేదికలు భారత విప్లవానికి రెండు పార్టీల మధ్య ఏర్పడిన వైమనస్య వాతావరణం భారత విప్లవానికి కలుగజేస్తున్న హాని గురించి మాట్లాడి అది తొలిగేలా చర్యలు చేపట్టాలని కోరాయి. ఇరు పార్టీలలో కూడా జరుగుతున్న నష్టాన్ని నివారించాలని బలమైన కోరిక ఉండటం వల్ల కాల్పుల విరమణ ప్రకటనలు చేయడంతో పాటు రెండు పార్టీల విలీన ప్రయత్నాలు కూడా మరోసారి ప్రారంభించాలని ప్రతిపాదన ముందుకు వచ్చింది.

నక్సల్బరీ కాలం నుండే విడివిడి పాయలుగా ఉన్న రెండు విప్లవ స్రవంతులు ఐక్యం కావడానికి ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. 2002 నుండి ప్రారంభమయిన ఈ చర్చలు 2004 నాటికి ఒక కొలిక్కి వచ్చి, రెండు పార్టీల అత్యున్నత స్థాయి ప్రతినిధి వర్గాలు రెండు పార్టీలు విలీనం కావాలని ఒక నిర్ణయానికి వచ్చాయి. సారండా అడవిలో జరిగిన ఇరు ప్రతినిధి వర్గాల సమావేశంలో వందలాది పిఎల్‌జిఏ సైనికుల మధ్య

21 సెప్టెంబర్ 2004 నాడు కా. వరుణ్ దా నూతన పార్టీ సిపిఐ (మావోయిస్టు) ఏర్పడిందని ప్రకటించాడు. ఈ మొత్తం ప్రక్రియలో ఎంసిసి కార్యదర్శిగా కా. కిషన్ దా పాత్ర చాలా గొప్పది. అప్పటిదాకా ఎంసిసి ప్రధాన కార్యదర్శిగా ఉన్న కా. కిషన్ దా స్వయంగా కామ్రేడ్ గణపతి నూతన పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉండాలని ప్రతిపాదించాడు.

ఆ సందర్భంలో అంతకు ముందు ఇరు పార్టీల పరస్పర దాడులలో మరణాలకు బాధ్యులైనందుకు ఎంసిసి తరఫున చాలా లోతైన స్వీయ విమర్శను కా. కిషన్ దా ప్రవేశపెట్టాడు. ఇరు పార్టీలు కూడా ఆ 'చీకటి అధ్యాయం' పట్ల లోతైన స్వీయ విమర్శను భారత పీడిత ప్రజల ముందు ఉంచాయి. ఆ చీకటి అధ్యాయం గురించిన ఆత్మ విమర్శతో కూడిన లక్షలాది కరపత్రాలను ప్రజలలోకి తీసుకెళ్లడం జరిగింది. కేంద్ర స్థాయిలో విలీనమైన పార్టీ కింది స్థాయి యూనిట్ల దాకా నిజమైన ఐక్యత సాచించడం చాలా అవసరం. ముఖ్యంగా అప్పటి దాకా వైమనస్యాలతో పరస్పర దాడులు చేసుకున్నా బీహార్–ఝార్ఖండ్ లలో మరీ అవసరం. ఆ ఐక్యతను సాధించడానికి కా. కిషన్ దా ఎంతో కృషి చేశాడు.

నూతన పార్టీని మరింత సంఘటిత పరచడానికి దేశంలోని విభిన్న ప్రాంతాలకు వెళ్ళి ఝార్ఖండ్ ఉద్యమ అనుభవాలను పంచడంతో పాటు విప్లవ పార్టీల ఐక్యతకు ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ పార్టీ అంతటా నూతన ఉత్సాహాన్ని నింపాడు.

ఈ నేపథ్యంలో 2007 తొలి మాసాలలో పార్టీ ఐక్యతా తొమ్మిదవ కాంగ్రెస్ గొప్ప విప్లవ వాతావరణంలో జరిగి నూతన అవగాహనలతో పార్టీ డాకుమెంట్లు రూపొందాయి. అసలు ఆ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కా. కిషన్ దా ది చాలా ముఖ్యమైన పాత్ర. అప్పటికే మావోయిస్టు పార్టీని 'దేశ అంతర్గత భద్రతకు' అతి పెద్ద ప్రమాదంగా వర్ణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీని అంతమొందించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నూతన పార్టీ కాంగ్రెస్ జరగబోతుందని ఇంటలిజెన్స్ వర్గాలు ఒక అంచనాతో ఉన్నాయి. కాంగ్రెస్ దండకారణ్యంలోనో, సారండా అడవుల్లోనో జరుగుతుందని ఒక అంచనాతో అక్కడికి వెళ్లగల దారులు, సమీప రైల్వే స్టేషన్లు, బస్ స్టాండులు, రోడ్డు మార్గాలపై విపరీతమైన నిఘా పెంచారు. అటువంటి సమయంలో కాంగ్రెస్ నిర్వహణ అత్యంత సవాలుతో కూడుకొన్న విషయం. రహస్యం అతి కీలకమైన విషయం. కా. గణపతి, కా. కిషన్ దాలు మాత్రమే చర్చించుకొని స్థలం గురించి నిర్ణయించిన తరువాత, కా. కిషన్ దా ఆ స్థల ప్రాంత బాధ్యులైన కా. వివేక్ దా, కా. సహదేవ్ సొరేన్ లతో కలిసి ఆ ఏర్పాట్లన్నీ చేసి విజయవంతంగా నిర్వహించారు. ఆ స్థలంలో నిర్వహిస్తారని ఇంటలిజెన్స్ వర్గాలు ఏ మాత్రం ఊహించకపోవడంతో కాంగ్రెస్ సజావుగా సాగింది.

రెండు పార్టీల విలీనం, విజయవంతంగా కాంగ్రెస్ నిర్వహణల తరువాత

దేశవ్యాప్తంగా విప్లవ శిబిరంలో ఒక కొత్త ఉత్సహం వెల్లివెరిసింది. దేశవ్యాప్తంగా మరిన్ని విప్లవ శక్తులు, సంస్థలు నూతన పార్టీతో విలీనం కావడానికి ముందుకు వచ్చాయి.

అప్పటికే మావోయిస్టు పార్టీని తుదముట్టించాలని ప్రయత్నిస్తున్న కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు, పోలీసు బలగాలు, ఇంటలిజెన్స్ సంస్థలు కాంగ్రెస్ తరువాత తమ ప్రయత్నాలను అన్నీ రకాలుగా ముమ్మరం చేశాయి. ఒకవైపు క్షేత్ర స్థాయిలో బలగాలను విపరీతంగా మోహరిస్తూనే మరో వైపు ఇంటలిజెన్స్ సంస్థలు నాయకత్వ కామ్రేడ్స్ పై కేంద్రీకరించి వారిని తుదముట్టించడానికై ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

ఆ క్రమంలోనే అటవీ ప్రాంతం బయట ఉన్న కేంద్ర కమిటీ నాయకులనందరినీ మూడు నాలుగేళ్ల వ్యవధిలో అరెస్టు చేసారు. కొందరిని బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేశారు. ఎందరో రాష్ట్ర కమిటీ సభ్యులు కూడా అరెస్టు అయ్యారు, లేదా బూటకపు ఎన్‌కౌంటర్లలో అసువులు బాసారు.

ఈ వరుస నష్టాలు ఒక వైపు జరుగుతుండగానే మరొకవైపు బలగాలను ఆధునీకరించి, ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసి, లక్షలాది బలగాలను మోహరించి 'ఆపరేషన్ గ్రీన్ హంట్', అనకొండ వంటి ఎన్నో ఆపరేషన్లను చేపట్టడంతో విప్లవోద్యమం, పార్టీ చాలా నష్టపోయింది.

పార్టీ కమిటీలు, సైన్య యూనిట్లు, ప్రజా సంఘాలు బాగా దెబ్బ తిని పోయాయి. 2013 నాటికి తూర్పు రీజియనల్ బ్యూరో సభ్యులలో చాలా మంది పొలిట్ బ్యూరో మెంబర్లు సహ సీసీ కామ్రేడ్స్ అరెస్టులు కావడం, అమరులు కావడంతో విప్లవోద్యమం అత్యంత ప్రతికూల పరిస్థితులలోకి నెట్టబడింది.

బిహార్–ఝార్ఖండ్ ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులను 2013 ప్రారంభ మాసాలలో కేంద్ర కమిటీ 4వ సమావేశంలో సమీక్షించి ఆ ఉద్యమం తాత్కాలిక వెనుకంజకు గురైందనీ అంచనా వేసింది. అదే సమయంలో దేశ వ్యాప్త విప్లవోద్యమం గడ్డు పరిస్థితులలోకి వెళ్లిందనీ నిర్ణయించింది. ఆ సమావేశంలో ఉద్యమ పరిస్థితిని సమగ్రంగా ప్రవేశపెట్టి దానిని అంచనా వేయడానికి కామ్రేడ్ కిషన్ దా ఆత్మవిమర్శతో సీసీ ముందు వుంచిన ప్రతిపాదనలు ఆయనలోని తప్పుల పట్ల కమ్యూనిస్టుల స్వభావానికి పరమ నిదర్శనాలు. ఆయన ఆ ఉద్యమం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను సీసీ చర్చించాలనీ అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించాలనే విప్లవ పట్టుదలతో మూడేళ్లుగా రెండు బలమైన ఉద్యమ ప్రాంతాల మధ్య (CRB-ERB) సమన్వయం దెబ్బతిన్న పరిస్థితులలో వందలాది మైళ్లు కాలినడకన సారండా అడవుల నుండి మాడ్ కొండలలోకి చేరుకొని లాంగ్ మార్చ్‌ను గుర్తు చేశారు. వయసు పైబడిన సమయంలో ఆయన అంత దూరం కాలిబాటన నడిచాడు.

రెండు పార్టీల విలీనం కన్నా ముందే బిహార్ లోని కొన్ని మైదాన ప్రాంతాలలో

దెబ్బ తిన్న విప్లవోద్యమం కాంగ్రెస్ తరువాత కొద్ది కాలానికే అనేక ప్రాంతాలలో దెబ్బ తిని ప్రధానంగా అటవీ ప్రాంతాలకే పరిమితమైన పరిస్థితులలో స్థానికంగా, రీజియన్ పరిధిలో, దేశవ్యాప్తంగా ముఖ్యంగా మధ్య రీజియన్‌తో, సీసీ తో సమన్వయం దెబ్బతినడంతో ఉద్యమం ఒంటరై నిలదొక్కుకోవడం అత్యంత సమస్యాత్మకంగా మారింది. ఇలాంటి పరిస్థితులలో 2016 మధ్యలో తీవ్ర ప్రమాదకర పరిస్థితులలోనే అయినప్పటికీ సీసీ సమావేశం కోసం తిరిగి సరండా నుండి మహానది దాటి ఒడిశా కాలినడకన చేరినా సమావేశం జరగలేదు. ఆ సమావేశం జరగకుండానే వెనుదిరిగి పోవడం కామ్రేడ్ కిషన్ దా ఆరోగ్యాన్నే తీవ్రంగా దెబ్బతీసింది.

కా. కిషన్ దా కరోనా సమయంలో ఒక సంవత్సరం పాటు చికిత్స కోసం ఒక పట్టణంలో ఉన్నాడు. పూర్తిగా కోలుకోకపోయినా మళ్ళీ సారండా అడవికి – ఉద్యమ ప్రాంతానికి చేరుకున్నాడు.

పై పరిస్థితుల నేపథ్యంలో, కామ్రేడ్ కిషన్ దా మిగిలిన ఉద్యమాన్ని కాపాడుకోవడానికి ఎంతగానో పాటుపడుతూ ఎదిగివస్తున్న కేడర్లతో కలిసి సిద్ధాంత రాజకీయ, సైనిక, నిర్మాణ రంగాలలో తన అనుభవాన్ని వారికి రంగరించి అందించసాగాడు. కానీ, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తన ఆరోగ్య సమస్యల కారణంగా అడవి నుండి బయటకు చికిత్సకు వెళ్లడం మళ్ళి ఒక అనివార్య ప్రయాణంగా ముందుకు వచ్చింది.

ఆయన ప్రయాణానికి సిద్ధమవుతున్న పరిస్థితులలో కేంద్ర కమిటీ 6వ సమావేశం నిర్ణయాలు, రూపొందించిన నూతన దస్తావేజులు, చేసిన 14 సంవత్సరాల ఉద్యమ సమీక్ష ఆయనకు చేరాయి. అనేక సంవత్సరాలుగా దెబ్బతిన్న సమన్వయం మధ్య అనుకోకుండా చేరిన ఆ దస్తావేజులను సమగ్రంగా, ఓపికగా చదివి అభిప్రాయాలు ఏర్పర్చుకునే అవకాశం తగినంత లేనప్పటికీ వాటిని పరిశీలించి స్థూలంగా ఏకీభవిస్తున్నాననే తన అభిప్రాయాన్ని ప్రధాన కార్యదర్శికి చేర్చాడు. అంతేకాదు, అప్పటికే తను ఎదుర్కొంటున్న వయసు, అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో తూర్పు రీజియన్ లో నిర్మాణపరంగా చేపట్టాల్సిన మార్పులను చేపట్టి వాటిని ప్రధాన కార్యదర్శికి తెలిపాడు. అదే ఆయన అందచేసిన చివరి ఉత్తరం.

విప్లవ మహిళా ఉద్యమ నిర్మాతగా, విప్లవ సాంస్కృతిక ఉద్యమ నిర్మాతగా కా. కిషన్ దా

విప్లవ రైతాంగ పోరాటాన్నే కాకుండా చాలా బలమైన మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో కా. కిషన్ దా ప్రత్యేక కృషి ఉంది. నారీ ముక్తి సంఘ్ ఏర్పడి ఝార్ఖండ్ లో వేలాది మహిళలు విప్లవోద్యమంలో సంఘటితమయ్యారు. అటువంటి నారీ ముక్తి సంఘర్ష్ తొలి కార్యకర్తలలో ఒకరే కా. షీలా మరాండి. ఆమె ఆ తరువాత ఎన్ఎస్ఎస్

నాయకురాలుగా ఎదిగింది. ఆమె కా. కిషన్ దా జీవన సహచరి కూడా అయ్యింది. ఆమె విప్లవోద్యమంలో క్రమంగా ఎదుగుతూ 2007 కాంగ్రెస్ లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికైంది. అట్లా పార్టీ కేంద్ర కమిటీలోకి ఎన్నికైన తొలి ఆదివాసీ మహిళ ఆమె. ఆమె ఎదుగుదలలోనూ, అటువంటి మరెందరో మహిళా కామ్రేడ్ల (ఉదా. బిజే ఎస్ఏసిల సభ్యురాలిగా ఎదిగిన కా. చింత) ఎదుగుదలలోనూ కా. కిషన్ దా కృషి చాలా గొప్పది.

విప్లవోద్యమ నిర్మాణంలో సాంస్కృతిక ఉద్యమ పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. దాని ప్రాముఖ్యత తెలిసిన కా. కిషన్ దా బిహార్, ఝార్ఖండ్ లలో విప్లవ సాంస్కృతిక సంఘాలను స్థాపించి సాంస్కృతికోద్యమాన్ని నిర్మించడానికి చాలా కృషి చేశాడు. ముఖ్యంగా ఝార్ఖండ్ ఎభేన్ (ఝార్ఖండ్ జాగృతి)ను స్థాపించి ఎందరో బాల కళాకారుల నుండి యువ కళాకారుల వరకు తయారు చేయడంలో కా. కిషన్ దా ప్రత్యేక శ్రద్ధ పెట్టాడు. స్వయంగా ఆయన అవకాశం ఉన్నప్పుడల్లా వాళ్ళకు రాజకీయ విషయాలలోనే కాక సాంస్కృతిక విషయాలలో కూడా మార్గదర్శకత్వం అందించేవాడు. చేతనా నాట్య మంచ్ కళాకారులు, ఎభేన్ కళాకారులు తమ సాంస్కృతిక అనుభవాలను పంచుకొని ఒకరి నుండి మరొకరు నేర్చుకొన్నారు. ఎభేన్ కళాకారులు తెలుగు పాటలు కూడా నేర్చుకొని పాడుతుంటే వాళ్ళు తెలుగువాళ్లేనేమో అనిపించేంత అద్భుతంగా పాడేవారు. స్వయంగా కా. కిషన్ దా గాయకుడు కావడం కూడా ఎభేన్ ఎదుగుదలకు తోడ్పడింది. సమావేశాలను ఆయన చాలా ఉత్సాహభరితంగా, ప్రేరణాదాయకంగా, ఎలక్ట్రిఫయింగ్ గా ముగించేవాడు. ఆయన స్వయంగా పాడుతూ, నినదిస్తూ అందరితో పాడిస్తూ, నినదింపజేస్తూ స్ఫూర్తిదాయకంగా సమావేశాలకు ముగింపు పలికించేవాడు.

ఆ బక్క పలుచటి మనిషి గొంతునుండేనా ఇటువంటి విద్యుత్తును ప్రవహింపజేసే నినాదాలు వెలువడుతున్నదని ఆశ్చర్యం అనిపించేది.

అటువంటి గొంతు శాశ్వతంగా మూగపోయింది. భారతదేశపు అతి గొప్ప విప్లవ నాయకులలో ఒకరైన కా. కిషన్ దా (ప్రశాంత్ బోస్) శారీరకంగా దూరమైనా ఆయన విప్లవ కార్యాచరణ తరతరాలకు ప్రేరణను ఇస్తూనే ఉంటుంది.

కామ్రేడ్ కిషన్ దా ఆశయమైనట్టి శ్రామిక వర్గాల విముక్తి కోసం కమ్యూనిస్టు లక్ష్యం సాధించేవరకు విశాల ప్రజారాసుల మధ్య వినమ్రంగా పట్టుదలతో పని చేయడమే ఆయనకు నిజమైన నివాళి.

భారత విప్లవోద్యమ ప్రముఖ నాయకులు

మన పార్టీ కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో సభ్యులు

కామ్రేడ్ ఆనంద్‌కు అరుణారుణ జోహార్లు



భారత విప్లవోద్యమ ప్రముఖ నాయకులు
మన పార్టీ కేంద్రకమిటీ పాలిట్ బ్యూరో సభ్యులు
కామ్రేడ్ ఆనంద్ కు అరుణారుణ జోహార్లు!

''...రాబోయే రోజుల్లో ప్రజలు మరింత గట్టిగా నిలిచి తప్పక విజయం కోసం పోరాడుతారు. అందులో సందేహం లేదు. ప్రజలే విప్లవోద్యమానికి నిజమైన కర్తలు...'' అన్న దృఢమైన విశ్వాసంతో, పీడిత ప్రజల విముక్తి కోసం దాదాపు 5 దశాబ్దాల పాటు అలుపెరుగకుండా పోరాడిన ఒక గొప్ప విప్లవ స్వాప్నికుడు 2023 మే 31వ తేదీ మధ్యాహ్నం 12:20 గంటలకు నిశ్చలనమయిపోయాడు. ఆయనే మన భారత కార్మికవర్గ ఉత్తమ పుత్రుడు, మన పార్టీ కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ ఆనంద్ (కటకం సుదర్శన్). ఆయన దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధి, డయాబెటిస్, అధిక రక్తపోటు సమస్యలతో గత కొద్ది సంవత్సరాలుగా బాధపడ్డారు. చివరికి గుండెపోటుతో తెలంగాణా – దండకారణ్య సరిహద్దులోని గెరిల్లా బేస్ లో తుదిశ్వాస విడిచారు.

మన పార్టీ ఉజ్వల చరిత్రలో గత ఐదు దశాబ్దాల కామ్రేడ్ ఆనంద్ పాత్ర విడదీయలేనంతగా పెనవేసుకొని వుంది. పార్టీ చరిత్ర నుంచి వేరుచేసి ఆయన గురించి చెప్పడం సాధ్యం కాదు. కామ్రేడ్ ఆనంద్ నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల అనంతర కాలపు మలితరం విప్లవోద్యమ నాయకుల్లో ఒకరు. 1974లో విద్యార్థిగా రాడికల్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితుడై, నక్సల్బరీ, శ్రీకాకుళ సాయుధ రైతాంగ ఉద్యమ రాజకీయాలతో ప్రభావితమయ్యారు. ఎంఎల్ఎం సిద్ధాంతాన్ని, రష్యా, చైనా విప్లవ అనుభవాలను అధ్యయనం చేస్తూ, తన ప్రాపంచిక దృక్పథాన్ని విప్లవీకరించుకుంటూ, విప్లవ కార్యకలాపాలలో నిమగ్నమై పనిచేస్తూ దృఢ సంకల్పాన్ని పెంచుకున్నారు. నక్సల్బరీ విప్లవ వెల్లువ–సెట్ బ్యాక్ అనుభవాలను సీపీఐ (ఎం–ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ మదింపు వేసి అందించిన గుణపాఠాలను రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో అమలులోకి తీసుకుపోయింది. ప్రజాపంథాను అమలు చేసింది. కామ్రేడ్ ఆనంద్ విప్లవోద్యమంలో మరో నూతన వెల్లువ సృష్టికి, దాని అభివృద్ధికి ప్రత్యక్ష నాయకత్వం వహించిన ఆ టీములో భాగమై పని చేసారు. ఆ సమిష్టి టీములో ఒకరిగా ఎంఎల్ఎం సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా ఆచరణకు అన్వయిస్తూ సిద్ధాంతం వెలుగులో ఆచరణ కొనసాగిస్తూ విప్లవోద్యమాన్ని వ్యూహాత్మక దృష్టితో అభివృద్ధి చేస్తూ, తన సైద్ధాంతిక స్థాయిని నిరంతరాయంగా పెంచుకున్నారు, గొప్ప విప్లవ అనుభవాన్ని సంపాదించారు. పార్టీ రాజకీయ, మిలిటరీ పంథాను సమృద్ధం చేయడంలో ఒక ప్రముఖ భూమిక నిర్వహించారు. రాజకీయంగా దృఢంగా వుంటూ, అంచలంచలుగా విప్లవోద్యమాన్ని పెంపొందించే కృషిని క్రియాశీలంగా కొనసాగించారు. దేశవ్యాప్తంగా దీర్ఘకాల

ప్రజాయుద్ధంతో పాటు తానూ అభివృద్ధి అవుతూ మన పార్టీలో అనేక కీలకమైన బాధ్యతల్ని చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు. కార్మిక, ఆదివాసీ, రైతాంగ, విద్యార్థి–యువజన, మహిళా, దళిత, మేధావి రంగాలలోనూ, మైదాన, అటవీ, పట్టణ ప్రాంతాలలోనూ పోరాటాలను నిర్మించి, అభివృద్ధి చేయడం కోసం, బలమైన పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ఐక్యసంఘటనలనూ నిర్మించి, సంఘటితం చేయడం కోసం ఆయన అవిశ్రాంతంగా పని చేసారు. విశేష ప్రజాదరణ కలిగిన నేతగా పీడిత ప్రజల, పార్టీ శ్రేణుల, పీ.ఎల్.జీ.ఏ. బలగాల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం, ఉత్తర తెలంగాణా స్పెషల్ జోన్ (ప్రస్తుత తెలంగాణ), మహారాష్ట్ర విప్లవోద్యమాలను నిర్మించి అభివృద్ధి చేయడంలో, నక్సల్బరి తాత్కాలిక వెనకంజ తర్వాత భారత విప్లవోద్యమాన్ని పునర్నిర్మాణం చేయడంలో ఒక ప్రముఖ పాత్ర పోషించారు. పార్టీలో ఒక ఏరియా స్థాయి ఆర్గనైజర్ నుండి కేంద్రకమిటీలో పొలిట్ బ్యూరో సభ్యుని స్థాయి వరకు ఎదిగి, భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహించారు.

పార్టీ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను దృఢంగా విశ్వసించిన కామ్రేడ్ ఆనంద్ సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక తదితర రంగాలలో పార్టీ పంథాను దక్షతతో అమలు చేసారు. కేంద్రకమిటీలో సమిష్టి నాయకత్వాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా ఎదుగుతూ, వ్యక్తిగత బాధ్యతల నిర్వహణలో తన శక్తియుక్తులన్నింటినీ ఉద్యమాభివృద్ధికి ధారపోసారు. ఉద్యమంలోని ప్రతీ కీలకమైన మలుపులో సృజనాత్మకంగా, విప్లవ నిబద్ధతతో కృషి చేసారు. సింగరేణి బొగ్గు గనుల్లో బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించి అభివృద్ధి చేయడంలో, విముక్తి ప్రాంత లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఉద్యమాన్ని దండకారణ్యంలోకి విస్తరింపజేయడంలో, దేశంలోని పలు ప్రాంతాలకు పార్టీని విస్తరింపజేయడంలో, గెరిల్లాయుద్ధాన్ని–ప్రజాయుద్ధాన్ని నిర్మించి అభివృద్ధి చేయడంలో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దండకారణ్యం, ఆంధ్ర–ఒడిశా బార్డర్ తదితర రాష్ట్రాల ఉద్యమాలను గెరిల్లా జోన్లుగా ఎదిగించడంలో, ప్రజా విముక్తి గెరిల్లా సైన్య స్థాపనలో, విప్లవ ప్రజా రాజకీయాధికారానికి బీజప్రాయంగా విప్లవ ప్రజా కమిటీల (దండకారణ్యంలో క్రాంతికారీ జనతన సర్కార్ల) స్థాపన–గెరిల్లా బేసుల స్థాపనలో, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నిర్మాణం–అభివృద్ధి–తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమాభివృద్ధిలో ఆయన కృషి ఎనలేనిది. ఆయన పార్టీలో కొనసాగిన రెండు పంథాల మధ్య పోరాటాలలో సరైన పంథా వైపు నిలబడి క్రియాశీల పాత్ర పోషించారు.

కార్మికవర్గ పుత్రుడు, విప్లవ మేధావి, భారత ప్రజాయుద్ధ వ్యూహకర్త, సమరయోధుడు, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ ఆనంద్ ఆదర్శాలను స్వీకరిద్దాం. భారత విప్లవోద్యమాన్ని పురోగమింపజేయడానికి ఆయన విప్లవ ప్రస్థానంలోని ప్రముఖ విషయాలను సంక్షిప్తంగా చూద్దాం.

కుటుంబ నేపథ్యం

కామ్రేడ్ ఆనంద్ సింగరేణి గనుల ప్రాంతంలోని బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తీలో సింగరేణి కార్మిక కుటుంబంలో 1956 మే 17న జన్మించారు. ఆరంభం నుంచి సింగరేణి బొగ్గు గనులు ప్రభుత్వానికి మంచి ఆదాయాన్ని అందిస్తూ, దక్షిణ భారతదేశం మొత్తానికి బొగ్గు సరఫరా చేస్తూ వుండేవి. అయినప్పటికీ కన్నాల బస్తీ సింగరేణి గనుల ప్రాంతంలో అనేక ఇతర కార్మిక బస్తీల మాదిరిగానే ప్రాథమిక సౌకర్యాలు లేని మురికివాడలా ఉండేది.

కామ్రేడ్ ఆనంద్ తల్లి కటకం వెంకటమ్మ, తండ్రి కటకం మల్లయ్య. తండ్రి సింగరేణిలో ఫిట్టర్ గా పని చేసేవారు. తాత కూడా బొగ్గు గని కార్మికుడే. వీరిది రెక్కలు తప్ప ఆస్తిపాస్తులు లేని నిరుపేద కుటుంబం. వీరికి నలుగురు మగ, ఇద్దరు ఆడ పిల్లలతో మొత్తం ఆరుగురు పిల్లలు. కామ్రేడ్ ఆనంద్ పెద్దవారు. ఆయనకు సుదర్శన్ అని పేరు పెట్టుకున్నారు. భూగర్భ బొగ్గు బావుల్లో మృత్యువుతో నిరంతరం పోరాడుతూ పని చేసి కూలి డబ్బులు సంపాదించుకుని జీవనం కొనసాగించడం ఎంతో కఠినంగా వుండేది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతూ పిల్లల్ని చదివించారు.

వారు పిల్లల పట్ల ప్రజాస్వామికంగా వ్యవహరించేవారు. పిల్లలు తమ లాగా కూలి పనికి పోకుండా తెల్లబట్టల ఉద్యోగిగా చూడాలనుకునేవారు. ఇంటిలో ఈ స్వేచ్ఛా వాతావరణం వుండడం, బెల్లంపల్లి పట్టణంలో కమ్యూనిస్టు రాజకీయ ప్రభావం వుండడం వలన సుదర్శన్ సహజంగానే విప్లవ రాజకీయాల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. సమాజంలో అందరూ సమానంగా ఎందుకు ఉండలేకపోతున్నారని ఆలోచించేవారు. కార్మిక కుటుంబంలో పుట్టి, కార్మికుడిగా పని చేయడం వల్ల కార్మికుల కష్టాలు కడగండ్లు దగ్గర నుంచి చూసారు. కార్మికుల జీవితాలను అధ్యయనం చేసేవారు. రష్యా, చైనాలలో సోషలిజం కారణంగా ప్రజలు దోపిడీ పీడనలు లేకుండా సమానంగా జీవిస్తున్నారనే వాస్తవం ఆయన మనసులో బలమైన ముద్ర వేసింది. అలాంటి సమాజాన్ని నిర్మించాలనే బలమైన ఆకాంక్ష ఏర్పడింది. విప్లవ రాజకీయాల ప్రభావం, కార్మికోద్యమ ప్రభావం వల్ల ఆయనలో అన్యాయాలను ఎదుర్కోవాలనే భావాలు పెరుగుతూ వచ్చాయి. ఆనాడు దేశంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు అలాంటివి. ఆయనే కాక ఆనాటి విద్యార్థి యువజనులు ఎందరో ఈ దోపిడీ సమాజం పట్ల ఆగ్రహాన్ని కలిగి వుండేవారు. ఈ భావాలతోనే సుదర్శన్ విప్లవోద్యమం వైపు ముందడుగు వేసారు. కార్మికవర్గంతో పాటు యావత్తు పీడిత ప్రజల విముక్తి ద్వారానే దోపిడీ పీడనలకు తావులేని కమ్యూనిజాన్ని సాధించడం సాధ్యమని దృఢంగా విశ్వసించారు.

తొలి వుద్యమ సంబంధాలు-ఆదిలాబాద్ జిల్లా ఉద్యమంలో ప్రముఖ పాత్ర

కామ్రేడ్ సుదర్శన్ 10వ తరగతి వరకూ బెల్లంపల్లిలో చదివారు. ఆ తర్వాత అదే జిల్లాలోని మంచిర్యాలలో ఇంటర్, బీ.ఎస్.సీ. చేసారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ లో 1974లో మైనింగ్ డిప్లొమా చేసారు. మందమర్రిలో గల కోల్ స్క్రీన్ ప్లాంట్ (సీ.ఎస్.పీ.)లో టెంపరరీ జాబ్ లో చేరి ఆరు నెలలు పని చేసారు. ఆపుడే కామ్రేడ్ సుదర్శన్ పార్టీతో సంబంధాలు ఏర్పరచుకున్నారు.

అది కల్లోలభరితమైన 1960 దశకం. ఆనాడు ఫ్రెంచి విద్యార్థి ఉద్యమ ప్రభావం, చైనా సాంస్కృతిక విప్లవ ప్రభావం, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల ప్రభావం మన దేశ విద్యార్థి యువజనులపై బలంగా ఉండేది. 1970 దశకం ప్రారంభంలో జై తెలంగాణ ఉద్యమం బలంగా ముందుకు వచ్చింది. ఇలాంటి రాజకీయ వాతావరణంలో ఆనాటి విద్యార్థి యువత చైతన్యవంతంగా ఉద్యమాలలో భాగం పంచుకునేవారు. కామ్రేడ్ సుదర్శన్ కూడా అందులో ఒకరు. ఈ క్రమంలో ఆయన దేశ, ప్రపంచ రాజకీయ పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించేవారు. ఈ నేపథ్యంలో నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ రాజకీయాలతో ఆనాటి తరం ఉత్తేజం పొందింది. మార్క్సిజం–లెనినిజం–మావోయిజంను, పార్టీ రాజకీయ పంథాను బలంగా నమ్మిన ఆ తరం సైద్ధాంతిక, రాజకీయ దృఢసంకల్పంతో కార్యాచరణలోకి దుమికింది. ప్రత్యేక తెలంగాణ కోసం వీధుల్లోకి వచ్చి పోలీసు తుపాకి సన్నీలను సవాలు చేస్తూ 'జై తెలంగాణ' ఉద్యమంలో పాల్గొంది ఈ తరమే. ఇందులో కామ్రేడ్ సుదర్శన్ ఈ ఉద్యమ మలి దశ రథసారథులలో ఒకరయ్యారు.

నక్సల్బరీ సాయుధ తిరుగుబాటు వెల్లువ తాత్కాలికంగా వెనకంజ వేసినప్పటికీ మార్క్సిజం–లెనినిజం–మావోయిజం గైడెన్స్ లో 'గతాన్ని సమీక్షించుకుని సాయుధ పోరాటపథంలో విజయవంతంగా పురోగమిద్దాం' అనే పేరుతో ఆమోదించిన ఆత్మవిమర్శనా డాక్యుమెంటుపై ఆధారపడి 1978 నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విస్తృత ప్రజా ఉద్యమాలను, విప్లవ ప్రజా సంఘాలను నిర్మించడంపై మన పార్టీ కేంద్రీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి–యువజన–సాహితీ–సాంస్కృతిక రంగాల్లో శక్తివంతమైన ఉద్యమాలను నిర్మించింది. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో రైతాంగ ఉద్యమాలను అభివృద్ధిపరిచింది. ఇవి బలమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలుగా ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఈ క్రమంలో 1980 ఏప్రిల్ 22న మునుపటి సీపీఐ (ఎం–ఎల్) (పీపుల్స్ వార్) ఏర్పాటుతో నూతన కేంద్రకమిటీ ఎన్నికయింది. పార్టీ మైదాన, అటవీ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ రైతాంగాన్ని, కార్మికులను, విద్యార్థి యువజనులను అనేకానేక దైనందిన సమస్యలతో పాటు రాజకీయ, సామాజిక సమస్యలపై విస్తృతంగా కదిలించి పోరాటాలను నిర్మించింది.

కామ్రేడ్ సుదర్శన్ 1975 సంవత్సరంలో రాడికల్ విద్యార్థి సంఘ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించడం ద్వారా విప్లవోద్యమంలో మరింత బాధ్యతాయుతంగా పని చేయనారంభించారు. కామ్రేడ్ గజ్జల గంగారం అదే పట్టణ కన్నాల బస్తీ వాస్తవ్యుడు కావడం, చిన్నప్పటి నుంచి ఆయన, సుదర్శన్ మంచి మిత్రులు కావడం ఇందుకు తోడ్పడింది. ఇద్దరూ బెల్లంపల్లి పార్టీ సెల్ లో సభ్యులయ్యారు.

ఆనాడు సింగరేణి బొగ్గు గనులలో కార్మికుల పని పరిస్థితులు, వారు నివశించే బస్తీలు దుర్భరంగా వుండేవి. సింగరేణి యాజమాన్యం, అధికారులు, చుట్టుపక్కల గ్రామాలలో భూస్వాములు దొరలుగా చెలామణీ అయ్యేవారు. వారి దోపిడీ, దౌర్జన్యాలు, అత్యాచారాలు అంతులేకుండా సాగేవి. ఇందుకోసం వారు గూండా గ్యాంగులను ఏర్పాటు చేసుకునేవారు. వీరి దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా కార్మికులు ఎక్కడికక్కడ పోరాడినప్పటికీ గూండా గ్యాంగులు వీరిని అణచివేస్తూ ఉండేవి. ఈ పరిస్థితులలో మార్పు తీసుకొచ్చేందుకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ రూపొందించిన ఆత్మవిమర్శనా సమీక్ష వెలుగులో, రాష్ట్రకమిటీ మార్గదర్శకత్వంలో ఆనాటి కరీంనగర్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకమిటీ కార్యదర్శి కామ్రేడ్ శ్యాం (నల్లా ఆదిరెడ్డి) నాయకత్వంలో పార్టీ సింగరేణి బొగ్గు గనుల్లో కేంద్రీకరించింది. జిల్లా కమిటీ, పార్టీ ఆర్గనైజర్లు, పార్టీ కార్యకర్తలు అందరూ చొరవగా ప్రచార, ఆందోళనా కార్యక్రమాల్లో ప్రజలను కదిలించారు. ఈ పోరాటాలలో కదిలిన ప్రజలను రాజ్యాధికారాన్ని సాధించే లక్ష్యంతో సాయుధ పోరాట రాజకీయాలతో చైతన్యపరుస్తూ వివిధ విప్లవ ప్రజా సంఘాలలో సంఘటితం చేసే కృషి చేసారు.

విప్లవ ప్రజాసంఘాల ముఖ్య ఉద్దేశ్యం ప్రజలను విప్లవానికి సన్నద్ధం చేసి సంఘటితపరచడమే. ప్రజలను విప్లవ రాజకీయాలతో సంఘటితపరచకపోతే విప్లవాన్ని విజయవంతం చేయడం సాధ్యం కాదు. విప్లవ విజయానికి బలమైన కమ్యూనిస్టు పార్టీ లాగానే బలమైన విప్లవకర ఐక్య సంఘటన కూడా అవసరం. ఈ విషయంలో నక్సల్బరి వెల్లువ కాలంలో మనం చేసిన పొరపాటును గుర్తించి, ప్రజలను ఎలా సంఘటితం చేయాలి, అందుకు ఆనాటి పరిస్థితుల్లో ఏ పద్ధతులను అవలంబించాలన్నదే ఆనాడు మన పార్టీ ముందున్న సమస్య. దీనిని పరిష్కరించడానికి ప్రజాపంథా మీద ఆధారపడి వర్గ పోరాటాన్ని పెంపొందించడానికి ప్రజల్ని అంటిపెట్టుకుని కార్యాచరణలోకి దిగాల్సి ఉంటుందనీ, అంచలంచలుగా సాయుధ పోరాటాన్ని పెంపొందించవలసి ఉంటుందనీ, దీర్ఘకాలం సాగే సాయుధ పోరాట క్రమంలో ప్రజలను ముందు నుండి వివిధ రూపాలలో సంఘటితపరచవలసి ఉంటుందనీ, ఆ నిర్మాణ రూపాలు ప్రజల పోరాట సంసిద్ధతను బట్టి, విప్లవ అవసరాలను బట్టి వుంటాయనీ మన పార్టీ నాయకత్వం నిర్దేశించింది. ఆయా సమయాల్లో ప్రజలను సంఘటితపరచాలనే విషయాన్ని మార్క్సిజం వెలుగులో, ప్రపంచ-మన దేశ విప్లవోద్యమాల చరిత్రల నుండి మనం నేర్చుకున్నాం. పోరాట రూపాల వలెనే నిర్మాణ

రూపాలు కూడా ప్రజల నుండే పుడతాయనేది వాస్తవమనీ, మనం ప్రజలను సంఘటితపరచవలసిన ప్రాముఖ్యతను గుర్తిస్తే విప్లవావసరాలకు అనుగుణంగా నిర్మాణ రూపాలను కనుగొనడం కష్టమేమీ కాదనీ మన పార్టీ కార్యాచరణ కూడా రుజువు చేసింది.

1976-77 మధ్య బెల్లంపల్లి పట్టణ పార్టీ సెల్ సభ్యుడిగా కామ్రేడ్ సుదర్శన్ ఈ కృషిలో భాగమయ్యారు. సింగరేణి కార్మికోద్యమానికీ, రాడికల్ విద్యార్థి యువజన ఉద్యమాలకు బలమైన పునాదులు వేసారు. ఎమర్జెన్సీ కాలంలో అత్యంత రహస్యంగా బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్టాపురం, శ్రీరాంపుర్ ఏరియాలో కార్మికులను, విద్యార్థులను కలుస్తూ విప్లవోద్యమ నిర్మాణంలో భాగమయ్యారు. ఆ సమయంలో తల్లి క్యాన్సర్ పేషెంట్ కావడంతో ఇంటికి పెద్ద కొడుకుగా బాధ్యత వహించి వైద్యం కోసం సుదూర ప్రాంతాలు తిరిగారు. తల్లిని కంటికి రెప్పలా కాపాడారు.

ఆ రోజుల్లో బొగ్గు గనులలో కార్మికుల సమస్యలపై, కార్మిక బస్తీలలోని సమస్యలపై, కార్మికులపై సింగరేణి అధికారుల, దొరల, గూండాల దౌర్జన్యాలకు, మహిళలపై సామూహిక అత్యాచారాలకు-హత్యలకు వ్యతిరేకంగా రాడికల్స్ నాయకత్వంలో ఏదోక చోట సమ్మెలు, పోరాటాలు జరుగుతూ వుండేవి. వీటన్నింటిలో కామ్రేడ్ సుదర్శన్ చురుగ్గా పాల్గొన్నారు. ముఖ్యంగా గూండాలకు వ్యతిరేకంగా కార్మికులు, మహిళలు, విద్యార్థి యువజనులను కూడగట్టి సాహసోపేతంగా తలపడడంలో ముందు వరసలో వున్నారు. బెల్లంపల్లి బొగ్గు బాయి దొర కొడుకు కార్మికురాలు రాజేశ్వరిపై అత్యాచారానికి పాల్పడినపుడు, దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ కన్నాల బస్తీ, బూడిద గడ్డ కార్మిక బస్తీలలో ఆరంభమైన ఉద్యమం సింగరేణి అంతటా, ఆదిలాబాద్ జిల్లాలోనూ, 1978 మధ్యకాలం నుండి తెలంగాణ, రాయలసీమ వ్యాప్తంగానూ విస్తరించింది. తెలంగాణ గ్రామాల్లో దొరల గడీలలో ఆగడాలు సాగించే భూస్వాములను, పట్టణాల్లో, నగరాల్లో గుండాలను గడగడలాడించే రాడికల్స్/"అన్నలు" బాధిత, వంచిత, పీడిత మహిళలకు అండగా ఉన్నారనే అపార విశ్వాసాన్ని కల్పించారు. భూస్వాములపై, గుండాలపై వారు సాగించిన పోరాటాలు వీరగాథలుగా ప్రసిద్ధి చెందాయి. దీంతో సహజంగానే కామ్రేడ్ సుదర్శన్ శత్రువుకు లక్ష్యంగా మారారు. ఆయన కోసం శత్రువు ఇంటిపై దాడి చేసాడు.

ఈ క్రమంలో కామ్రేడ్ సుదర్శన్ 1978 మార్చి నెలలో గ్రామాలకు తరలండి క్యాంపెయిన్ లో భాగంగా పార్టీ పిలుపుతో పూర్తి కాలం కార్యకర్తగా ఉద్యమంలో చేరారు. ఆనంద్ పేరుతో లక్సెట్టిపేట-జన్నారం ఏరియా పార్టీ ఆర్గనైజర్ గా బాధ్యతలు చేపట్టి రైతాంగాన్ని విప్లవోద్యమంలో సమీకరించారు. 1979 ఏప్రిల్ లో కరీంనగర్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కమిటీ రెండు (కరీంనగర్, ఆదిలాబాద్) జిల్లా కమిటీలుగా విడిపోయింది. కామ్రేడ్ శ్యాం కార్యదర్శిగా ఆనంద్, గజ్జల గంగారాంలతో ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఏర్పడింది. కామ్రేడ్ ఆనంద్ సింగరేణి

కార్మికవర్గంపై కేంద్రీకరించి, ఆదివాసీ గ్రామీణ ప్రాంతాలలో వర్గ పోరాటాలను నిర్మించి విస్తరింపజేసారు.

'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్ లలో యువతీ, యువకులను సమీకరించారు. వారికి రాజకీయ తరగతులు నిర్వహించి వారి సైద్ధాంతిక, రాజకీయ అవగాహనను పెంపొందించడంతో పాటు విద్యార్థి, యువజనులతో, రైతాంగంతో, ఆదివాసులతో, దళితులతో పేద ప్రజలతో మమేకం కావలసిన అవసరం గురించిన అవగాహనను వారికి కలిగించారు. ఈ క్యాంపెయిన్లలో వందలాది గ్రామాలలో పలు రాజకీయ నినాదాలతో విప్లవ ప్రచారం చేసారు. ప్రజల్ని దైనందిన సమస్యలపై, కూలిరేట్లు, భూమి తదితర ఆర్థిక, మౌలిక సమస్యలపై సమీకరిస్తూ పోరాటాలలో కదిలించారు. ఈ పోరాటాలలో క్రియాశీలంగా ముందున్న శక్తులను సంఘటితం చేసారు.

1980లలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు వేజ్ బోర్డు కోసం జరిపిన చారిత్రాత్మక సమ్మె పోరాటం విప్లవ కార్మికోద్యమ చరిత్రలో ఒక మైలురాయి. కామ్రేడ్ ఆనంద్ సింగరేణి కార్మిక సమాఖ్య (సి.కా.స.) నిర్మాణానికి ఎనలేని కృషి చేసారు. ఆ ప్రాంతంలో ఇతర రంగాల్లోని కార్మికులను కూడా సంఘటితం చేసి ఉద్యమాలు నిర్మించారు. కార్మిక బస్తీలలో సారా వ్యతిరేక ఉద్యమం నుంచి ప్రతి పోరాటానికీ ఆయన సమర్థవంతంగా నాయకత్వం వహించారు. కార్మిక పోరాటాలతో రైతాంగ పోరాటాలను, రైతాంగ పోరాటాలతో కార్మిక పోరాటాలను సమన్వయం చేస్తూ, వాటి పరస్పర సహకారాన్ని, మద్దత్తును కూడగడుతూ, ఆ రెండింటినీ జమిలిగా నడపకుండా, భారత నూతన ప్రజాస్వామిక విప్లవం జయప్రదం కాదన్న వ్యూహాత్మక అవగాహనతో ఆనాడు పనిచేసిన రాష్ట్ర, జిల్లా ప్రముఖ నాయకత్వ కామ్రేడ్స్ లో ఆయన ఒకరు.

ఈ క్రమంలో కామ్రేడ్స్ పెద్ది శంకర్, పులి మధునయ్య వంటి ఎంతో మంది యువతీ, యువకులను రిక్రూట్ చేసి పార్టీని బలోపేతం చేసారు. ఉద్యమాన్ని జిల్లాలోని నూతన ప్రాంతాలకు విస్తరింపజేసారు. ఈ క్రమంలో 1981 సెప్టెంబర్ 8న మొదటి మిలిటరీ శిక్షణా శిబిరంలో గ్రెనేడ్ దుర్ఘటనలో కామ్రేడ్ గజ్జల గంగారాం తీవ్రంగా గాయపడి అమరుడు కావడంతో కామ్రేడ్ ఆనంద్ తీవ్రంగా చలించిపోయారు. తన చిన్ననాటి నుంచి నేస్తం, ఉద్యమంలో సహచరుడు గంగారాం అమరత్వం, చివరిగా ఆయన పలుకులు కామ్రేడ్ ఆనంద్ చివరి ఊపిరి వరకూ వెన్నాడుతూనే ఉండినాయి. కామ్రేడ్ గంగారాం తుది పలుకులు 'నా చిన్ని తమ్ముల్లారా' అనే పాటలో ఇప్పటికీ సజీవంగా పార్టీ కేడర్లకు మార్గనిర్దేశం చేస్తుంటాయి.

దండకారణ్య విప్లవోద్యమ నిర్మాతల్లో ఒకరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో రైతాంగ పోరాటాలను కాపాడుకునేందుకు, వాటిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేస్తూ ఉన్నతస్థాయికి అభివృద్ధి చేసేందుకు,

విముక్తి ప్రాంత లక్ష్యంతో గెరిల్లాజోన్ పర్ స్పెక్టివ్ డాక్యుమెంటును రూపొందించింది. దీనిని అమలు చేయడానికి పార్టీ వ్యూహాత్మకంగా దండకారణ్య ప్రాంతంలోకి విప్లవోద్యమాన్ని విస్తరింపజేసే కృషిని చేపట్టింది. ఆదిలాబాద్ జిల్లా దండకారణ్యంలో భాగమైంది. ఆదిలాబాద్ జిల్లా నుంచి కామ్రేడ్ ఆనంద్ ఈ కృషిలో భాగమయి ఆ జిల్లాకమిటీ కార్యదర్శిగా నాయకత్వం వహించారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ దండకారణ్యానికి పంపిన ఏడు సాయుధ గెరిల్లా దళాలలో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచలోని 2వ దళానికి ఆయన ప్రత్యక్షంగా బాధ్యత వహించారు. చాలా కొద్ది రోజులలోనే 1980, నవంబర్ 11న మొదటిసారి ఈ దళంపై ఆకస్మికంగా ప్రభుత్వ పోలీసు బలగాలు జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ పెద్ది శంకర్ అమరుడయ్యారు. అయినప్పటికీ ఏమాత్రం చలించకుండా, ఈ నష్టాన్ని అధిగమించేలా చైతన్యం కల్పిస్తూ, జిల్లాలోని కేడర్లను మరింతగా దృఢంగా విప్లవోద్యమంలో నిలపడం కోసం కామ్రేడ్ ఆనంద్ చేసిన కృషి ముఖ్యమైంది.

ఈ క్రమంలోనే జిల్లాలో ఫారెస్టు అధికారుల దోపిడీ, వడ్డీ షావుకారుల దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలను కదిలించారు. ఆదివాసీల భూములను గైరాదివాసీ భూస్వాములు బలవంతంగా లాక్కొని ఆ భూముల నుండి బేదఖల్ చేయడానికి వ్యతిరేకంగా వారిని ఐక్యం చేసి పెద్దయెత్తున పోరాటాలు నిర్మించారు. ఇంద్రవెల్లిలో గిరిజన రైతుకూలి సంఘం మొదటి మహాసభలను జరుపుకునేందుకు సమీకృతులైన వేలాది ఆదివాసీ రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వ కిరాయి పోలీసు బలగాలు 1981 ఏప్రిల్ 20న విచక్షణారహితంగా కాల్పులు జరిపి 70 మంది ఆదివాసులను పాశవికంగా హత్య చేసాయి. వందలాది మందిని గాయపరిచాయి. వీరిలో మహిళల సంఖ్య గణనీయంగా వుంది. జలియన్ వాలాబాగ్ సంఘటనను గుర్తుకు తెచ్చే ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. కామ్రేడ్ ఆనంద్ ఇంద్రవెల్లి హత్యాకాండకు వ్యతిరేకంగా జిల్లాలో నిర్వహించిన నిరసనోద్యమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా జననాట్యమండలి రూపొందించిన 'రగల్ జండా' బ్యాలేకు ఆయన కథనాన్ని అందించారు. ఇంద్రవెల్లి హత్యాకాండ తర్వాత జిల్లాలో ఆదివాసీ రైతాంగ పోరాట జ్వాలలు మరింతగా విస్తరించాయి. ఆదివాసులు తరతరాలుగా సాగు చేసే అటవీ భూముల నుండి ఎమర్జెన్సీ కాలంలో అటవీ శాఖ అధికారులు వారిని బలవంతంగా బేదఖల్ చేసారు. అటవీ శాఖ ఆ భూములలో అకాసియా, టేకు మొక్కలను నాటింది. అక్రమంగా నాటిన ఈ మొక్కలను నరికి అటవీ భూములను పునఃస్వాధీనం చేసుకోవడం కోసం ఆదివాసీ ప్రజలు వెల్లువలా కదిలారు. అటవీ శాఖ అధికారులకు అండగా నిలిచి, ఆదివాసీ రైతాంగంపై దాడులు చేసిన ప్రభుత్వ పోలీసు బలగాలను తమ సంప్రదాయ ఆయుధాలతో ప్రతిఘటించారు. సాత్నాల ప్రతిఘటనా పోరాటం అందుకు ఒక మంచి ఉదాహరణ. అటవీ భూముల ఆక్రమణ పోరాటాల రక్షణ కోసం క్రమంగా

ప్రజా మిలిషియా విస్తరించింది. రెగ్యులర్ రైతాంగ సాయుధ దళాలు ఆవిర్భవించాయి. ఇంద్రవెల్లిలో ప్రభుత్వం జరిపిన హత్యాకాండ ఆ ప్రాంత పోరాటాలను ఆపలేకపోవడమే కాకుండా, జిల్లా విప్లవోద్యమం త్వరితగతిన విస్తరించడాన్ని, దాని స్థాయి పెంపొందడాన్ని నిలువరించడంలో కూడా విఫలమైంది. భూస్వామ్య వ్యతిరేక కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలు దేశ విప్లవ చిత్రపటంపై ప్రముఖ స్థానం పొందాయి.

1980లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 12వ కాన్ఫరెన్స్ లో కామ్రేడ్ ఆనంద్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో పలు రాజకీయ, నిర్మాణ సమస్యలపై జరిగిన చర్చలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ తర్వాత కొద్ది నెలలకు జరిగిన ఆదిలాబాద్ జిల్లా కమిటీ మీటింగ్ లో కామ్రేడ్ శ్యాం సెక్రటరీగా రిలీవ్ అయినప్పుడు కామ్రేడ్ ఆనంద్ జిల్లా కమిటీ సెక్రటరీ అయ్యారు. 1984లో 2వ కాన్ఫరెన్స్ లో ఆదిలాబాద్ డివిజనల్ కమిటీ సెక్రటరీగా ఎన్నికయ్యారు.

ఆదిలాబాద్, గడిచిరోలి, బస్తర్, విశాఖపట్టణం–తూర్పు గోదావరి (ఈస్ట్ డివిజన్) జిల్లాల వరకు విస్తరించి వున్న దండకారణ్య ప్రాంతంలో విప్లవోద్యమాన్ని పురోగమింపజేసే క్రమంలో 1987 ఫిబ్రవరిలో దండకారణ్య ఫారెస్ట్ మొదటి కాన్ఫరెన్స్ జరిగింది. అందులో ఫారెస్ట్ కమిటీ (ఎఫ్.సీ.) ఏర్పడింది. కామ్రేడ్ ఆనంద్ ఎఫ్.సీ. సభ్యుడిగా ఎన్నికయ్యారు. దండకారణ్య విప్లవోద్యమ నిర్మాతల్లో ఒకరిగా కీలక భూమిక పోషించారు. 1987 మే లో జరిగిన 13వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్నారు. 1988లో ఎఫ్.సీ. సెంటర్ ఏర్పడింది. 1990లో ఎఫ్.సీ. సెంటర్ లోకి ఆయన ఎంపికయ్యారు. 1990లో గోందియా, బాలాఘాట్, రాజనాంద్ గాం జిల్లాల్లోకి విస్తరించిన గెరిల్లా దళాలకు నాయకత్వం వహించారు. ఆ తర్వాత ఆ ప్రాంతం ఒక డివిజన్ గా అభివృద్ధి అయింది.

వర్గ పోరాటాన్ని, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడంలో నాయకత్వ పాత్ర

ఆంధ్రప్రదేశ్ లో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల రైతాంగ పోరాటాలను కేంద్రంగా చేసుకుని ఉత్తర తెలంగాణలో, విశాఖపట్టణం–తూర్పు గోదావరి, అనంతపుర్, చిత్తూరు జిల్లాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు వెల్లువలా అభివృద్ధి చెందాయి. కేవలం ఆదిలాబాద్ జిల్లాలోనే 1986 చివరి నాటికి 60 వేల ఎకరాల (1995 నాటికి ఒక లక్షకు పైగా ఎకరాల) అడవి భూమిని మన పార్టీ నాయకత్వంలో ప్రజలు, ప్రధానంగా ఆదివాసులు స్వాధీనం చేసుకుని సాగు చేస్తుండినారు.

అడవి భూమి పోరాటాలతో పాటు తునికాకు కూలీ, వెదురు కూపుల కూలీ, వ్యవసాయ కూలీ, జీతగాళ్ల జీతాలు, పేపర్ మిల్లు కార్మికుల వేతనాలు, ప్లాంటేషన్ కూలీ, క్వారీ కూలీ, హమాలీల కూలీ పెంపుదల, సారా సమస్య, సంతల్లో సరుకుల అధిక రేట్లు, ఫారెస్టు అధికార్ల దౌర్జన్యాలు,

రోడ్డు పని కూలీ, అటవీ ఉత్పత్తుల రేట్ల పెంపుదల తదితర సమస్యలపై వివిధ సంఘాలు, పోరాట కమిటీలు ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాయి. ఈ కాలంలో సమ్మె పోరాటాలు ప్రధాన పోరాట రూపంగా ముందుకు వచ్చాయి. అటవీ ప్రాంతాల్లో ఆదివాసులను, మైదాన, పట్టణ ప్రాంతాల్లో రైతుకూలీలను, కార్మికులు, విద్యార్థి యువజనులు, మహిళలు, మేధావులు, బాలలను వివిధ సంఘాలలో సంఘటితపరచడంలో పార్టీ చొరవగా సాగించిన సమిష్టి కృషిలో కామ్రేడ్ ఆనంద్ భాగస్వాములయ్యారు.

ఈ ప్రజా పోరాటాలు 1978 మధ్య నుండి ఆరంభమై విస్తరిస్తూ, అనతికాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా నూతన విప్లవ వెల్లువగా మారాయి. విప్లవ ప్రజా సంఘాలు రాసిలోనూ, వాసిలోనూ పటిష్టమయ్యాయి. దీనితో ప్రజాపునాది, పార్టీ స్వీయాత్మక శక్తి, ప్రజా సమీకరణ, ప్రభావం గణనీయంగా పెరిగాయి. అనేక సెక్షన్ల ప్రజలలోకి నూతన ప్రాంతాలకు విస్తరించడంతో రాష్ట్ర స్థాయి సంగాలు, మన పార్టీ పని చేస్తుండిన రాష్ట్రాలలో ప్రజాసంఘాలు, సోదర విప్లవ పార్టీల, గ్రూపుల నాయకత్వాన గల ప్రజాసంఘాలు కలిసి అఖిల భారత స్థాయిలో కొన్ని విప్లవ ప్రజా సంఘాలు ఏర్పడి పని చేసాయి. లక్షలాదిగా ప్రజలను సమీకరించడంతో అనేక సమస్యలపై దేశవ్యాపితంగా ఆందోళనలు జరిగాయి. పార్టీ రాజకీయ ప్రతిష్ట పెరగడంతో పాటు రాడికల్స్/అన్నల ప్రభావం ప్రజలపై విస్తృతంగా పడింది. పార్టీతో పాటు నాయకత్వ కేడర్ అభివృద్ధి అయింది. గెరిల్లా బలగాలకు అనేక రూపాల్లో మద్దతు దొరికింది. బిహార్, ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం తదితర రాష్ట్రాలలో భూస్వామ్య వ్యతిరేక, రాజ్య వ్యతిరేక, రైతాంగ, ఆదివాసీ ప్రజలు పలు రాష్ట్రాలలో అనేక సమస్యలపై కార్మికులు, మహిళలు, విద్యార్థి యువజనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రచార ఆందోళన ఉద్యమాలు నిర్మించారు. బహిరంగ-రహస్య కార్యకలాపాలను సమన్వయించుకుంటూ, విప్లవోద్యమం శత్రు క్రూర నిర్బంధాల మధ్యనే ప్రజా ప్రదర్శనలు, ధర్నాలు, సభలు, కరువు దాడులు, భూస్వాధీనాలు, భూస్వాముల ఆస్తుల స్వాధీనాలు, సింగరేణి కార్మికుల సమ్మెలు, బంద్ లు, ఎన్నికల బహిష్కరణలు ఇలా ఎన్నో సర్వసాధారణమయ్యాయి. వేలాది గ్రామాలలోను, చాలా పట్టణాలలోను జరిగిన పీడిత వర్గాల, సెక్షన్ల పోరాటాలు వివిధ రూపాలలో దోపిడీ పాలకవర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని, పీడనను దెబ్బతీసాయి. బలమైన వ్యూహాత్మక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రాజకీయ అధికారం బీజరూపంలో నెలకొనడం ఆరంభమైంది. ఇది చూసి బెదిరిన కేంద్ర ప్రభుత్వం 1983లోనే కేంద్ర పారా మిలిటరీ (సీ.ఆర్.పీ.ఎఫ్.) బలగాలను మోహరించింది. ఉత్తర తెలంగాణా జిల్లాలన్నింటిలో పెద్ద సంఖ్యలో క్యాంపులను నెలకొల్పి తీవ్ర నిర్బంధకాండను అమలుపరిచారు. అయినా ఈ విప్లవ వెల్లువను అరికట్టలేకపోయారు.

ఈ విప్లవ వెల్లువను రూపుమాపేందుకు 1985లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ

అందదండలతో ఆంధ్రప్రదేశ్ లో ఎన్.టీ.ఆర్. తెలుగుదేశం ప్రభుత్వం విప్లవోద్యమంపై అపక్రటిత యుద్ధాన్ని ప్రారంభించింది. యావత్తు తెలంగాణను పోలీసు శిబిరంగా మార్చివేసింది. ఈస్ట్ డివిజన్ లోని మన్యం ప్రాంతంలో ఒకే సమయంలో 60 గ్రామాలను పోలీసులు తగులబెట్టి ప్రజల్లో భయోత్పాతం సృష్టించింది. 1985-87 మధ్య తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో ప్రజలు, పార్టీ కాడర్ ఎన్నో త్యాగాలు చేసారు. బూటకపు ఎదురుకాల్పులలో వందలాది మంది విప్లవ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల కార్యకర్తలు ఊచకోతకు గురయ్యారు. అనేక మంది పార్టీ నాయకులను, కార్యకర్తలను శతృవు మాయం చేసాడు. ఆదిలాబాద్ జిల్లాలోనే 1985-89 మధ్య 56 మంది కామ్రేడ్స్ అమరులైనారు.

శతృ అప్రకటిత యుద్ధాన్ని తిప్పికొట్టడానికి "ఆత్మరక్షణా యుద్ధాన్ని కొనసాగిద్దాం, గెరిల్లా దళాలను కంటికి రెప్పలా కాపాడుకుందాం" అనే సర్కులర్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ రూపొందించింది. అప్రకటిత నిర్మూలనా యుద్ధంలో దళ పని విధానం, రహస్య ప్రజా సంఘాల నిర్మాణం, రైతాంగ సమస్యలపై పోరాటాలు, బలవంతపు సరెండర్ల పట్ల మన వైఖరి, ఆయుధాలు వగైరా సమస్యలపై పై కమిటీల నుండి కింది కమిటీల వరకు అన్ని స్థాయిల్లో చర్చించి ఉమ్మడి నిర్ణయాలు తీసుకున్న తర్వాత పార్టీ కేడర్లందరూ పూర్తి ఆత్మవిశ్వాసంతో తమ తమ ప్రాంతాలలో ఆ నిర్ణయాలను నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా అన్వయిస్తూ సృజనాత్మకంగా పని చేసారు. 1987-88 నాటికి ఆర్గనైజర్లను, దళాలను రహస్యంగా తిప్పడం, రహస్య సంఘాలు నిర్మించి పని చేయించడం, కొన్ని పట్టణాలలో రహస్యంగా ట్రేడ్ యూనియన్లను నిర్మించి పని చేయించడం, శతృ నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజల్ని ప్రతిఘటనలోకి దింపటంలో పార్టీ క్రమంగా కొంత పట్టు సంపాదించింది. ప్రజలు నిర్బంధానికి అలవాటుపడ్డారు. ప్రతిఘటన ప్రారంభమైంది. శతృవు చేసే దాడుల్లో ఏ కొద్ది అవకాశం చిక్కినా ప్రతిఘటిస్తూ తప్పుకోవడం, తప్పుకోవడానికి ఎలాంటి అవకాశాలు లేనపుడు నీరుగారిపోకుండా త్యాగనిరతితో వీరోచితంగా పోరాడుతూ ప్రాణాలర్పించడం, వీలున్నప్పుడు శతృవుకు నష్టం కలిగించడం, ఇలా నక్సల్బరీ సెట్ బ్యాక్ తర్వాత సాగిన సాయుధ పోరాట క్రమమంతా మనం రక్తం ధారపోసి సంపాదించుకున్న మొట్టమొదటి మంచి విస్తృత అనుభవం.

దోపిడీ పాలకవర్గాల ప్రభుత్వానికి ఆయువుపట్టు అయిన కీలక పారిశ్రామిక రంగాల్లో ఒకటైన సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికులు మన పార్టీ నాయకత్వంలో పలు పోరాటాలు నిర్వహించారు. ఇవి భవిష్యత్తులో ఉన్నత విస్తృత స్థాయి పోరాటాలు నిర్వహించడానికి ఆ కార్మికులకే కాకుండా పార్టీకి రిహార్సల్స్ గా తోడ్పడినాయి. ఇది బహిరంగ-చట్టబద్ధ కార్యకలాపాలకే కాకుండా రహస్య-చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగించడంలో కూడా తగిన తర్ఫీదు పొందడానికి తోడ్పడింది.

అప్రకటిత ప్రభుత్వ దాడిని ఓడించాలనే పార్టీ పిలుపునందుకుని ఆదిలాబాద్ జిల్లాలోనూ,

దండకారణ్యంలోనూ దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని–గెరిల్లాయుద్ధాన్ని నిర్మించడంలో కామ్రేడ్ ఆనంద్ తన రాజకీయ–మిలిటరీ దక్షతను ప్రదర్శించారు. తొలి నుండి ఆ దృష్టితో జిల్లాలోనూ, దండకారణ్యంలోనూ గెరిల్లా దళాలకు రాజకీయ క్లాసులు, మిలిటరీ శిక్షణ ఇచ్చారు. ప్రజలను ప్రజా మిలిషియాలో సంఘటితం చేసారు. ప్రజా ప్రతిఘటనా పోరాటాలను నిర్మించారు. ఆదివాసీ ప్రజల వీరోచిత పోరాటాలకు, వారు చేసిన త్యాగాలకు సాక్షిగా నిలిచిన ఇంద్రవెల్లి స్థూపాన్ని పోలీసులు, మతోన్మాదులు కలిసి కూల్చివేసినా, ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభలకు వేలాది మంది ప్రజలు కదిలి నిర్వహించడం ద్వారా శత్రువుకు తగిన జవాబు ఇచ్చారు. సాయుధ పోలీసు బలగాలకు వ్యతిరేకంగా గెరిల్లాయుద్ధాన్ని నడిపారు. ఇది క్రూరమైన శత్రు హంతక దాడిలో మొదట కలిగిన గందరగోళం, అనుభవరాహిత్యం నుండి బయటపడి ప్రతిఘటన–ఆత్మరక్షణ చేసుకుంటూ, యుద్ధాన్ని యుద్ధం ద్వారా నేర్చుకుంటూ ఆత్మవిశ్వాసంతో ప్రజల్ని ప్రతిఘటనా పోరాటాలకు సన్నద్ధం చేసిన కాలం. శత్రుదాడిలో వీలైనంత వరకు మనల్ని మనం కాపాడుకుంటూ గెరిల్లాయుద్ధంలో శత్రువును వీలైనంత ఎక్కువగా దెబ్బతీయడం కోసం కృషి చేసారు. 1988 నుండి పార్టీ కమిటీలు, గెరిల్లా దళాలు ప్రజలను ప్రజా మిలిషియాలో సంఘటితం చేస్తూ పెద్దయెత్తున ప్రజా ప్రతిఘటనా పోరాటాలను, సాయుధ గెరిల్లా చర్యలను, విధ్వంస చర్యలను నిర్వహించాయి. ఈ విధంగా ఆలంపల్లి ఆంబుష్ వంటి పలు గెరిల్లా చర్యలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా గెరిల్లా యుద్ధంలో తొలిపాఠాలను నేర్చుకోవడమే కాకుండా, శత్రువు దూకుడుపై అడ్డుకట్ట వేసాయి. వర్గ శత్రువులను, ఇన్ఫార్మర్లను నియంత్రించాయి. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రకమిటీ, ఫారెస్ట్ కమిటీల నాయకత్వంలో పార్టీ కేడర్లు, సాయుధ ప్రజా గెరిల్లా దళాలు, విప్లవ ప్రజా నిర్మాణాలు, విప్లవ ప్రజానీకం సమైక్యంగా నిలిచి వర్గ పోరాటాన్ని, గెరిల్లాయుద్ధాన్ని సమన్వయించి కొనసాగించడం ద్వారా మొదటి ప్రభుత్వ దాడిని 1989 నాటికి ఓడించారు.

ఫాసిస్టు ప్రభుత్వ దాడిని పార్టీ నాయకత్వాన ప్రజలు, గెరిల్లా బలగాలు విఫలం చేయడంతో తాత్కాలికంగా నిర్బంధం తగ్గుముఖం పట్టింది. పార్టీ, ప్రజాసంఘాలు కొనసాగించిన రాజకీయ, నిర్మాణ కృషి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ప్రజా సమూహాలు మన పార్టీ నాయకత్వంలో కదిలాయి. పీడిత రైతాంగంతో పాటు కార్మికులు, ఆదివాసులు, దళితులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్దెయెత్తున తమ సమస్యలపై పోరాటాలలోకి దిగారు, ప్రజాసంఘాలు సంఘటితపడినాయి. దండకారణ్యంలో ప్రజలను కదలించడంలో కామ్రేడ్ ఆనంద్ చొరవగా కృషి చేసారు.

ఆదిలాబాద్ జిల్లాలో 1990–1991 మధ్య భూస్వాముల పట్టా భూముల ఆక్రమణ పోరాటాలు పెద్దయెత్తున జరిగాయి. బోధ్, ఆదిలాబాద్, ఇచ్చోడ, వాంకిడి, అసిఫాబాద్, సిర్పూర్,

చెన్నూర్ ప్రాంతాలలో 100 గ్రామాలలో 200 మందికి పైగా భూస్వాముల నుంచి 9,250 ఎకరాల భూములను వేలాది మంది ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగం పార్టీ నాయకత్వంలో ఉవ్వెత్తున కదిలి ఎక్కడికక్కడ ఆక్రమించుకుని పంపిణీ చేసుకున్నారు. దీంతో పాటు తునికాకు కూలీ పోరాటం, వెదురు కూలీ పోరాటం, సారా రేటు తగ్గుదల, సారా నిషేధ పోరాటాలు, పత్తి గిట్టుబాటు ధర పోరాటం వంటి పాక్షిక సమస్యలపై పోరాటాలు జరిగాయి. నూతన ఉన్నత పోరాట రూపంగా కరువు దాడులు రాష్ట్రంలో సంచలనం సృష్టించాయి. 1989 నవంబర్ లో పార్లమెంటు, అసెంబ్లీల ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ విజయవంతమైంది. పెద్దెత్తున కదులుతున్న ప్రజలను వివిధ విప్లవ, ప్రజాస్వామిక బహిరంగ, రహస్య ప్రజా సంఘాలలో సంఘటితం చేసే కృషి కొనసాగింది. విశాల గ్రామీణ ప్రాంతంలో పార్టీ నాయకత్వంలో గెరిల్లా బలగాలు పెరుగుతూ గెరిల్లా యుద్ధం పెంపొందుతుండడంతో వర్గ శత్రువులు గ్రామాలను విడిచి పట్టణాలకు పారిపోయారు. సంఘటిత విప్లవ ప్రజాసంఘాల నాయకత్వంలో రైతాంగం రాజకీయాధికారాన్ని చెలాయించడం బీజప్రాయంగా మొదలైంది.

1990-1991లలో రాష్ట్రవ్యాప్తంగా మన పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం వెల్లువెత్తింది. దీనిని రూపుమాపేందుకు 1991 లోనే సుమారు 150 మంది విప్లవకారులను, ప్రజలను ప్రభుత్వ బలగాలు క్రూరంగా చంపాయి. 1992 మే నెలలో మన పార్టీపై, విప్లవ ప్రజాసంఘాలపై ప్రభుత్వం నిషేధం విధించడంతో ప్రభుత్వ విప్లవ ప్రతిఘాతక 2వ దాడి మొదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'సంయుక్త కమాండ్'ను ఏర్పరచుకుని వేలాది సంఖ్యలో పారామిలిటరీ బలగాలను మోహరించాయి. ఉద్యమ ప్రాంతాలలో ప్రజల ఆస్తుల విధ్వంసం, ఇళ్ల విధ్వంసం, ప్రజలపై హత్యాకాండలు, మహిళలపై అత్యాచారాలు, బూటకపు ఎదురుకాల్పులు, మాయం చేయడం, అరెస్టులు, బూటకపు లొంగుబాట్లు, చిత్రహింసలు, జైళ్లలో బంధించడం ద్వారా భయానక వాతావరణం సృష్టించాయి. ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తర, దక్షిణ తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో, దండకారణ్యంలోని ఈస్ట్ డివిజన్, గడ్చిరోలి డివిజన్ లలో తెల్ల బీభత్సం విస్తరించింది. మరోవైపు ప్రజల్లో భ్రమలు రేకెత్తించి పార్టీని, గెరిల్లా బలగాలను వారి నుండి ఒంటరి చేసి దెబ్బతీయడానికి ప్రభుత్వాలు పెద్దయెత్తున బూటకపు సంస్కరణలను అమలు చేసాయి. వీటి గురించి అభూత కల్పనలతో ప్రభుత్వాలు పెద్దెత్తున ప్రచారం కొనసాగించాయి. అందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లాను 'ఆదర్శ జిల్లా'గా ప్రకటించాయి. 110 కోట్ల రూపాయలు కేటాయించి జిల్లా కలెక్టర్ నాయకత్వంలో సంస్కరణలను అమలు చేసాయి. అయితే ప్రభుత్వ యంత్రాంగాల్లో కొనసాగిన అవినీతి వల్ల ప్రజలకు తోడ్పడిన సంస్కరణలు పాక్షికమే.

ఈ క్రూరమైన శతృదాడికి వ్యతిరేకంగా మొదటి శత్రుదాడిని ప్రతిఘటించిన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ (ఎస్.సీ.), దండకారణ్య ఫారెస్టుకమిటీ (ఎఫ్.సీ.)లు ప్రజాయుద్ధాన్ని-

గెరిల్లాయుద్ధాన్ని సమన్వయించి నడిపాయి. ప్రభుత్వ బూటకపు సంస్కరణలను ఎండగడుతూ కామ్రేడ్ ఆనంద్ నాయకత్వంలో జిల్లాలో పార్టీ కేడర్లు దృఢంగా నిలిచి తిరిగి ప్రజల్ని సాయుధ పోరాటాలలోకి కదిలించారు. వివిధ ప్రజా సంఘాల్లో, పార్టీ సెల్స్, గ్రామ పార్టీ కమిటీలలో, వివిధ స్థాయి ఆర్.పీ.సీ.లు, గ్రామ మిలిషియా నిర్మాణాల్లో సంఘటితం చేసే సమిష్టి కృషిని మెరుగ్గా నిర్వహించారు. వరుసగా శత్రువు చేస్తున్న హత్యల పరంపర మధ్యనే కొనసాగిన ప్రజల ప్రతిఘటన, నిరసనల వెల్లువ శత్రు నిర్బంధాన్ని తట్టుకుని నిలబడడం కోసమే కాకుండా, పార్టీని, విప్లవోద్యమాన్ని మరింత సంఘటితం చేయడానికి, పురోగమింపజేయడానికి ఉపయోగపడింది. ఈ విధంగా 2వ శత్రుదాడిని విఫలం చేయడంలో 1995 నాటికి పార్టీ విజయం సాధించింది. దీంతో ప్రజా ఉద్యమాలకు మరింత ఊపు లభించింది. వివిధ సమస్యలపై పోరాటాలు, భూఆక్రమణ పోరాటాలతో వర్గ పోరాటం విస్తరించింది. ఆరంభం నుండే బిహార్ లో ఇస్తున్న క్రాంతికారీ కిసాన్ కమిటీ(కేకేసీ)లకే అధికారం అనే నినాదం క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఉత్తర తెలంగాణ, దండకారణ్యంలలో విప్లవ ప్రజా సంఘాలకే సర్వాధికారాలు అనే నినాదం మరింతగా విస్తరించింది.

దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో పార్టీ పొందిన ఈ ఉన్నత అనుభవం తదనంతర కాలంలో విప్లవానికీ, ప్రతిఘాత విప్లవానికీ మధ్య కొనసాగిన భీషణ యుద్ధంలో మరింత సంపద్వంతమైంది. 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందాల్లో భాగంగా అమెరికా సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో 'లో ఇంటెన్సిటీ కాంఫ్లిక్ట్' (ఎల్.ఐ.సీ.) వ్యూహాన్ని రూపొందించింది. తదనంతర కాలంలో భారత దళారీ దోపిడీ పాలకవర్గాలు దేశ–విదేశీ కార్పొరేట్ ప్రయోజనాలను నెరవేర్చడం కోసం భారత విప్లవోద్యమాన్ని అణచివేయడానికి ఈ వ్యూహాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపజేసాయి. ఇందులో భాగంగా మొట్టమొదట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక ప్రయోగశాలగా మార్చివేసాయి. 1997–2006 మధ్య కాలంలో ఉత్తర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో పార్టీ నాయకత్వాన్ని, గెరిల్లా దళాలను లక్ష్యంగా చేసుకుని కుఖ్యాత గ్రేహౌండ్స్ బలగాలు చుట్టివేత–నిర్మూలన దాడులు నిర్వహించాయి. విప్లవ ప్రతిఘాతక నల్లదండు ముఠాలు– గ్రీన్ టైగర్స్, బ్లాక్ టైగర్స్, రెడ్ టైగర్స్, క్రాంతిసేన, తిరుమల టైగర్స్, కోబ్రాలు, విశాఖ టైగర్స్ వంటి హంతక ముఠాల ద్వారా రాష్ట్రంలో ప్రజాస్వామికవాదులపై క్రూరంగా దాడులు చేసి వారి గొంతు నొక్కాయి. జన్మభూమి, మైత్రీ సంఘాలు మొదలైనవాటి ద్వారా సోషల్ పోలీసింగ్ ను అమలు చేసాయి. 2004 నుంచి దండకారణ్యం, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బంగ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్నాటకలలో ఎల్.ఐ.సీ.ని స్థూలంగా అమలు చేయడం ప్రారంభించాయి. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఒకదాన్ని వెన్నంటి మరొకటి నిరంతరాయంగా కేంద్ర, రాష్ట్ర ఫాసిస్టు ప్రభుత్వాలు వ్యూహాత్మక దాడి క్యాంపెయిన్లను

కొనసాగించాయి. 2004–2009 మధ్య విప్లవ ప్రతిఘాతక సల్వాజుడుం, సేంద్ర వంటి తెల్ల మిలిషియాల ద్వారా పాశవిక దాడి క్యాంపెయిన్లు, 2009–2017 మధ్య 'ఆపరేషన్ గ్రీన్ హంట్', 2017–2022 మధ్య 'సమాధాన్' వంటి వ్యూహాత్మక దాడి ప్రణాళికలు అమలు చేసాయి.

ఈ విప్లవ ప్రతిఘాతక ఎల్.ఐ.సీ. దాడి ఫలితంగా భారత విప్లవోద్యమం ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొంటూ వచ్చింది. ప్రత్యేకించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఏఓబీ ఉద్యమాలు 2004 నాటికి సెట్ బ్యాక్ కు గురై అత్యంత ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మారుతున్న సామాజిక పరిస్థితులను, శతృదాడి తీవ్రతను అర్థం చేసుకుని తగిన ఎత్తుగడలను రూపొందించుకోకపోవడం, రూపొందించుకున్న ఎత్తుగడల అమలులో తీవ్రమైన లోపాల, బలహీనతల, పరిమితుల కారణంగా 2018 నాటికి దేశవ్యాప్తంగా విప్లవోద్యమం తాత్కాలికంగా వెనకంజ వేసింది. అయినప్పటికీ శత్రువు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ప్రజలపై అమలు జరిపిన ఈ నిర్మూలనా యుద్ధంలో అడుగడుగునా రక్తతర్పణ చేస్తూ, నూతన అనుభవాలు పొందుతూ, అనేక గుణపాఠాలు నేర్చుకొని ఇనుమడించిన బలంతో పోరాడుతూ పార్టీ శత్రు పథకాల్ని తిప్పికొడుతూ వస్తోంది. ఎంతో రక్తం ధారపోసి అనేక రకాల అనుభవాలను గడిస్తూ ప్రజాయుద్ధ శస్త్రాగారానికి నూతన ఆయుధాలను సమకూర్చుకుంటున్నది. ఎప్పటికప్పుడు శతృదాడిని, ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ ఉద్యమాన్ని కాపాడుకునేందుకు, పురోగమింపజేసేందుకు, ఆచరణను సమీక్షించుకుంటూ లోపాలను సరిదిద్దుకుంటూ, తగిన ఎత్తుగడలను రూపొందించుకుంటూ ముందుకు సాగుతున్నది. గత రెండున్నర దశాబ్దాల నుంచి ఇదంతా క్యాంపెయిన్ల రూపంలో పథకం ప్రకారం కొనసాగిస్తున్నది. ముఖ్యంగా పోరాటం (ఆత్మరక్షణ–దాడి), త్యాగాలు, పునర్నిర్మాణం, విస్తరణ, దీర్ఘకాల ప్రజాయుద్ధ పురోగమనం ..... ఈ విధంగా మన విప్లవ క్రమం కొనసాగింది.

ఇందులో భాగంగా ముఖ్యంగా సల్వాజుడం తెల్ల బీభత్సాన్ని ఓడించేందుకు యూనిఫైడ్ కమాండ్ల నిర్మాణం రూపం ముందుకు వచ్చింది. శతృదాడిని ఓడిస్తూ, విప్లవోద్యమాన్ని పురోగమింపజేయడంలో ఇది మెరుగైన అనుభవాలనిచ్చింది. కామ్రేడ్ ఆనంద్ సీ.ఆర్.బీ. ఇంచార్జిగా యూనిఫైడ్ కమాండ్ల అనుభవం నుంచి నేర్చుకుంటూ వాటిని మెరుగైన పద్ధతిలో పని చేయించేందుకు కృషి చేస్తూ సహ కామ్రేడ్స్ కు తన సహాయ సహకారాలను అందించారు. గెరిల్లా జోన్లలో యూనిఫైడ్ కమాండ్ల ఆధ్వర్యంలో యావత్తు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ఐక్యసంఘటన (ప్రజా) నిర్మాణాలు సమైక్యంగా నిలిచి నిరంతరం ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ, దానిపై ఆధారపడి ప్రజాయుద్ధాన్ని సాగించడం ద్వారానే ఎప్పటికప్పుడు శతృ దాడులను విఫలం చేస్తూ, పార్టీని, పార్టీ నాయకత్వాన్ని, విప్లవోద్యమాన్ని తీవ్రమైన నష్టాల మధ్యనే పరిరక్షించుకోవడం సాధ్యమైంది. ఇందులో కామ్రేడ్ ఆనంద్ సమర్థవంతమైన నాయకత్వ పాత్ర అడుగడుగునా

కనపడుతుంది.

1995లో జరిగిన అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్ (ఏ.ఐ.ఎస్.సీ.)లో కామ్రేడ్ ఆనంద్ కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఉద్యమ స్థితిపై ఆధారపడి ఈ కాన్ఫరెన్స్ లోనే ఆంధ్రప్రదేశ్ నుంచి ఉత్తర తెలంగాణ ప్రాంతాన్ని వేరు చేసి దానిని రాష్ట్ర స్థాయి స్పెషల్ జోనల్ కమిటీగా ఏర్పరచాలని నిర్ణయించారు. ఈ జోన్ లో దండకారణ్యం నుంచి విడదీసి ఆదిలాబాద్ డివిజన్ ను కలపాలనీ, ఈస్ట్ డివిజన్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ పరిధిలో కలపాలని నిర్ణయించారు. కామ్రేడ్ ఆనంద్ నూతనంగా ఏర్పడిన ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. ప్రజాయుద్ధం-గెరిల్లాయుద్ధం తీవ్రస్థాయిలో జరుగుతున్న ఉత్తర తెలంగాణకు 2000వ సంవత్సరం వరకూ ఐదేళ్ల పాటు ప్రత్యక్ష బాధ్యత వహించారు, విశేష అనుభవం గడించారు.

2001లో జరిగిన మునుపటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్ వార్] 9వ కాంగ్రెస్ లో మరోమారు కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యి, పొలిట్ బ్యూరో సభ్యుడయ్యారు. కేంద్రకమిటీ దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని సమన్వయంతో నడపడం కోసం ఆనాడు రీజినల్ బ్యూరోల్ని ఏర్పాటు చేసింది. కామ్రేడ్ ఆనంద్ సెంట్రల్ రీజినల్ బ్యూరో (సీ.ఆర్.బీ.-మధ్య రీజినల్ బ్యూరో) ఇంచార్జి బాధ్యతలు చేపట్టారు. 2004 సెప్టెంబర్ 21న మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ), భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్ వార్], రెండూ కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. 2007లో ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ జరిగినపుడు మరోమారు ఆయన కేంద్రకమిటీలోకి ఎన్నికయి పొలిట్ బ్యూరో సభ్యుడిగా, మధ్య రీజినల్ బ్యూరో ఇంచార్జిగా కొనసాగారు. 2017లో అనారోగ్య కారణాలతో స్వచ్ఛందంగా సీ.ఆర్.బీ. ఇంచార్జి బాధ్యతల నుండి వైదొలిగి సీఆర్.బీ. సభ్యునిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగుతూ వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. సీ.ఆర్.బీ. ఇంచార్జిగా వున్నకాలంలో సీ.ఆర్.బీ. అధికార ప్రతినిధిగా, ఆయన అమరత్వానికి ముందు రెండు సంవత్సరాలుగా కేంద్రకమిటీ అధికార ప్రతినిధిగా సమర్థవంతంగా పనిచేసారు.

సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ కృషిలో పాత్ర

సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ రంగాలలో పార్టీ నాయకునిగా కామ్రేడ్ ఆనంద్ కృషి ఎనలేనిది. చైనాలో కామ్రేడ్ మావో నేతృత్వంలో అనుసరించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలోనే భారత విప్లవం జరుగుతుందనీ, అయితే "మన దేశంలో చైనా అనుభవాలను మక్కికి మక్కి లేదా కొన్ని సవరణలతో అన్వయిస్తే సరియైన ఫలితాలు రావు", ఆనాటి చైనాకూ, భారతదేశానికీ అనేక తేడాలున్నాయి, ఈ దేశంలో గల కొన్ని భిన్నమైన చారిత్రక, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఇక్కడ విప్లవం తనదైన కొన్ని విశిష్టతలతో ముందుకు

సాగుతుందని మన పార్టీ అవగాహన. ఈ అవగాహనతో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్ని మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయిస్తూ విప్లవానికి నాయకత్వం వహిస్తూ భారత విప్లవ పంథాను సుసంపన్నం చేసిన, 1980ల నుండి ముందుకు వచ్చిన మన పార్టీ నాయకత్వ టీములో ఆయన ఒకరు. ఇందుకోసం ఆయన నిరంతరం తపించడమే కాకుండా తన కార్యాచరణలో సృజనాత్మకంగా అమలు చేయటానికి ప్రతిభను ప్రదర్శించారు. ఆయన 1980 నుంచి అమరుడయ్యే వరకు ప్రతినిధిగా, నాయకత్వ కమిటీ సభ్యునిగా పార్టీ వివిధ రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ లు, 1995 ఆల్ ఇండియా స్పెషల్ కాన్ఫరెన్స్, 2001 పీడబ్ల్యు 9వ కాంగ్రెస్, 2007 సీపీఐ (మావోయిస్టు) ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ లు, ప్లీనాలు, మీటింగులు, విస్తృత సమావేశాలలో పాల్గొన్నారు. పార్టీ పంథాను సంపద్వంతం చేయడంలో ఆయన సమిష్టి నాయకత్వ టీములో ఒకరుగా చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులను అంచనా వేసి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తగిన కర్తవ్యాలను రూపొందించుకోవడంలో చొరవను ప్రదర్శించేవారు. తద్వారా పార్టీకి చెందిన పలు కొత్త డాక్యుమెంట్లు, పాలసీ పేపర్ల తయారీలో, పాత వాటిని సంపద్వంతం చేయడంలో క్రియాశీలంగా వుండేవారు. తాను ఏ బాధ్యతలు నిర్వహిస్తున్నా, ఎక్కడ వున్నా, ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ పరిస్థితులు, శత్రు ఎత్తుగడలకు అనుగుణంగా సర్కులర్లు, లెటర్ల తయారీలో నాయకత్వ సమిష్టి కృషిలో భాగమయ్యేవారు. సైద్ధాంతిక, రాజకీయ అంశాలను ఎంచుకొని పార్టీ పత్రికలకు, ప్రధాన స్రవంతి మీడియాకు వ్యాసాలు రాసేవారు. పార్టీ కేడర్లకు, విప్లవ ప్రజానీకానికీ విప్లవ రాజకీయాలు అందించి వారిని ఆచరణలోకి దించేవారు. 1996లో సీసీ కోసం సీసీ నిర్వహించుకున్న క్లాసులలో విద్యార్థిగా పాల్గొని తన సైద్ధాంతిక అవగాహనను పెంచుకునేందుకు కృషి చేసారు. పార్టీ సైద్ధాంతిక ఎడ్యుకేషన్ కోసం సీసీ నోట్స్ పుస్తకాలను తయారు చేయడంలో భాగమయ్యారు. పార్టీ డాక్యుమెంట్లలో కాన్సెప్ట్స్ పై కేంద్రీకరించి కేడర్లకు సకాలంలో శిక్షణ అందించి పార్టీ పట్ల, విప్లవోద్యమ భవిష్యత్ పట్ల అచంచల విశ్వాసాన్ని కలిగించేవారు. పీడిత ప్రజల్లో అనేక సెక్షన్లతో పరిచయాలుండడం, ఆయా రంగాలను గైడ్ చేయడంలో అనుభవం ఉండడంతో ఆయన ఆయా విషయాలను ఎంతో లోతుగా చెప్పేవారు, చర్చించేవారు. దృఢనిశ్చయంతో పనిచేసేలా వారికి తర్ఫీదునిచ్చేవారు. ఆయన వున్న క్యాంపులలో ఎప్పుడూ అనేక రకాల చర్చలతో కూడిన రాజకీయ వాతావరణం ఉండేది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల కారణంగా, మన ఉద్యమ ప్రాంతాలలో వర్గ పోరాట ఫలితంగా సమాజంలో ఉత్పత్తి సంబంధాలలో కలుగుతున్న మార్పులను పరిశీలించడంపై కామ్రేడ్ ఆనంద్ కేంద్రీకరించి కృషి చేసారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో భూసంబంధాలలో వస్తున్న మార్పులపై మీడియాకు వ్యాసాలు రాసారు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలోనూ, దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ గ్రామాలలో వర్గ పరిశీలన చేసారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక పరిశోధనా డాక్యుమెంటు ద్వారా మార్పులకు అనుగుణంగా నిర్దిష్ట

ఎత్తుగడలు రూపొందించడంలో ముఖ్య పాత్ర పోషించారు. కేంద్రకమిటీ భారతదేశంలో ఉత్పత్తి సంబంధాలలో మార్పులపై విడుదల చేసిన డాక్యుమెంటును సంపద్వంతం చేయడంలో తన వంతు పాత్ర పోషించారు.

పార్టీలో తప్పులకు వ్యతిరేకంగా దిద్దుబాటు ఉద్యమాలు నడపాల్సిన ప్రాధాన్యత గుర్తించి నడపడమే కాకుండా, అందులో తన వైపు నుండి జరిగిన లోపాలను ఆత్మవిమర్శ చేసుకోవడంలో ముందుండేవారు. తన తోటి కమిటీ సభ్యులను, పార్టీ కేడర్లను తప్పులను గుర్తించి సరిదిద్దుకునే విధంగా తోడ్పడేవారు. 1984లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీలో తలెత్తిన ఆరు చెడులను వ్యతిరేకించడంలో, ఆ తర్వాత శిక్షణ-దిద్దుబాటు ఉద్యమాన్ని నడపడంలో కామ్రేడ్ ఆనంద్ క్రియాశీలంగా ఉన్నారు. ఆ తర్వాత పార్టీ 1990ల చివర, 2000 ప్రారంభంలో, ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ తర్వాతా చేపట్టిన ఎడ్యుకేషన్-దిద్దుబాటు ఉద్యమాలను తాను బాధ్యత వహించే ప్రాంతాలలో చురుగ్గా నడిపారు. పార్టీలో జరుగుతున్న తప్పులను ప్రజల ముందుకు వెళ్లి సరిదిద్దుకునేందుకు కృషి చేసారు. దిద్దుబాటు ఉద్యమాలలోని పాజిటివ్, నెగెటివ్ అంశాలను లోతుగా సమీక్షించి పార్టీని బోల్షివీకరించే వైపుగా కృషి చేసారు. ఉన్నతస్థాయి కమిటీలలో ఈ విషయంపై చర్చించి బోల్షివీకరణ క్యాంపెయిన్ చేపట్టడం, దాన్ని విజయవంతం చేయడంలో, ఆ వైపుగా పార్టీని నడిపించడంలో ఒక డైనమిక్ పాత్ర పోషించారు. సమిష్టి పని విధానానికి, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రానికి కట్టుబడి పనిచేయాల్సిన, పార్టీలో మావోయిస్టు పని శైలిని అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందని చెప్పారు. ఈ విషయంపై పార్టీ కేడర్లను ఉద్దేశించి పీపుల్స్ వార్ పత్రికలో వ్యాసాన్ని రాసారు. పార్టీలో సైద్ధాంతిక, రాజకీయ కృషే మన కృషికి అంతటికీ జీవనాడి అని మావో బోధించిన సూత్రాన్ని తన తుదిశ్వాస వరకూ ఆచరించేందుకు కృషి చేసారు.

విప్లవ ప్రచారంలో, విప్లవ సాహిత్యం, పత్రికల ప్రచురణలలో నిరంతరం విశేష కృషి చేసారు. ఆయా సందర్భాలలో పార్టీ నిర్ణయం మేరకు రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై పార్టీ వైఖరిని మీడియా ద్వారా విశాల ప్రజలకు తెలియజేయడంలో ఆయన కృషి ప్రముఖమైంది. లాల్ గఢ్, నారాయణపట్నా ఉద్యమాలను విస్తృత స్థాయిలో ప్రచారం చేయడానికి, అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమాన్ని గురించి మైదాన, పట్టణ ప్రాంతాల ప్రజలకు చేరవేయడానికి అనేక ప్రచురణలను, అనేక సిద్ధాంత, రాజకీయ గ్రంథాలను, ఉద్యమానికి అవసరమైన సాహిత్యాన్ని తేవడానికి, దండకారణ్యంలో క్రాంతికారీ జనతన సర్కార్ల గురించి ప్రచారం చేయడానికి తన వంతు కృషి చేసారు. క్రాంతి ప్రచురణలుగా అనేక పుస్తకాలు ప్రచురింపజేసారు. సభలు, సమావేశాలు, వేదికలు నిర్వహించడానికి, ప్రచార, ఆందోళనా కార్యక్రమాల్లో తనదైన శైలిలో స్పందిస్తూ వాటిని విజయవంతం చేసేందుకు కృషి చేసారు. ఆదిలాబాద్ నేపథ్యంలో వచ్చిన కొన్ని పుస్తకాలపై, నవలలపై ఆయన బలమైన ముద్ర ఉంది. తెలంగాణ అమరుల చరిత్రలను వెంట వెంట తేవడంలో ఆయన కృషి, ప్రోత్సాహం ఉన్నాయి. దండకారణ్య ఎఫ్.సీ. బాధ్యతలు చూస్తున్నప్పుడు జంగ్ పత్రిక కంట్రిబ్యూటర్ గా కూడా పని చేసారు. క్రాంతి పత్రిక సంపాదకునిగా

అనేక సంవత్సరాలు పని చేయడంతో పాటు ఎర్రజెండా, పీపుల్స్ వార్ వంటి అజ్ఞాత పత్రికలకు కూడా కొంతకాలం సంపాదకత్వం వహించారు. సంపాదకవర్గంతో, స్టాఫ్ తో సన్నిహితంగా, ప్రజాస్వామికంగా చర్చిస్తూ ఉన్నత ప్రమాణాలతో పత్రికలను నడిపేందుకు కృషి చేసారు. ప్రజా విముక్తి, ఎర్రజెండా, పీపుల్స్ వార్ పత్రికలకు అనేక వ్యాసాలు రాసారు. మీడియాకు పలు సందర్భాల్లో ఇంటర్వ్యూలు ఇచ్చారు. పరమేశ్వర్ పేరుతో అనేక వ్యాసాలు రాసారు,. ప్రతాప్ పేరుతో సీ.ఆర్.బీ. అధికార ప్రతినిధిగా పత్రికా ప్రకటనలు జారీచేసారు. 2018లో కేంద్రకమిటీ పీపుల్స్ మార్చ్ పత్రికను పునఃప్రారంభించినపుడు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. ఆయన అమరత్వానికి ముందు రెండు సంవత్సరాలుగా కేంద్రకమిటీ అధికార ప్రతినిధిగా ముఖ్యమైన పాత్ర పోషించారు.

ఐక్యసంఘటన నిర్మాణ కృషిలో విశేష పాత్ర

ఎంఎల్ఎం సిద్ధాంత వెలుగులో భారత విప్లవోద్యమంలో ఐక్యసంఘటనను అద్భుత ఆయుధంగా అభివృద్ధి చేయడానికి కామ్రేడ్ ఆనంద్ తన సుదీర్ఘ విప్లవ కాలమంతటా తీవ్రంగా కృషి చేసారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ కేంద్రకమిటీ మార్క్సిస్టు దృక్పథంతో "ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ" డాక్యుమెంటును రూపొందించి ఆ ఉద్యమానికి మార్గనిర్దేశం చేసింది. ఈ డాక్యుమెంటు తయారు చేయడంలో, ఈ ఉద్యమానికి నాయకత్వం వహించడంలో కామ్రేడ్ ఆనంద్ చెరగని ముద్ర వేసారు. 2014లో భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా అది ప్రజల మౌలిక ఆకాంక్షలను నెరవేర్చదని, ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించడంలో, అందుకు తగిన కార్యక్రమం రూపొందించి, ప్రజల ఆచరణ క్రమంలో ముందుకు వస్తున్న పోరాట, నిర్మాణ రూపాల ప్రాధాన్యతను వివరిస్తూ, వాటిని ప్రభావవంతంగా మలచి అందించడంలో, పాలకవర్గ పార్టీలు సైతం ప్రజాస్వామిక తెలంగాణ నినాదంతో ప్రజల మధ్యకు వెళ్లక తప్పని విధంగా తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. విప్లవ రాజకీయాలే ప్రత్యామ్నాయం అని చెప్పి తెలంగాణ ప్రజలను ముందుకు నడిపించారు. విప్లవోద్యమానికి, భారత పీడిత ప్రజలకు వ్యతిరేకంగా కొనసాగిన రాజ్యహింసకు వ్యతిరేకంగా, విప్లవ ప్రతిఘాతక ఆపరేషన్ గ్రీన్ హంట్, సమాధాన్ దాడులకు వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా, రాజకీయ ఖైదీల విడుదల కోసం విశాల ప్రాతిపదికన వివిధ ప్రజాసంఘాలను, విప్లవ, ప్రజాస్వామిక, ప్రగతిశీల సంస్థలను, పార్టీలను, శక్తులను, వ్యక్తులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చేందుకు పార్టీ మార్గదర్శకత్వంలో ఆయన చేసిన కృషి ఇందుకు తిరుగులేనిదిగా నిలుస్తుంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉద్యమాల్ని, భారత విప్లవోద్యమాన్ని తాత్కాలిక వెనకంజ నుంచి బయటపడేసి, ముందంజ వేసేందుకు ఐక్యసంఘటనా ఎత్తుగడలను సృజనాత్మకంగా అన్వయిస్తూ అన్ని రంగాలలో, పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో అహర్నిశలు కామ్రేడ్ ఆనంద్ చేసిన కృషి మరువలేనిది. ఐక్యసంఘటనా కృషిలో భాగంగా పార్టీ కార్మిక, కర్షక, విద్యార్థి–మేధావులు,

ఉద్యోగులు, మహిళలు, ఆదివాసీలు మొదలైన పీడిత వర్గాల, పీడిత సెక్షన్లకు చెందిన విశాల ప్రజారాశులను కదిలిస్తూ విలువైన అనుభవాలను సంపాదించుకుంది. సామ్రాజ్యవాద ఆర్థిక సంక్షోభం ప్రపంచీకరణ విధానాల కారణంగా మరింత తీవ్రతరమవుతూ దీర్ఘకాలంగా కొనసాగుతుండడంతో పీడిత ప్రజలకు, జాతులకు కష్టాలు, కడగండ్లతో పాటు వాళ్లలో ఆగ్రహాన్ని కూడా సృష్టిస్తూ వచ్చింది. ప్రత్యేకించి మన దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ అధికారంలోకి రావడంతో గత దశాబ్ద కాలంగా పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజలు ఈ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ఎక్కడికక్కడ వివిధ రూపాలలో సమీకృతులవుతూ పోరాడుతున్నారు. ఈ సంక్షుభిత పరిస్థితులలో పార్టీ తన శక్తి మేరకు ప్రజల్లోకి వెళుతూ వారిని సంఘటితం చేయడమే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ వర్గాల, సెక్షన్ల ప్రజా వేదికలలో భాగమవుతూ వచ్చింది. వివిధ ప్రజా సంఘాలను సంఘటితం చేయడానికి కృషి చేస్తోంది. ఈ కృషి అంతటా కామ్రేడ్ ఆనంద్ ముందు భాగాన నిలిచారు.

పార్టీలో అంతర్గతంగా రెండు పంథాల మధ్య పోరాటాలలో క్రియాశీల పాత్ర

1985లో సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్ వార్) కేంద్రకమిటీ కార్యదర్శి సత్యమూర్తి నాయకత్వంలో సీసీలోని మెజారిటీ గ్రూపు తమ స్వార్థపర కెరీరిస్టు ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి, తప్పులను కప్పిపుచ్చుకుంటూ అతివాద వాగాడంబరం, మితవాద అవకాశవాదంతో కుట్రలు, కూహకాలు పన్ని కేంద్రకమిటీని తీవ్ర ప్రతిష్టంభనకు గురిచేసి పార్టీలో అంతర్గత సంక్షోభం సృష్టించారు. విప్లవోద్యమంపై పెద్దెత్తున మొదటి శత్రుదాడి ఆరంభమైన స్థితిలో సీసీ మెజారిటీ గ్రూపు ఈ సంక్షోభాన్ని సృష్టించింది. పార్టీపై తమ విచ్ఛిన్నకర, దివాలాకోరు పంథాను రుద్దడానికి ప్రయత్నించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో 1985 మే లో జరిగిన రాష్ట్ర మొదటి ప్లీనం, సెప్టెంబర్ లో జరిగిన రెండవ ప్లీనంలో కామ్రేడ్ ఆనంద్ పాల్గొన్నారు. ఇందులో ఆయన మెజారిటీ గ్రూపు అవకాశవాద పంథాను తిరస్కరించి, కేఎస్ నాయకత్వంలో సీసీ మైనారిటీ గ్రూపు అనుసరిస్తున్న పార్టీ సరైన పంథాను బలపరిచారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి మైనారిటీ గ్రూపు అనుసరించిన ఒంటెత్తు పోకడల పట్ల కూడా ఆయన విమర్శనాత్మక వైఖరిని తీసుకున్నారు.

1991 జూన్ లో కేంద్రకమిటీ కార్యదర్శి కేఎస్ తో పాటు ఆయనతో చేతులు కలిపిన కొద్దిమందితో కూడిన అవకాశవాద ముఠా పార్టీలో 2వ అంతర్గత సంక్షోభాన్ని తీసుకొచ్చింది. కేఎస్ దీర్ఘకాలికంగా తనలో కొనసాగుతున్న స్వీయాత్మకత, ఒంటెత్తుపోకడ, పెత్తందారీతనం, మితవాద వైఖరులు తదితర తప్పుడు ధోరణులను సరిదిద్దుకోవడానికి సిద్ధంగా లేరు. పార్టీ అనుసరిస్తున్న సరైన రాజకీయ, నిర్మాణ పంథాకు తూట్లు పొడవడానికి ఈ ముఠా అనుసరించిన నిర్మాణ అరాచకత్వం వల్ల పార్టీలో గందరగోళానికీ దారితీసింది, పార్టీ ఐక్యత దెబ్బతింది. ఈ సంక్షోభ పరిష్కారానికి అన్ని రాష్ట్రాలలో ప్లీనాలు జరిగాయి. అక్టోబర్ 1991లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్లీనంకు, 1993లో జరిగిన దండకారణ్య ప్లీనంకు కామ్రేడ్ ఆనంద్

హాజరయ్యారు. ప్లీనాలు కేఎస్, ప్రసాద్, బండయ్యలను పార్టీ పదవుల నుంచి తొలగించాలని, ఇతరులపై చర్యలు తీసుకోవాలనీ కేంద్రకమిటీని కోరుతూ తీర్మానించాయి.

ఈ రెండు అంతర్గత సంక్షోభాలలోనూ పార్టీ, సరైన పంథాపై ఆధారపడి పార్టీ కేడర్లను సమైక్యంగా నిలపడంలో, వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించి సంక్షోభాన్ని పరిష్కరించడంలో కామ్రేడ్ ఆనంద్ తన వంతు కృషి చేసారు.

ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ తర్వాత గత 2 దశాబ్దాల కాలంలో కేంద్రకమిటీ సభ్యులు పాపిరెడ్డి, నర్సింహారెడ్డి, సుధాకర్, కోబాడ్ గాంధీలు తమ కార్మికవర్గ వ్యతిరేక బలహీనతలను సరిదిద్దుకోలేక పచ్చి మితవాద అవకాశవాద వాదనలు ముందుకు తెచ్చి, ఘోరంగా దిగజారి పార్టీకి, ప్రజలకు తీరని ద్రోహం తలపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రసిద్ధ విప్లవ గాయకుడు గద్దర్ దివాలాకోరు అవకాశవాద బూర్జువా రాజకీయాలను ముందుకు తెచ్చాడు. వారిని కేంద్రకమిటీ సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎండగట్టడంలో, వారిని పార్టీ నుంచి బహిష్కరించడంలో, వారికి జవాబులు ఇవ్వడంలో, పార్టీ శ్రేణులను చైతన్యవంతం చేయడంలో కామ్రేడ్ ఆనంద్ ఒక ముఖ్య పాత్ర పోషించారు.

విప్లవకారుల మధ్య ఐక్యతను సాధించడంలో కృషి

నక్సల్బరీ తాత్కాలిక వెనకంజ తర్వాత చీలికలు పేలికలు అయినవాటిలో నిజమైన విప్లవ పార్టీలను, గ్రూపులను ఐక్యం చేయాలని, వారితో సౌహార్ద సంబంధాలు కొనసాగించాలని, దేశంలో సరైన పంథాను అనుసరించే ఒకే విప్లవ కమ్యూనిస్టు పార్టీని స్థాపించడం ద్వారానే విప్లవాన్ని విజయం వైపుగా నడిపించగలమని, ఇందుకోసం విశాల ప్రాంతాల్లో ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ వర్గ పోరాటాన్ని అభివృద్ధి చేయడం అవసరమని చెప్పిన కేంద్రకమిటీ అవగాహనను కామ్రేడ్ ఆనంద్ మనస్ఫూర్తిగా స్వీకరించి అందుకు శాయశక్తులా కృషి చేసారు. ఆయన కేంద్రకమిటీ సభ్యుడైనప్పటి నుండి ఈ వైఖరితోనే నిజమైన విప్లవకారుల ఐక్యతకు తన వంతు పాత్ర నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ విప్లవ గ్రూపుల పట్ల ఇదే సరైన వైఖరితో సౌహార్ద సంబంధాలు కొనసాగించారు. పార్టీ మొదటి అంతర్గత సంక్షోభం (1985) వల్ల పార్టీ నుండి విడిపోయిన తమిళనాడు, మహారాష్ట్రలోని గ్రూపులతో చర్చలు జరిపి సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్ వార్)ను బలోపేతం చేసినప్పుడు ఆయన దానిని మంచి పరిణామంగా ఆహ్వానించారు. సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్ వార్)కూ, పార్టీ యూనిటీకీ మధ్య ఐక్యతా చర్చలు విజయవంతమై రెండు పార్టీల కేంద్రకమిటీలు సమావేశమై ఐక్యతా ప్రకటన జారీ చేసినప్పుడు ఆయన అందులో పాలుపంచుకున్నారు. అలాగే ఎంసీసీఐకీ, సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్ వార్]కూ మధ్య ఐక్యత ఏర్పడి, సీపీఐ (మావోయిస్టు)ను స్థాపించిన జాయింట్ కేంద్రకమిటీ సమావేశంలో కూడా ఆయన పాలుపంచుకున్నారు. కేంద్రకమిటీ నిర్ణయం మేరకు 2014లో సీపీఐ (ఎం-ఎల్) నక్సల్బరీకీ, సీపీఐ (మావోయిస్టు)కూ మధ్య చర్చలు విజయవంతమై, రెండు పార్టీలు విలీనం కావడంతో

భారతదేశంలో విప్లవకారుల ఐక్యతా ప్రక్రియ ప్రధానంగా పూర్తయింది.

పార్టీ కేడర్ల విశ్వాసం చూరగొన్న నాయకులు

కామ్రేడ్ ఆనంద్ ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా ఎలాంటి ఆడంబరాలు లేకుండా చివరి వరకూ సాదాసీదా జీవనశైలిని అనుసరించారు. కింది స్థాయి కేడర్ పట్ల శ్రద్ధ కనబరిచేవారు, వారితో కలిసిపోయేవారు. అందువల్లనే కేడర్ ఆయనను పెద్ద అండగా భావించేవారు. అమరుడయ్యే నాటి వరకూ దీర్ఘకాల ప్రజాయుద్ధ మైదానంలో ఉండి అనేక ఆటుపోట్లను, ఒడిదుడుకులను తట్టుకొని రాటుదేలిన నాయకులు. ఆయన సర్కపల్లి ఎన్ కౌంటర్ వంటి పలు ఘటనల్లో శత్రువుతో హోరాహోరీ పోరాడుతూ తోటి గెరిల్లాలకు నాయకత్వం వహించారు. అనేక అనుభవాల గని ఆయన. ఆయన విరామ సమయాల్లో గెరిల్లా యువతీ యువకులతో ఎంతో సంతోషంగా తన విప్లవానుభవాలను పంచుకునేవారు. గెరిల్లా జీవితంలో క్రమశిక్షణ పాటించడంలో ముందుండేవారు. లోతైన అధ్యయనం, నిర్దిష్ట పరిశీలన చేయడంలో నిరంతరం ఒక విద్యార్థిగా, దీర్ఘదృష్టితో పని చేయడం, కష్టపడి పని చేయడం, ఒడిదుడుకులలో నిబ్బరంగా, ఒక స్థిరమైన దృఢసంకల్పంతో పని చేయడంలో ఒక ఉపాధ్యాయుడిగా బోధిస్తూ కామ్రేడ్ ఆనంద్ ఆదర్శంగా నిలిచారు. తెలంగాణ, డీకే, ఏఓబీ ఉద్యమాలను దగ్గరగా గైడ్ చేయడంతో అక్కడి కాడర్ తో ఆయనకు లోతైన సంబంధాలుండేవి. కేడర్లను సకాలంలో, సరైన పద్ధతుల్లో తీర్చిదిద్దుతూ ఎదిగించుకునేందుకు, వారిలోని తప్పులను సరిదిద్దేందుకు రోగానికి వైద్యం చేసి రోగిని కాపాడుకోవాలనే మావో బోధనకు అనుగుణంగా కామ్రేడ్లీగా మంచి ఉపాధ్యాయుడిగా, విప్లవ నాయకుడిగా సమర్థవంతంగా కృషి చేసారు. తద్వారా ఆయన పార్టీ ఉన్నత స్థాయి నాయకత్వ కమిటీలలో, కేడర్లలో అపారమైన విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. కేడర్లు తమ కమిటీల సమావేశాలకు ఆయన రావాలని కోరుకునేవారు. ఏ సీరియస్ సమస్య వచ్చినా ఆయనతో మాట్లాడాలని కేడర్లు కోరుకునేవారు. ఆయన సమస్య మూలాల్లోకి వెళ్లి మాట్లాడిన తర్వాత వారు సంతృప్తి చెంది తమ బాధ్యతలను ఉత్సాహంగా నిర్వహించేవారు. కాడర్ ఎదుగుదల నుంచి, వారి సాహసిక చర్యల నుంచి ఆయన ఎంతో ఉత్సాహపడేవారు. పూజారి కాంకేర్ ఎన్ కౌంటర్ లో నాయకత్వాన్ని కాపాడేందుకు తమ ప్రాణాన్ని పణంగా పెట్టి పీ.ఎల్.జీ.ఏ. యోధులు చేసిన త్యాగాలను, జహానాబాద్, గిరిడీ, ఉర్పల్ మెట్ట, నయాగఢ్, ముకరం, బుర్కాపాల్ లాంటి అనేక పీ.ఎల్.జీ.ఏ. గెరిల్లా యుద్ధ చర్యలను చూసి తాను ఎంతో ఉత్సాహపడడమే కాకుండా యావత్తు విప్లవ క్యాంపును ఉత్తేజపరిచేవారు. జీరగూడెం సాహసిక దాడికి ప్రత్యక్షంగా మార్గదర్శకం అందించి ప్రజాశక్తిని చాటిచెప్పడంలో తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన యావత్తు కృషి విద్యార్థి–యువజనులకూ, కార్మికులకూ, రైతాంగానికి, పీడిత సామాజిక సెక్షన్లకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, పీ.ఎల్.జీ.ఏ. యోధులకు, కమాండర్లకు, మొత్తం విప్లవ శిబిరానికి సదా గొప్ప ప్రేరణాదాయకంగా నిలిచి వుంటుంది.

కామ్రేడ్ ఆనంద్ కు కళల పట్ల, సాహిత్యం పట్ల అభిరుచి, ప్రవేశం ఉండడంతో పాటు ఆ రంగాలను గైడ్ చేసిన అనుభవం కూడా ఉంది. ఈ రంగాలలో వివిధ తప్పుడు ధోరణులు పొడచూపిన సందర్భాలలో వాటిని సరి చేయడానికి తన వంతు కృషి చేసారు. సామాజికోద్యమాల్లో, సాహిత్య రంగంలో వచ్చిన అస్తిత్వవాద ఉద్యమాల్లోని వివిధ ధోరణులపై ప్రజాస్వామికంగా చర్చ నిర్వహించడంలో, ఎంఎల్ఎం వెలుగులో వాటిని సరిదిద్దడంలో ఆయన పాత్ర ఉంది. జననాట్యమండలి చరిత్ర పుస్తకం తేవడంలో తన సలహాలనందించారు.

అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంక్షోభం దుర్భరమయ్యే కొలదీ, ప్రజలు ప్రజాస్వామిక ఉద్యమాలను పురోగమింపజేసేందుకు మరింతగా పోరాడుతారు. అయితే పార్టీ ప్రజలను రాజకీయంగా చైతన్యవంతం చేస్తూ విప్లవోద్యమంలోకి సమీకరించి, సంఘటితపరచకుండా, స్వీయాత్మక శక్తులను పెంపొందించుకోకుండా, ప్రత్యేకించి ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ వారిని ప్రజావిముక్తి సైన్యంగా సంఘటితం చేస్తూ సాయుధ పోరాటంలోకి దించకుండా, నిజమైన జాతీయ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం ప్రజలను విస్తృతంగా, సమరశీలంగా నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములను జేయడం సాధ్యం కాదు. ప్రజల ప్రజాస్వామిక విప్లవం ద్వారా మాత్రమే పీడిత ప్రజలు, పీడిత జాతులు, దోపిడీ, పీడనల నుంచి పూర్తిగా విముక్తి చెందగలరు. సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్య విధానాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ తుడిచిపెట్టడంలో, వారి అభివృద్ధి నిరోధక విప్లవ ప్రతిఘాతక ప్రభుత్వాన్ని ఓడించడంలో ప్రజల పాత్ర–ప్రజాశక్తి నిర్ణయాత్మకమైంది. కామ్రేడ్ ఆనంద్ ఈ ప్రజాశక్తిని వెలికితీయడం కోసం విప్లవ జీవితమంతా కష్టించి పనిచేసారు. అనారోగ్యం పట్టి పీడిస్తున్నా, వయసు పైబడుతూ గతంలా పనిచేసే శక్తి సన్నగిల్లుతున్నా, చివరి నిమిషం వరకూ, భారత పీడిత ప్రజల కోసం, విప్లవోద్యమ పురోగమనానికి నిరంతరం తపించారు, పనిచేసారు.

కామ్రేడ్ ఆనంద్ వైవాహిక జీవితం ప్రజాస్వామిక దాంపత్య జీవనానికి ప్రతిబింబం. జీవన సహచరి కామ్రేడ్ ఎల్లంకి అరుణను అన్ని విషయాల్లో సమానంగా చూస్తూ విప్లవోద్యమంలో పరస్పర ఎదుగుదలకు సహకారాన్ని అందించుకున్నారు. 2003లో ఆదిలాబాద్ డివిజనల్ కమిటీ కార్యదర్శిగా పని చేస్తున్నపుడు శత్రు బలగాలతో జరిగిన ఒక ఎన్ కౌంటర్ లో వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్ అరుణ అమరురాలయింది. తర్వాత మూడు సంవత్సరాలకు మరొక కామ్రేడ్ ను ఆయన వివాహం చేసుకున్నారు. ఆమె విప్లవ కృషికి తన వంతు సహకారాన్ని అందించారు.

కామ్రేడ్ ఆనంద్ ఆదర్శాలను సమున్నతంగా ఎత్తిపడదాం! వేలాది 'ఆనంద్'లను సృష్టిద్దాం!

కామ్రేడ్ ఆనంద్ విప్లవం పట్ల, విప్లవ సిద్ధాంతం ఎంఎల్ఎం పట్ల, పీడిత ప్రజల పట్ల, పార్టీ పట్ల నిబద్ధతను, అంకితభావాన్ని, కార్మికవర్గ దృఢసంకల్పాన్ని, విమర్శనాత్మక దృక్పథాన్ని, ఉన్నతమైన కమ్యూనిస్టు విలువలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా నిజమైన కమ్యూనిస్టుగా చివరి

వరకూ కొనసాగారు. విప్లవ ప్రతిఘాతక భారత పాలకవర్గాలు విప్లవోదమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా వ్యూహాత్మక 'సూరజ్ కుండ్' పథకాన్ని అమలు చేస్తూ తీవ్రస్థాయిలో క్రూరాతి క్రూరంగా దాడిని కేంద్రీకరించిన నేపథ్యంలో ఆయన అకాల మరణం మన పార్టీకీ, భారత విప్లవానికీ, పీడిత ప్రజలకు అపారమైన నష్టాన్ని కలిగించింది. అయినప్పటికీ మన అమర నాయకుడు కామ్రేడ్ ఆనంద్ విప్లవానికి చేసిన సేవలు అజరామరంగా నిలిచే వుంటాయి. వాస్తవానికి, విప్లవ సిద్ధాంత రాజకీయాలు, విప్లవ పార్టీ, పీడిత ప్రజలూ, వర్గ పోరాటమూ, సాయుధ విప్లవోద్యమమే ఒక సామాన్యమైన ఆనంద్ ను 'ఒక గొప్ప కమ్యూనిస్టు'గా తీర్చిదిద్దాయి. కఠినమైన వర్గ పోరాటంలోనే ఆయన రాటుదేలి ఉన్నత స్థాయికి ఎదిగారు. విప్లవోద్యమాలు ఈ విధంగానే నాయకులను సృష్టిస్తాయి. తిరిగి ఆ నాయకులు విప్లవోద్యమాలను విజయపథంలో నడిపిస్తారు. విప్లవోద్యమానికి దారితీసి, దాని పురోగమనానికి దోహదపడే విప్లవ పరిస్థితులే దాని నాయకులను కూడా సృష్టిస్తాయి. ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో ఇది పదే పదే రుజువైన సత్యం. నేటి అనుకూల పరిస్థితులను ఉపయోగించుకుని పార్టీ ఎంఎల్ఎం సిద్ధాంతం వెలుగులో, మన రాజకీయ పంథా మార్గదర్శకత్వాన, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ నియమాలను సృజనాత్మకంగా మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి స్వీయాత్మక కృషిని నిర్వహించడం ద్వారా, ప్రజాపునాదిని, సంఘటిత శక్తిని, వర్గ పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని పెంపొందించ గలుగుతాం. తద్వారా కామ్రేడ్ ఆనంద్ వంటి వేలాది మంది నాయకులు ఉద్భవిస్తారు. కామ్రేడ్ ఆనంద్ లా వారు వర్గ పోరాట కొలిమిలో రాటు దేలుతారు. కామ్రేడ్ ఆనంద్ తన సైద్ధాంతిక–రాజకీయ కృషి ద్వారా, ఆచరణ ద్వారా ఇందుకు ఎంతో దోహదం చేసారు. ఒక గజ్జల గంగారాం అమరత్వం ఆనంద్ వంటి అనేక మంది కామ్రేడ్స్ ముందు ఒక ఆదర్శాన్ని నిలిపింది. అలాగే, ఆనంద్ త్యాగాన్ని ఆదర్శంగా తీసుకొని అనేక మంది విప్లవకారులు ముందుకొస్తారు. విప్లవానికి నాయకత్వం వహించేలా ఎదుగుతారు. ఆయన ఆశయాన్ని కొనసాగించడం అంటే పార్టీ చరిత్రతో పెనవేసుకుపోయిన ఆయన జీవితాన్ని అధ్యయనం చేయడం; కార్మికవర్గ దృష్టికోణాన్ని అలవరచుకోవడం; ఏటికి ఎదురీదడం; గుండె నిబ్బరం పెంపొందించుకోవడం; విప్లవం గెలుస్తామన్న దృఢమైన విశ్వాసంతో మార్క్సిజం–లెనినిజం–మావోయిజాన్ని, పార్టీ పంథాను, పీడిత ప్రజలను అంటిపెట్టుకుని, అకుంఠిత దీక్షతో భారత ప్రజాయుద్ధం కోసం మన యావత్తు శక్తిని వెచ్చించి పని చేయడం; విప్లవాన్ని పురోగమింపజేయడమే. ఇదే కామ్రేడ్ ఆనంద్ కు నిజమైన నివాళి.

మే డే, 2024.

గోదావరి దాటి, దండకారణ్యంలో అడుగిడి,
సుదీర్ఘ ప్రజాయుద్ధ కార్యాచరణలో రాజకీయ, నిర్మాణపర,
సాంస్కృతిక రంగాలలో కృషి చేసి, గోండు ఆదివాసుల
హృదయాలలో నిలిచిపోయిన
కామ్రేడ్ కడారి సత్యనారాయణరెడ్డి (కోసా దాదా)కి
ఎర్రెర్ర జోహార్లు!



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ కదారి సత్యనారాయణరెడ్డి (కా.కోసా దాదా), మరో కేంద్ర కమిటీ సభ్యులు ఖాతా రామచంద్రా రెడ్డి (కా. రాజు దాదా)లను ఛత్తీస్‌గఢ్ పట్టణ ప్రాంతాలలో ఎక్కడో పట్టుకున్న దోపిడీ పాలక వర్గాల సాయుధ బలగాలు సెప్టెంబర్ 22వ తేదీన ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో బూటకపు ఎదురుకాల్పులలో హత్య చేసారు. దేశ దోపిడీ పాలక వర్గాలు విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టాలన్న ఉద్దేశ్యంతో సాగిస్తున్న ఆపరేషన్ కగార్ దాడిలో కామ్రేడ్ కోసా దాదా, కామ్రేడ్ రాజు దాదా అమరులయ్యారు.

కామ్రేడ్ కదారి సత్యనారాయణరెడ్డి (కోసా దాదా) 1955లో తెలంగాణా రాష్ట్రం సిరిసిల్లా జిల్లా తంగెళ్లపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో మధ్య తరగతి రైతాంగ కుటుంబంలో రెండవ సంతానంగా పుట్టి పెరిగారు. ఆయన తల్లి అన్నమ్మ, తండ్రి కృష్ణారెడ్డి, ఒక అన్నయ్య ఉన్నారు. తండ్రి ఉపాధ్యాయుడు. ప్రాథమిక విద్య సిరిసిల్లాలో పూర్తి చేసారు. చిన్నతనంలో బడికి వెళ్లనని మారాం చేస్తుంటే తండ్రి చదువు ద్వారా జ్ఞానం పెరుగుతుందని అర్థం చేయించేవారు. స్కూలుకు వెంటబెట్టుకు వెళ్లి కొడుకును ఉపాధ్యాయులకు అప్పగించేవారు. తరువాత కామ్రేడ్ కదారి 10వ తరగతి వరకు ఎల్లారెడ్డిపేటలో చదివారు. పెద్దపల్లి ఐటీఐలో ఫిట్టర్ కోర్సు పూర్తి చేసారు.

నక్సల్బరీ వసంత మేఘ గర్జనతో భారతదేశమంతటా మార్క్సిస్టు రాజకీయాల ప్రభావం వ్యాపిస్తున్న కాలం అది. మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం సృష్టించిన భారత విప్లవ మార్గంలోకి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున రాసాగారు. కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఆయన అమరత్వం తరువాత చీలికలయినప్పటికీ దేశంలో వివిధ రాష్ట్రాలలో పార్టీ నాయకులు ఎక్కడికక్కడ పార్టీని పునర్నిర్మాణం చేయసాగారు.

ఆ సమయంలో 1974 అక్టోబర్‌లో ఏర్పడింది రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ). ఆర్ఎస్‌యూ 1975 ఫిబ్రవరిలో ప్రారంభ మహాసభ జరుపుకుంది. విప్లవ విద్యార్థి రాజకీయాలు ఊపందుకున్నాయి. జూన్‌లో కాంగ్రెస్ ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న యావత్తు పార్టీలతో సహా భాకపా (మా-లె)ను కూడా నిషేధించింది. ఎమర్జెన్సీ చీకటి కాలంలో సాగిన అన్యాయాలు, అకృత్యాలతో 1977లో జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ ఓడిపోయి జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. తిరిగి ఆర్ఎస్‌యూ కార్యకలాపాలు పుంజుకున్నాయి. దీంతో పాటుగా రాడికల్ యూత్ లీగ్ (ఆర్ వైఎల్) ఏర్పడి యువతలో పని చేయసాగింది. ఈ రాజకీయ వాతావరణంలో ఐటీఐ చదువుతుండగా కామ్రేడ్ సత్యనారాయణ ఆర్ఎస్‌యూలో చేరారు. రాష్ట్రంలో అనేక జిల్లాలలో ఐటీఐలలో ఆర్ఎస్‌యూ బలంగా ఉండేది. ఐటీఐలలో సమస్యల పరిష్కారం కోసం ఆర్ఎస్‌యూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. ఇందులో

కామ్రేడ్ సాయిని ప్రభాకర్‌తో పాటుగా కామ్రేడ్ సత్యనారాయణ క్రియాశీలంగా పాల్గొన్నారు. నాయకత్వం వహించారు. ఐటీఐలో ఆర్ఎస్‌యూ యూనిట్‌ను కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావు గైడ్ చేసేవారు.

ఆర్ఎస్‌యూ కార్యకలాపాలలో భాగంగా కామ్రేడ్ సత్యనారాయణ శాస్తుర్లపల్లి గ్రామంలో జరిగిన రాజకీయ తరగతులకు హాజరై ఆ తరువాత 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో భాగమయ్యారు. అలాగే జననాట్యమండలి ప్రదర్శనలలో పాలు పంచుకున్నారు. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్లా ప్రాంతాలలో వివిధ విప్లవ ప్రచార కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొన్నారు. వీధి భాగోతంలో భూస్వామి పాత్రను, పాలేరు మల్లిగాని పాత్రనూ ప్రభావవంతంగా ప్రదర్శించేవారు. పాటలు బాగా పాడేవారు.

జగిత్యాలలో కా.పోశెట్టిని భూస్వామి సుధాకర్ హత్య చేయించాడు. సిరిసిల్లాలో కామ్రేడ్ లక్ష్మిరాజంను భూస్వామి మనోహర్ రావు హత్య చేయించాడు. ఈ హత్యలకు వ్యతిరేకంగా పార్టీ ప్రజలలో ప్రచారం చేసింది. ఈ అమరత్వాల స్ఫూర్తితో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఊపందుకున్నాయి. కామ్రేడ్ సత్యనారాయణతో సహా అనేక మంది ఆర్ఎస్‌యూ సభ్యులుగా ఉన్న ఐటీఐ విద్యార్థులు ఈ పోరాటాలలో భాగమయ్యారు. రైతాంగ సమస్యలపై పోరాటాలు నడిచాయి. కూలి రేట్ల పెంపుదల, పాలేర్ల జీతాల పెంపు, పరంపోగు బంచరాయి భూముల పోరాటాలతో కరీంనగర్–జగిత్యాల ప్రాంతాలు ఎరుపెక్కాయి. ఎర్రజెండా నీడలో రాజకీయంగా చైతన్యవంతమయ్యాయి. ఐటీఐ పూర్తి చేసిన కామ్రేడ్ సత్యనారాయణకు తక్కెళ్లపల్లి సిమెంటు కంపెనీలో అప్రెంటిస్‌షిప్ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూ పోరాట కార్యక్రమాలలో పాలు పంచుకుంటూ వచ్చారు. కానీ ఉద్యోగం పర్మనెంట్ కాక ముందే ఈ పోరాటాల క్రమంలో పూర్తి కాలం కార్యకర్తగా రూపొందారు.

1977లో ప్రజలకు అంకితమయిన కామ్రేడ్ సత్యనారాయణ ఆనాటి నుంచి విప్లవోద్యమ అనేక ఎగుడు దిగుడులలో, మలుపులు మెలికలలో మడమ తిప్పకుండా ప్రజలను అంటిపెట్టుకుని ఉన్నారు. పూర్తి కాలం కార్యకర్తగా ప్రారంభ కాలంలో ఇదే ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు నాయకత్వం వహించారు. కుక్కలగూడూరు, జయ్యారం, బ్రాహ్మణ్ణపల్లి, అప్పన్నపేట, పాల్తేం, రాగనేడు, పాలకుర్తి, దొంగతుర్తి గ్రామాల్లో పోరాటాలు బలపడ్డాయి. గ్రామ గ్రామాన రైతు కూలి సంఘాలు నిర్మాణమయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన బూటకపు భూసంస్కరణల ద్వారా భూములు సంపాదించుకున్న భూస్వాముల నుంచి సంఘం నేతృత్వంలో ప్రజలు తిరిగి భూములు గుంజుకున్నారు. భూస్వాముల భూముల్లో ఎర్రజండాలు పాతారు. దీంతో భూస్వాములు దిగి వచ్చారు. ఈ పోరాటాల ప్రభావంతో ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలలో కూడా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రారంభమయ్యాయి. భూములు ఇవ్వ నిరాకరించిన భూస్వాములను సామాజిక బహిష్కరణ చేసారు. దోపిడీ భూస్వాములపై పీడిత రైతాంగ ప్రజలు ఆధిక్యత సాధించారు.

వేలాది ఎకరాల భూములు రైతు కూలి సంఘాల వశమయ్యాయి.

పోరాటాల ఉధృతితో జగిత్యాల, మెట్టుపల్లి, సిరిసిల్లా ప్రాంతాలను నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కల్లోల ప్రాంతాలుగా ప్రకటించింది. రైతు కూలీలపై, రైతు కూలీ సంఘంపై పెద్ద ఎత్తున నిర్బంధం విరుచుకుపడింది. వేలాది మంది ప్రజలను, కార్యకర్తలను అరెస్టు చేసి జైళ్లల్లో పెట్టారు. అది 1978. ఈ పరిస్థితిలో విప్లవోద్యమాన్ని రక్షించుకోవడం కోసం గ్రామీణ ప్రాంతాలలో పార్టీ నిర్మాణాలు ఏర్పాటు చేయసాగింది.

గెరిల్లా జోన్ నిర్మాణానికై దళంతో ప్రయాణం

పార్టీ గెరిల్లా జోన్ పర్స్‌పెక్టివ్ తో గెరిల్లా జోన్ లు నిర్మించే కర్తవ్యం చేపట్టింది. పార్టీ శ్రేణులకు రాజకీయ తరగతులు నిర్వహించి ఈ దస్తావేజుపై అవగాహన కల్పించింది. అటవీ ప్రాంతంలో విప్లవ కృషి చేపట్టేందుకు సంసిద్ధులైన మొత్తం 7గురు కార్యకర్తలతో కలిసి కామ్రేడ్ కడారి సత్యనారాయణ మహదేవ్ పూర్ ప్రాంతంలో గోదావరి, ఇంద్రావతి నదులు కలిసే చోట నాటి మధ్యప్రదేశ్ రేగుగూడెం గ్రామం వద్ద దండకారణ్యంలోకి అడుగు పెట్టారు. మరో పక్క నుంచి మరో దళం ఇదే ప్రాంతంలో ప్రవేశించింది. దళాల కదలికలు అర్థమయిన కేంద్ర, రాష్ట్ర బలగాలు భద్రకాళి, మద్దులగూడెం, తాళ్ళగూడెం, దేపల భూపాలపట్నం ప్రాంతాలలో డేగ కన్ను వేసాయి. రాష్ట్ర కమిటీ అందించిన కార్యక్రమాన్ని అమలు చేసే క్రమంలో ముగ్గురు కామ్రేడ్స్ అరెస్టయ్యారు. దాంతో ఈ దళం కరీంనగర్ జిల్లా కమిటీని కలిసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో కా. గోపన్నగా పేరు మార్చుకున్న కా. కడారి సత్యనారాయణ, మరో దళ సభ్యుడు జగన్నాథం పోలీసు క్యాంపు ఏర్పాటయిన విషయం తెలియక మద్దులగూడెం రైతాంగాన్ని కలిసేందుకు వెళ్లారు. పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా తప్పించుకున్నారు.

పార్టీ కమిటీతో చర్చించి దళం తిరిగి గోదావరిఖని ప్రాంతం నుంచి బయలుదేరి చెన్నూరు అటవీ ప్రాంతం నుంచి సిరొంచ అడవిలోకి ప్రవేశించింది. ఈ ప్రాంతంలో సర్వే ప్రారంభించి 50 చదరపు కిలోమీటర్ల మేరకు పూర్తి చేసింది. గ్రామాలలో ప్రజలను కలుస్తున్న క్రమంలో పాలక వర్గాలు పోలీసు క్యాంపులు వేయసాగాయి. ఈ విషయం అర్థం కాకపోవడంతో, మన కార్యకర్తలు గ్రామంలోకి వెళ్లారు. వాళ్లను చూసిన పోలీసు హెడ్ కానిస్టేబుల్ వారిని పట్టుకుని పోలీసు స్టేషనుకు తీసుకుపోతున్నారు. అప్పుడు వానికి డబ్బులు ఇచ్చి బయటపడి దళాన్ని చేరుకున్నారు. ఆ తరువాత కాలంలో హమ్‌రాజిలో కూడా ఇదే విధంగా పట్టుకునే ప్రయత్నం చేయగా పిస్టల్‌తో బెదిరించి బయటపడ్డారు. ఈ రకంగా విప్లవ కార్యాచరణ ప్రారంభించిన కామ్రేడ్ గోపన్న మొదట మహదేవ్ పూర్–ఏటూరు నాగారం దళంలో పని చేసారు.

కొద్ది కాలానికి సరిహద్దున ఉన్న మహారాష్ట్ర గఢ్‌చిరోలి జిల్లా సిరొంచ ఏరియాలో దళంలోకి బదిలీ అయ్యారు. ఈ ప్రాంతంలో ప్రజల సంస్కృతిని, స్థితిగతులను

తెలుసుకున్నారు. ప్రజల భాష నేర్చుకున్నారు. ప్రారంభం నుంచి కూడా కా.గోపన్నకు ప్రజల సాంస్కృతిక జీవితంపై ఆసక్తి ఉండేది. మార్క్సిస్టు అవగాహనతో వారి సమాజాన్ని, ప్రజల మధ్య సంబంధాలను అధ్యయనం చేస్తూ వచ్చారు. ఈ ప్రాంతంలో ప్రజా సంఘాలు, పార్టీ కమిటీల నిర్మాణంలో పాలు పంచుకున్నారు. అటవీ శాఖ నుంచి తీవ్రమైన అన్యాయాలను, అత్యాచారాలను ఎదుర్కొంటున్న ప్రజలు త్వరిత కాలంలోనే పార్టీ రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. దళం ప్రజలలో వేళ్లూనుకుంది. సమీప ప్రాంతాలకు విస్తరించే పరిస్థితి ఏర్పడింది. ఈ విస్తరణలో భాగంగా కామ్రేడ్ గోపన్న కార్యకలాపాలను పరిశీలించిన పార్టీ 1982 మార్చి-ఏప్రిల్ నెలలలో ఆయనను అహిరి ప్రాంతంలో ప్రారంభించిన నూతన దళానికి కమాండర్ బాధ్యతలలో పంపించింది. అప్పటికి సిరొంచ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాల గురించి తెలుసుకుని ఉన్న అహిరి ప్రాంత ప్రజలు పార్టీ మార్గదర్శకత్వంలో సంఘాలు పెట్టుకున్నారు. జిమ్మలగట్ట, రేపన్ పల్లి, కమలాపురం, బాందే రేంజి కమిటీలు ఏర్పడ్డాయి. 1984 జనవరిలో డివిజన్ రైతు కూలి సంఘం ఏర్పాటయింది. పార్టీ ప్రజలకు ప్రధాన ఆదాయమైన తునికాకు కూలీ రేట్ల సమస్య చేపట్టింది. ప్రజలను సంసిద్ధులను చేసి వారి సమ్మెకు నాయకత్వం వహించింది. ఆ సంవత్సరం కూలీ రేటు కట్టకు 10 పైసలు పెంచుకున్నారు ప్రజలు. దీంతో పాటుగా అటవీ కార్పొరేషన్ దోపిడీకి వ్యతిరేకంగా కా. గోపన్న నాయకత్వంలో దళం ప్రచారం చేపట్టింది. ఈ దోపిడీ పేద ప్రజలను పీల్చి పిప్పి చేసి దేశంలో పది శాతంగా మాత్రమే ఉన్న దోపిడీ వర్గాలకు ఉపయోగపడుతుందని వివరించింది. భూమిపై, అడవిపై హక్కు సాధించాలంటే ప్రజలకు రాజ్యాధికారం తప్పనిసరి అని బోధించింది. అందుకోసం నూతన ప్రజాస్వామిక విప్లవం చేయాలని చెప్పింది.

ప్రజా పోరాటాల నాయకుడు

ప్రజలలో పోరాట జ్వాల రగిలింది. పెద్ద ఎత్తున పోరాటాలలో కదలసాగారు. బలార్షా పేపర్ మిల్లు ఈ ప్రాంతం నుంచి వెదురు తీసుకువెళ్లేది. ఈ 'వెదురు కటాయి' (నరకడం) కూలి రేట్ల పెంపుదల కోసం 1983లో సమ్మె జరిగింది. ఈ సమ్మె ఫలితంగా ఆనాడు 3 బండిల్స్‌కు 1 రూపాయికి కూలీ రేటు పెంచుకున్నారు. అటవీ శాఖ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టి అడవి నరికి భూములు స్వాధీనం చేసుకున్నారు. కొత్తూరు గ్రామ భూస్వామి నదిలో ఒంద్రు మట్టి భూములను కబ్జా చేసుకోవడానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేసారు. ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఈ పోరాటాల పునాదిగా ప్రజలలో రాజకీయాలు బలపడ్డాయి. సంవత్సర కాలంలో అనేక గ్రామాల్లో ప్రజా సంఘాల నిర్మాణం జరిగింది. షేత్ కారీ షేత్ మజ్ దూర్ సంగఠన్ (రైతు కూలీ సంఘం) నిర్మించారు. కొంత కాలానికి క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగఠన్ (కేఏఎంఎస్) ఏర్పాటు ప్రారంభమయింది. తరతరాలుగా పితృస్వామ్యంతో నలిగిపోతున్న మహిళలు కేఏఎంఎస్‌లో సంఘటితం కాసాగారు. ప్రజల పోరాట సంసిద్ధతపై ఆధారపడి పార్టీ ప్రజా సంఘాల

రేంజి కమిటీలను ఏర్పాటు చేసింది. మహాసభలు జరిపింది. ఈ కార్యక్రమాలలో భాగమయిన కా. గోపన్న రాజకీయంగా, నిర్మాణపరంగా అనుభవం సంపాదించారు. ఈ అనుభవాల ద్వారా పెంపొందిన చైతన్యం ఆయన సుదీర్ఘ రాజకీయ కార్యాచరణకు తోడ్పడింది.

అహిరి ప్రాంతంలో విస్తృతమయిన ప్రజా నిర్మాణాలు, పోరాటాలతో పార్టీ 1983లో ఏటపల్లి, భామ్రాగఢ్ ప్రాంతాలకు విస్తరించింది. ఈ పోరాటాల ప్రభావంతో భామ్రాగఢ్ ప్రాంత ప్రజలలో కూడా కదలిక ప్రారంభమయింది. ఎక్కడికక్కడ పార్టీ మార్గదర్శకత్వంలో సంఘాల నాయకత్వంలో భూస్వాములు, అటవీ శాఖ కబ్జా చేసుకున్న తమ భూములను ప్రజలు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. విస్తరించిన ఉద్యమ ప్రాంతాన్ని సంఘటితం చేసేందుకు పార్టీ ఈ సంఘాన్ని డివిజన్ స్థాయిలో నిర్మించాలని నిర్ణయించింది. డివిజనల్ సమన్వయ కమిటీ పిలుపుతో కమాలాపూర్‌లో ప్రథమ మహాసభ జరప తలపెట్టింది. ఈ నిర్ణయం మేరకు ఈ ప్రాంతమంతటా దళాలు, సంఘాలు విస్తృత ప్రచార క్యాంపెయిన్ చేపట్టాయి. అప్పటికే ఈ పోరాటాలతో విదర్భ ప్రాంతంలో మేధావి వర్గాలు, ప్రగతిశీల శక్తులు ప్రభావితం అయి ఉన్నాయి. ఇదంతా చూసి ప్రభుత్వం ఉలిక్కి పడింది. గ్రామాల నుంచి, సమీప పట్టణాల నుంచి వస్తున్న ఆహ్వాన్ నాట్య మంచ్ కార్యకర్తలను, జననాట్యమండలి కార్యకర్తలను, గద్దర్ మొదలైన వారిని అరెస్టు చేసింది. మహాసభకు వందలాదిగా తరలి వచ్చిన రైతాంగంపై, మహిళలపై లాఠీ ఛార్జి చేసింది. ఈ నిర్బంధ చర్యలు గఢ్‌చిరోలి జిల్లా రైతాంగ పోరాటాలకు విస్తృత ప్రచారమే కల్పించాయి. 'కమలాపూర్ అధివేశన్' గా దండకారణ్యం ప్రాంత విప్లవోద్యమ చరిత్రలో లిఖితమైన ఈ మహాసభ తరువాత పోరాటాలు ఊపందుకున్నాయి. దీన్ని వెన్నంటి నిర్బంధం తీవ్రతరమయింది.

గతితార్కిక భౌతికవాద నియమాన్ని అనుసరించి నిర్బంధం ప్రతిఘటనకు దారి తీసింది. పార్టీ నిర్ణయం మేరకు కా. గోపన్న ప్రజా సంఘాలలో చురుకుగా పని చేస్తున్న కార్యకర్తలతో పార్టీని సంఘటితం చేయసాగారు. పార్టీలోకి భర్తీ కావలసిన అవసరాన్ని రాజకీయంగా వివరించారు. ఈ రాజకీయ కృషితో 1983 జనవరి, జూన్, జూలై నెలలలో ఆదివాసీ రైతాంగ యువతీ యువకులు సంఘాల నుంచి పార్టీలోకి భర్తీ కాసాగారు. అప్పుడే అహిరి ప్రాంతం నుంచి మొట్టమొదటి మహిళా కార్యకర్తలుగా కామ్రేడ్ సడిమేక్ రుక్ని (రాధక్క), మరొకరు భర్తీ అయ్యారు. ఆమె కొంత కాలం తరువాత ఇంటికి వెళ్లిపోగా కా. రాధక్క ఆఖరు శ్వాస వరకు ఉద్యమంలో కొనసాగింది. కా. గోపన్న, కా. రాధక్క దళంలో పని చేస్తూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని తమ ప్రతిపాదనను డివిజనల్ కమిటీకి తెలిపారు. కమిటీ ఆమోదించడంతో 1984 మార్చిలో వారి వివాహం జరిగింది. పార్టీలో అన్యోన్య జంటగా వీరిని గుర్తు పెట్టుకుంటారు. కా.రాధక్క 2025 మార్చి 19వ తేదీన అనారోగ్యంతో అమరురాలయింది.

సైనిక చర్యలలో ముందుండి

దండకారణ్యం ఉద్యమం అభివృద్ధి చెందుతూ ముసుముందుకు వెళ్లడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రూర నిర్బంధకాండను కొనసాగించాయి. పార్టీపై దాడులు తీవ్రతరం చేసాయి. తెలంగాణా గ్రేహౌండ్స్ బలగాల తరహాలో 1992లో మహారాష్ట్ర ప్రభుత్వం సీ-60 కమాండో బలగాన్ని ఏర్పాటు చేసింది. 1993 మే-జూన్ నెలలలో దాదాపు 60 మంది కామ్రేడ్స్ బూటకపు ఎదురుకాల్పులలో అమరులయ్యారు. ఈ దమనకాండకు ప్రతిఘటనగా ఈ ప్రాంతంలో సైనిక చర్యలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా భామ్రాగఢ్-తాడిగామ మధ్య కుమ్మరిగూడ వద్ద ఆంబుష్ చేసింది దళం. దోపిడీ ప్రభుత్వాల సాయుధ బలగాలకు గట్టి దెబ్బ తగిలింది. ఈ ఆంబుష్ లో 15 మంది పోలీసులు చావగా 17కు పైగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులకు కామ్రేడ్ గోపన్న నాయకత్వం వహించారు. సైనిక చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కా. గోపన్న రోజువారీ దళం కార్యక్రమంలో భాగంగా కసరత్తు చేసేవారు, చేయించేవారు. అలాగే సైనిక శిక్షణా శిబిరాలలో పాలు పంచుకునేవారు. 1987లో జరిగిన ఒక శిబిరంలో ఫైరింగ్‌లో మొదటి స్థానం పొందారు. గఢ్‌చిరోలి డివిజన్‌లో రాజకీయంగా, నిర్మాణపరంగా ప్రజలలో చైతన్యం పెంపొందించడంతో పాటుగా శత్రువుపై దాడుల్లో దృఢంగా నిలిచి ప్రజల, కేడర్‌ల విశ్వాసం చూరగొన్నారు. శత్రు నిర్బంధ చర్యలకు దీటుగా ఎత్తుగడలను రూపొందించడంలో ప్రభావవంతమైన నేతృత్వం అందించారు.

మూడు అద్భుత ఆయుధాల అభివృద్ధిలో అంచెలంచెలుగా ఎదిగిన కా. గోపన్న

తెలంగాణా భూస్వామ్య వ్యతిరేక పోరాటాల కొలిమిలో నుంచి ఎగసిన కా. గోపన్న దండకారణ్యం గోండు ఆదివాసులలో కొనసాగుతూ వర్గ పోరాటంలో రాటుదేలారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. 1983లో కర్రెగుట్టల్లో జరిగిన గెరిల్లా జోన్ రాజకీయ తరగతులలో పాల్గొన్నారు. 1985లో జరిగిన గఢ్‌చిరోలి డివిజన్ ప్రథమ మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నారు. 1986 చివరి ప్రాంతంలో డివిజనల్ కమిటీ సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. 1995లో ఏర్పడిన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ 2వ మహాసభలో ఈ కమిటీలోకి ఎన్నికయ్యారు.

1997-98 ప్రాంతంలో కోసాగా పేరు మార్చుకున్న కా. గోపన్న పార్టీ నిర్ణయం మేరకు మాడ్ డివిజన్ కు మారారు. తన సహజ ఆసక్తితో వారి సంస్కృతిని, భాషను, సామాజిక పరిస్థితులను పరిశీలించారు. మాడియా గోండు ప్రజలలో ఎంతగా మమేకమయ్యారంటే, కోసా దాదా తమ వాడిగా వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. మాడ్ ప్రాంత గ్రామాలలో ఆయనను తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఆయనకు ఉన్న అపార సామాజిక, రాజకీయ అనుభవంతో ప్రజలకు, పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు వివిధ సమస్యలపై సలహాలు, సూచనలు ఇచ్చేవారు. వారి

విశ్వాసం చూరగొన్నారు. వీటితో పాటుగా ఉద్యమ అవసరాల రీత్యా వైద్య శిక్షణ పొందిన కా. గోపన్న ఈ జ్ఞానాన్ని స్వీయ కృషితో మరింతగా పెంపొందించుకుని వైద్యంలో నైపుణ్యం సంపాదించారు. డాక్టర్‌గా కా. కోసా దాదా పట్ల కేడర్ లలో విశ్వాసం ఉండేది.

2001లో మాడ్ ప్రాంతంలో జరిగిన భాకపా (మా-లె) (పీపుల్స్‌వార్) కాంగ్రెస్ నిర్వహణ బాధ్యతలను 2025 సెప్టెంబర్ లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్ జిల్లాలో చుట్టుముట్టి-దాడిలో అమరుడయిన కా. పాండన్న (చంద్రహాస)తో కలిసి సమర్థవంతంగా నిర్వర్తించారు. ఈ కాంగ్రెస్ లో డీకే ఎస్‌జడ్‌సీ నుంచి ప్రతినిధిగా పాల్గొని రాజకీయ చర్చలలోను, దస్తావేజులపై చర్చలలోను ముఖ్య భూమిక వహించారు. ఈ కాంగ్రెస్ లో కా. కోసా దాదా కేంద్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2002లో ఎస్‌జడ్‌సీ కార్యదర్శి కేంద్ర కమిటీ బాధ్యతలలో భాగంగా బదిలీ కావడంతో కా. కోసా దాదా ఈ బాధ్యతలు చేపట్టారు. 2011 దండకారణ్యం స్పెషల్ జోనల్ ప్లీనంలో అమరుడు కా. రామన్నకు అందించే వరకు ఈ బాధ్యతలలో కొనసాగారు.

దండకారణ్య ఉద్యమ నేతృత్వంలో

దాదాపు దశాబ్దం పాటు కామ్రేడ్ కోసా దాదా కార్యదర్శిగా దండకారణ్య ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ కాలంలో తన కమిటీ సభ్యులతో కలిసి దండకారణ్యం ఉద్యమ పురోగమనానికి విశేష కృషి సలిపారు. ఈ దశాబ్ద కాలంలో విప్లవోద్యమం నిర్బంధ క్యాంపెయిన్‌లను ఎదుర్కొంటూ పురోగమించింది.

2001లో జరిగిన కాంగ్రెస్ నిర్ణయం మేరకు విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పీసీ-క్రాంతికారీ జనతన సర్కార్)ల ఏర్పాటు ప్రారంభమయింది. 2004 నుంచి ఏరియా స్థాయి కమిటీలు ఏర్పడసాగాయి. దక్షిణ బస్తర్ మొదలుకుని, పశ్చిమ బస్తర్, మాడ్, ఉత్తర బస్తర్, గఢ్‌చిరోలి డివిజన్‌లలో ఆర్‌పీసీల నిర్మాణానికై ఎస్‌జడ్‌సీ సభ్యులతో కలిసి కా. కోసా దాదా అలుపెరుగని కృషి చేసారు. ఈ కమిటీల ద్వారా ప్రజలలో ఆర్థిక, రక్షణ, వ్యవసాయ, అటవీ రక్షణ, న్యాయ, సాంస్కృతిక-విద్య-ప్రచార మొదలయిన శాఖల ద్వారా ఆయా కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన విధంగా వాటిని అభివృద్ధి చేసారు. కమిటీల నిర్మాణం, శాఖల పని విధానంపై వివిధ డివిజన్ లలో విస్తృతంగా పర్యటించి ఎస్‌జడ్‌సీ సభ్యులకు, డీవీసీ సభ్యులకు, ఆర్‌పీసీ సభ్యులకు మార్గదర్శకత్వం అందించారు. ప్రజల స్వయం పాలనలో సాగుతున్న ఈ అభివృద్ధిని సహించలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2005 మధ్య కాలంలో సల్వా జుడుం పేరుతో నిర్బంధ క్యాంపెయిన్‌ను చేపట్టాయి. ఆర్‌పీసీలు నిర్వహిస్తున్న పాఠశాలలపై, వైద్య శిబిరాలపై దాడులు చేసాయి.

పశ్చిమ బస్తర్ కుట్రు ప్రాంతం కేంద్రంగా ప్రారంభమైన సల్వా జుడుం ప్రధానంగా పశ్చిమ బస్తర్, దక్షిణ బస్తర్ ప్రాంతాలలో నడిచింది. గ్రామంలో ప్రజా వ్యతిరేక శక్తులను కూడగట్టి పాలక వర్గాల బంటైన ఆదివాసీ మాంఝి కుటుంబానికి చెందిన కాంగ్రెస్ నాయకుడే

అయినప్పటికీ భాజపాకు సహకరిస్తూ వచ్చిన మహేంద్ర కర్మ ద్వారా భారత రాజ్యం ఈ క్యాంపెయిన్‌ను నడిపింది. పార్లమెంటరీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా అవతరించిన 'జనతన సర్కార్ల'ను అంతమొందించడమనేది సల్వాజుడుం ప్రధాన లక్ష్యం. 1990వ దశకం నాటి జన జాగరణ్ అభియాన్‌కు కొనసాగింపుగా సల్వా జుడుం కోయ-గోండు ఆదివాసుల తరతరాల జీవనాన్ని, సంస్కృతిని మట్టి గలిపేందుకు ప్రయత్నించింది. కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. అంతేకాకుండా ఈ ప్రజా వ్యతిరేక శక్తులతో ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్‌పీఓ) అనే పదవిని సృష్టించి, వారి ద్వారా ప్రజలపై నానా రకాల భీభత్సం చేసింది. ఉద్యమంలో బలమైన పాత్ర వహించిన గ్రామాలను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రజలను హత్య చేసారు, అరెస్టు చేసారు, మహిళలను అత్యాచారం చేసారు. ప్రజల ఇళ్లను, ధాన్యాన్ని, పశువులను కాలబెట్టారు.

ఈ నిర్బంధ క్యాంపెయిన్‌ను ఎదుర్కొనేందుకు కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో దండకారణ్యం ఎస్‌జడ్‌సీ ప్రత్యేక ఎత్తుగడలు చేపట్టింది. పార్టీ కమిటీలు ప్రజలను అంటిపెట్టుకుని ఉన్నాయి. ప్రజా సంఘాలు ప్రజల సమస్యలను నిత్యం తెలుసుకుంటూ వారికి తగిన సహాయ సహకారాలు అందించాయి. ఆర్‌పీసీలు గ్రామం నుంచి భయంతో పారిపోయిన వారి ఆస్తులను కాపాడి, వారు తిరిగి వచ్చేందుకు మార్గం వేసాయి. పీఎల్‌జీఏ బలగాలను కేంద్రీకృతం చేసి పార్టీ ప్రభుత్వ సాయుధ బలగాలపై, ఎస్‌పీఓల క్యాంపులపై పెద్ద దాడులకు మార్గదర్శకత్వం అందించింది. గ్రామ గ్రామానా మిలిషియా బలోపేతం అయింది. సెంట్రీ, పెట్రోలింగ్‌లు ప్రజలకు సాధారణ అంశంగా మారాయి. దీంతో పాటుగా దేశంలోనూ, ఇతర దేశాలలోనూ కమిటీ సల్వా జుడుం గురించి ప్రత్యేక ప్రచారం చేసింది. సాగుతున్న అత్యాచారాల గురించి వీడియో తయారు చేసి పంపింది. ప్రజలలో ఒక సెక్షన్‌ను మెజారిటీ ప్రజలకు వ్యతిరేకంగా నిలబెట్టిన ఈ క్యాంపెయిన్ పట్ల దేశ, విదేశాలలో తీవ్ర నిరసన వ్యక్తమయింది. ఇది అంతర్జాతీయ నియమాలకు విరుద్ధమని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కృషిలో కమిటీ కార్యదర్శిగా కా. కోసా దాదా కీలక పాత్ర పోషించారు. పార్టీ మార్గదర్శకత్వంలో పీఎల్‌జీఏ చిన్న, మధ్య తరహా, పెద్ద సైనిక చర్యలతో, ప్రజల మద్దతుతో 2009 ప్రారంభానికి సల్వాజుడుం ఓడిపోయింది. సంవత్సరం తరువాత ప్రజలు తిరిగి బలహీనపడిన ఆర్‌పీసీలను, ప్రజా సంఘాలను పునస్సంఘటితం చేసుకున్నారు. ప్రజా జీవనం యథాతథ స్థితికి చేరుకుంది. పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలు బలోపేతం కాసాగాయి.

ఆర్‌పీసీలను అభివృద్ధి చేయడంలో

ఆర్‌పీసీల పని విధానాన్ని మరింత బలోపేతం చేసేందుకు 2008లో ఎస్‌జడ్‌సీ జోన్ వ్యాప్తంగా వర్క్ షాప్ నిర్వహించింది. ఈ వర్క్ షాప్‌కు పార్టీ ఆనాటి ప్రధాన కార్యదర్శి, కొందరు కేంద్ర కమిటీ సభ్యులు హాజరయ్యారు. కా. కోసా దాదా తన కమిటీల సభ్యులతో

కలిసి వివిధ స్థాయి ఆర్‌పీసీల మధ్య, ఆర్‌పీసీలకు, ప్రజా సంఘాలకు మధ్య సంబంధాలకు, సమన్వయానికి సంబంధించిన మార్గదర్శక నియమాలను రూపొందించారు. ఎస్‌జడ్‌సీ కార్యదర్శిగా జోన్ జనతన సర్కార్ సమన్వయ కమిటీకి నాయకత్వం వహించి, జోన్ వ్యాప్తంగా విప్లవ ప్రజా కమిటీల అభివృద్ధి కోసం కృషి చేసారు. ఈ కమిటీల ద్వారా ప్రజల జీవన స్థితిగతులను పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలను రూపొందించారు.

సుదీర్ఘ కాలం దండకారణ్యం ఉద్యమానికి నాయకత్వం వహించిన కా. కోసా దాదా ప్రజలను సంఘటితం చేయడంలోను, ప్రజా పునాదిని పెంపొందించు కోవడంలోనూ జరుగుతున్న లోపాలను వివరించి స్థానిక నిర్మాణాల నాయకత్వంలో మార్పులు తీసుకురావాలని తన కమిటీలో చర్చించి అమలు చేయించారు. నూతన నాయకత్వాన్ని, ద్వితీయ స్థాయి నాయకత్వాన్ని తయారు చేసుకోవడంపై శ్రద్ధ వహించారు. ప్రజల విశ్వాసం చూరగొన్న, రాజకీయంగా దృఢంగా ఉన్న వారిని నాయకత్వంలోకి ఎదిగించుకునే విధంగా కమిటీలకు మార్గదర్శకత్వం అందించారు. ముఖ్యంగా క్రాంతికారీ జనతన సర్కార్ కమిటీలలో పెత్తందార్లను గుర్తించి తొలగించడం వర్గ పోరాట పురోగమనానికి ఎంత ముఖ్యమైనదో డివిజనల్ కమిటీలకు, ఏరియా కమిటీలకు అర్థం చేయించారు. కార్యదర్శిగా విస్తృతంగా పర్యటిస్తూ డివిజన్‌ల పునస్సంఘటితీకరణకు కృషి చేసారు. ఉత్తర బస్తర్, మాడ్, తూర్పు బస్తర్, రాజ్ నందగాం–కాంకేర్ బోర్డర్ డివిజన్‌లకు మార్గదర్శకత్వం అందించారు. ఆయా డివిజన్‌ల ప్రత్యేకతలను అధ్యయనం చేస్తూ అందుకు అనుగుణంగా ఎత్తుగడలను అందించారు. గ్రామాలపై అంచనా వేసుకుని, రానున్న మార్పులను గుర్తించి సంబంధిత కమిటీలకు, కేడర్‌లకు వివరించేవారు.

ఉద్యమ విస్తరణలో

విప్లవోద్యమంలో విస్తరణకు ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకున్న పార్టీ అందుకు ప్రత్యేక నిర్ణయాలు చేసింది. దండకారణ్యం చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించడంలో భాగంగా అప్పటికే విప్లవ కృషి సాగుతున్న మైన్‌పూర్ ప్రాంతం నుంచి సర్వేకు పంపించింది. 2010లో ఛత్తీస్‌గఢ్‌కు సరిహద్దున ఒడిశా రాష్ట్రంలోకి ప్రవేశించింది. ఈ విస్తరణ కృషిలో, ఇందు కోసం కేడర్‌లను సంసిద్ధులను చేయడంలో ఎస్‌జడ్‌సీ సభ్యులతో కలిసి కా. కోసా దాదా మార్గదర్శకత్వం వహించారు.

2009 సెప్టెంబర్‌లో భారత రాజ్యం దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. ఈ నిర్బంధ క్యాంపెయిన్‌కు అమెరికా సామ్రాజ్యవాద ఎల్ఐసీ వ్యూహం ఆధారం. గ్రామంలో అధికార వ్యవస్థ ప్రతినిధులను తమ పక్షం తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూ ప్రజలపై అణచివేత చర్యలు చేపట్టింది. సాయుధ బలగాల సంఖ్యను పెద్ద ఎత్తున పెంచింది. గ్రామంలో ఇన్‌ఫార్మర్‌లను తయారు చేసుకుని దళాల కదలికలను తెలుసుకుంటూ దాడులు చేసేందుకు ప్రయత్నించింది. పార్టీపై విప్లవోద్యమంపై

దుష్ప్రచారం చేపట్టింది. ఈ బహుముఖ దాడిలో పార్టీ, సైన్యం, ఐక్య సంఘటన నిర్మాణాలు గణనీయంగా ప్రభావితం అయ్యాయి. ఉద్యమ స్థితిలో క్రమంగా మార్పు రాసాగింది. ఈ పరిస్థితిని అంచనా వేసేందుకు ఎస్‌జడ్‌సీ 2011 సెప్టెంబర్‌లో ప్లీనం నిర్వహించింది. ఈ ప్లీనం దండకారణ్యం ఉద్యమం గడ్డు స్థితికి చేరుకుందని సమీక్షించింది. ఈ ప్లీనంలో కా. కోసా దాదా తన సుదీర్ఘ కార్యాచరణ నుంచి ఉద్యమ పరిస్థితికి అనుగుణంగా ఎత్తుగడలు రూపొందించేందుకు లోతుగా చర్చించారు. కమిటీ తగిన నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేసారు. ఈ ప్లీనంలో అమరుడు కా. రామన్న కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత నుంచి కా. కోసా దాదా కేంద్ర కమిటీ సభ్యునిగా దండకారణ్యం ఉద్యమానికి మార్గదర్శకత్వం అందిస్తూ వచ్చారు.

2013లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం దండకారణ్య ఉద్యమం కఠిన స్థితిలో, బీహార్–ఝార్ఖండ్ ఉద్యమం తాత్కాలిక వెనకడుగులో ఉన్నాయని అంచనా వేసింది. పార్టీ వ్యాప్తంగా బోల్షివీకరణ క్యాంపెయిన్ నిర్వహించాలని తీర్మానించింది. ఈ మేరకు కేంద్ర కమిటీ, మధ్య రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ) విడుదల చేసిన సర్కులర్‌ల రూపకల్పనలో, వాటిని కేడర్‌లలోకి తీసుకువెళ్లడంలో కా. కోసా దాదా విశేష కృషి జరిపారు. 2014లో జరిగిన సీఆర్‌బీ విస్తృత సమావేశంలో కా. కోసా దాదా పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజకీయ నిర్మాణ సమీక్షతో పాటుగా ఉత్పత్తి సంబంధాలలో వచ్చిన మార్పుల గురించి కూడా చర్చించిన సీఆర్‌బీ దానిపై తరువాత కాలంలో అధ్యయనం చేసి ఒక పుస్తకం విడుదల చేసింది. అలాగే మధ్య ప్రాంతంలో స్పెషల్ జోన్‌లు, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా ఉన్న రాష్ట్రాలలో పరిస్థితులను అంచనా వేసి తగిన ఎత్తుగడలు రూపొందించింది.

2015 ప్లీనం దండకారణ్యంలో విప్లవోద్యమం మరింత గడ్డు స్థితికి చేరుకుందని సమీక్షించింది. 2016 నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పెట్ సెక్యూరిటీ వ్యవస్థను మరింతగా విస్తృతం, సంఘటితం చేయసాగాయి. ఈ బలగాలు ప్రహార్ పేరుతో సైనిక గస్తీని, కూంబింగ్‌లను తీవ్రతరం చేసాయి. ఈ క్రమంలో పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలు నష్టాలు చవి చూడసాగాయి. విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తీవ్రతరమవుతున్న రాజ్య నిర్బంధంలో మాడ్‌ను కేంద్ర గెరిల్లా బేస్‌గా నిలబెట్టుకోవడంలో భాగంగా యూనిఫైడ్ కమాండ్‌ను ఏర్పరచాలని కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో ఎస్‌జడ్‌సీ నిర్ణయించింది. మొదటిసారిగా ఏర్పడిన ఉత్తర బ్యూరో యూనిఫైడ్ కమాండ్‌కు కా. కోసా దాదా నాయకత్వం వహించారు.

కేంద్ర కమిటీ బాధ్యతలలో

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటు తరువాత 2007 జనవరి/ఫిబ్రవరిలో జరిగిన ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్‌లో కా. కోసా దాదా ప్రతినిధిగా హాజరయ్యారు. సెరబ్రల్ మలేరియా రావడంతో కొన్ని రోజులు కాంగ్రెస్‌లో

పాల్గొనలేకపోయినప్పటికీ రాజకీయ చర్చలలో క్రియాశీలంగా పాలు పంచుకున్నారు. కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. కేంద్ర కమిటీ సమావేశాలు మాడ్‌లో జరిగినప్పుడు, నిర్వహణా ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు. కేంద్ర కమిటీ రూపొందించిన అనేక దస్తావేజులలో కేంద్ర కమిటీ సభ్యునిగా కా. కోసా దాదా తన వంతు కర్తవ్యం నెరవేర్చారు.

ఉద్యమంలో ఎగుడు దిగుడులు, మలుపులు మెలికలు, ఆటుపోట్లు ఉంటాయన్న స్పష్టమైన అవగాహనతో ఎప్పటికప్పుడు కేంద్ర, స్పెషల్ జోనల్ కమిటీలు ఎత్తుగడలు రూపొందిస్తూ వచ్చినప్పటికీ శత్రు వర్గాలు అమెరికా సామ్రాజ్యవాద ఎల్ఐసీ వ్యూహాన్ని అమలు చేయడంతో క్రమంగా ప్రతికూలతలు చోటు చేసుకున్నాయి. దేశవ్యాప్త విప్లవోద్యమం తాత్కాలిక వెనకడుగులోకి వెళ్లిందని 2018లో జరిగిన సమావేశంలో కేంద్ర కమిటీ సమీక్షించింది. కాంగ్రెస్ తరువాత 14 సంవత్సరాల కార్యాచరణను సమీక్షించిన కేంద్ర కమిటీ 2020లో రాజకీయ నిర్మాణ నమీక్షను రూపొందించింది. ఉద్యమ పరిస్థితిపై అంచనాతో కేంద్ర, తక్షణ, ప్రధాన కర్తవ్యాలను మార్చుకుంది. 2023 నాటికి ఉద్యమాన్ని కాపాడుకోవడం ప్రధానమని నిర్ణయించింది. ఈ ఆలోచనలతో కా. కోసా దాదా సంతృప్తిపడి ఊరుకోలేదు. ఇంకా కూడా మనం ఆలోచించాలి, చెయ్యాలి అని తపనపడేవారు. ఇందుకోసం కేంద్ర కమిటీ లోతుగా అధ్యయనం చేయాలని అర్థం చేసుకుని తన వంతు కృషి చేసారు. తన రాజకీయ పరిజ్ఞానానికి అనుభవాన్ని జోడించి నిర్దిష్ట ప్రతిపాదనలను, ఎత్తుగడలను చర్చించారు. ఉద్యమాన్ని కాపాడేందుకు తన వంతు కృషి చేసారు.

విప్లవంలో సజీవులై ఉంటారు మన కోసా దాదా

కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు పట్టణ ప్రాంతానికి మార్గదర్శకత్వం అందించేందుకు సుదీర్ఘ కాలంగా ఉన్న గెరిల్లాజోన్‌ను విడిచి పట్టణంలో ఉంటున్న కా. కోసా దాదా ఆచూకీ పసి గట్టిన దోపిడీ ఫాసిస్టు రాజ్యం కా. ఖాతా రామచంద్ర రెడ్డితో కలిపి బూటకపు ఎదురు కాల్పులలో ఆయనను హత్య చేసింది. అమరులయ్యేంత వరకు కా. కోసా దాదా వ్యూహాత్మక కమిటీలలో సభ్యునిగా దేశంలో విప్లవోద్యమ పురోగమనం కోసం కృషి చేసారు.

నలభై సంవత్సరాల పాటు కా. కోసా దాదా దండకారణ్య ఉద్యమంతో మమేకమై తన ప్రాణాలు అర్పించారు. పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనల నిర్మాణంలో ముఖ్య భూమికను పోషించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగారు. 'ప్రజల కోసం విప్లవోద్యమంలో చేరాం, పరిస్థితులు మారినా భయపడవలసిన అవసరం లేదు' అని కా. కోసా దాదా ఎల్లప్పుడూ చెప్పేవారు. ప్రజల మీద విశ్వాసం ఉంచిన కమ్యూనిస్టు విలువ ఇది. నిజానికి ఎన్నెన్నో అనుభవాలు ఉన్న కా. కోసా దాదా వాటిని నిక్షిప్తం చేయవలసింది. తన అనుభవాలతో, ఆచరణలో కా. కోసా దాదా విప్లవంలో సజీవంగా ఉంటారు.

భారతదేశ విప్లవోద్యమ ప్రముఖ నాయకుడు,
కార్మికవర్గ ఉత్తమ పుత్రుడు కామ్రేడ్ వివేక్ కు విప్లవాంజలి!



ఝార్ఖండ్ లోని బొకారో జిల్లా, లల్పనియా పోలీస్ స్టేషన్, ముండాటోలీ-సోసో గ్రామాల సమీపంలో ఏప్రిల్ 21, 2025న జరిగిన చుట్టివేత దాడిని వీరోచితంగా తిప్పికొడుతూ భారత విప్లవోద్యమ ఒక ప్రముఖ నాయకుడు, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ వివేక్ (ప్రయాగ్ మాంఝీ), మరో ఇద్దరు కామ్రేడ్స్ అవినాశ్ (అరవింద్ యాదవ్), షాజహాన్ మాంఝీలతో పాటు 8 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, అంతిమంగా ప్రపంచవ్యాప్తంగా సోషలిజం-కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల విముక్తి కోసం వారు తమ అత్యున్నతమైన ప్రాణాలను ధారపోసారు. భారత విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే లక్ష్యంతో దేశ దోపిడీ పాలక వర్గాలు అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్ నిర్బంధ సైనిక క్యాంపెయిన్ లో విప్లవోద్యమానికి జరిగిన మరో పెద్ద నష్టం ఈ ఘటన.

కామ్రేడ్ వివేక్ ఝార్ఖండ్ లోని గిరిడీహ్ జిల్లా, పారస్ నాథ్ పర్వత ప్రాంతంలో సంథాలీ ఆదివాసీ పేద రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన పేరు ప్రయాగ్ మాంఝీ. ఆయన వయసు 66 సంవత్సరాలు. సంథాల్ ఈ దేశంలో ఒక ప్రాచీన ఆదివాసీ తెగ. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారత దేశాన్ని విడిచిపెట్టి వెళ్లి, దేశ భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఆదివాసీ తెగల కోసమూ ఏమీ చేయలేదు. దేశంలో వివిధ ఇతర ఆదివాసీ తెగల ప్రజల మాదిరిగానే సంథాల్ ఆదివాసీ ప్రజలు నివసించే ప్రాంతాలు కూడా విద్యా, వైద్యం మొదలయిన కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాద అధికారానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వారసత్వం సంథాల్ ఆదివాసీ ప్రజలకు ఉన్నది. ఈ వారసత్వంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ ప్రయాగ్ మాంఝీ చిన్న నాటి నుంచి ప్రజలు పడుతున్న కష్టాలు చూస్తూ వచ్చారు. సమాజంలో అసమానతను అర్థం చేసుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి కాయకష్టం చేస్తూ తోటి బాలలతో ఈ విషయాలు పంచుకునేవారు.

అది కల్లోల 1960వ దశాబ్దం. 1967లో జరిగిన మహత్తర నక్సల్బరీ సాయుధ గిరిజన పోరాటం భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో దశాబ్దాలుగా పాతుకుపోయి ఉన్న రివిజనిజానికి గొడ్డలి పెట్టు పెట్టింది. సాయుధ పోరాటమే భారత విప్లవ విజయానికి ఏకైక మార్గం అని చాటి చెప్పింది. నక్సల్బరీ పోరాటం దేశంలో యావత్తు పీడిత వర్గాలను, సమూహాలను తీవ్రంగా కదిలించింది. నక్సల్బరీ పోరాట రుధిర జ్వాలలు దేశ నలుమూలల్లో విద్యార్థి, యువజనుల హృదయాలను జ్వలింపజేసాయి. మీరు బానిస బతుకులు బతుకుతారా లేదా సంకెళ్లను బద్దలు కొట్టి ప్రపంచాన్ని జయించేందుకు ముందుకు దూకుతారా అని నిలదీసాయి. ఇది యువ ప్రయాగ్ హృదయాన్ని జ్వలింపజేసింది. 13, 14 యేళ్ల వయసులోనే

తన లాంటి ఎంతో మంది యువకిశోరాలతో కలిసి బానిస సంకెళ్లను తెంచుకోవాలని కలలు గంటూ ముందడుగు వేసారు.

అప్పటికి పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కాంక్సా లో రైతాంగ పోరాట వెల్లువ వచ్చి ఉంది. ఈ పోరాట అనుభవంతో ఉమ్మడి బిహార్ రాష్ట్రం గయ-హజారీబాగ్ ప్రాంతంలో విప్లవోద్యమాన్ని నిర్మించేందుకు కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ (కేసీ), కామ్రేడ్ అమూల్య సేన్, కామ్రేడ్ చంద్రశేఖర్ దాస్ ల నాయకత్వంలో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ) పూనుకుంది. నక్సల్బరీ పంథాలో రైతాంగంలో పని చేసేందుకు వారు కామ్రేడ్ ప్రయాగ్ ఉన్న ప్రాంతానికి వచ్చారు. హజారీబాగ్ జిల్లాలోనే నేటి గిరిడీహ్ జిల్లా ఉండేది. అక్కడ క్రూరమైన భూస్వామ్య వ్యవస్థ ఉండేది. ప్రత్యేక ఝార్ఖండ్ ఉద్యమ ప్రభావం ఉండేది. ఆదివాసీ, ఆదివాసీయేతర ప్రజల విశాల పాత్రతో ఒక విప్లవ వెల్లువ లాంటి పరిస్థితి ఏర్పడింది. తెలియని ప్రాంతాన్ని, భాషను తెలుసుకుంటూ ఈ నాయకులు నక్సల్బరీ విప్లవ పంథాలో రైతాంగాన్ని సంఘటితం చేయసాగారు.

ఆ సమయంలో అతి చిన్న వయసులోనే కా. ప్రయాగ్ కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ సంబంధాల్లోకి వచ్చారు. చిన్న నాటి నుంచి సమాజాన్ని గురించి కలిగిన ఆలోచనలకు కా. కేసీ ఒక రూపం కల్పించారు. సంథాల్ ఆదివాసీ రైతాంగం మాత్రమే కాకుండా దేశంలో అనేక ప్రాంతాలలో వ్యవసాయాన్ని నమ్ముకుని బతికే ఆదివాసులు, మైదాన ప్రాంత ప్రజలు జరుగుబాటుకు పడుతున్న కష్టాలను వివరించారు. తిరుగుబాటే ఇందుకు పరిష్కారం అని చెప్పారు. ఈ ప్రాంత రైతాంగంలో కదలిక ప్రారంభమయింది. కా. ప్రయాగ్‌తో పాటుగా గ్రామ గ్రామానా యువకులు వారి నాయకత్వంలో సంఘాలు పెట్టుకోసాగారు. క్రాంతికారీ కిసాన్ కమిటీ (కేకేసీ) ప్రజల సంఘంగా ఏర్పడసాగింది. అనతి కాలంలోనే పితృస్వామ్యంపై రణ నినాదం చేస్తూ నారీ ముక్తి సంఘ్ (ఎన్ఎంఎస్) మహిళా సంఘంగా ఏర్పడసాగింది.

కేకేసీ కార్యక్రమాలలో పాలు పంచుకుంటూ కా. ప్రయాగ్ చదవడం, రాయడం నేర్చుకున్నారు. క్రమంగా నాయకత్వ కామ్రేడ్స్ సహకారంతో మార్క్సిస్టు మౌలిక సిద్ధాంతాన్ని అధ్యయనం చేయనారంభించారు. సిద్ధాంత అధ్యయనం ద్వారా, నిత్య కార్యాచరణ ద్వారా మావోయిస్టు రాజకీయాలతో మమేకమయ్యారు. ఆ రాజకీయాల కోసం తన జీవితాన్ని అర్పించాలని నిర్ణయించుకున్నారు. క్రూరమైన చుట్టివేత-అణచివేత క్యాంపెయిన్ తో పాలక వర్గాలు ఆ వెల్లువను అణచివేయాలని ప్రయత్నించాయి. ఒకటి, రెండు సంవత్సరాల తర్వాత మరో నూతన పథకంతో శత్రు దాడిని ఓడిస్తూ, క్రమేపీ విప్లవోద్యమాన్ని విస్తరించి ఉన్నత స్థాయికి తీసుకుపోయేందుకు పార్టీ కృషి చేసింది. ఉద్యమం గయ ప్రాంతానికి విస్తరించింది.

కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ ప్రత్యక్ష నాయకత్వంలో

ప్రజా సైన్యాన్ని, విముక్తి ప్రాంతాన్ని నిర్మించే లక్ష్యంతో 1976లో కామ్రేడ్ కేసీ ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో, నేతృత్వంలో బిహార్–బెంగాల్ స్పెషల్ ఏరియా కమిటీ ఏర్పడింది. దీని నాయకత్వంలో ఆ ప్రాంతంలో విప్లవోద్యమం విజయవంతంగా పురోగమించింది. అమరులు కామ్రేడ్ కేసీ, కామ్రేడ్ బరుణ్ దాలతో, కామ్రేడ్ కిషన్ దాతో సన్నిహిత సంబంధాలు కలిగిన యువకిశోరం కామ్రేడ్ ప్రయాగ్ మాంఝీ 'వివేక్' పేరుతో ఈ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఉద్యమం పురోగమిస్తున్న సమయంలో కామ్రేడ్ అమూల్య సేన్, కామ్రేడ్ కేసీ కొద్ది నెలల తేడాతోనే అనారోగ్యంతో అమరులయ్యారు. పార్టీ ప్రకాశవంతమైన తారను, మంచి సైద్ధాంతిక నాయకుడిని, సమర్థవంతమైన ఆర్గనైజర్ ను, అనుభవజ్ఞులైన నాయకులు కామ్రేడ్ కేసీని, కమ్యూనిస్టు ఆశయాల పట్ల దృఢత్వంతో పని చేసిన కామ్రేడ్ అమూల్యా సేన్‌ను కోల్పోయిందని, వారి అమరత్వం నుంచి, భారత విప్లవం కోసం, ప్రపంచ విప్లవం కోసం వారు తమ మహత్తర జీవితాలను చేసిన త్యాగం నుంచి పాఠాలను తీసుకుని పోరాటం కొనసాగించాలన్న కేంద్ర కమిటీ పిలుపుతో యావత్తు పార్టీ దృఢ సంకల్పంతో అందుకు ప్రతిజ్ఞ పూనింది. వారితో ప్రత్యక్ష పరిచయం నుంచి ప్రజల రాజ్యాధికార రాజకీయాలను నేర్చుకున్న, వాటి ఆవశ్యకతను అర్థం చేసుకున్న యువ వివేక్ మనసులో అమరులు అందించిన ఆశయాలు, లక్ష్యాలు చెరిగిపోని ముద్ర వేసాయి. వారు చూపిన మార్గంలో పార్టీకీ, విప్లవోద్యమానికీ తన జీవితాన్ని అంకితం చేసారు. మరెన్నడూ వెనుదిరిగి చూడలేదు.

కామ్రేడ్ బరుణ్ దా నాయకత్వంలో 1980–90 దశకాల్లో హజారీబాగ్ ప్రాంతంలో సాయుధ వ్యవసాయ విప్లవోద్యమం అభివృద్ధి చెందింది. ఉత్తర ఛోటా నాగ్‌పూర్ ప్రాంతంగా ఉన్న ధన్‌బాద్, గిరిడీహ్, బొకారో, హజారీబాగ్, చత్రాలలో శత్రు 'చుట్టివేత–నిర్బంధం' మధ్యనే క్రాంతికారీ కిసాన్ కమిటీ పతాకం కింద సంఘటితమై ఉన్న విప్లవ రైతాంగం వ్యవసాయ విప్లవ పోరాటాన్ని కొనసాగించింది. ఇందులో భాగంగా ప్రజలు దోపిడీకి, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరిపారు. అడవిలో యూకలిప్టస్ చెట్లను నాటడానికి వ్యతిరేకంగా నినదించారు. వర్గ శత్రువులైన భూస్వామ్య కుటుంబాల పంటలను జప్తు చేసుకున్నారు. ఈ ప్రజల పోరాటాలకు ఎర్ర రక్షణ దళం రక్షణ కల్పించింది. ఈ పోరాటాల ద్వారా వర్గ పోరాటం ఉన్నత, నూతన స్థాయికి పురోగమించింది. భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడల పట్ల స్పష్టమైన అవగాహనతో ఉన్న పార్టీ నాయకత్వంలో ఈ పోరాటాలు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ముసుముందుకు సాగాయి.

ఛోటా నాగ్‌పూర్ విప్లవ పోరాటం 'లాల్ ఖండ్' పోరాటంగా పేరు పొందింది.

'ఆపరేషన్ లాల్ ఖండ్' పేరుతో ఈ ప్రాంత విప్లవ పోరాటాన్ని అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్ధ సైనిక బలగాలను, బీఎమ్ పీ, సీఆర్ పీ, బీఎస్ఎఫ్ బలగాలను మొహరించాయి. ఎదురుకాల్పుల పేరిట ప్రజలపై కాల్పులు, అరెస్టు చేయడం, కొట్టడం, మహిళల పట్ల అసభ్య వ్యవహారం సాధారణ విషయంగా మారాయి. ఒక సమయంలో గిరిడీహ్, ధన్‌బాద్ సరిహద్దు ప్రాంతాలను దిగ్బంధించారు. శ్వేత మిలిషియా 'సన్‌లైట్ సేన'ను పునరుద్ధరించారు. పార్టీకి, ఉద్యమానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసారు. అదే సమయంలో లిబరేషన్ గ్రూపు, ఐపీఎఫ్ గ్రూపు 'ప్రభుత్వ నక్సలైట్'లుగా వ్యవహరిస్తూ ప్రజా వ్యతిరేక పనులు చేయసాగారు. ప్రభుత్వంతో గొంతు కలిపారు. పార్టీ నాయకత్వంలో విప్లవ ప్రజానీకం ఈ బహుముఖ దాడిని తిప్పికొడుతూ, సృజనాత్మకంగా పోరాటం చేస్తూ వర్గ పోరాటాన్ని నూతన పద్ధతులలో ముందుకు సాగించారు.

ఝార్ఖండ్ ప్రజల చిరకాల కోరికగా ఉన్న ప్రత్యేక ఝార్ఖండ్ కోసం ఉద్యమం కూడా ఈ కాలంలో అభివృద్ధి చెందింది. 'కైసె లేంగే ఝార్ఖండ్-లఢ్‌కె లేంగే లాల్ ఖండ్' ఆనాడు ప్రజల నోళ్లల్లో నిత్యం కదలాడిన నినాదం. అయితే ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన బూర్జువా వర్గం ప్రజల పట్ల నిజాయితీగా వ్యవహరించలేదు. అధికారం కోసం పాకులాడింది. పాలక వర్గాలతో రాజీ పడింది. ప్రజలలో వీరి పట్ల వ్యతిరేకత ఏర్పడింది. పార్టీ, కేకేసీ, ఎన్ఎంఎస్ వారి స్వార్థ ప్రయోజనాలను ఎండగట్టాయి. ప్రజల అభీష్టాన్ని నెరవేర్చేందుకు, వర్గ పోరాటంలో భాగంగా పార్టీ ప్రత్యేక ఝార్ఖండ్ ఉద్యమాన్ని కూడా ఒక కర్తవ్యంగా చేపట్టింది. ప్రజలలో స్వార్థ శక్తుల గురించి తగిన అవగాహన కల్పించింది. ఈ క్రమంలో ఈ కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు ఒక ప్రత్యేక సంఘాన్ని నిర్మించింది. ఈ సంఘం నాయకత్వంలో ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించసాగారు. ఈ యావత్తు పోరాటాల క్రమంలోనే కామ్రేడ్ వివేక్ కమ్యూనిస్టు విప్లవకారునిగా రాటు దేలారు. ఆనాటి బిహార్-బెంగాల్ స్పెషల్ ఏరియా కమిటీ నాయకత్వంలో ప్రజా సైన్యాన్ని, విముక్తి ప్రాంతాలను నిర్మాణం చేసే ప్రక్రియ ద్వారా సంపాదించుకున్న యావత్తు అనుభవాలను, వివిధ పోరాటాలలోని ప్రత్యేకతలను అధ్యయనం చేసేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు ఆయన తీవ్రంగా కృషి చేసారు.

బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా ఉద్యమ నాయకునిగా

ఈ దశకాలలో బిహార్-బెంగాల్ స్పెషల్ ఏరియా కమిటీ ఎప్పటికప్పుడు గడచిన కాల ఉద్యమ సాఫల్య వైఫల్యాలను విశ్లేషిస్తూ వచ్చింది. సిద్ధాంతం, ఆచరణల సమన్వయంతో పార్టీని బలోపేతం చేయడం పట్ల శ్రద్ధ వహించింది. పార్టీ కార్యకర్తలందరినీ రాజకీయంగా అభివృద్ధి చేయడం కోసం కృషి చేసింది. ఉద్యమ విస్తరణపై దృష్టి సారించింది. పార్టీలో బూర్జువా ఆలోచనలకు వ్యతిరేకంగా దిద్దుబాటు ఉద్యమం నిర్వహించింది. కేంద్రీకృత

ప్రజాస్వామ్యాన్ని, నాయకత్వ సరైన పద్ధతినీ దృఢంగా అమలు చేసే విధంగా యావత్తు పార్టీకి మార్గదర్శకత్వం వహించింది. పార్టీ రహస్య నిర్మాణ ఆవశ్యకతను గుర్తించి అమలు చేస్తూ వచ్చింది. పోరాట సాఫల్యాలను నిలబెట్టుకునేందుకు సైనిక చర్యలను చేపట్టింది. శత్రు చుట్టివేత దాడిని ఎదుర్కొనేందుకు సరైన కౌశలతను అనుసరించింది.

ప్రజల క్రియాశీలక భాగస్వామ్యంతో సంతరించుకుంటున్న భూపోరాటాల అనుభవం, ప్రజల సంసిద్ధత, సాఫల్యాలపై ఆధారపడి, భూపోరాటాన్ని మరింత బలంగా పురోగమింపజేసింది. విప్లవ భూసంస్కరణలను కొనసాగించింది. దీంతో పాటుగా ప్రజలకు విద్య, వైద్యం అందించే విధంగా కేకేసీ చొరవతో పనిచేసే విధంగా మార్గదర్శకత్వం అందించింది. పట్టణ పని విధానంలో జరుగుతున్న లోపాలను సరిదిద్దుతూ పట్టణోద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేసింది. కార్మికులు, మహిళలు, విద్యార్థి, యువజన, మేధావి, సాంస్కృతిక రంగాల పని తీరును, విశాల ప్రజా సమూహాలలో పనిని సమీక్షించి కర్తవ్యాలు రూపొందించింది. ఈ యావత్తు కృషిలో కా. వివేక్ ఒక విప్లవ కమ్యూనిస్టుగా ప్రజలకు అంకితమై కృషి సాగిస్తూ వచ్చారు. ఆయా స్థాయిలలో తన కమిటీ సభ్యులతో కలిసి సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, సైనిక కృషి సలిపారు.

స్పెషల్ ఏరియా వ్యాప్తంగా సాగుతున్న వివిధ ప్రజా పోరాటాల నివేదికలను, సైనిక చర్యల సమాచారాన్ని పార్టీ వ్యాప్తంగా అందించడం కోసం స్పెషల్ ఏరియా కమిటీ 'లాల్ చింగారీ' పత్రికను నడిపింది. ఈ పత్రిక కోసం నివేదికలు రూపొందించడం, వివిధ అంశాల గురించి రాయించడంపై కా. వివేక్ శ్రద్ధ పెట్టేవారు. ఈ పత్రిక ఒక ఆర్గనైజర్ గా కేడర్ లకు ఉపయోగపడే విధంగా రూపొందడంలో కా. వివేక్ తన కమిటీ సభ్యులతో కలిసి కృషి చేసారు.

1990 దశాబ్దం చివరిలో పార్టీలో ఒక చిన్న పాటి అవకాశవాద 'బాదల్-భరత్' ముఠా రెండు పంథాల మధ్య పోరాటం పేరుతో పార్టీ మౌలిక పంథాకు వ్యతిరేకంగా అవకాశవాద, వర్గ సంకర పంథాను ముందుకు తెచ్చి అంతర్గత సంక్షోభాన్ని సృష్టించింది. ఎంసీసీ సరైన నాయకత్వంలో విప్లవ ప్రజలు సమైక్యంగా విప్లవ సంకల్పంతో పోరాటాన్ని సాగించి కొద్ది కాలంలోనే ఈ ముఠాను పక్కకు నెట్టివేసారు. ఈ అంతర్గత పోరాటంలో కామ్రేడ్ వివేక్ సరైన పంథా వైపు దృఢంగా నిలబడ్డారు. పార్టీలో అంతర్గత పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్ర ఎంతో సకారాత్మకమైనది, చెప్పుకోదగినది. ఈ క్రమంలో 1989, 1996లలో చారిత్రాత్మకమైన ఎంసీసీ రాష్ట్ర, కేంద్ర మహాసభలు, 2002లో బిహార్-బెంగాల్ స్పెషల్ ఏరియా మహాసభ జరిగాయి. ఇవి ఉద్యమ అనుభవాలను క్రోడీకరించాయి. సరైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక కృషి ద్వారా ఉద్యమం పురోగమించింది,

వివిధ రాష్ట్రాలకు, రంగాలకు విస్తరించింది. ప్రజా పునాది, పార్టీ, గెరిల్లా బలగాలు గణనీయంగా అభివృద్ధి చెందాయి.

ఈ క్రమంలో బిహార్–ఝార్ఖండ్ ప్రాంతంలో కామ్రేడ్ వివేక్ ముఖ్యమైన నాయకుడిగా ఎదిగారు. సబ్ జోన్ స్థాయిలో పని చేస్తూ జోన్ స్థాయికి, జోన్ స్థాయిలో పని చేస్తూ స్పెషల్ ఏరియా స్థాయికి అంచలంచెలుగా ఎదిగారు. ఉద్యమ అవసరాల మేరకు పార్టీ నిర్దేశించిన బాధ్యతలను ఎటువంటి శషభిషలు లేకుండా చేపట్టారు. ఉద్యమ పురోగమనంలో తన వంతు పాత్ర నిర్వహించారు. 2001 నాటికి కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు.

పార్టీ ఐక్యతా కృషిలో

విప్లవకారుల ఐక్యత గురించి కామ్రేడ్ కన్హాయ్ చటర్జీ చెప్పిన విషయాలు కామ్రేడ్ వివేక్ ఎన్నడూ మరిచిపోలేదు. వివిధ ఎం–ఎల్ గ్రూపులతో ఐక్యమయ్యేందుకు ఆయన ఉత్సుకతతో ఉండేవారు. కామ్రేడ్ కిషన్ దా నాయకత్వంలో 2001లో కేంద్రకమిటీ నిర్వహించిన సైద్ధాంతిక కృషితో పార్టీ అవగాహనలోనూ, ఆచరణలోనూ ఒక గెంతు వచ్చింది. భాకపా (మా–లె) (పీపుల్స్ వార్) తో ఘర్షణల నివారణ, పార్టీ ఐక్యత, పిడివాద, సెక్టేరియన్ వైఖరులను వదులుకోవడం, ప్రజాసైన్య నిర్మాణం–ప్రజాయుద్ధ అభివృద్ధి–విముక్తి ప్రాంతాల ఏర్పాటు విషయంలో ఒక బ్రేక్ త్రూ సాధించడానికి సానుకూల పరిస్థితి ఏర్పడింది. విప్లవకారుల ఐక్యతా క్రమం వేగం పుంజుకుని కొన్ని నిజమైన మా–లె గ్రూపులను, శక్తులను ఐక్యం చేసుకుని ఎంసీసీ అఖిల భారత పార్టీ, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ)గా ఎదిగింది. 2003 ఏప్రిల్ 22న పీఎల్‌జీఏను స్థాపించింది.

ఈ ఐక్యతా క్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు భాకపా (మా–లె)(పీపుల్స్ వార్) తో గతంలో సాగి, నిలిచిపోయిన ఐక్యతా చర్చలను తిరిగి కొనసాగించింది. ఈ క్రమంలోనే 2004 సెప్టెంబరులో రెండు ప్రధాన విప్లవ స్రవంతులుగా వున్న ఎంసీసీఐ, భాకపా (మా–లె) (పీపుల్స్ వార్)లు విలీనమై నూతన పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. పార్టీ ఐక్యతా కృషిలో కేంద్ర కమిటీ సభ్యునిగా కామ్రేడ్ వివేక్ తన వంతు బాధ్యత నిర్వర్తించారు. బిహార్–ఝార్ఖండ్‌లో ఉన్న యావత్తు పార్టీ నిర్మాణాల అన్ని స్థాయిల్లోనూ రెండు పార్టీలను ఐక్యం చేసిన విజయవంతనైన కృషిలో పాలు పంచుకున్నారు.

నూతన పార్టీని 'దేశ అంతర్గత భద్రతకు పెను ముప్పు'గా భావించిన భారత పాలక వర్గాలు వెనువెంటనే అణచివేత క్యాంపెయిన్ లను చేపట్టాయి. విప్లవ ప్రతిఘాతుక 'సేంద్ర', 'నాగరిక్ సురక్షా సమితి' వంటి శ్వేత మిలిషియాలను ప్రారంభించాయి. అదే సమయంలో దండకారణ్యం స్పెషల్ జోన్ ప్రాంతమయిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సల్వా జుడుం పేరుతో ప్రారంభించింది. ఈ నిర్బంధ సైనిక క్యాంపెయిన్ ల లక్ష్యం ఒకటే.

దేశవ్యాప్త ఐక్య పార్టీగా ఆవిర్భవించిన భాకపా (మావోయిస్టు)ను తుదముట్టించడం. దేశ ప్రాకృతిక వనరులను సామ్రాజ్యవాదులకు, దేశ భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలకు కట్టబెట్టేందుకు మార్గం సుగమం చేయడం. ఈ క్యాంపెయిన్ ల లక్ష్యాన్ని ప్రజలకు వివరించి వారిని ప్రతిఘటనకు సంసిద్ధులను చేయడంలో కా. వివేక్ తన కమిటీ సభ్యులతో కలిసి తీవ్రంగా కృషి చేసారు. ప్రజలను, ప్రజా మిలిషియాను సమీకరించడంలో ముందున్నారు.

ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ కర్తవ్యాల అమలులో

ఐక్యతా క్రమాన్ని సంఘటితం చేసేందుకు కాంగ్రెస్ నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. 2007 ఫిబ్రవరి-మార్చిలో జరిగిన ఈ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ నిర్వహణ బాధ్యతలను కామ్రేడ్ వివేక్ సమర్థవంతంగా నిర్వహించారు. కమిటీలో నిర్ణయించిన ప్రకారంగా ఈ చారిత్రాత్మక ఘట్టానికి తగిన స్థాయిలో రక్షణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాంగ్రెస్ లో చర్చలను సుగమం చేసేందుకు అవసరమైన ముద్రణా, విద్యుత్తు ఇతర అవసరాలను సహచర కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసారు. కాంగ్రెస్ లో జరిగిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, సైనిక అంశాలపై చర్చలలో క్రియాశీలంగా పాల్గొన్నారు. తన సుదీర్ఘ అనుభవంతో పార్టీ పంథాను సుసంపన్నం చేసేందుకు తన వంతు కృషి సలిపారు. దండకారణ్యం, బిహార్-ఝార్ఖండ్ లను విముక్తి ప్రాంతాలుగా రూపొందించాలని, పీఎల్‌జీఏను పీఎల్ఏగా అభివృద్ధి చేయాలని, గెరిల్లా యుద్ధాన్ని చలన యుద్ధ స్థాయికి తీసుకువెళ్లాలన్న కాంగ్రెస్ నిర్దేశించిన కేంద్ర కర్తవ్యాన్ని అమలు చేసేందుకు కృషి చేసారు. ఈ కేంద్ర కర్తవ్యంతో పాటుగా ప్రధాన, తక్షణ కర్తవ్యాల అమలుపై కేంద్రీకరించి సృజనాత్మకంగా పని చేసారు. ఆ ప్రాంతాల నిర్దిష్టతలకు అనుగుణంగా స్పెషల్ ఏరియా ప్రాంతానికి మార్గదర్శకత్వం అందించారు. విప్లవ ప్రజా సంఘాలను, విప్లవ ప్రజా కమిటీ (ఆర్ పీసీ)లను, వర్గ పోరాటాన్ని, ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేయడంలో చొరవగా కృషి చేసారు.

2009లో భారత రాజ్యం 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో మరో నిర్బంధ సైనిక క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్ లో అమెరికా సామ్రాజ్యవాదుల ఎల్ఐసీ వ్యూహాన్ని అమలు చేసింది. సాయుధ బలగాలను పెద్ద ఎత్తున మొహరించింది. ఇన్ ఫార్మర్ నెట్ వర్క్ ను బలోపేతం చేసింది. మానసిక యుద్ధంలో భాగంగా ఉద్యమంపై, పార్టీపై దుష్ప్రచారం గావించింది. బూటకపు సంస్కరణలు చేపట్టింది. యావత్తు దేశంలో గెరిల్లా జోన్ ప్రాంతాలలోను, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలోను, పట్టణాలు, మైదాన ప్రాంతాలలోనూ ఆపరేషన్ గ్రీన్ హంట్ వివిధ రూపాలలో అమలయింది. దీని ప్రభావం సాధారణ ప్రజలపై సయితం పడింది. ఈ క్యాంపెయిన్ ను ఓడించేందుకు యావత్తు పార్టీ

కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో ఆయా ప్రాంతాలలో వివిధ ప్రచార-ఆందోళనా కార్యక్రమాలు, సైనిక చర్యలు చేపట్టింది. అటువంటి క్లిష్ట పరిస్థితిలో కా. వివేక్ బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.

వరుస నిర్బంధ క్యాంపెయిన్ లను ఓడిస్తూ విప్లవోద్యమం నిలదొక్కుకున్నప్పటికీ క్రమంగా కొన్ని ప్రాంతాలు సాపేక్షికంగా బలహీనపడసాగాయి. అంతటా స్థానిక నిర్మాణాలు, సైనిక ఫార్మేషన్‌లు, ప్రజా సంఘాల కార్యకలాపాలపై సాపేక్షికంగా నకారాత్మక ప్రభావం పడసాగింది. కేంద్ర కమిటీ, బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ ఎప్పటికప్పుడు పరిస్థితికి అనుగుణంగా ఎత్తుగడలు రూపొందిస్తూ వస్తున్నాయి. అయితే 2012 నుంచి విప్లవోద్యమం గడ్డు స్థితిని ఎదుర్కోసాగింది. 2013లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం బిహార్-ఝార్ఖండ్ ఉద్యమం తాత్కాలిక వెనకడుగులోకి వెళ్లిందని సమీక్షించింది. దీనిని అధిగమించేందుకు ఎత్తుగడలు రూపొందించింది. ఈ ఎత్తుగడలను విజయవంతంగా అమలు చేసేందుకు పార్టీ అంతటా బోల్షివీకరణ క్యాంపెయిన్ నిర్వహించాలని పిలుపునిచ్చింది. బోల్షివీకరణ క్యాంపెయిన్ కోసం కేంద్ర కమిటీ రూపొందించిన సర్కులర్ లను కేడర్ లలోకి తీసుకువెళ్లేందుకు బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ కృషి చేసింది. ఈ సర్కులర్‌లపై, ఈ ప్రాంత చరిత్రపై వారిలో అవగాహన కల్పించేందుకు క్లాసులు, చర్చా కార్యక్రమాలు నిర్వహించింది. ఎస్ఏసీ చేపట్టిన ఈ కృషిలో కా. వివేక్ తన కమిటీ సభ్యులతో కలిసి కృషి చేసారు. కింది కమిటీలకు అన్ని అంశాలలో మార్గదర్శకత్వం అందించారు.

ఏటికి ఎదురీదుతూ

దేశవ్యాప్త ఉద్యమం తాత్కాలికంగా వెనకంజ వేసిందని 2018లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం సమీక్షించింది. అన్ని గెరిల్లా జోన్ లు, స్పెషల్ ఏరియాలు, రాష్ట్రాలలో హెచ్చు తగ్గులలో ప్రజా నిర్మాణాలు, సైనిక ఫార్మేషన్ లు, పోరాటాలు వెనకడుగు పట్టాయి. వివిధ స్థాయిల కేడర్ లు పార్టీ వదిలి పారిపోవడం ఎక్కువయింది. ఆ ప్రతికూల పరిస్థితిల్లో సైతం కామ్రేడ్ వివేక్ గుండె నిబ్బరంతో దృఢ సంకల్పంతో పని చేసారు. విప్లవోద్యమాన్ని, పార్టీ, పీఎల్‌జీఏలను కాపాడుకుంటూ వర్గ పోరాటాలను, ప్రజా ఉద్యమాలను పునర్నిర్మాణం చేసేందుకు కృషి చేసారు. అప్పటికి సంవత్సరం క్రితం ప్రారంభయి ఉన్న వ్యూహాత్మక 'సమాధాన్' నిర్బంధ క్యాంపెయిన్ కు వ్యతిరేకంగా పోరాడేందుకు కేడర్‌లను, ప్రజలను సంసిద్ధులను చేసారు. 2021 నవంబరులో తూర్పు రీజనల్ బ్యూరో బాధ్యునిగా ఉన్న కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులు కా. కిషన్ దాదా, కేంద్ర కమిటీ సభ్యులు కా. షీలా దీదీ అరెస్టు కావడంతో కా. వివేక్ పై మరింత బాధ్యత పెరిగింది. సహచర కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి ఈ భర్తీని పూరించేందుకు ప్రయత్నిస్తూ ఉద్యమాన్ని నిలబెట్టే కృషిని కొనసాగించారు.

2022 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం 'చింతన్ శిబిర్' నిర్వహించి రూపొందించిన 'సూరజ్ కుండ్' నిర్బంధ క్యాంపెయిన్‌లో పార్టీని, ఉద్యమాన్ని నిలబెట్టేందుకు అవసరమైన కృషి చేసారు. 'సూరజ్ కుండ్' పథకంలో భాగంగా 2024 జనవరి 1వ తేదీ నుంచి భారతదేశ దళారీ పాలకవర్గాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో విప్లవోద్యమాన్ని నిర్మూలించే దుష్ట లక్ష్యంతో నిరంతరాయంగా దాడులను సాగిస్తున్నది. ఈ దాడులను తిప్పికొడుతూ చెక్కు చెదరని విప్లవ దీక్షతో, విప్లవం పట్ల అంకిత భావంతో కా. వివేక్ ప్రజలను, పార్టీని, పీఎల్‌జీఏను, యుద్ధ రంగాన్ని అంటిపెట్టుకుని ఉన్నారు.

కగార్ దాడిలో అనేక మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. మరెంతో మంది శత్రు చేత చిక్కి జైలు పాలయ్యారు. కొంత మంది ద్రోహులుగా మారి ఉద్యమానికి వెన్నుపోటు పొడిచారు. కామ్రేడ్ వివేక్ జీవన సహచరి కామ్రేడ్ చింతా (జయ) అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సమయంలో, 2024 అక్టోబర్ నెలలో పోలీసులు అరెస్టు చేసి సరైన చికిత్స అందించకుండా హత్య చేసారు. ఇలా ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా గానీ, ఉద్యమంలో చివరి ఊపిరి వరకూ శక్తివంచన లేకుండా కృషి చేసిన ప్రజాయుద్ధ నాయకుడు కామ్రేడ్ వివేక్.

విప్లవోద్యమంలో దాదాపు నాలుగైదు దశాబ్దాల అనుభవం కలిగిన కామ్రేడ్ వివేక్ కార్మికవర్గ దృక్పథంతో పనిచేస్తూ ప్రజల, పార్టీ విశ్వాసాన్ని చూరగొన్న నిజమైన కమ్యూనిస్టు. కోపం, అహంభావాలను ఆయన దరి చేరనిచ్చేవారు కారు. సాదా–సీదా జీవనశైలి ఆయనది. ఆయన వేషభాషలు సాధారణంగా ఉండేవి. నిస్వార్థత, త్యాగశీలతలతో ఆయన పీడిత ప్రజలకు, విప్లవోద్యమానికీ సేవ చేసారు. కామ్రేడ్ వివేక్ ప్రదర్శించిన ఉన్నత కమ్యూనిస్టు ఆదర్శాలు యావత్తు కమ్యూనిస్టు విప్లవకారులకు ప్రేరణగా నిలుస్తాయి. ఆయన ఆదర్శాలను అలవరచుకుంటూ ఆయన కన్న కలలను సాకారం చేసేందుకు కృషి చేయడమే ఆయనకు మనం ఇవ్వగల నిజమైన నివాళి.

చిత్రహింసలను గేలి చేసి, అనారోగ్యాన్ని లెక్క చేయకుండా,

ఆంధ్రప్రదేశ్, ఏఓబీ మీదుగా ఒడిశా వరకు

విప్లవానికి ఊపిరి ఊదిన యోధుడు

కామ్రేడ్ మోడెం బాలకృష్ణ (భాస్కర్, మనోజ్)కు ఎర్రెర్ర జోహార్లు!



ఆంధ్రప్రదేశ్, ఏఓబీ, ఒడిశా రణభూమిలో పోరుకు ఊపిరందించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ మోడెం బాలకృష్ణ 2025 సెప్టెంబర్ 11వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్ జిల్లా రాజాడేరా అడవిలో జరిగిన చుట్టుముట్టి-మట్టుపెట్టే దాడిలో ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ ప్రమోద్ (పాండన్న, చంద్రహాస), మరో 8 మంది కామ్రేడ్స్‌తో కలిసి అమరులయ్యారు. దేశంలో తూర్పు, మధ్య, పశ్చిమ భూభాగంపై ఉన్న విలువైన ప్రాకృతిక వనరులను దోపిడీ చేయడం కోసం తమకు అడ్డుగా ఉంటూ, ప్రజలకు రక్షణగా నిలిచిన భారత విప్లవోద్యమాన్ని, దానికి నాయకత్వం వహిస్తూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ను తుదముట్టించాలన్న లక్ష్యంతో భారత పాలక వర్గాలు అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌లో భారత విప్లవోద్యమానికి జరిగిన మరో పెద్ద నష్టం ఈ అమరత్వాలు.

కామ్రేడ్ బాలకృష్ణ 61 సంవత్సరాల క్రితం తెలంగాణా రాష్ట్రం హనుమకొండ జిల్లా మడికొండలో జన్మించారు. ఆయన తండ్రి ప్రభుత్వ తపాలా శాఖలో పోస్ట్‌మేన్‌గా పని చేసేవారు. తల్లి మల్లమ్మ. ఆయనకు ముగ్గురు తమ్ములు, ఒక సోదరి ఉన్నారు. అంతకు కొద్ది కాలం క్రితమే తండ్రి ఉద్యోగ రీత్యా హైదరాబాదుకు బదిలీ అయి ఉన్నాడు. వాళ్ళు హైదరాబాదులోని చాదర్‌ఘాట్ వద్ద సుల్తాన్‌పురాలో ఉండేవారు. కామ్రేడ్ బాలకృష్ణ హైదరాబాదులోనే ఇంటర్మీడియట్ వరకు చదివారు. ఇంటర్మీడియట్ లోనే ఆర్ & బి వొకేషనల్ కోర్స్ తీసుకున్నాడు. చదువుపై కా.బాలకృష్ణకు అమితమైన ఆసక్తి ఉండేది. పాఠ్యాంశాలలో ఉన్న విషయాలను శ్రద్ధగా గుర్తు పెట్టుకునేవారు. పరీక్షలు రాయడం కోసమే కాకుండా జ్ఞాన పిపాస కలిగి ఉండేవారు.

కా. బాలకృష్ణ చిన్న నాటి నుంచి ఎదుటి వారి కష్టాలను చూసి చలించిపోయేవారు. కన్నీళ్లు పెట్టే వారిని చూస్తే కన్నీళ్లు ఆగేవి కాదు. కుటుంబంలో తల్లి చేసే శ్రమ చూస్తూ సమాజంలో మహిళల స్థితిని గురించి ఆలోచించేవారు. సమాజంలో అందరికీ అంతా సజావుగా లేదని భావించేవారు. ఈ ఆలోచనలతో సతమతమవుతున్న కా. బాలకృష్ణ హైదరాబాద్ చేరుకునే నాటికి నగరంలో విప్లవ విద్యార్థి సంఘాలు చురుకుగా పని చేస్తున్నాయి. నగరవ్యాప్తంగా వివిధ కాలేజీలలో ఆర్ఎస్‌యూ యూనిట్‌లు ఉండేవి. కా. బాలకృష్ణ తమ కాలేజీలో ఉన్న రాడికల్ స్టూడెంట్స్ యూనియన్‌లో చేరి పని చేయసాగారు. విద్యార్థుల సమస్యలపై ఆర్ఎస్‌యూ విస్తృతంగా పోరాటాలు చేపట్టేది. ఈ పోరాటాలలో పాలు పంచుకుంటూ కా. బాలకృష్ణ వర్గ సమాజం గురించి, సమాజంలో పీడిత వర్గాలు, పీడిత సమూహాలపై దోపిడీ గురించి తెలుసుకున్నారు.

తాను పుట్టి పెరిగిన ప్రాంతంలో రైతుల, బడుగు వర్గాల పరిస్థితులు చూసిన

ఆయనకు వారి కష్టాలకు కారణాలు ఏంటో, వాటికి పరిష్కార మార్గం ఏదో విద్యార్థి పోరాట రాజకీయాలు తెలియపరచాయి. అలాగే దేశంలో, ప్రపంచంలో అంతటా దోపిడీ చేసేది కొద్ది మందేనని, దోపిడీకి గురి అయ్యేది మెజారిటీ ప్రజలనీ తెలుసుకున్నారు. దోపిడీని రూపుమాపాలంటే విప్లవం తప్పనిసరి అని అర్థం చేసుకున్నారు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం పరిచయం అయింది. కా. బాలకృష్ణలో చిన్న నాటి నుంచి రేగుతున్న ఆలోచనలకు ఈ సిద్ధాంతం ఒక దారి చూపించింది. ప్రజల కోసం, దేశం కోసం తాను కూడా పనిచేయాలన్న సంకల్పం ఏర్పడింది. ఈ సంకల్పంతోనే ఆర్ఎస్యూ కార్యకలాపాలలో మరింత చురుకుగా పాలు పంచుకుంటూ వచ్చారు. సమాజంలో మార్పు కోసం తన జీవితాన్ని అంకితం చేయాలన్న భావన ఆయనలో బలపడింది. ఈ చైతన్యంతో ఉన్న కా. బాలకృష్ణ తన కుటుంబానికి కలిసి ఈ విషయం చెప్పారు. ఇంటి వద్దనే ఉండి పని చేయాలని కుటుంబ సభ్యులు అన్నారు. అయితే అప్పటికే రాజ్యం పట్ల, దాని దోపిడీ విధానాల పట్ల ద్వేషం పెంచుకున్న బాలకృష్ణ తాను ప్రజల కోసమే అంకితం కాదలచుకున్నానని చెప్పారు. కుటుంబానికి ప్రత్యక్షంగా ఏమీ చేయకపోయినా, దేశం కోసం చేస్తే అందులో కుటుంబం కూడా భాగమే అవుతుందని వారికి చెప్పి, పూర్తి కాలం విప్లవకారునిగా పార్టీలో చేరారు. అది 1983.

చిత్రహింసలతో, జైలు జీవితంతో రాటు దేలిన విప్లవకారుడు

ఆనాడు పార్టీ నిర్మాణంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాలలో సెంట్రల్ ఆర్గనైజర్ (సీఓ)లు ప్రధానంగా విద్యార్థులు, యువజనులలో పని చేసేవారు. బస్తీలలో పేద ప్రజలలో పని చేసేవారు. కా. బాలకృష్ణ ఖమ్మం జిల్లాలో అటువంటి ఒక సీఓగా బాధ్యతలు చేపట్టారు. విద్యార్థి రంగం నుంచి వచ్చిన ఆయన విద్యార్థులను, అలాగే యువజనులను కూడా కలిసేవారు. పోరాటమే ఏకైక మార్గం అని, సమాజంలో యావత్తు పీడిత వర్గాల ప్రజల సమస్యలకూ మూలం ఒకటేనని చెప్పి వారిని సంఘటితం చేసేందుకు కృషి చేసారు. పార్టీ మార్గదర్శకత్వంలో సిద్ధాంతాన్ని, రాజకీయాలను నేర్చుకుంటూ, నేర్పుతూ ప్రజా నాయకునిగా ఎదుగుతూ వచ్చారు.

ఖమ్మం జిల్లాలో ఆర్గనైజర్ గా వెళ్ళిన కా. బాలకృష్ణ కొద్ది కాలంలోనే అరెస్టు అయ్యాడు. అప్పుడు ఆయనను వరంగల్ జైలులో ఉంచారు. దాదాపు రెండేళ్ళ పాటు వరంగల్ జైలులో ఉన్నాడు. అప్పటికే వరంగల్ జైలులో నక్సలైటు ఖైదీలందరూ పోరాడి జైల్ కమ్యూన్ స్థాపించుకున్నారు. కొద్ది రోజులలోనే బాలకృష్ణను ఆ జైలు కమ్యూన్‌ను నడిపించడానికి ఏర్పడ్డ నాయకత్వ కమిటీ అయిన జైలు కమ్యూన్ కమిటీలోకి తీసుకున్నారు. ఆయన జైలులో ఉన్నంత కాలం ఆ కమ్యూన్ సజావుగా క్రమశిక్షణతో నడవడంలో కీలక పాత్ర వహించాడు. కమ్యూన్‌లో రాజకీయ విషయాల అధ్యయనం,

చర్చలు సజావుగా, క్రమబద్ధంగా జరిగేలా పట్టుదలతో పని చేసేవాడు. జైలు సమస్యల మీద పోరాటం నడిపారు. ఆ జైలు పోరాటాన్ని అణచివేసేందుకు జైలులోనే నక్సలైటు ఖైదీల మీద విపరీతంగా లాఠీ చార్జ్ చేయించారు. ఈ విధంగా తన యవ్వన ప్రాయం లోనే జైలు పోరాటాలకు కా. బాలకృష్ణ నాయకత్వం వహించాడు. జైలులో సాధారణ ఖైదీల నుంచి, రాజకీయ ఖైదీల నుంచి అనేక విషయాలు తెలుసుకున్నారు. దోపిడీ సమాజంపై, దానికి సహకరిస్తున్న రాజ్యంపై అవగాహన ఏర్పడింది. కొద్ది కాలానికి బెయిలుపై విడుదల అయిన తరువాత, తిరిగి చదువు కొనసాగించాలని గాని, కుటుంబ జీవితం గడపాలని గానీ ఆలోచించలేదు.

ఒకటిన్నర రెండేళ్లలో కా. బాలకృష్ణ జైలు నుండి విడుదలయ్యాడు. జైలులో నిరంతర అధ్యయనం వల్ల మార్క్సిస్ట్ రాజకీయాలలో మరింత రాటుదేలి బయటకు వచ్చాడు. జైలు నుండి విడుదల అయ్యాక అతి త్వరలోనే ఆయన మళ్ళీ విప్లవోద్యమంలోకి మరింత ఉన్నత బాధ్యతలు చేపట్టి వెళ్ళాడు. ఈ సారి మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ సభ్యుడిగా జిల్లా ఉద్యమానికి నాయకత్వం వహించడానికి వెళ్ళాడు. అక్కడ విప్లవ రైతాంగ ఉద్యమాన్ని, విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడానికి పూనుకున్నాడు.

1987లో మహబూబ్‌నగర్‌లో ఒక అద్దె గదిలో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్న కా. బాలకృష్ణను పోలీసులు అరెస్టు చేసి కుట్ర కేసు బనాయించారు. ముషీరాబాద్ జైలులో నిర్బంధించారు. గత జైలు జీవిత అనుభవంతో ఈసారి జైలు నిర్బంధంలో ఉన్నప్పుడు అక్కడి ఖైదీలను రాజకీయంగా సంఘటితం చేయడంపై శ్రద్ధ పెట్టారు. 'జైలు ఒక రాజకీయ పాఠశాల' అన్న విప్లవ అవగాహనతో తాను ఉన్న జైలును ఈ రకంగా తీర్చి దిద్దేందుకు తన మాదిరిగానే రాజకీయ ఖైదీలుగా ఉన్న పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి సమిష్టి కృషి సలిపారు. 1991లో అధికార తెలుగుదేశం పార్టీ శాసన సభ్యుడిని కిడ్నాప్ చేసిన పార్టీ బాలకృష్ణ మొదలయిన వారి విడుదలను డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను అంగీకరించడంతో ఆయన, కా. మంజీర జైలు నుంచి విడుదలయ్యారు.

వాళ్ళు విడుదల అయ్యే సమయానికి బయట నిర్బంధం కొంత సడలి మరో వెల్లువ ప్రజా పోరాటాలకు సన్నద్ధమవుతున్న కాలం అది. చారిత్రక వరంగల్ రైతు కూలీ సంఘ సభలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కనీవినీ ఎరుగని ప్రజా సమీకరణకు సన్నాహాలు నడుస్తున్నాయి. దానిని సజావుగా నడిపించేందుకు వందలాది వాలంటీర్ల బృందాలు ఏర్పడ్డాయి. ఆ బృందాలకు నాయకత్వం వహించేందుకు కొన్ని నాయకత్వ కమిటీలు ఏర్పడ్డాయి. ఆ సమయం లోనే వివిధ జైళ్ల నుండి బయటకు వచ్చిన కా. సూర్యం, బాలకృష్ణ, రవి కుమార్, మల్లా రెడ్డి, భూషణం, ప్రభు లు ఈ నాయకత్వ కమిటీలలో ఉన్నారు. వీరందరికీ బాధ్యుడు కా. పులి అంజన్న. వీరి

నాయకత్వంలో వరంగల్ లో రైతు కూలీ సంఘ సభలు అత్యంత ఘనంగా విజయవంతమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగి పది లక్షలకు పైగా హాజరైన సభల్లో ఒక్క చిన్న ఘటన కూడా జరగకుండా సజావుగా జరిపించిన నాయకత్వ టీం లో కా. బాలకృష్ణ కూడా ఒకరు. ఆ సభలు జరిగిన కొద్ది కాలానికే కా. బాలకృష్ణ మళ్ళీ విప్లవోద్యమంలో అజ్ఞాత జీవితానికి వెళ్లిపోయాడు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ దక్షిణ తెలంగాణా వైపు విస్తరించాలని నిర్ణయించింది. ఈ విస్తరణలో కా. బాలకృష్ణ భాగమయ్యారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వం కృష్ణా నదిపై, పంట భూములలో నిర్మించ తలపెట్టిన వివిధ ప్రాజెక్టులు మత్స్యకారుల, రైతుల జీవితాలలో మన్ను బోస్తాయి కాబట్టి ప్రజలు వాటిని వ్యతిరేకిస్తున్నారు. ఈ సమస్యను చేపట్టింది పార్టీ. ప్రజలను సంఘటితపరచి ఈ దోపిడీని రూపుమాపేందుకు వర్గ పోరాటమే మార్గమని వివరించింది. రాజ్యాధికారం లేనిదే పీడిత వర్గాల జీవితాలకు విముక్తి ఉండదని అర్థం చేయించింది. ప్రజలు ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాడుతుంటే రాజ్యం వారిపై నిర్బంధం అమలు చేసింది. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా పార్టీ చెప్పిన రాజ్యాధికార రాజకీయాలతో ప్రజలు ఆయుధాలు కూడా పట్టవలసిన అవసరాన్ని గుర్తించారు. ఆ రకంగా ఈ ప్రాంతం నుంచి పార్టీలోకి యువతీ యువకులు భర్తీ అయ్యారు. ఈ పరిస్థితిలో పార్టీ నిర్మాణాలతో పాటుగా ప్రజా సైన్య నిర్మాణాలను కూడా సంఘటితం చేసింది పార్టీ. ఈ విస్తరణలో, సంఘటితీకరణ కృషిలో తన కమిటీ సభ్యులతో కలిసి కా. బాలకృష్ణ ముఖ్య పాత్ర వహించారు. ఈ కృషితో దక్షిణ తెలంగాణా ఒక రీజియన్‌గా అభివృద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్లమల ఫారెస్ట్ డివిజన్, రాయలసీమ డివిజన్‌లతో అనుసంధానం చేస్తూ రాష్ట్రంలో ఉద్యమం కొనసాగుతూ వచ్చింది. ఈ కృషి క్రమంలోనే కా. బాలకృష్ణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు.

'జైలు పోరాటంలో' ఒక నాయకునిగా

1993 మార్చిలో కా. బాలకృష్ణ మరోసారి అరెస్టయ్యారు. ఈసారి ఆయనపై బెంగుళూరు ఆయుధాల కేసు, గ్రేహౌండ్స్ వ్యవస్థాపకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీఐజీ వ్యాస్‌ను యాక్షన్ టీం మట్టు గావించిన కేసు కూడా పెట్టారు. ఈ అరెస్టు సమయంలో పోలీసులు ఆయనను క్రూరంగా చిత్రహింసలు పెట్టారు. రోలర్ ట్రీట్ మెంట్ మొదలయిన పాశవిక పద్ధతులకు పాల్పడ్డారు. ఈ చిత్రహింసల కారణంగా కామ్రేడ్ బాలకృష్ణకు మోకాళ్లు, కీళ్లు దెబ్బ తిన్నాయి. రహస్యమంటూ ఏదీ రాబట్టలేకపోయిన అధికారులు చివరకు కా. బాలకృష్ణను హైదరాబాద్ చంచల్‌గూడ జైలుకు పంపించారు. అదే సమయంలో మద్రాసులో అరెస్టు అయిన కామ్రేడ్ శాఖమూరి అప్పారావును కూడా అదే జైలుకు పంపించారు.

అంతకు ముందు నుండే కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి ముషీరాబాద్ జైల్లో ఉన్నాడు. అంతకు ముందు నుండే జైలులో సాగుతూ వస్తున్న రాజకీయ కృషిని ఈ ముగ్గురు పీడిత ప్రజల నాయకులు మరింత ముందుకు తీసుకువెళ్లారు. జైలులో ఖైదీలలో రాజకీయ కృషి సలిపి ఖైదీల హక్కుల గురించి వారిలో అవగాహనను మరింతగా పెంపొందించారు. ప్రజలపై దోపిడీలో భాగంగానే జైలులో ఖైదీలపై హింస అమలు అవుతుందని, చట్టాలను అమలు చేయడంలో నిజాయితీ లేని రాజ్యం ఖైదీలకు ఉన్న హక్కులను అమలు చేయదని వివరించారు. జైలులో ఖైదీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు వ్యతిరేకంగా వారిని పోరాటాలకు సిద్ధం చేసారు. వీరి నాయకత్వంలో 42 రోజుల పాటు జైళ్లలో రాజకీయ ఖైదీలు, జీవిత ఖైదు పడిన ఖైదీలు నిరాహార దీక్ష చేసారు. ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా అనేక జైళ్లకు వ్యాపించింది. వివిధ జైళ్లల్లో ఖైదీలు ఎక్కడికక్కడ పోరాటాలు ప్రారంభించారు. ఈ పోరాటాలకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ పట్టణాలలో వివిధ ప్రజా సంఘాలు సంఘీభావ పోరాటాలు, ధర్నా శిబిరాలు ప్రారంభించాయి. రాష్ట్రమంతటా జైళ్లల్లో ఉన్న అమానవీయ పరిస్థితులు, ఖైదీల హక్కుల ఉల్లంఘన, విడుదలలో జాప్యం మొదలయిన అంశాలు బలంగా చర్చకు వచ్చాయి.అంతిమంగా ఖైదీల డిమాండ్లనన్నింటినీ ప్రభుత్వం ఒప్పుకోవలసి వచ్చింది.

1995లో జరిగిన ఈ ఉద్యమం 'జైలు పోరాటం'గా చరిత్రలో నిలిచిపోయింది. ఆ సమయంలో జైలు నుంచి విప్లవ సాహిత్యం విరివిగా వివిధ విప్లవ సాహిత్య పత్రికలలో ప్రచురణ అయ్యేది. జైలు నుంచి ఎవరు రాసినా దానిని 'సముద్రుడు' పేరుతో రాయడం ఆనాటి జైలు ఖైదీల ఐక్య రాజకీయ అవగాహనకు ఒక నిదర్శనం. ఈ రకంగా శత్రు నిర్బంధంలో కటకటాల వెనుక ఒక గొప్ప రాజకీయ కేంద్రం రూపొందింది. ఈ కృషి అంతటిలో ఈ ముగ్గురు నాయకులలో ఒకరుగా ఉన్న కా. మోడెం బాలకృష్ణ పాత్ర కూడా చెప్పుకోతగినది. ఏడు సంవత్సరాల తరువాత 1999లో కామ్రేడ్ బాలకృష్ణ బెయిలుపై విడుదలయ్యారు. కొద్ది రోజుల తరువాత తిరిగి రహస్య జీవితానికి వెళ్లిపోయారు.

1995లో అఖిల భారత ప్రత్యేక మహాసభ జరుపుకున్న పార్టీ వ్యూహాత్మక ప్రాంతాల్లో విప్లవోద్యమ అభివృద్ధి కోసం కీలక నిర్ణయాలు తీసుకుంది. అప్పటికి దండకారణ్యంలో భాగంగా ఉన్న ఆదిలాబాదు జిల్లాను ఉత్తర తెలంగాణా స్పెషల్ జోన్ పరిధిలోకి, ఈస్ట్ డివిజన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోకి చేర్చింది. 2000 నాటికి ఈస్ట్ డివిజన్‌కు శ్రీకాకుళం–విజయగరం జిల్లాలను, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలో కొంత ప్రాంతాన్ని చేర్చి, ఆంధ్ర–ఒడిశా బార్డర్ స్పెషల్ జోన్‌ను ఏర్పరచింది.

ఆంధ్ర–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా

విస్తరిస్తున్న ఉద్యమ అవసరాల దృష్ట్యా పార్టీ కా. బాలకృష్ణను 2000లో ఆంధ్ర–

ఒడిశా బార్డర్ స్పెషల్ జోన్ కు పంపించింది. ఆయన భాస్కర్ పేరుతో ఈ ప్రాంతంలో పని చేసారు. భాకపా (మాలె) (పీపుల్స్ వార్), భాకపా (మాలె) పార్టీ యూనిటీ కలిసి భాకపా (మాలె) (పీపుల్స్‌వార్)గా విలీనం అయిన తరువాత, ఇరు పార్టీల అవగాహనను, ఆచరణను మరింత సంఘటితం చేసుకునేందుకు పార్టీ కాంగ్రెస్ నిర్వహించింది. 2001లో జరిగిన ఈ పార్టీ కాంగ్రెస్ లో కా. భాస్కర్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ కాంగ్రెస్‌లో వివిధ ఉద్యమ అంశాల గురించి లోతైన చర్చ జరిగింది. విప్లవంలో మూడు మంత్ర దండాలుగా ఉన్న పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనలను బలోపేతం చేసేందుకు నిర్దిష్ట నిర్ణయాలు జరిగాయి. ఈ కాంగ్రెస్‌లో కొందరు ప్రతినిధులు అతివాద-మితవాద పంథా ముందుకు తీసుకువచ్చారు. దీనిపై కూలంకషంగా చర్చించిన కాంగ్రెస్ దానిని నిరాకరించింది. పార్టీ పంథాను దృఢంగా నిలబెట్టింది. పార్టీ పంథాను సుసంపన్నం చేసుకునేందుకు సాగిన ఈ చర్చలలో కా.భాస్కర్ క్రియాశీలంగా పాల్గొన్నారు. ఇదే సంవత్సరం జూన్ నెలలో మహిళా ఉద్యమంలో పూర్తి కాలం కార్యకర్తగా పని చేస్తున్న కామ్రేడ్‌ను వివాహం చేసుకున్నారు.

నూతనంగా ఏర్పడిన ఏఓబీ స్పెషల్ జోన్‌ను నిర్మాణపరంగా బలోపేతం చేసేందుకు ఎస్‌జడ్‌సీ పూనుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీలో కలిసి పనిచేసిన అమరుడు కామ్రేడ్ సుధాకర్ (తెంటు నరసింహాచలం), కా.భాస్కర్ ఈ కమిటీలో కలిసి పని చేసారు. ఏఓబీ స్పెషల్ జోన్ శ్రీకాకుళం జిల్లా నుంచి విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల మీదుగా సీలేరు దాటి పప్పులూరు కొండలపై నుంచి ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల ప్రాంతం వరకు విస్తరించి ఉంటుంది. ప్రాంతాల మధ్య, భాషలో, ప్రజా జీవితాలలో తేడాలు ఉంటాయి. ఈ నిర్దిష్టతను అర్థం చేసుకునేందుకు ఎస్‌జడ్‌సీ విశేష కృషి చేస్తూ అందుకు అనుగుణంగా పార్టీ, ప్రజా సైన్య, ఐక్య సంఘటనా నిర్మాణాలను బలోపేతం చేయసాగింది.

కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో స్పెషల్ జోన్ ప్రాంతంలో రాజ్య నిర్బంధానికి ప్రతిఘటనగా సైనిక చర్యలు చేపట్టాలని స్పెషల్ జోనల్ కమిటీ పథకం రచించింది. దండకారణ్యం, ఏఓబీ బలగాలు కలిసి ఒడిశా-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో కలిమెల-మోటు పోలీసు స్టేషన్‌లపై సంయుక్త రెయిడ్ నిర్వహించాయి. ఆ తరువాత మైదాన ప్రాంతంలో ఉన్న అనకాపల్లి-చోడవరం పట్టణాలలో పోలీసు స్టేషన్‌లపై దాడి జరిగింది. ఈ దాడులు ప్రజలను ఉత్తేజపరిస్తే, ప్రభుత్వ, పోలీసు బలగాలలో భయం పుట్టించాయి. పార్టీ ఈ పరిస్థితిని సంఘటితం చేసింది. ప్రజా పోరాటాలకు పిలుపునిచ్చింది. స్థానిక వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు జరిగాయి. విప్లవ ప్రజా కమిటీలకు, ప్రజా పోరాటాలకు మద్దతుగా పీఎల్‌జీఏ చిన్న పాటి ప్రతిఘటనా చర్యలు కొనసాగించింది.

ఎస్‌జడ్‌సీ సభ్యునిగా కా. భాస్కర్ జోన్‌లో ఈ రాజకీయ, నిర్మాణపర, సైనిక కృషిలో క్రియాశీలంగా పాల్గొన్నారు.

విప్లవ ప్రజా కమిటీల స్థాపనకు కృషి

ప్రజా నిర్మాణాల సంఘటితీకరణలో భాగంగా ఎస్‌జడ్‌సీ ప్రధానంగా కాంగ్రెస్ నిర్ణయాల మేరకు విప్లవ ప్రజా కమిటీల స్థాపనపై కేంద్రీకరించింది. ఈస్ట్ డివిజన్‌లో సుదీర్ఘకాలంగా సాగుతున్న ప్రజా పోరాటాలకు ఒక ముందడుగుగా విప్లవ ప్రజా కమిటీలు ఏర్పడసాగాయి. ప్రజలలో విప్లవోత్సాహం నింపాయి. తాను బాధ్యత తీసుకున్న ప్రాంతంలో ఈ కమిటీలకు ఉన్న వ్యూహాత్మక, రాజకీయ ప్రాధాన్యతను డీవీసీ, ఏసీ, పార్టీ కేడర్‌లకు బోధిస్తూ వారిని ఇందులో క్రియాశీలంగా పాలు పంచుకునేలా చేసారు కా.భాస్కర్. పార్టీతో, ఉద్యమంతో పెనవేసుకుని ఉన్న ప్రజలు ఈ కమిటీల ద్వారా తమ జీవితాలలో మార్పు తీసుకువచ్చేందుకు చొరవతో పని చేయసాగారు.

ఐక్య సంఘటనలో భాగంగా విప్లవ ప్రజా సంఘాలైన రైతు కూలీ, మహిళా, సాంస్కృతిక సంఘాలు క్రియాశీలంగా ఎదిగేందుకు కా. భాస్కర్ దోహదం చేసారు. కొన్ని దశాబ్దాలుగా ఆదివాసీ రైతు కూలీ సంఘం అటవీ శాఖ జులుంకు వ్యతిరేకంగా పోరాడుతూ వస్తున్నది. విప్లవ ప్రజా కమిటీలు ఏర్పడిన తరువాత ఆదివాసీ రైతు కూలీ సంఘం చేయవలసిన ప్రచార-ఆందోళనా కార్యక్రమాలు, ఈ రెండింటికీ మధ్య ఉండవలసిన సమన్వయం గురించి కమిటీ అవగాహన కల్పించింది. మహిళలపై పితృస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగానూ, మహిళలను దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో భాగం చేసేందుకూ పని చేస్తున్న ఆదివాసీ విప్లవ మహిళా సంఘం (ఏవీఎంఎస్) డివిజన్ స్థాయి కమిటీ మహాసభలు జరిగాయి. పార్టీలో మహిళా కార్యకర్తల గుణాత్మక ఎదుగుదల కోసం కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో ఏర్పడిన కేంద్ర మహిళా సబ్ కమిటీని అనుసరించి ఏఓబీలో స్పెషల్ జోన్ స్థాయిలో మహిళా సబ్ కమిటీ ఏర్పాటు చేసింది ఎస్‌జడ్‌సీ. ఈ కమిటీకి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో మహిళల క్రియాశీల భాగస్వామ్యం కోసం కా. భాస్కర్ తన వంతు బాధ్యత నెరవేర్చారు. జననాట్యమండలి దళాల నుంచి స్థానిక కళా రూపాలలో విప్లవ ప్రచారం గావించేందుకు కళాకారులకు మార్గదర్శకత్వం అందించారు. ఆ కాలంలో ఏఓబీ నుంచి కువ్వి, తెలుగు భాషలలో ఎన్నో పాటలు తయారై రికార్డయ్యాయి. విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఈ కృషి అంతటిలో ఎస్‌జడ్‌సీ సభ్యులతో పాటుగా కా.భాస్కర్ పాత్ర ఉన్నది.

ముందుకు సాగుతున్న ఉద్యమాన్ని నిర్మాణపరంగా సంఘటితపరచేందుకు పార్టీ 2002లో ఏరియా స్థాయి ప్లీనాలు నిర్వహించాలని నిర్ణయించింది. సెప్టెంబర్ నెలలో ఏరియా స్థాయిలో మొదటిసారిగా జరుగుతున్న ఈ ప్లీనం ప్రక్రియ గురించి ముందుగా

కేడర్‌లకు వివరించి, వారు అందులో క్రియాశీలంగా పాలు పంచుకునేందుకు కా.భాస్కర్ కృషి చేసారు. ఏరియా ప్లీనంలో ఏరియా రాజకీయ, సామాజిక పరిస్థితులలో వచ్చిన మార్పులపై డీవీసీ సభ్యుల నాయకత్వంలో ఏసీలు అర్థం చేసుకుని ఏరియా రాజకీయ, నిర్మాణ సమీక్షలు ప్రవేశపెట్టేందుకు దోహదం చేసారు. ఏరియా ప్లీనాల అనంతరం డివిజన్ ప్లీనాలు జరిగాయి. ఈ ప్లీనాలను ఫలవంతంగా నడిపించేందుకు ఎస్‌జడ్‌సీ సభ్యునిగా కా. భాస్కర్ తన కమిటీ సభ్యులతో కలిసి కృషి చేసారు. కేడర్‌లలో ఉన్న అవగాహనా లోపాలను ఓపికగా అర్థం చేసుకుంటూ, వారు తమ బాధ్యతలు నెరవేర్చేందుకు ఎప్పటికప్పుడు అవసరమైన అంశాలను తెలియపరుస్తూ, తద్వారా వారి ఎదుగుదలకు కృషి చేసేవారు కా. భాస్కర్. కేడర్‌ల పట్ల ప్రజాస్వామికంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించేవారు. కేడర్‌ల, ప్రజల విశ్వాసం చూరగొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు దోహదం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా విప్లవోద్యమానికి అపారమైన మద్దతు పెంపొందింది. విద్యార్థులు, మేధావులు, యువజనులు, మహిళలు, దళిత ప్రజలలో విప్లవోద్యమ ప్రభావం ఇనుమడించసాగింది. రాజ్యాధికారం కోసం పోరాటం చేయకుండా తమ సమస్యలు పరిష్కారం కావని ప్రజలు మరింత స్పష్టంగా అవగాహన చేసుకోసాగారు. మరో పక్క రాష్ట్ర పాలక వర్గాలలో వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. అంతిమంగా విధాన సభ ఎన్నికలు సమీపించాయి. ఈ ఎన్నికలలో నక్సలైట్ల పట్ల వైఖరి ఒక ప్రధాన అంశం అయింది. నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని, ప్రజలపై హింస విడనాడాలని పౌర, ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కొంత కాలంగా డిమాండ్ చేస్తూ ఉన్నాయి. ఈ రాజకీయ వాతావరణాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడం కోసం, తాము గెలిస్తే నక్సలైట్లతో చర్చలు జరుపుతామని కాంగ్రెస్ ప్రకటించింది. ప్రజల అభీష్టాన్ని తీరుస్తున్నానని భ్రమపరిచే ఉద్దేశ్యంతో అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీని చర్చలకు ఆహ్వానించింది.

2004 అక్టోబర్‌లో జరిగిన ఈ శాంతి చర్చలలో పాలు పంచుకునేందుకు ఏఓబీ ఎస్‌జడ్‌సీ కా. సుధాకర్‌ను ప్రతినిధిగా ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి అమరుడు కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్ (ఆర్ కే, సాకేత్) ప్రతినిధిగా ఎంపికై, ఉత్తర తెలంగాణా స్పెషల్ జోన్ నుంచి ఎంపికయిన అమరుడు కామ్రేడ్ గాజర్ల రవి (గణేష్, ఉదయ్), జనశక్తి పార్టీ నుంచి అమరుడు కామ్రేడ్ రియాజ్, కామ్రేడ్ అమర్‌లతో కూడుకున్న చర్చల బృందానికి నాయకత్వం వహించారు. ఈ చర్చల ప్రక్రియ కోసం ప్రభుత్వంతో నిర్దిష్టంగా ప్రజా సమస్యలపై ప్రతిపాదనలు చేసేందుకు కేంద్ర కమిటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, ఏఓబీ, ఎన్‌టీ స్పెషల్ జోనల్ కమిటీలు ఆయా ప్రాంతాలలో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి ఒక అవగాహనకు వచ్చాయి. ఏఓబీ ప్రాంతానికి

సంబంధించిన అధ్యయనంలో కా. భాస్కర్ పాలు పంచుకున్నారు. తన అనుభవంలోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్, ఏఓబీ అటవీ, మైదాన ప్రాంతాల ప్రజా జీవన పరిస్థితులను, జైలు ఖైదీల పరిస్థితులను చర్చించి ప్రతిపాదనలలో చేర్చేందుకు తోడ్పడ్డారు.

ఈ శాంతి చర్చల కాలంలో పార్టీ కొన్ని బహిరంగ సభలు నిర్వహించింది. ఈస్ట్ డివిజన్‌లో మైదాన ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలోను, సమీప ప్రాంతాలలోనూ జరిగిన ఈ సభల కోసం ప్రచార సామగ్రిని సిద్ధం చేయడంలో, ప్రజా సంఘాల నాయకులకు సభా నిర్వహణకు తయారు చేయడం కోసం కా.భాస్కర్ విశేషంగా కృషి చేసారు. ఈ సందర్భంగా ఏరియా పరిస్థితులు, ప్రజల సమస్యల గురించి, ప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్టులు, అవి దారి తీసే విస్థాపన గురించి కరపత్రాలు, పుస్తకాలు తయారు చేసి పంపిణీ చేయడంలో తన వంతు దోహదం చేసారు. చర్చలు జరిగిన నెల రోజులకే ప్రభుత్వం తిరిగి బూటకపు ఎదురుకాల్పులు ప్రారంభించింది. చర్చల ప్రక్రియ ముగిసింది.

నిర్బంధంలో ఉద్యమాన్ని నిలబెట్టేందుకు కృషి

2004లో ఐక్య పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. అప్పటికి దాదాపు మూడు దశాబ్దాలుగా విడి విడిగా నక్సల్బరీ పంథాలో కొనసాగుతున్న ఎంసీసీఐ, భాకపా (మా–లె) (పీపుల్స్ వార్) పార్టీలు ఐక్యం కావడంతో దేశవ్యాప్త పార్టీ ఏర్పడింది. నూతన పార్టీ దేశ, విదేశాలలో మావోయిస్టు శక్తులకు స్ఫూర్తిదాయకమైనదిగా ఉంటే, పాలక వర్గాలు 'దేశ అంతర్గత భద్రతకు పెను ముప్పు' అని వర్ణించాయి. ఒక దాని తరువాత మరొక నిర్బంధ క్యాంపెయిన్‌లు అమలు చేయసాగాయి. 2005 మధ్య కాలంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సల్వా జుడుం, ఝార్ఖండ్‌లో సేంద్ర నిర్బంధ సైనిక క్యాంపెయిన్‌లు ప్రారంభమయ్యాయి. పొరుగు స్పెషల్ జోన్‌గా దండకారణ్యంలో అమలవుతున్న ఈ నిర్బంధం గురించి ఏఓబీ ఎస్‌జడ్‌సీ విస్తృత ప్రచారం గావించింది. పుస్తకాల ద్వారా, కరపత్రాలు, అపీల్‌ల ద్వారా దీనికి వ్యతిరేకంగా విద్యార్థి, యువజన, మేధావి సెక్షన్స్ నుంచి మద్దతు కూడగట్టేందుకు కృషి చేసింది. ఈ కృషిలో కా. భాస్కర్ క్రియాశీలంగా పాలు పంచుకున్నారు.

దేశవ్యాప్త విప్లవోద్యమంపై నిర్బంధంలో భాగంగా ఏఓబీ ప్రాంతంలో కూడా ప్రభుత్వ సాయుధ బలగాల గస్తీ, కూంబింగ్ తీవ్రతరమయ్యాయి. పార్టీ మార్గదర్శకత్వంలో పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా కమిటీలు, ప్రజా సంఘాలు, ప్రజలు సంయుక్తంగా వీటిని తిప్పికొడుతూ ఉద్యమాన్ని, నిర్మాణాలను నిలబెట్టారు. అయితే తీవ్రమవుతున్న దాడులలో విప్లవ ప్రజా కమిటీల నిర్మాణం కుంటుబడింది. గ్రామ సభలలో ఎన్నికయిన కమిటీ అధ్యక్షులు, సభ్యులు అరెస్టు కావడంతో ఎప్పటికప్పుడు వీటిని భర్తీ చేసుకుంటూ కొనసాగించే క్రమంలో కార్యక్రమాలు సరిగా సాగలేదు. నిర్బంధం తీవ్రతరం కావడంతో కార్యకర్తలలో

పారుబోతుతనం కూడా పెరిగింది. ఈ కఠిన పరిస్థితులలో పార్టీని, ఉద్యమాన్ని నిలబెట్టేందుకు కా. భాస్కర్ తన కమిటీ సభ్యులతో కలిసి సమయానుకూలంగా ఎత్తుగడలు రూపొందించేందుకు కృషి చేసారు.

కేంద్ర కమిటీ సభ్యునిగా ఒడిశా ఉద్యమంలోకి

నూతన పార్టీని సంఘటితం చేసేందుకు కేంద్ర కమిటీ కాంగ్రెస్ నిర్వహించాలని నిర్ణయించింది. 2007లో జరిగిన ఈ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో కా. భాస్కర్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఒక ముఖ్యమయిన ఘట్టం. ఇరు పార్టీల అపార అనుభవాల విశ్లేషణ, సంశ్లేషణ పరిపూర్తి అయింది. పార్టీ మౌలిక దస్తావేజులు, విధాన పత్రాలు సుసంపన్నం అయ్యాయి. ఈ చర్చలలో, పార్టీ పంథాను దృఢంగా నిలబెట్టడంలో ఒక ప్రతినిధిగా కా. భాస్కర్ పాత్ర ఉన్నది. ఈ కాంగ్రెస్‌లో కా. భాస్కర్ ప్రత్యామ్నాయ కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఐక్య పార్టీ ఏర్పాటు సందర్భంగా ఏర్పడిన కేంద్ర స్థాయి బ్యూరోలలోని తూర్పు రీజనల్ బ్యూరో (ఈఆర్‌బీ)లో భాగంగా ఉంటూ ఒడిశా రాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకత్వం అందించారు. 2013లో ఒడిశా రాష్ట్రాన్ని మధ్య రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ)లో భాగం చేయడంతో ఆనాటి నుంచి సీఆర్‌బీలో భాగమయ్యారు.

2007లో పార్టీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న ఒడిశా ప్రాంతంలోకి విస్తరించే కృషిని చేపట్టింది. దండకారణ్యం నుంచి కంపెనీ సంఖ్యలో బలగాలను పంపించింది. కొద్ది కాలం తరువాత ఏఓబీ నుంచి కా. భాస్కర్‌తో పాటుగా మరి కొందరు కామ్రేడ్స్ ఇక్కడకు చేరుకున్నారు. ఆనాటి నుంచి అమరులయేంత వరకు ఆయన మనోజ్ పేరుతో ఈ కమిటీలో భాగంగా పని చేస్తూ వచ్చారు. ఛత్తీస్‌గఢ్-ఒడిశా బార్డర్ కమిటీ నాయకత్వంలో ప్రారంభమయిన ఈ ప్రాంత ఉద్యమం రాజకీయంగా, నిర్మాణపరంగా, సైనికంగా ఎదిగి మూడు డివిజన్‌లుగా అభివృద్ధి అయింది. ఒడిశా రాష్ట్ర కమిటీ ఏర్పడింది.

ఈ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ జిల్లాలయిన గరియాబంద్, ధంతరి అటవీ, మైదాన ప్రాంతాలు కాగా, దానిని ఆనుకుని ఉన్న ఒడిశా రాష్ట్ర సోనబేడ అటవీ ప్రాంతం. మైదాన ప్రాంత ప్రజల జీవితానికి, అటవీ ప్రాంతంలో ఉన్న కువ్వి, భుంజియా, చౌకట్ భుంజియా, కమార్ ఆదివాసీ ప్రజల జీవితానికీ ఎంతో తేడా ఉంటుంది. సోనబేడకు దూరంగా కలహండి, కందమాల్ జిల్లాలున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న నియంగిరి అటవీ ప్రాంత కువ్వి ప్రజల జీవితం మరింత ప్రాచీన పద్ధతులలో ఉండేది. ఈ నిర్దిష్టతలను అర్థం చేసుకోవడం కోసం కా. మనోజ్ విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, మేధావులు చేసిన అధ్యయనాలను సేకరించి చదివేవారు. వీటిలో ఉన్న ప్రధానాంశాలను రాష్ట్ర, డివిజన్, ఏరియా స్థాయి కేడర్ లకు వివరించి చెప్పేవారు.

ఒడిశా ఎర్ర ప్రతిఘటనా ప్రాంత పురోగమన కృషిలో

పార్టీ వ్యూహం–ఎత్తుగడలు దస్తావేజు అందించిన అవగాహన మేరకు ఒడిశా విప్లవోద్యమ స్థాయి ఎర్ర ప్రతిఘటనా ప్రాంతం. దండకారణ్యం గెరిల్లా జోన్‌కు ఆనుకుని ఉన్న ఈ ప్రాంతానికి గెరిల్లా జోన్‌కు మధ్య ఉండవలసిన రాజకీయ, నిర్మాణపర సంబంధం గురించి కేడర్‌లకు అర్థం చేయించేవారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర కమిటీ రూపొందిస్తున్న కర్తవ్యాలను అమలు చేసేందుకు వారికి తోడ్పడేవారు.

ఒడిశా రాష్ట్ర ఉద్యమంలో ఒక ముఖ్యమైన పరిణామం లక్ష్మణానంద సరస్వతి హత్యకు ముందు, తరువాత ఆ ప్రాంత పరిణామాలు. ఒడిశా రాష్ట్రం నయాగఢ్ ప్రాంతంలో బ్రాహ్మణీయ హిందుత్వ పీఠం ఏర్పాటు చేసింది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్). స్థానిక ఆదివాసీ ప్రజలను బలవంతంగా హిందూ మతంలోకి మారుస్తూ వారి తరతరాల అస్తిత్వాన్ని, మనగడను నాశనం చేయసాగింది. ఈ ప్రాంతంలో ఆదివాసీ ప్రజలు చాలా సంవత్సరాల క్రితమే క్రైస్తవం పుచ్చుకున్నారు. వీరిపై ఈ హిందుత్వ పీఠం ప్రత్యేకించి దాడులు చేసింది. క్రైస్తవ మత ప్రచారకుడిగా పని చేస్తున్న ఆస్ట్రేలియా దేశస్తుడయిన స్టెయిన్‌ను కూడా హత్య చేసింది. ఈ ప్రాంతంలోకి ప్రవేశించిన పార్టీ ఆదివాసుల కష్టాలను గమనించింది. వారిని కలిసి వాటికి పరిష్కార మార్గాన్ని బోధించింది. ప్రజల కోరికపై, వారి సహకారంతో ఈ పీఠానికి ముఖ్యుడిగా ఉన్న లక్ష్మణానంద సరస్వతిని పీఎల్‌జీఏ మట్టు గావించింది. ఆ తరువాత ఈ ప్రాంతంలో ఆదివాసులపై ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధం అమలు చేసింది. ఈ పరిణామాలపై మేధావులలో వివిధ రకాలుగా చర్చ సాగింది. ఈ హత్య చేసినందుకే ఈ నిర్బంధం అమలు అయిందనే వాదనను తోసిపుచ్చుతూ మార్క్సిస్టు మేధావులు వివరమైన నివేదిక రూపొందించారు. కా. మనోజ్ ఈ నివేదికను స్థానిక కేడర్‌ల కోసం అనువాదం చేయించి అందులో ఉన్న వాస్తవాలను ప్రచారం చేసారు.

కేబీకే ప్రాంతంగా పేరు పడ్డ కలహండి–బొలాంగిర్–కందమాల్ ప్రాంత వెనుకబాటుతనంపై కూడా ఒడిశా రాష్ట్ర మేధావులు విశేష అధ్యయనం జరిపారు. ఈ ప్రాంతాన్ని అధ్యయనం చేయడంలో భాగంగా కా. మనోజ్ కేడర్‌ల కోసం వీటిలో ముఖ్యమైన అంశాలను ఒడియా భాషలోకి అనువాదం చేయించేందుకు కృషి చేసారు. ఒడిశా రాష్ట్రంలో ఆదివాసీ పోరాటాల చరిత్రలను సేకరించేవారు. వీటిని ఆయా సందర్భాలలో కేడర్‌లకు చెప్పేవారు. రాష్ట్ర కమిటీ అధికార పత్రికగా 'జన్ సంగ్రామ్' ప్రచురించేది. ఈ పత్రిక కోసం తాను బాధ్యునిగా పని చేస్తున్న ప్రాంత రిపోర్టులు రాయించడం, తాను రాయడం కోసం కా. మనోజ్ కృషి చేసేవారు. పార్టీ ప్రజలలో వేళ్లూనుకోవాలంటే స్థానిక భాష నేర్చుకోవడం చాలా అవసరం అన్న అవగాహనతో కా.మనోజ్ ఒడియా భాష

నేర్చుకున్నారు. తెలంగాణా, బస్తర్ ప్రాంతాల నుంచి వచ్చిన కామ్రేడ్స్ కూడా ఒడియా భాష నేర్చుకోవాలని గట్టిగా చెబుతూ అందుకు ప్రోత్సహించేవారు. రాష్ట్ర కమిటీ చొరవతో జన సంగ్రామ్ తరువాత కాలంలో మొత్తంగా ఒడియా భాషలో విడుదలయింది.

ఒడిశాలో విస్థాపన వ్యతిరేక పోరాటాలకు మద్దతుగా

ఒడిశాలో బర్‌గఢ్-బొలాంగిర్ సరిహద్దు ప్రాంతంలో బర్‌గఢ్-బొలాంగిర్-మహాసముంద్ (బీబీఎం) డివిజన్ ఉద్యమంగా ఉన్న గంధామర్దన్ ప్రాంతంతో మొదలుకుని, కలహండి-కందమాల్-బౌద్ధ్-నియంగిరి (కేకేబీఎన్) డివిజన్ ఉద్యమంగా ఉన్న నియంగిరి వరకు విస్థాపన సమస్య తీవ్రమైనది. నియంగిరిని, దీనిని ఆనుకుని ఉన్న దేవ్‌మాలి, సిజుమాలి మొదలయిన ప్రాంతాలను గని తవ్వకాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా కంపెనీ అయిన వేదాంత కంపెనీకి ఇచ్చేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ విస్థాపనకు వ్యతిరేకంగా ప్రజలు మిలిటెంట్ పోరాటాలు చేస్తున్నారు. ఈ పోరాటాలకు పార్టీ సహకరించింది. ప్రజలకు గని తవ్వకాలకు సంబంధించిన సమాచారాన్ని, అది కలిగించే నష్టాలను విశదపరిచేందుకు పుస్తకాలు, కరపత్రాలు పంపిణీ చేసింది. వివిధ వర్గాల నుంచి మద్దతు, సంఘీభావం లభ్యమయిన ఈ విస్థాపన వ్యతిరేక పోరాటం నేడు కొనసాగుతున్నది.

2016 నవంబర్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో కా. మనోజ్ ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. ఒడిశా ఉద్యమానికి మార్గదర్శకత్వం వహిస్తూ వచ్చారు. 2022 జులై నెలలో జరిగిన ఒడిశా రాష్ట్ర ప్రథమ మహాసభ ప్రథమ ప్లీనం జరిగింది. ఈ ప్లీనం సందర్భంగా కామ్రేడ్ మనోజ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల నుండి రిలీవ్ కాగా కామ్రేడ్ చలపతి (జైరామ్) రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. అయితే కేంద్ర కమిటీ ఇచ్చిన బాధ్యతల రీత్యా ఇదే ప్రాంతంలో ఉంటూ తన కమిటీ సభ్యులకు, రాష్ట్ర, జిల్లా కమిటీలకు సహకరించారు.

అనారోగ్య పీడితుడు అయితేనేం, యోధుడే!

రాష్ట్ర కమిటీ పని విభజనలో భాగంగా కా. మనోజ్ ప్రధానంగా కలహండి-కందమాల్-నియంగిరి ప్రాంతంపై కేంద్రీకరించారు. సోనబేడ ప్రాంతం నుంచి ఈ ప్రాంతానికి దాదాపు 5 రోజుల కష్టభూయిష్ట ప్రయాణం ఉండేది. మైదానాలు, రోడ్లు దాటుకుంటూ ఒక నదిని కూడా దాటవలసి వచ్చేది. ముందుగా తయారు చేసుకుని తీసుకువెళ్లే ఆహార పదార్థాలు తింటూనే దళం నడక సాగించేది. అంత కష్టంలోనూ కేడర్‌లను ఉత్సాహపరుస్తూ కా.మనోజ్ ఎన్నో సార్లు ఈ ప్రయాణాలు సాగించారు. ఈ కాలంలో కా. మనోజ్‌కు బీపీ ఎక్కువయింది. షుగర్ వ్యాధి వచ్చింది. థైరాయిడ్ ఉండేది.

వీటికి తోడుగా పోలీసు చిత్రహింసల నుంచి ప్రారంభమయిన కీళ్ల నొప్పులతో బాధపడేవారు. తీవ్ర అనారోగ్యంతో కూడా చెదరని విప్లవ దీక్షతో ఆయన ఒడిశా రాష్ట్రాన్ని ఎర్ర ప్రతిఘటనా ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఎంతగానో కృషి చేసారు. ఈ నడకలతో పాటుగా కేంద్ర కమిటీ సమావేశాల కోసం రెండేళ్లకు ఒకసారి దండకారణ్యానికి వెళ్లేవారు.

కా. మోడెం బాలకృష్ణ ఒక సాధారణ కుటుంబంలో పుట్టి పెరిగి, విద్యార్థి కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించారు. పార్టీలో వృత్తి విప్లవకారునిగా చేరి, దళ సభ్యుని నుంచి అంచెలంచెలుగా కేంద్ర కమిటీ బాధ్యతల వరకు ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏఓబీ మీదుగా ఒడిశా వరకు పని చేసారు. రాజకీయ కార్యాచరణ క్రమంలో విప్లవ కమ్యూనిస్టుకు అత్యంత అవసరం అయిన కార్మికవర్గ లక్షణాలను అలవరచుకున్నారు. పదే పదే జైలు జీవితంలో ఉండడంతో ఆరోగ్యం క్షీణించినప్పటికీ అచంచల దీక్షతో, దృఢ సంకల్పంతో విప్లవ రాజకీయ కృషిని కొనసాగించారు. పనుల రీత్యా ఏ ప్రాంతానికి వెళ్లినా తనకు పరిచయం ఉన్న కేడర్‌లను, లేని కేడర్‌లను కూడా తప్పనిసరిగా కలిసేందుకు ప్రయత్నించేవారు. వారికి ఉద్యమ రిపోర్టులు చెప్పేవారు, వారి నుంచి రిపోర్టులు తీసుకునేవారు. కేడర్‌ల అభిప్రాయాలకు విలువ ఇచ్చేవారు. విప్లవ అనివార్యతను చారిత్రకంగా అర్థం చేయించేవారు. ఆపరేషన్ కగార్ క్రూర దాడుల నుండి పార్టీని, విప్లవోద్యమాన్ని కాపాడడం కోసం చివరి శ్వాస వరకు అకుంఠిత దీక్షతో కృషి చేసారు. ఆ కార్మికవర్గ పుత్రుని ఆదర్శాలను, విలువలను, దృఢ సంకల్పాన్ని పుణికి పుచ్చుకోవడం, ఉద్యమాన్ని పురోగమింపచేయడమే ఆ అమరునికి నివాళి అవుతుంది.

భారత ప్రజాయుద్ధ వీరుడు,
ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు,
కామ్రేడ్ ప్రతాపరెడ్డి (చలపతి, జైరామ్) కి విప్లవ జోహార్లు



మూడు దశాబ్దాలకు పైగా శ్రీకాకుళం, తూర్పు కనుమలు, ఒడిశా ప్రాంతాలలో విప్లవోద్యమ నిర్మాణంలో భాగమైన సాహసిక యోధుడు, వీర గెరిల్లా నాయకుడు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ చలపతి (జైరామ్) ఒడిశా రాష్ట్రం గరియాబంద్ జిల్లాలో మైన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో కుల్హాడీఘాట్ రక్షిత ప్రాంత అడవిలో భాలూడిగ్గీ వద్ద ఒడిశా–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు బలగాలు, కేంద్ర బలగాలు కలిసి చేసిన చుట్టివేత దాడిలో వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. కా. చలపతితో పాటు 18 మంది కామ్రేడ్స్ 40 గంటల పాటు సాహసంగా పోరాడి భారత దేశ పీడిత ప్రజల కోసం తమ ప్రాణాలు అర్పించారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. ఆపరేషన్ కగార్‌లో భారత విప్లవోద్యమానికి, పార్టీకి ఎదురైన మరో పెద్ద నష్టం కా. చలపతి అమరత్వం.

కామ్రేడ్ చలపతికి తల్లితండ్రులు పెట్టిన పేరు ప్రతాపరెడ్డి. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలంలోని మత్యం కొత్తపల్లి (పైపల్లె) గ్రామంలో లక్ష్మమ్మ, రామసుబ్బారెడ్డి దంపతులకు కలిగిన ముగ్గురు మగపిల్లలలో ప్రతాపరెడ్డి మూడవవారు. ప్రతాపరెడ్డి 1964లో జన్మించారు. స్వగ్రామంలోనే ప్రాథమిక విద్యను అభ్యసించారు. చిన్నతనం నుండి తెలివితేటలతో చురుకుగా వుండే ప్రతాప్ కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల ప్రేమాభిమానాలు చూరగొన్నారు. రైతు కుటుంబంలో జన్మించిన ప్రతాప్ పొలం పనులలో పాలు పంచుకుంటూ హైస్కూలు విద్యను బంగారుపాలెం హైస్కూలులోను, ఇంటర్మీడియెట్, బీఎస్‌సీ చిత్తూరు పట్టణంలోను పూర్తి చేసారు. చదువు పూర్తయిన కొద్దికాలానికే మదనపల్లిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెరీకల్చర్ (పట్టు పరిశ్రమ) శాఖలో ఉద్యోగం వచ్చింది. 1988లో ఫీల్డ్ ఫోర్‌మెన్‌గా పదోన్నతిపై విజయనగరం జిల్లా పార్వతీపురంకు బదిలీ అయ్యారు.

ఈ కాలంలో జిల్లాలో పని చేస్తున్న మునుపటి భాకపా (మా–లె)(పీపుల్స్‌వార్) సెంట్రల్ ఆర్గనైజర్‌తో పరిచయం ఏర్పడింది. ఆర్గనైజర్ ద్వారా ఆ ప్రాంతంలో జరిగిన శ్రీకాకుళం గిరిజన సాయుధ పోరాట చరిత్ర గురించి తెలిసింది. పార్టీ పత్రికలు, సాహిత్యం చదువుతూ, ఆర్గనైజర్‌తో చర్చిస్తూ విప్లవ రాజకీయాలకు చేరువయ్యారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతానికీ, ఈ ప్రాంతానికీ ఉత్పత్తి విధానంలో వెనుకబాటుతనంలో ఉన్న పోలికలు చూసారు. బ్రిటిషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా తమ ప్రాంతంలో పాలెగాళ్లు తిరగబడితే, ఈ ప్రాంతంలో రాజులు తిరగబడ్డారు. అక్కడా, ఇక్కడా ప్రజలు వీరికి మద్దతు అందించారు. ఇటువంటి పోరాటాల వల్లనే బ్రిటిషు సామ్రాజ్యవాదులు భారత దేశం విడిచి వెళ్లారని అర్థం చేసుకున్నారు. ఈ పోరాటాల ప్రాధాన్యతను అవగాహన చేసుకున్నారు. ఆర్గనైజర్‌కు సహకరించసాగారు. విప్లవోద్యమంపై తీవ్ర నిర్బంధం అమలు

చేస్తూ ఆనాడు రాష్ట్రంలో ప్రభుత్వం 'ఆట, మాట, పాటా బంద్' చేసింది. కొన్ని ప్రజా సంఘాలు బహిరంగంగా పని చేస్తుంటే, ప్రధానంగా ఉద్యమ కార్యక్రమాలు రహస్యంగానే సాగుతున్నాయి. అడపా దడపా బహిరంగ కార్యక్రమాలకు వెళ్లినా ప్రధానంగా ఆర్గనైజర్‌తో కలిసి రహస్య కార్యక్రమాలలో పాల్గొంటూనే కా. చలపతి విప్లవ రాజకీయ కార్యకలాపాలలో క్రియాశీలంగా పని చేయసాగారు. ఈ క్రమంలోనే 1988లో పూర్తికాలం విప్లవకారునిగా పని చేయడానికి నిర్ణయించుకుని ఉద్యోగానికి రాజీనామా చేసారు.

ఉద్దానం నాయకునిగా

పార్టీ కా. చలపతిని నాటి శ్రీకాకుళ పోరాట ప్రాంతమైన ఉద్దానంలో పని చేసేందుకు పంపించింది. ఉద్దానంలో 1969-70 నాటి శ్రీకుకుళ సాయుధ పోరాట ప్రభావం బలంగా వుంటుంది. ఈ ప్రాంత పోరాటాల గురించి తెలుసుకుని ఉన్న కా. చలపతి సుధ పేరుతో మందస, సోంపేట మండలాల్లో గ్రామీణ ప్రాంతంలో కేంద్ర ఆర్గనైజర్‌గా పని చేస్తూ త్వరలోనే ప్రజలకు సన్నిహితమయ్యారు. 1990లో దళాలు ఏర్పడిన తర్వాత చలపతి ఉద్దానం దళ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1990-91 నుండి ఉద్దానం ప్రాంతంలో మత్స్యకారుల సమస్యలు, రైతాంగం సమస్యలు, వెనుకబడిన ప్రాంతానికి ఉండే ప్రత్యేక సమస్యలను అధ్యయనం చేస్తూ ప్రజలను సంఘటితం చేయసాగారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మార్గదర్శకత్వంలో పని చేస్తూ, వారికి నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలు నేర్పి తమ సమస్యలపై పోరాటాలు చేపట్టే విధంగా సంసిద్ధులను చేసారు. తదనుగుణంగా దళంలో ఉన్న పార్టీ కేడర్‌లకు అవగాహన కల్పించారు. ఉద్దానం దళాన్ని క్రియాశీలంగా నడిపారు. జీడిపిక్కల పరిశ్రమలలో కూలిరేట్ల పెంపుదల, చేపలు పట్టే పల్లెకారుల పై షావుకార్ల దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాటాల నుండి భూముల ఆక్రమణ పోరాటం వరకు అన్ని రకాల ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యలపై పోరాడడం, ప్రజల మధ్య కోర్టులు నిర్వహించి ప్రజా వ్యతిరేకులను శిక్షించడంలో చలపతి పాత్ర ప్రముఖంగా వుండేది.

విద్యార్థి, యువజనులను రాజకీయంగా చైతన్యపరిచి రిక్రూట్ చేయడంలో, పట్టణ, మైదాన ప్రాంతాలలో ఉద్యమాన్ని విస్తరింపచేయడంలో ఆనాడు చేసిన కృషి వలన ఉద్యమం క్రమంగా గతంలో శ్రీకాకుళ పోరాటం జరిగిన ప్రాంతాలకు విస్తరించింది. సవర, జాతాపు ఆదివాసీ ప్రజల్లో విప్లవోత్తేజాన్ని పునరుద్ధరించి, వారి అభిమానాన్ని పొంది, దళాలకు నాయకత్వాన్ని అందించారు. ప్రజలలో వేళ్ళూనుకుంటున్న ఉద్యమాన్ని విస్తరించాలని పార్టీ నిర్ణయించింది. ఈ కర్తవ్యాన్ని అమలు చేసేందుకు కా. సుధ తన తోటి కమిటీ సభ్యులతో, దళ సభ్యులతో కలిసి తీవ్రంగా కృషి చేసారు. ఈ కృషి ఫలితంగా గుమ్మలక్ష్మీపురం, కొండబారిడి ఏరియాల నుండి ఉద్యమం ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా

సరిహద్దు వరకు విస్తరించింది. రాష్ట్ర కమిటీ మార్గదర్శకత్వంలో ఒక దశాబ్ది కాలంలో విజయనగరం–శ్రీకాకుళం జిల్లాల ఉద్యమం ఉమ్మడి డివిజన్ ఉద్యమంగా అభివృద్ధి చెందింది. ఈ కృషిలో కా. సుధ పాత్ర కీలకమైనది.

ఈ ప్రాంత అనుభవంతో రాజకీయంగా ఎదిగిన కా. సుధకు పార్టీ 1995లో జిల్లా కమిటీ సభ్యునిగా పదోన్నతి కల్పించింది. ఈ సంవత్సరం చివరిలో కా. సుధ ఈ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న చందనగిరి దళాన్ని చేరుకుని జిల్లా కమిటీ నుంచి మార్గదర్శకత్వం అందించారు. 1996 నాటికి ఈ కమిటీ గైడెన్స్‌లో 7 దళాలు వుండేవి – 1. ఉద్దానం, 2. మహేంద్రగిరి, 3. కొండబారిడి, 4. దేవగిరి, 5. చందనగిరి, 6. నాగావళి, 7. జంఝావతి. ఈ దళ ప్రాంతాల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించేందుకు తగిన ఎత్తుగడలు చేపడుతూ కమిటీ ఈ ప్రాంత ఉద్యమాన్ని పురోగమింపజేసింది. ఈ పురోగమన కృషిలో కా. సుధ పాత్ర చాలా ముఖ్యమైనది. ఈ కాలంలో సరిహద్దున ఉన్న ఒడిశాలో గొట్ట ఏరియా పాండ్రతల భూస్వామి రామారావుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం చాలా కాలం కొనసాగింది.

ఉత్తరాంధ్ర ప్రాంతమైన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో రైతాంగ ప్రజల పేదరికపు పరిస్థితిని అవకాశంగా తీసుకుని దక్షిణ కోస్తా జిల్లాల నుంచి భూస్వాములు రాసాగారు. ఈ ప్రాంతంలో భూములు కొని తోటలు వేసారు. అతి తక్కువ కూలీతో వ్యవసాయ పనులు జరిపించుకున్నారు. ఈ భూస్వామ్య వర్గం అప్పటికి అర్ధ దశాబ్దంగా అధికారంలో ఉన్నది. యావదాంధ్రలోనూ తమ బలం పెంచుకుని, ఇతర ప్రాంతాల నుంచి పెట్టుబడిని ఆహ్వానించి తాము పారిశ్రామికంగా కూడా లాభం పొందే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న నిర్బంధంలో భాగంగా ఈ ప్రాంతంలో కూడా నిర్బంధం తీవ్రతరం కాసాగింది. గడచిన శ్రీకాకుళ పోరాట అనుభవంతో ఈ పోరాటాన్ని ఎదగనీయకుండా, విప్లవోద్యమం విస్తరించకుండా చర్యలు తీసుకోవడం దోపిడీ పాలక వర్గాలకు అవసరం. 'నక్సలైట్ల అణచివేత' కోసం ప్రత్యేక గ్రేహౌండ్స్ పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలలో క్రూర నిర్బంధం అమలు చేయసాగింది.

ఈ నిర్బంధంలో 1990–2000ల మధ్య శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో పార్టీ కేడర్‌లు ఎన్నో సార్లు దాడులకు గురయ్యారు. ప్రజలపై దాడులు జరిగాయి. కొద్దిమంది కామ్రేడ్స్ అమరులయ్యారు, మరి కొద్ది మంది అరెస్టయ్యారు. ఇటువంటి అనేక దాడుల నుండి కా. సుధ తప్పుకున్నారు. 1997 అక్టోబరులో ముఖలింగాపురం వద్ద జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. 1998 ఏప్రిల్‌లో జరిగిన గొట్ట ఎన్‌కౌంటర్‌లో చిట్టెక్కతో పాటు నలుగురు మహిళా కామ్రేడ్స్ అమరులయ్యారు. 1998

ఆగస్టు 9న తేదీన ఒడిశా రాష్ట్ర పరిధిలో ఉన్న కోపర్‌డాంగ్‌లో శ్రీకాకుళం జిల్లా పార్టీ ప్లీనం జరుగుతుండగా పోలీసులు చేసిన దాడిలో 13 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. అందులో శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి గంటి రమేష్ (రాజన్న) (ఆర్‌సీఎమ్)తో పాటు, జిల్లా కమిటీ సభ్యుడు, కమాండర్లు అమరులు కావడంతో జిల్లా ఉద్యమానికి తీవ్ర నష్టం జరిగింది. ఈ వరుస నష్టాల తర్వాత ఉద్యమాన్ని, కేడర్‌ను కాపాడుకుంటూ ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి కా. సుధ తన కమిటీ సభ్యులతో కలిసి విశేషంగా కృషి చేసారు. ఉద్యమంతో పాటుగా ఎదుగుతూ, అవసరాలకు తగిన విధంగా తన్ను తాను మలుచుకుంటూ జిల్లా నాయకునిగా కీలక భూమిక నిర్వహించారు. 2000 సంవత్సరంలో ఈస్ట్ డివిజన్‌కు బదిలీ అయిన కా. సుధ ఇక్కడ చలపతి పేరుతో పని చేసారు.

ఈస్ట్ డివిజన్ ఉద్యమ పురోగమనంలో

ఈస్ట్ డివిజన్‌కు ఒక ప్రత్యేకత ఉన్నది. 1980లో గెరిల్లా జోన్ పర్స్‌పెక్టివ్‌ను రూపొందించుకున్న పార్టీ తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్ నుంచి ప్రాణహిత నదిని, గోదావరి నదినీ దాటి మహారాష్ట్ర సిరొంచ ప్రాంతానికి చేరుకున్న సమయంలోనే విశాఖపట్నం-తూర్పు గోదావరి జిల్లాల అటవీ ప్రాంతం అయిన మన్యం ప్రాంతంలోకి అడుగు పెట్టింది. మలేరియా డాక్టర్ల పేరుతో అమరులు కామ్రేడ్ బీఆర్, కామ్రేడ్ చంటి మొదలయిన పార్టీ కార్యకర్తలు ప్రజలలో విప్లవ కృషి ఆరంభించారు. అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన మన్యం పితూరీ వారసత్వంలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం వెలుగులో, విప్లవం గురించి స్పష్టమైన వ్యూహం-ఎత్తుగడలతో సాగుతూ వచ్చిన రాజకీయ కృషి ప్రజలలో పోరాట చైతన్యానికి తిరిగి రూపం కల్పించింది. పార్టీ నిలదొక్కుకుని క్రమంగా ఈ ప్రాంత ఉద్యమం శత్రువుకు సవాలు విసిరే స్థాయికి చేరుకుంది.

1995లో జరిగిన పార్టీ అఖిల భారత ప్రత్యేక మహాసభ (ఏఐఎస్‌సీ) ఇచ్చిన మార్గదర్శకత్వంలో దండకారణ్యంలో భాగంగా వున్న ఈస్ట్ డివిజన్ ఉద్యమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ గైడెన్స్‌కు బదిలీ అయ్యింది. శ్రీకాకుళం డివిజన్‌ను, ఈస్ట్ డివిజన్‌ను, విశాఖ పట్టణాన్ని కలిపి ఈస్ట్ రీజియన్ ఉద్యమంగా అభివృద్ధి చేసే కృషి ప్రారంభమయింది. ఈ కృషిలో కా. చలపతి భాగమయ్యారు. ఈ ప్రాంతం గురించి పరోక్ష పరిచయం ఉన్నప్పటికీ రాజకీయ, నిర్మాణపర, సైనిక కృషి చేసేందుకు ఇది సరిపోదు. ప్రజల జీవన పరిస్థితుల గురించి, సమస్యల గురించి, ప్రభుత్వం ఈ ప్రాంతంలో చేపడుతున్న బూటకపు సంస్కరణల గురించి కా. చలపతి తన పై కమిటీ నుంచి, ప్రజల నుంచి తెలుసుకుని అధ్యయనం చేసారు. 1980వ దశకం మధ్య నాటి నుంచే తీవ్ర నిర్బంధం చవి చూస్తూ వస్తున్న ఈస్ట్ డివిజన్‌లో ప్రజలు అప్పటికే నిర్బంధంలో పని చేయడం

నేర్చుకుని ఉన్నారు. కాఫీ ఎస్టేట్‌లలో ఆదివాసీ ప్రజలపై సాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేసి ఉన్నారు. షావుకార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఉన్నారు. గైరాదివాసీ భూస్వాములు ఆదివాసీ మహిళలను పెళ్లి పేరుతో మోసం చేసి వారి పేర భూమి రాయించుకుని అనుభవిస్తున్న దానికి వ్యతిరేకంగా ఉద్యమించి ఉన్నారు. అటవీ ఉత్పత్తుల రేట్లు పెంచుకోవడం కోసం మిలిటెంట్ పోరాటాలు చేసి ఉన్నారు. 1987లో గుర్తేడు గ్రామం వద్ద నుంచి ఏడుగురు ఐఏఎస్ అధికారులను కిడ్నాప్ చేసిన పార్టీ వారిని విడిచిపెట్టాలంటే, జైలులో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని డిమాండ్ చేసి విజయవంతం అయిన ఘటన, పాలక వర్గాన్ని కుదిపివేసిన తొలి ఆంబుష్‌లలో ఒకటైన దారగడ్డ ఆంబుష్ మొదలయిన వాటి ప్రభావం ప్రజల మీద ఉన్నది. ఈ వారసత్వాన్ని, ఈ ప్రభావాన్ని ప్రజా యుద్ధ పురోగమనం కోసం మలుచుకుంటూ నాయకత్వ కమిటీ ఎత్తుగడలు చేపట్టింది. ఈస్ట్ డివిజనల్ కమిటీ సభ్యునిగా కా. చలపతి ఈ ఎత్తుగడల అమలులో క్రియాశీలంగా కృషి చేసారు.

డివిజన్ ఉద్యమం బలోపేతం అవుతుండడంతో ప్రభుత్వం నిర్బంధాన్ని కొనసాగిస్తూ వచ్చింది. సైనిక గస్తీ, బూటకపు ఎదురుకాల్పులతో పాటుగా ప్రజలను, కార్యకర్తలను వివిధ రకాలుగా లొంగదీసుకునే ప్రయత్నం చేయసాగింది. అందులో పోలీసు కౌన్సిలింగ్ ఒకటి. కౌన్సిలింగ్ పేరిట పార్టీలో పూర్తి కాలం పని చేస్తున్న కార్యకర్తల కుటుంబాలను కలిసి వారి ద్వారా వారిని లొంగదీసుకోవాలని ప్రయత్నించింది. సైనిక ప్రతిఘటనా చర్యలతో పాటుగా, దీనికి ప్రతిగా రాష్ట్ర కమిటీ మార్గదర్శకత్వంలో డివిజన్ కమిటీ ప్రచార క్యాంపెయిన్ చేపట్టింది. శత్రు కుట్రలను బహిర్గతపరుస్తూ పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం, ఇతర కార్యక్రమాలు చేపట్టింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రజలలో ప్రచారం చేస్తూనే కా. చలపతి మరింత నిర్దిష్టంగా కృషి జరిపేందుకు కేడర్ తల్లితండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడేవారు. ఇదంతా కపట నాటకమని, విప్లవోద్యమం పై మరో రూపంలో దాడి అని, ప్రజా జీవనంపై సయితం ఇది నకారాత్మక ప్రభావం వేస్తుందంటూ వివరించేవారు.

2000లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలో కా. చలపతి ఈస్ట్ రీజియన్ ప్రతినిధిగా పాలు పంచుకున్నారు. దేశంలో కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత కోసం పార్టీ చేస్తూ వస్తున్న కృషిలో భాగంగా 1998లో భాకపా (మా-లె)(పీపుల్స్‌వార్), భాకపా (మా-లె) (పార్టీ యూనిటీ) గ్రూపులు ఐక్యమయ్యాయి. ఈ ఐక్యతా క్రమంలో గెరిల్లా జోన్ ప్రాంతాలను బలోపేతం చేసుకోవడంపై కూడా చర్చ జరిగింది. బీహార్ ప్రాంతంలో కోయల్-కైమూర్ మొదలయిన ప్రాంతాలపై కేంద్రీకరిస్తే, ఆంధ్రప్రదేశ్-దండకారణ్యం ప్రాంతాలలో గడచిన దశాబ్దాలుగా సాగుతున్న కృషిని పునస్సంఘటితం చేయాలని

నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు ఈ మహాసభలో ఈస్ట్ రీజియన్ ప్రాంతానికి శ్రీకాకుళం డివిజన్‌ను, దండకారణ్యంలో భాగంగా ఉన్న మల్కన్‌గిరి జిల్లా కలిమెల ప్రాంతాన్ని కలిపి ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్ స్పెషల్ జోన్ ఏర్పచింది. ఈ జోన్‌కు నాయకత్వ కమిటీగా ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ (ఏఓబి ఎస్‌జడ్‌సీ) ఏర్పాటయింది. ఈ రెండు పార్టీల ఐక్యతా క్రమాన్ని సంఘటితం చేసుకునేందుకు పార్టీ 2001లో కాంగ్రెస్ నిర్వహించింది. ఈ కాంగ్రెస్ నిర్ణయాలలో భాగంగా నూతనంగా ఏర్పడిన ఏఓబీ స్పెషల్ జోన్‌లో పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలు బలోపేతం కాసాగాయి.

2001లో జరిగిన ఏఓబి స్పెషల్ జోన్ రెండవ మహాసభలో కా. చలపతి ఎస్‌జెడ్‌సీ సభ్యునిగా ఎన్నికయ్యారు. సైనిక అనుభవాన్ని గడించుకున్న కా. చలపతి ఏఓబీ జోన్ సైనిక కమిషన్ (ఎస్‌ఎమ్‌సీ) సభ్యునిగా ఎన్నికయ్యారు. అమరులు కా. బీఆర్, కా. బీకేల నేతృత్వంలో సైనిక చర్యలలో ఎన్నో విజయాలు సాధించిన ఈస్ట్ డివిజన్‌లో, వారి నుంచి నేర్చుకుంటూ కా. చలపతి ఒక సైనిక యోధునిగా రూపొందారు. ప్రజా యుద్ధ పురోగమనంలో రాజకీయ కృషికి, సైనిక కృషికి ఉన్న గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకుని అందుకోసం ఎంతగానో శ్రమించారు. సైనిక కమాండర్‌గా కేడర్‌ల విశ్వాసం చూరగొన్నారు. ఉద్యమం పురోగమిస్తూ ఈ జిల్లాలలో మైదాన, పట్టణ ప్రాంతాలను కూడా ప్రభావితం చేస్తూ వచ్చింది. పార్టీ అందించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ కా. చలపతి రాజకీయ, నిర్మాణపర, సైనిక కృషిలో ఎదుగుతూ, ఎస్‌జడ్‌సీ సెక్రటేరియట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. దేశ విప్లవోద్యమంలో భాగంగా ఉన్న ఏఓబీ స్పెషల్ జోన్ ప్రాంతంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

ఐక్యతా కృషిని కొనసాగించిన పార్టీ ఎంసీసీఐతో నిలిచిపోయిన ఐక్యతా చర్చలను తిరిగి కొనసాగించింది. ఈ చర్చలు 2004లో భాకపా (మా-లె)(పీపుల్స్‌వార్), ఎంసీసీఐ ఐక్యతకు కృషి చేసాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దేశవ్యాప్త పార్టీగా ఆవిర్భవించింది. ఈ ఆవిర్భావాన్ని అమరులు కా. అక్కిరాజు హరగోపాల్ నాయకత్వంలో అప్పటికి రాష్ట్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు వెళ్లి ఉన్న ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సభ జరిగింది. ఈ సభకు ఈస్ట్ డివిజన్ నుంచి ప్రజలను, విప్లవ సాంస్కృతిక కళాకారులను పంపడంలోను, నూతన పార్టీ ఆవిర్భావ ప్రాధాన్యతను ప్రజలకు, కేడర్‌లకు వివరించడంలోనూ ఎస్‌జడ్‌సీ సభ్యునిగా కా. చలపతి ఉత్సాహంతో పాలు పంచుకున్నారు. ఈ ఐక్యతా కృషిని సంఘటితం చేసుకుంటూ 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో ఏఒబి ఎస్‌జెడ్‌సీ నుండి ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ కాంగ్రెస్‌లో కా. చలపతి కేంద్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యునిగా ఎన్నికయ్యారు.

నారాయణపట్నా భూస్వామ్య వ్యతిరేక పోరాట నాయకునిగా

2003 నుండి పార్టీ ఒడిశా రాష్ట్రం కోరాపుట్ ఏరియాలో కేంద్రీకరించి చేస్తున్న కృషి 2010 నాటికి ఒక డివిజన్ ఉద్యమంగా ఎదిగింది. అప్పుడే ఈ ప్రాంత ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న భూమి సమస్య పార్టీ దృష్టికి వచ్చింది. కోరాపుట్ జిల్లా నారాయణపట్నా భూపోరాటం స్థానిక భూస్వాములను, పాలక వర్గాలను కుదిపివేసింది. ఆదివాసీయేతర భూస్వాములు తమ ప్రాంతంలో భూములు ఆక్రమించి తమను కూలీలుగా చేయడానికి వ్యతిరేకంగా ప్రజలు ఒక మా–లె గ్రూపు నాయకత్వంలో పోరాటం చేస్తున్నారు. అయితే మితవాద రాజకీయాలతో ఉన్న ఈ గ్రూపు ప్రజల సంసిద్ధతకు అనుగుణంగా ఈ పోరాటాన్ని తీర్చిదిద్దలేకపోయింది. ప్రజలు దీని పట్ల అసంతృప్తితో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ వారికి అండగా నిలిచింది. పార్టీ మార్గదర్శకత్వంలో ఈ పోరాటం అత్యంత మిలిటెంట్ రూపం తీసుకుంది. ఏఓబీ ఎస్‌జడ్‌సీ ఈ ప్రాంతానికి కా. చలపతిని కేటాయించింది. అప్పుడు ఇది శ్రీకాకుళం–కోరాపుట్ డివిజన్‌గా ఉండేది. ఈ డివిజన్ బాధ్యునిగా కా. చలపతి నారాయణపట్నా భూపోరాటానికి మార్గదర్శకత్వం వహించారు. ప్రజలలో మితవాద రాజకీయాల పరిమితులను విడమర్చి చెప్పి, భూసమస్య నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా ఉన్న వ్యవసాయ విప్లవంలో ఎలా అంతర్భాగంగా ఉంటుందో తెలియజేసారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు ప్రజా సైన్య మద్దతు ఏ విధంగా అవసరమో వారికి తెలియజెప్పి, వారు పీఎల్‌జీఏలో భర్తీ అయ్యేందుకు ప్రోత్సహించారు. రైతాంగానికి పీఎల్‌జీఏ బలగాలు మద్దతు యిచ్చేలా గైడ్ చేసారు. నారాయణపట్నా భూపోరాటం ఆ ప్రాంతంలోని కువ్వి ఆదివాసీ ప్రజల గొప్ప పోరాట శక్తిని, తెగువను చాటి చెప్పింది.

2009 జూన్‌లో ఛాసి మూలియా సంఘం నాయకత్వంలో 'మనోబల్ మీటింగ్'లు జరిపి 'దున్నేవారికే భూమి నినాదం'తో ప్రజలు భూపోరాటానికి సిద్ధమయ్యారు. నారాయణపట్నాలో పెద్ద భ్యూస్వాములైన కుంజోపోడి, కుసరాజులకు సంబంధించిన 700 ఎకరాలతో పాటు మొత్తం 2,500 ఎకరాల భూములు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూముల్లో ఎర్ర జెండాలు పాతారు. బొరిగి, నాగులబెడ్డలలో 2007లో మొదలైన భూస్వామ్య వ్యతిరేక భూపోరాటం నారాయణపట్నా పోరాటంతో ఊపు అందుకుని 7 పంచాయితీలలో 159 గ్రామాలకు విస్తరించింది. 2010లో, 2012 లలో కూడా బందుగాం బ్లాక్‌లోని అనేక గ్రామాల్లో వేలాదిగా ప్రజలు పోరాడి భూములు స్వాధీనం చేసుకున్నారు.

2009 నవంబర్ 20న నారాయణపట్నా పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన ర్యాలీ పై కాల్పులు జరిపి ఆదివాసీ యువకులు సింగన్న, ఆంధ్రూలను పోలీసులు

హత్య చేసారు. ఆ ప్రాంత ప్రజలపై అనేకసార్లు దాడులు చేసి మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసారు. పంటలను ధ్వంసం చేసారు. ప్రజలను బలవంతంగా సరెండర్ చేయించారు. అయినా ప్రజలు భయపడకుండా పోరాడి భూస్వాములు అన్యాయంగా లాక్కున్న భూములను సాధించుకున్నారు. భూస్వాములు అధికారుల అండతో అక్రమ పట్టాలతోను, పట్టాలు లేకుండాను అక్రమంగా 2,500 ఎకరాల భూమిని ఆదివాసుల నుండి అక్రమంగా లాక్కున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1/70 చట్టం వున్నట్లే ఒడిశాలో 2/56 చట్టం వున్నప్పటికీ కుట్ర పద్ధతుల్లో కాజేసారు.

విద్యార్థి, యువజనులను ఆర్గనైజ్ చేయడంలో వచ్చిన అనుభవం క్రమంగా రైతాంగ పోరాటాలను, ఆదివాసీ ప్రజల సమస్యలపై, జీడిపిక్కలు, గొచ్చకందులు, పసుపు మొదలగు పంటల గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు నిర్వహించడానికి కా. చలపతికి ఎంతో తోడ్పడింది. గంజాయి పండించడాన్ని నిరుత్సాహపరిచి, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం పార్టీ నిధుల్ని కేటాయించే విధంగా కృషి చేశారు.

2004లో జరిగిన కోరాపుట్ దాడి సందర్భంగా, 2009 ఏప్రిల్‌లో చేసిన దామనజోడి నాల్కో పంచవటి మహల్ ఆయుధ గోడౌన్ పై పీఎల్‌జీఏ దాడి సందర్భంగా, అలాగే 2009 టీసీఓసీలో భాగంగా జూన్ నెలలో జరిగిన పాలూరు డెలిబరేట్ ఆంబుష్, కరువు దాడి మొదలయిన చర్యలలో ప్రజలు అన్ని విధాల సహకరించారు. వారిలో వున్న ఈ పోరాట సంసిద్ధతకు అనుగుణంగానే పార్టీ వారి భూపోరాటాన్ని మిలిటెంట్‌గా నిర్వహించింది.

కేంద్ర కమిటీలోకి

పార్టీ ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తూ కా. చలపతి 2011 సంవత్సరంలో కేంద్ర కమిటీలోకి కో-ఆప్ట్ అయ్యారు. అయితే 2012లో తన పొరపాటు వలన మైన్ విస్ఫోటనం చెందిన ఘటనలో ఒక కామ్రేడ్ అమరుడు కావడంతో డిమోషన్‌కు గురయ్యారు. ఈ డిమోషన్‌ను ఒక నిజమైన కమ్యూనిస్టు స్ఫూర్తితో స్వీకరించిన కా. చలపతి నిజాయితీగా స్వయం విమర్శ చేసుకున్నారు. ఆత్మన్యూనతకు గురి కాకుండా, ప్రజలను అంటి పెట్టుకుని ఉన్నారు. పై కమిటీ, తన సహచర కమిటీ సభ్యులు అందించిన మద్దతుతో తన్ను తాను సరిదిద్దుకున్నారు. కా. చలపతి ఆచరణలో దిద్దుబాటును పరిశీలించిన కేంద్ర కమిటీ ఆయనను తిరిగి 2018లో కమిటీలోకి తీసుకుని ఒడిశా రాష్ట్రానికి బదిలీ చేసింది. 2019 అక్టోబరులో జరిగిన ఏఓబీ స్పెషల్ జోన్ ప్లీనంలో కా. చలపతి పాల్గొని అంతకాలంగా శ్రీకాకుళం, కోరాపుట్, ఈస్ట్ డివిజన్‌లలో తన అనుభవాలను సంశ్లేషిస్తూ, ఉద్యమ పురోగమనానికి తీసుకోవలసిన ఎత్తుగడలను చర్చించారు. ఈ ప్లీనంలో రిలీవ్ అయ్యి, ఒడిశాకు ప్రయాణం ప్రారంభించారు.

అప్పటికి కా. చలపతికి బీపీ వచ్చి ఉన్నది. సుదీర్ఘ కాలంగా శ్రీకాకుళం, ఈస్ట్ డివిజన్‌లలో కొండలు ఎక్కీ, దిగీ మోకాళ్లు దెబ్బ తిన్నాయి. రెండు చేతుల్లోను రెండు కర్రలు పట్టుకోకుండా నడవలేని స్థితి వచ్చింది. అటువంటి శారీరక సమస్యలలో కూడా చెక్కు చెదరని విప్లవ దీక్షతో ఈస్ట్ డివిజన్‌లో తన బాధ్యతలు కొనసాగించారు. కోరాపుట్‌లో నిర్బంధం తీవ్రతరమై ఖాళీ చేసి ఈస్ట్ డివిజన్‌కు వచ్చిన నాయకత్వానికి మార్గదర్శకత్వం అందించారు. కొన్ని ఎదురుకాల్పుల ఘటనల నుంచి తప్పించుకోగలిగారు. పార్టీ నిర్ణయాన్ని క్రమశిక్షణతో శిరసావహించి ఈ శారీరక స్థితిలో సయితం సుదీర్ఘ ప్రయాణం సాగించారు. ఒడిశా రాష్ట్ర నిర్మాణ బాధ్యతలతో పాటుగా కందమాల్ జిల్లాలో మహానది ఆవల ఉన్న ప్రాంతం ద్వారా ఝార్ఖండ్ రాష్ట్రంలో పార్టీతో సంబంధాలు పునరుద్ధరించడం కేంద్ర కమిటీ కా. చలపతికి ఇచ్చిన మరొక కర్తవ్యం. ఈ కర్తవ్యాలను ఆయన విప్లవోత్సాహంతో, ప్రజల అంతిమ విజయం పట్ల గొప్ప విశ్వాసంతో చేపట్టారు. ఒడిశాలో జైరామ్ పేరుతో పని చేసిన కా. చలపతి 2022లో జరిగిన రాష్ట్ర ప్లీనంలో రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ప్రాంతాన్ని అధ్యయనం చేస్తూ ఈ కర్తవ్యాలను నిర్వహిస్తూనే తన ప్రాణాలు అర్పించారు.

సాహసిక గెరిల్లా యోధుడు

శత్రువుతో జరిగిన ఎదురుకాల్పులలో, శత్రువు పై చేసిన మెరుపు దాడుల్లో వీరోచితంగా పోరాడిన సాహసిక వీర గెరిల్లా యోధుడు, ప్రజా యుద్ధ సేనాని కామ్రేడ్ చలపతి. ప్రజల విముక్తి కోసం పని చేయాలంటే ప్రజా సైన్యం తప్పనిసరి అని ఆచరణ నుంచి అర్థం చేసుకున్నారు. కామ్రేడ్ మావో రాసిన సైనిక వ్యాసాలు అధ్యయనం చేసారు. వాటిని ఆచరణలో అన్వయించేందుకు కృషి చేసారు. ఆయన రాజకీయ జీవితంలో సైనిక చర్యలు ఒక ప్రధాన అంశం. ఉద్దానంలోను, ఆ తరువాత కాలంలో మన్యంలో ఈస్ట్ డివిజన్‌లోనూ కా. సుధ ఎన్నో చర్యలలో పాలు పంచుకున్నారు, నాయకత్వం వహించారు. దూకుడుగా వస్తున్న శత్రువును ఆంబుష్ దాడుల్లో హతమార్చి, తుపాకులను స్వాధీనం చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఉద్దానంలో పని చేస్తున్నప్పుడే సుధ దళం అంటే పోలీసులకు చాలా భయం ఉండేది.

ఈస్ట్ డివిజన్ ప్రాంతంలో టెర్రయిన్‌పై పట్టు సంపాదిస్తూ అమరులు కా. వడ్డాపూర్ చంద్రమౌళి (బీకే)తో కలిసి చలపతి ఎన్నో మిలటరీ దాడులకు వ్యూహ రచన చేసారు. దాడులకు నేతృత్వం వహించారు. అవన్నీ విజయవంతం అయ్యాయి. ఏఓబీ వ్యాప్తంగా కా. చలపతి నాయకత్వంలో పెద్ద, చిన్న, మధ్య రకం మిలటరీ చర్యలు అనేకం జరిగాయి. శత్రువును నిర్మూలించడం, గాయపరచడం, ఆయుధాల స్వాధీనం చర్యలలో కేడర్‌లకు ఎంతో ప్రోత్సాహకరంగా నిలిచారు కా. చలపతి. కేంద్ర సైనిక కమిషన్ (సీఎంసీ)

నేతృత్వంలో యుద్ధ కౌశల్యాన్ని పెంపొందించుకుంటూ దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో భాగంగా గెరిల్లా యుద్ధాన్ని నడపడంలో అనుభవం సాధించారు. షార్ట్ సర్‌ప్రైజ్ ఎటాక్స్‌లో నైపుణ్యం సాధించారు. ఆయన కీలక పాత్ర వహించిన కొన్ని ఘటనలు పేర్కొనాలంటే, బుడ్డిగడ్డ-బొడపాడు జాయింట్ రెయిడ్ (20-12-1998), దారకొండ రెయిడ్ (18-2-2000), కలిమెల రైయిడ్ (9-8-2001), అనకాపల్లి-చోడవరం (నేషనల్ హైవే పైన) జాయింట్ రైయిడ్ (2002), కోరాపుట్‌లో మల్టిపుల్ షార్ట్ సర్‌ప్రైజ్ దాడి (6-2-2004), ఆర్.ఉదయగిరి-మల్టిపుల్ షార్ట్ సర్‌ప్రైజ్ దాడి (2006), నయాగఢ్ ఆపరేషన్ రోప్‌వే (15-2-2008), దామన్‌జోడి రైయిడ్ (2009). ఇవి కేంద్రీకృత బలగాలతో చేసిన దాడులు.

వీటిలో 2004లో జరిగిన కోరాపుట్‌లో హెడ్‌క్వార్టర్ పై దాడితో పాటు జిల్లా పోలీసు ఆయుధాగారం, ట్రెజరీ, జిల్లా జైలు, టౌన్ పోలీసు స్టేషన్ మరో మూడు పోలీసు స్టేషన్లు లక్ష్యంగా జరిగినది తొలి భారీ దాడిగా చెప్పవచ్చు. దీనిని 'గెరిల్లా ఎత్తుగడల ఆధిక్యతను', 'అద్భుతశక్తిని' ప్రదర్శిస్తూ 'బీజప్రాయంలో ఆవిర్భవించిన ఒక మొబైల్ యుద్ధ చర్య'గా పార్టీ పేర్కొన్నది. 2006లో జరిగిన నయాగఢ్ దాడి ఒకేసారి 6 టార్గెట్స్‌పై లంఘించి చేసినది. 1200 సెమీ, ఆటో తుపాకులను, 1,75,000 తూటాలను స్వాధీనం చేసుకున్న అతి పెద్ద ప్రతి దాడి చర్య ఇది. ఒడిశా, ఏఓబి, డీకే బలగాలు చేసిన సంయుక్త దాడి. దీనికి రాజకీయ, సైనిక ప్రాధాన్యత వుంది. ఈ చర్యకు దాదాపు సంవత్సరం ముందు నుంచి ఈ ప్రాంత ప్రజలలో రాజకీయ కృషి జరిగింది. ప్రజల పూర్తి సహకారంతోనే ఈ దాడి విజయవంతం అయింది. ఈ దాడి వెనువెంటనే కేంద్ర ప్రభుత్వం, ఒడిశా, ఆంధ్రా రాష్ట్ర ప్రభుత్వాలు ఫిబ్రవరి 18 నుండి మార్చి 1 వరకు 'ఆపరేషన్ గోసామా', మార్చి 17 వరకు 'ఆపరేషన్ ఫ్లష్ అవుట్'లను చేపట్టాయి. అయితే ఎంతో త్యాగానికి, వ్యయ ప్రయాసలకు ఓర్చి స్వాధీనం చేసుకున్న తుపాకుల్లో కొన్నింటిని పీఎల్‌జీఏ రక్షించుకుంది. కొన్నింటిని శత్రువు తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు.

ఈ యావత్తు యుద్ధ చర్యల నిర్వహణలో వందల సంఖ్యలో వున్న బలగాలకు అన్ని రకాల సరఫరాలు అందించడంలోను, కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించడంలోను, ఆయుధాలను తరలించడంలోను ప్రజల సంపూర్ణ సహకారం వుంది. విప్లవ ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనే విధంగా కేంద్ర సైనిక కమిషన్, రాష్ట్ర సైనిక కమిషన్‌లు మార్గదర్శకత్వం వహించాయి. పార్టీ రాజకీయ-సైనిక పంథాను సరిగా అన్వయిస్తూ ప్రజల చైతన్య పూర్వక మద్దతును సంపాదించడంతో పాటు కంబాట్ స్కిల్స్‌లో పట్టు సంపాదించి సవివరమైన నిర్దిష్ట పథకంతో సాధించిన సైనిక విజయాలు విప్లవ క్యాంపును

ఉత్తేజపరచడంతో పాటు ప్రజాయుద్ధానికి అవసరమైన ఆయుధాలను, అనుభవాన్ని అందించాయి. ఉద్యమ పురోగమనానికి సహకరించాయి. ఈ అంతటిలో కామ్రేడ్ చలపతి విశేష కృషి ఒక భాగంగా ఉన్నది.

కామ్రేడ్ చలపతి ప్రత్యక్ష పర్యవేక్షణలో 2008 మే 28వ తేదీన విశాఖ జిల్లా గునకరాళ్ళలో డెలిబరేట్ ఆంబుష్ జరిగింది. ఒకేసారి అనేక వలయాలుగా వచ్చే శత్రువు పై దాడి చేసే పథకంగా దానికి చాలా ప్రాధాన్యత వున్నది. అలాగే తాను ప్రత్యక్షంగా లేకున్నా పథక రచన చేసి అమలు జరిగే విధంగా గైడ్ చేసిన బలిమెల ఘటన ప్రజలపై బలమైన ప్రభావం వేసింది. ఈ దాడిలో 38 మంది గ్రేహౌండ్స్ పోలీసులు చనిపోయారు. నక్సలైట్లను అణచివేయడం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బలగంగా గ్రేహౌండ్స్‌కు ఉన్న విర్రవీగుడుకు ఈ ఘటన అడ్డుకట్ట వేసింది.

ఏఒబి జోన్‌లో అనేక సార్లు నిర్వహించిన వివిధ రకాల మిలటరీ శిక్షణా శిబిరాలలో కమాండర్లకు, పీఎల్‌జీఏ బలగాలకు కా. చలపతి మిలటరీ శిక్షణ అందించారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు ఫీల్డ్ క్రాఫ్ట్, ఫీల్డ్ డ్రిల్, వివిధ రకాల సైనిక విన్యాసాలు, ఇమ్మిడియేట్ ఆక్షన్ డ్రిల్స్ (ఐఏడి) నేర్పించారు. వాటితో పాటు ఆంబుష్‌లు, రెయిడ్స్‌లో పాల్గొనేటపుడు ఫీల్డ్‌లో వచ్చే సమస్యలను వారితో వివరంగా చర్చించి, నష్టాలు జరగకుండా చర్యలు విజయవంతం చేసేలా వారిలో ఆత్మవిశ్వాసం కలిగించేవారు.

మన్యం పితూరీ జరిగిన తూర్పు కనుమలయిన ఈస్ట్ డివిజన్‌లో 'పితూరీ సేన' పేరుతో మిలిషియా నిర్మాణానికి ఎంతో కృషి చేసారు. అన్ని రకాల ప్రతిఘటన చర్యలలో స్థానిక మిలిషియాను ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా కృషి చేసారు. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఏర్పడిన వెంటనే డిసెంబర్ 2న ఒకే రోజు అనేక పోలీసు స్టేషన్ల పై మిలిటెంట్ చర్యలకు ప్రోత్సహించి, వారిలో ఉన్న శక్తిని, నైపుణ్యాన్ని బయటకు తీసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

ఈస్ట్ డివిజన్‌లో గని తవ్వకాలకు ప్రభుత్వానికి సహకరిస్తూ, ఆదివాసీ ప్రజలను నయానా భయానా లొంగదీసుకునే ప్రయత్నం చేస్తూ ఒక స్థానిక మాజీ విధానసభ సభ్యుడు, మరొక ఆనాటి విధానసభ సభ్యుడు అత్యంత ప్రజా వ్యతిరేకంగా తయారయ్యారు. వీరి వల్ల తీవ్రమైన ఇక్కట్లు పాలవుతున్న ప్రజలలో ఆగ్రహం ఉన్నది. ప్రజలకు అడవి, భూమి, నీళ్లపై ఉన్న హక్కులను కాపాడేందుకు ప్రజా యుద్ధం చేస్తూ పార్టీ, ప్రజా సైన్యం కృషి చేస్తుంటే, వీరు అందుకు వ్యతిరేకంగా ఉద్యమ ద్రోహులుగా తయారయ్యారు. ప్రజల డిమాండ్ మేరకు పార్టీ మార్గదర్శకత్వంలో పీఎల్‌జీఏ 2018లో ఎమ్ఎల్ఏ కిడారి సర్వేశ్వరావు, మాజీ ఎమ్ఎల్ఏ సివేరి సోమాలను తుడిచిపెట్టింది. ఈ చర్య రూపకల్పనలో చలపతి పాత్ర ఎంతగానో ఉన్నది. ప్రజలను మాయమాటలతో మోసగించి ప్రాకృతిక

సంపదను దోచుకునే వారికి ప్రజల నుంచి శిక్ష తప్పదని గట్టిగా హెచ్చరించింది ఈ చర్య. ప్రజల పట్ల అత్యంత ప్రేమగా ఉండే కా. చలపతి వర్గ శత్రువుల పట్ల, పోలీసు ఇన్‌ఫార్మర్ల పట్ల కఠిన వైఖరితో వ్యవహరించేవారు.

యుద్ధ చర్యలకు అవసరమైన రెక్కీలు, రిహార్సల్స్, లాజిస్టిక్స్ సమీకరణ, బలగాల సమీకరణ, సరఫరాలు, మోటివేషన్ అన్నింటినీ దగ్గరుండి అత్యంత శ్రద్ధతో చేయడంతో కేడర్‌కు కా. చలపతి పట్ల విశ్వాసం, నమ్మకం బలంగా వుండేవి. రాజకీయ, మిలటరీ విషయాలలో ఎప్పుడైనా తన నుండి పొరపాటు జరిగితే వెనకా ముందు కాకుండా ఆత్మవిమర్శకు సిద్ధపడేవారు. అటువంటి సమస్యల నుండి బయటపడడానికి ప్రయత్నించేవారు. చలపతి సూటిగా వుంటూ, నిజాయితీతో మెలుగుతూ కేడర్ ప్రేమను పొందేవారు.

ప్రజాయుద్ధ నాయకునిగా ప్రజా పోరాటాలకు మార్గదర్శకత్వం

దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో ప్రజా పోరాటాలు ఒక అంతర్భాగంగా ఉంటాయి. ఎస్‌జడ్‌సీ ఏఓబీ ప్రాంతంలో, ముఖ్యంగా ఈస్ట్ డివిజన్‌లో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గని తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయసాగింది. సైనిక చర్యలు, ప్రజా పోరాటాలు సమన్వయంతో సాగాలని కా. చలపతి స్పష్టంగా అర్థం చేసుకుని, కేడర్‌లకు ఈ విషయం నొక్కి చెప్పేవారు. ఇందులో ఈస్ట్ డివిజన్‌లో బాక్సైట్ వ్యతిరేక పోరాటం, కాఫీ ఎస్టేట్‌లలో దోపిడీకి వ్యతిరేక పోరాటం ముఖ్యమైనవి.

బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాటం

ఈస్ట్ డివిజన్‌లో మూడు దశాబ్దాలుగా సాగుతున్న బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాట నాయకత్వంలో కామ్రేడ్ చలపతి పాత్ర వుంది. బాక్సైట్ తవ్వకాలను నిలువరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలు (కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ) చేసుకున్న ఒప్పందాలను వెనక్కి తీసుకునే విధంగా ప్రజా ఉద్యమాన్ని నిరంతరం కొనసాగించి, మిలిటెంట్ చర్యల ద్వారా ప్రజల పోరాట పటిమను పెంపొందించే విధంగా ఆయన కృషి చేసారు. "పొట్ట కిచ్చినా, బట్ట కిచ్చినా అడవే" అని బతుకుతున్న లక్షలాది మంది మన్యం ఆదివాసులు బాక్సైట్ పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారు. బాక్సైట్ వెలికితీత మూలంగా తాము సర్వస్వం కోల్పోతామని, కనుక ప్రాణాలొడ్డయినా బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటామని ఆదివాసులు అనేక సంవత్సరాలుగా ఉద్యమిస్తూ వస్తున్నారు. 1/70 చట్ట సవరణ, జీవో నెంబర్-97, జీవో నెంబర్-222 పేర్లతో ప్రత్యేక జీవోలను తెచ్చి బాక్సైట్ తవ్వకాలు చేయాలని టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వాలు చేసిన కుట్రలను ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. జిందాల్, అన్‌రాక్, రసల్ ఆల్ ఖైమా కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను ఆదివాసీ ప్రజల ప్రతిఘటనతో ప్రభుత్వం రద్దు

చేసుకుంది.

విశాఖ ఏజెన్సీలో అనంతగిరి, అరకు, చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల పరిధిలోను, తూర్పు గోదావరి జిల్లా వై.రామవరం, మారేడుమిల్లి మండలాల పరిధిలోనూ 800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 570 బిలియన్ టన్నుల మేలైన బాక్సైట్ ఖనిజ నిక్షేపాలను, అడవిని కాపాడుకోడానికి ప్రజలు పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. తరతరాలుగా సాగుతున్న జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికార పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ సాయుధంగా సమైక్యమయిన ఆదివాసీ పోరాట చైతన్యం వెనుక కామ్రేడ్ చలపతి నిర్వహించిన భూమిక ఎన్నదగినది.

కాఫీ ప్లాంటేషన్స్‌లో పోరాటం

విశాఖ అటవీ ప్రాంతంలో ఆదివాసీలకు అడవి పై హక్కును దూరం చేస్తూ ప్రభుత్వం 1980 దశకంలో ఏపీ ఎఫ్‌డీసీకి మన్యంలో వేలాది ఎకరాల భూమిని అప్పగించింది. ఆదివాసులను అందులో కూలీలుగా మార్చివేసింది. 1990లలో పార్టీ "అడవి పై హక్కు ఆదివాసులకే" అనే నినాదంతో కాఫీ తోటల ఆక్రమణ పోరాటానికి పిలుపునిచ్చింది. మొదట్లో కూలిరేట్ల పెంపుదల కోసం పోరాడిన ప్రజల చైతన్యం కాఫీ తోటల ఆక్రమణ పోరాట చైతన్యంగా ఎదిగి రూపు దిద్దుకుంది. ఆ పోరాటం క్రమంగా అత్యంత మిలిటెంట్ ఉద్యమంగా మారింది. కాఫీ తోటల భూముల ఆక్రమణ, కాఫీ గింజల సేకరణ, కాఫీ తోటలపై ప్రజల హక్కు కోసం పారాటం కూడా మూడు దశాబ్దాల కాలం నిరంతరం కొనసాగింది. కాఫీ ప్లాంటేషన్స్‌లో పని చేసే ఉద్యోగులను కూడా సంఘటితం చేసి వారి సమస్యల మీద పోరాటాలు నిర్వహించడంలో కామ్రేడ్ చలపతి పాత్ర కీలకమైనది.

2007లో మర్రిపాకల ఎస్టేట్, 2010లో లంకపాకల, తీములబంద-కుంకుంపూడి ఎస్టేట్, సప్పర్ల, బలపం ఎస్టేట్లను, 2015లో కొత్తూరు ఎస్టేట్‌ను ప్రజలు పోరాడి స్వాధీనం చేసుకున్నారు. 2016లో నిర్బంధం పెరిగిన తర్వాత కూడా 2018లో చాపగడ్డ ఎస్టేట్ పోరాట కమిటి ఏర్పడింది. 2019 ఏప్రిల్‌లో ఆర్.వీ.నగర్ డివిజన్ మేనేజరును ప్రజా కోర్టులో ప్రజలు హెచ్చరించి వదిలిపెట్టారు. దానితో డీఎమ్ రాజీనామా చేసి వెళ్ళి పోయాడు. ఏఓబి ఎస్‌జెడ్‌సీ ఒక కమిటీని ఏర్పాటు చేసి 2020 ఏప్రిల్‌లో కా. చలపతి పర్యవేక్షణలో సమాచార సేకరణ చేసింది. పోరాటాన్ని కొనసాగించాలని కమిటీ నిర్ణయించి అనేక గ్రామాల్లో ప్రజలను కదిలించింది.

దృఢమైన రాజకీయ విశ్వాసం కలిగి ఉండి, కలిగించే నాయకుడు

సిద్ధాంత, రాజకీయ స్పష్టతతో వున్న చలపతి పార్టీలో ముందుకొచ్చిన మితవాద, అతివాద అవకాశవాద రాజకీయాలను ఓడించడంలో ముందున్నారు. 2011లో ఒడిశా

రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి పాండా ప్రభుత్వంతో కుమ్మక్కై కేడర్‌లలో తప్పుడు ధోరణులతో మాట్లాడుతున్నప్పుడు కా. చలపతి తీవ్రంగా వ్యతిరేకించారు. బస్తర్, ఒడిశా కేడర్‌ల మధ్య చీలిక తీసుకువచ్చే విధంగా వ్యవహరించిన అతని గురించి కమిటీ చర్చించి కేడర్‌లకు అవగాహన కల్పించింది. ఆ తరువాత కాలంలో ఇతను కొద్ది మంది కేడర్‌లను తీసుకుని పార్టీని చీల్చి ఒడిశా మావోయిస్టు పార్టీని ఏర్పరిచాడు. ఈ రాజకీయ సంక్షోభంలో ముందుకు వచ్చిన తప్పొప్పులను కేడర్‌లకు తెలియపరచి వారిని, ఉద్యమాన్ని నిలబెట్టడంలో కా. చలపతి పాత్ర కూడా ఉన్నది. అలాగే ఇదే కాలంలో ఏఓబీ ఎస్‌జడ్‌సీ సభ్యుడు శ్రీరాములు శ్రీనివాసులు మితవాద రాజకీయాలను ముందుకు తీసుకువచ్చి మరో సంక్షోభం సృష్టించేందుకు ప్రయత్నించాడు. కమిటీ ఏకగ్రీవంగా దీనిని తిప్పికొట్టింది. ఈ సందర్భంలో కా. చలపతి పార్టీ పంథాపై దృఢంగా నిలబడి తన కమిటీ సభ్యులతో కలిసి పార్టీలో ఏర్పడిన ఈ సంక్షోభాన్ని అధిగమింపజేయడంలో కృషి చేసారు.

కా. చలపతి మార్క్సిజం–లెనినిజం–మావోయిజాన్ని ఎంతో నిబద్ధతతో అధ్యయనం చేసేవారు. సిద్ధాంతం లేనిదే విప్లవ పార్టీ లేదు, విప్లవ పార్టీ లేనిదే విప్లవం లేదు అన్న మాటను స్పష్టంగా అర్థం చేసుకున్న నాయకత్వ కామ్రేడ్‌గా సిద్ధాంత అధ్యయనం పట్ల శ్రద్ధ వహించారు. తాను అధ్యయనం చేయడం మాత్రమే కాకుండా, తన తోటి కేడర్‌లు, కింది స్థాయి కేడర్‌లు సిద్ధాంత అధ్యయన ఆవశ్యకతను అర్థం చేసుకునే విధంగా సహకరించేవారు. రాజకీయ తీర్మానంపై ఆయన చెప్పిన క్లాసు దేశ, అంతర్జాతీయ పరిస్థితులను చిత్రిక పట్టినట్టుగా గుర్తు ఉండిపోతుందని క్లాసు విన్న కార్యకర్తలు అనేవారు.

సహనం, సహకార గుణంతో ఓపికగా వుండేవారు కా. చలపతి. కష్టమైన పనులను కూడా బాధ్యతపడి నిర్వహించేవారు. కేడర్‌కు ప్రాధాన్యతనిచ్చి వారి చైతన్యానికి అనుగుణంగా వ్యవహరించడం చలపతికి ఉన్న మంచి లక్షణం. తనకంటూ ప్రత్యేకం ఏమీ కోరుకోని మంచి నాయకునిగా, ఆదర్శవంతమైన కమ్యూనిస్టుగా చలపతిని గురించి కేడర్ చెప్పుకుంటారు. బలగాలతో వుంటూ, బలగాల విశ్వాసాన్ని చూరగొన్న చలపతి చివరి రోజుల్లో ఉద్యమ అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల పనులు చేయలేక పోతున్నానని మధనపడేవారు.

కా. చలపతి మొదట వివాహం చేసుకున్న ఉద్దానం ప్రాంతానికి చెందిన కామ్రేడ్ అరుణ ప్రమాదవశాత్తు అమరురాలైంది. 2000లో మరో కామ్రేడ్‌తో వివాహం జరిగింది. ఆమె కొంత కాలం తరువాత ఉద్యమం విడిచి వెళ్ళిపోయింది. పది సంవత్సరాల తరువాత, దీర్ఘకాలంగా కలిసి పని చేస్తున్న ఏఓబీ ఎస్‌జడ్‌సీ సభ్యురాలు అమరురాలు కామ్రేడ్ అరుణతో పరస్పర ఇష్టంతో వివాహం జరిగింది. కోరాపుట్ ఉద్యమంలో, ఆ తరువాత ఈస్ట్ డివిజన్ ఉద్యమంలో కలిసి పని చేస్తూ ఈ సహచరులిద్దరూ పరస్పరం రాజకీయంగా

సహకరించుకుంటూ విప్లవ కృషి కొనసాగించారు.

కేంద్ర కర్తవ్యానికి ప్రాధాన్యత నిచ్చి పని చేయడం, కేంద్ర గెరిల్లా బేస్ చుట్టూ విస్తృతంగా ఉద్యమాన్ని అభివృద్ధి చేసి శత్రువును వికేంద్రీకరించడం అనే దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాకు కట్టుబడి, శక్తి వంచన లేకుండా కృషి చేసిన కామ్రేడ్ చలపతి పీడిత ప్రజల ముద్దుబిడ్డ. ప్రజాయుద్ధ వీరుడు.

కామ్రేడ్ చలపతికి వినమ్రంగా జోహార్లర్పిద్దాం!
కామ్రేడ్ చలపతి ఆశయ సాధనకు పునరంకితమవుదాం!

ఓరుగల్లు మట్టిపై పుట్టి ఉత్తర తెలంగాణా నాయకునిగా ఎదిగి,
మన్యం మట్టిపై దేశ విప్లవోద్యమ నాయకునిగా అమరులైన
కామ్రేడ్ గాజర్ల రవి (గణేష్, ఉదయ్)కు విప్లవ జోహార్లు!



తెలంగాణా రాష్ట్రం లోని నాటి వరంగల్ జిల్లాలో ఒక పోరాట కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ గాజర్ల రవి మన్యం అడవిలో మారేడుమిల్లి ప్రాంతం కుంటుకూరులో భారత దేశ ప్రజల విముక్తి కోసం ప్రాణాలు అర్పించారు. భారత విప్లవోద్యమ చరిత్రలో తన అమరత్వంతో ప్రజలలో విప్లవ స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటారనడానికి ఆయన అంతిమ యాత్రకు పెద్ద ఎత్తున కదలి వచ్చిన ప్రజలు సాక్ష్యం. దశాబ్దాలుగా సాగుతున్న దేశ విప్లవోద్యమాన్ని రూపుమాపేందుకు భారత పాలక వర్గాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తిప్పి కొట్టేందుకు రాజకీయ కృషి చేస్తూనే కా. రవి అమరులయ్యారు. దేశ పీడిత ప్రజలు మరో గొప్ప నాయకుడిని కోల్పోయారు. దళం కదలికల గురించి పోలీసు ఇన్ ఫార్మర్‌ల ద్వారా సమాచారం అందుకుని రాష్ట్ర బలగాలు చేసిన ఈ చుట్టివేత-దాడిలో కా.రవితో పాటు ఆంధ్రప్రదేశ్-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ వెంకట రవి చైతన్య (అరుణ), కమాండర్ కా. అంజు అమరులయ్యారు.

కా. గాజర్ల రవి 1969లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించారు. నాటి తెలంగాణా సాయుధ పోరాట ప్రాంతమయిన ఈ గ్రామం విప్లవోద్యమం కోసం అనేక మంది వీరులను అందించింది. కా. రవి అందులో ఒకరు. తల్లిదండ్రులు పిల్లలకు విద్యా బుద్ధులతో పాటుగా విప్లవ ఆవశ్యకతను కూడా అర్థం చేయించారు. చిన్న నాటి నుంచి విప్లవం గురించి వింటూనే కా. గణేష్ పెరిగారు. 'మన జీవితం కోసం కాదు, మన జీవితంలో పది మంది కోసం ఏం చేయాలో ఆలోచించాలి' అన్న తల్లిదండ్రుల మాట కా. గణేష్ లో విప్లవ భావాలు గూడు కట్టుకోవడానికి పునాది. కా. గాజర్ల రవి కుటుంబంలో మొత్తంగా ఆరుగురు అమరులయ్యారు. దాదాపు దశాబ్దం క్రితం కా. రవి సోదరుడు కా. గాజర్ల సారయ్య (ఆజాద్) విప్లవోద్యమంలో రాష్ట్ర కమిటీ స్థాయి సభ్యునిగా పని చేస్తూ, ఒక సందర్భంలో పట్టణ ప్రాంతంలో ఉన్నప్పుడు పోలీసు బలగాలు ఆయన ఉనికి తెలిసి పట్టుకుని బూటకపు ఎదురుకాల్పులలో హత్య చేసారు.

నక్సల్బరీ సాయుధ పోరాట ప్రభావంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళంలో, బీహార్ రాష్ట్రం బీర్ భూం, లఖింపూర్-ఖేరీలలో రైతాంగ పోరాటాలు జరుగుతున్న కాలంలో కా. రవి జన్మించారు. పెరిగి పెద్దవుతున్న క్రమంలో నాటి తెలంగాణా పోరాట చైతన్యంతో పాటుగా ఈ పోరాటాల నుంచి చైతన్యం పొందారు. ఈ పోరాటాల కొనసాగింపుగా భూస్వామ్య దోపిడీ వేళ్లూనుకుని ఉన్న తెలంగాణా ప్రాంతం కరీంనగర్-ఆదిలాబాద్ జిల్లాలలో 1978 ప్రాంతంలో భూపోరాటాల వెల్లువ వచ్చింది. ప్రజలు పెద్ద ఎత్తున కదిలి భూస్వాములు గుంజుకున్న తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. పార్టీ నేతృత్వంలో ప్రజలకు ఈ భూమి పంపిణీ జరిగింది. కొందరు భూస్వాములు గ్రామాలు

విడిచి పారిపోయారు. జగిత్యాల జైత్రయాత్రగా ఈ పోరాటాలు పేరు గాంచాయి. ఈ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఇతర జిల్లాలకు వ్యాపించాయి.

ఈ పోరాటాల ప్రభావం వరంగల్ జిల్లాలోనూ ఉన్నది. కా. రవి ప్రాథమిక విద్య పూర్తి చేసిన తరువాత హైస్కూలు చదువు కోసం వరంగల్ చేరారు. అప్పటికే వెలిశాలలో విప్లవ కార్యకలాపాలు బలంగా సాగుతున్నాయి. కా. రవిని చదువుకు మించి విప్లవం ఆకర్షించింది. స్కూలు సెలవు రోజులలో ఇంటికి వెళుతూ వస్తూ విప్లవ వార్తలు వింటూ తాను కూడా ప్రజల కోసం పని చేయాలన్న సంకల్పం ఏర్పడింది.

1982లో రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్యూ) లో చేరారు కా. రవి. ఆర్ఎస్యూ స్కూలు విద్యార్థుల సమస్యలు చేపట్టేది. హైస్కూలు పాఠ్యాంశాలను స్థాయికి మించి పెంచివేసిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహించింది. అలాగే ప్రభుత్వ హాస్టళ్లల్లో విద్యార్థుల దయనీయ పరిస్థితులకు వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించేది. ఆర్ఎస్యూ కార్యకలాపాలలో పాలు పంచుకోసాగారు కా. రవి. ఆ సమయంలో ఒకసారి అరెస్టై జైలుకు వెళ్లారు. చిన్న వయసులో జరిగిన ఈ అనుభవం కా. రవిని బలహీనపరచలేదు. ప్రజల కోసం పని చేయాలంటే ఇటువంటి నిర్బంధాలు అనివార్యం అని ఆయన అర్థం చేసుకున్నారు. విద్యార్థి కార్యకలాపాలకు పరిమితం కాకుండా, తన గ్రామంలో సాగుతున్న విప్లవ కార్యకలాపాలలో కూడా పాలు పంచుకునేవారు.

ఆర్ఎస్యూ 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్ చేపట్టి రైతాంగ సమస్యలకు విద్యార్థులను సన్నిహితం చేసింది. రైతాంగ కుటుంబాలలో పుట్టిన విద్యార్థులకు జీవితం నుంచే కాకుండా మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం వెలుగులో తమ సమస్యలను అర్థం చేసుకునేందుకు ఈ క్యాంపెయిన్ ఉపకరించింది. కా. రవి అన్ని రకాలుగా తన చైతన్యాన్ని పెంపొందించుకుంటూ వచ్చారు. ఆయన క్రియాశీలత్వం ఆయనను సాధారణ జీవితానికి పరిమితం కానివ్వలేదు. తాను పార్టీలో చేరి పూర్తి కాలం పని చేస్తానని ప్రతిపాదన చేసారు. కా. రవి చైతన్యం, సంసిద్ధత పరిశీలించిన పార్టీ అందుకు అంగీకరించింది. 16 సంవత్సరాలు నిండిన తరువాత పార్టీలోకి తీసుకుంది.

వృత్తి విప్లవకారునిగా

1984లో కా. రవి వృత్తిపర విప్లవకారుని (పీఆర్)గా రాజకీయ కార్యాచరణ ఆరంభించారు. పార్టీ ఆయనను అదే ప్రాంతంలో మట్టెవాడలో పని చేసేందుకు కేటాయించింది. ఈ ప్రాంతంలో అప్పటికి రాడికల్ యువజన సంఘం (ఆర్ వైఎల్) చురుకుగా పని చేస్తున్నది. అప్పుడప్పుడే ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఏర్పడుతున్నది. పార్టీ మార్గదర్శకత్వంలో ప్రజా సంఘాలు రైతాంగ, యువజనులను సంఘటితం

చేస్తున్నాయి. ప్రజలకు ఉన్న ఆర్థిక, సామాజిక పీడనా, అణచివేత మొదలయిన సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నాయి. తునికాకు, సారా, జీతాలు, కూలీ రేట్లు, వెట్టి చాకిరీ బంద్ వంటి పోరాటాలు జరిగాయి. పోరంబోకు, బంచరాయి, చెరువుశిఖం, దేవుడిమాన్యం అక్కడక్కడా పట్టా భూములు స్వాధీనం పోరాటాలు జరిగి విజయం సాధించారు. విద్యార్థి, యువజన సంఘాలతో పాటుగా వీటి సహకారంతో, రక్షణలో జననాట్యమండలి క్రియాశీలంగా పని చేయసాగింది. విప్లవ గేయాలు, కళా రూపాల ద్వారా పెద్ద ఎత్తున విప్లవ రాజకీయాలను ప్రచారం చేసింది. ఈ యావత్తు కృషి నుంచి పార్టీ నిర్మాణాలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో కా. రవి భాగమయ్యారు. స్థానిక కార్యకర్తలు పార్టీలోకి భర్తీ కావడం పెరిగింది. పార్టీ మరింతగా ప్రజలలో బలోపేతం అయింది.

రాష్ట్ర కమిటీ ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో ఉన్న ఈ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకుని పార్టీ రీజనల్ కమిటీ ఏర్పాటుకు పూనుకుంది. 1985 మార్చిలో ఉత్తర తెలంగాణా రీజియన్ ప్రథమ మహాసభ జరిగింది. ఈ ప్రాంతంలో పోరాటాలు బలోపేతం అవుతుంటే శత్రు నిర్బంధం తీవ్రమైంది. 'ప్రభుత్వ దాడిని ఓడిద్దాం...' పేరుతో రాష్ట్ర కమిటీ విడుదల చేసిన సర్కులర్ ద్వారా నిర్బంధాన్ని ప్రతిఘటించడం గురించి, నిర్బంధం మధ్యనే ఉద్యమం పురోగమింపజేయడం గురించి కేడర్‌లలో అవగాహన ఏర్పడింది. ఉద్యమ ప్రాంతం విస్తరించింది. ఉద్యమాన్ని సంఘటితపరచడంలో భాగంగా ఉత్తర తెలంగాణా జిల్లాల్లో పార్టీ మహాసభలు జరిగాయి. ఉద్యమ అవసరాల దృష్ట్యా పార్టీ 1980 దశకం ఆఖరు నాటికి కా. రవిని ఇక్కడి నుంచి చిట్యాల ప్రాంతానికి బదిలీ చేసింది.

ప్రజా పోరాటాలలో, పార్టీ నిర్మాణంలో అనుభవం గడించి ఉన్న కా. రవి త్వరలోనే చిట్యాల ప్రాంత ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. చిట్యాల మండలంలో దాదాపు ప్రతి గ్రామంతో ఆయనకు పరిచయం ఉన్నది. భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటం సాగుతున్న ఈ ప్రాంతంలో దీనిని మరింత ముందుకు తీసుకువెళుతూ కా. రవి రాజకీయంగా మరింతగా ఎదిగారు. పార్టీ మార్గదర్శకత్వంలో పోరాటాల ద్వారా ప్రజలు భూస్వాములను ప్రజా పంచాయితీలలో విచారించారు. కూలీ పెంపు కోసం చేస్తున్న సమ్మెలను ఖాతరు చేయకుండా మొండిగా వ్యవహరించిన భూస్వాములను సాంఘికంగా బహిష్కరించారు. ప్రజల సామాన్లు ప్రజలు స్వాధీనం చేసుకుని లక్షలాది రూపాయల విలువ కలిగిన అప్పు పత్రాలను కాలబెట్టారు. వెట్టి గొర్లు రద్దు చేసుకున్నారు. వీటితో బెంబేలెత్తిన భూస్వాములు ప్రభుత్వాన్ని ఆశ్రయించి పోలీసు క్యాంపులను పెట్టుకున్నారు. వారికి అండగా వచ్చిన పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రజలు ధర్నాలు చేసారు. పోలీసులను తిట్టడం, కొట్టడం, బంధించడం వంటి ప్రతిఘటనా పోరాట రూపాలు ముందుకు వచ్చాయి.

మేకలకు, గొర్లకు, గొడ్లకు పుల్లర పట్టీ వసూలు చేసే అటవీ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి.

ఆ తరువాత కాలంలో ఖమ్మం, కొత్తగూడ, ఏటూరు నాగారం ప్రాంతాల్లో పని చేసినప్పుడు ఈ అనుభవం కా. రవికి ఎంతగానో తోడ్పడింది. ఈ ప్రాంతాలలో పాలేర్ల జీతాలు, కూలీ రేట్ల పోరాటం జరిగింది. పార్టీ మార్గదర్శకత్వంలో సంఘాల నాయకత్వంలో సంఘటితమైన వీరు సమ్మెలు చేసి ఫలితం సాధించుకున్నారు. నాగలి కిరాయి పెంచుకున్నారు. వ్యవసాయ కూలీలు, పొగాకు కూలీలు, చెరువు పని కూలీలు, హమాలీ పని చేసే కూలీలు, కెనాల్ పని చేసే కూలీలు, బొంగు కొట్టే కూలీలు, తునికాకు కొమ్మ కొట్టే కూలీలు, సుద్దముద్దలు చేసే కూలీలు, బీడీ ఆకు కార్మికులు మొదలయిన పీడిత వ్యవసాయ కూలీలు ఈ పోరాటాల ద్వారా మరింత చైతన్యవంతులయ్యారు. ఏటూరు నాగారం, మంథని, పర్కాల ప్రాంతాలలో కూడా రైతాంగం భూస్వాములపై దాడులు చేసి వారి ఆస్తులను, ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అటవీ రక్షణకు కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలు తమ అడవిని రక్షించుకున్నారు. దొంగ కర్ర వ్యాపారాన్ని అరికట్టారు. ఈ యావత్తు కృషిలో కా. గణేష్ క్రియాశీల పాత్ర ఉన్నది.

ఉత్తర తెలంగాణా ఉద్యమ పురోగమనంలో

రైతే దేశానికి వెన్నెముక అని ప్రగల్భాలు పలుకుతూ ప్రభుత్వం ఎరువులు, క్రిమి సంహారక మందులపై వారికి ఇస్తున్న రాయితీలను రద్దు చేసింది. అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా దేశంలో అమలు చేయసాగిన ప్రపంచీకరణ విధానాలలో ఇది భాగం. ఈ విధానాల గురించి పార్టీ రైతాంగంలో అవగాహన కల్పించి వాటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది.

ఈ ప్రచార-ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరో పక్క తమ తక్షణ సమస్యలు పరిష్కరించుకోవడం కోసం, వీటిని నల్ల బజారులో అమ్మి లాభాలు చేసుకోసాగిన వ్యాపారులపై కూడా రైతు కూలీ సంఘం దృష్టి సారించింది. పార్టీ నాయకత్వంలో వేలాది ప్రజలు కదిలి ఇటువంటి దుకాణాలపై దాడులు చేసి ఎరువుల బస్తాలను, మందుల డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గ్రైన్ మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలకు నిరసనగా అడ్తిదారులకు దేహశుద్ధి చేసారు. మార్కెట్‌లో అవకతవకలను ఒక మేరకు తగ్గించుకున్నారు. చెరుకు పంటకు గిట్టుబాటు ధరల కోసం ధర్నాలు చేసారు. సాగు నీరు, విద్య, రవాణా సౌకర్యాల కోసం పోరాటాలు చేసారు. తమ సమస్యలపై పోరాడుతూ యావత్తు పీడిత ప్రజల విముక్తితో తమ విముక్తి ముడిపడి ఉన్నదని రైతాంగం అర్థం చేసుకున్నారు. పార్టీలో భర్తీ కాసాగారు.

ఉత్తర తెలంగాణా వ్యాప్తంగా జిల్లా ముఖ్య పట్టణాల్లోను, తాలూకా కేంద్రాల్లోనూ

గూండాయిజం తీవ్రంగా ఉండేది. దుకాణదార్ల నుండి, వ్యాపారస్తులు, పాన్ షాపుల నుంచి బెదిరించి గూండాలు డబ్బులు వసూలు చేసేవారు. మహిళలపై అత్యాచారాలు చేసేవారు. గూండాయిజానికి వ్యతిరేకంగా ఆర్ఎస్యూ, ఆర్వైఎల్ గట్టి పోరాటాలు చేసాయి. ప్రజలను కదిలించడమే కాకుండా, వారి కోరిక మేరకు కొందరు గూండాలను తుదముట్టించాయి. ఈ చర్యలు ప్రజలకు రక్షణగా నిలిచాయి. సారాకు వ్యతిరేకంగా ప్రధానంగా మహిళలలో వచ్చిన కదలికను పార్టీ మరింత ముందుకు తీసుకువెళ్లి మిలిటెంట్ రూపం కల్పించింది. ఆనాడు ఈ ప్రాంతంలో జరిగిన ఈ పోరాటాలన్నింటిలో కా. రవి పాత్ర చాలా ముఖ్యమైనది. ఈ పోరాటాల నుంచి తాను కూడా నేర్చుకుంటూ, అందుకు తగిన సిద్ధాంత అధ్యయనం చేస్తూ కా. రవి రాజకీయంగా ఎదుగుతూ వచ్చారు.

1991 డిసెంబర్ లో ఉత్తర తెలంగాణ ఫారెస్టు డివిజన్ (ఎన్.టీ.ఎఫ్.డీ.)లోని ఏటూరు నాగారం దళంలోకి సభ్యుడిగా బదిలీ అయ్యారు. ప్రజలతో మమేకం అవుతూ, వారిలో రాజకీయ కృషి సలుపుతూ వారి విశ్వాసం చూరగొన్నారు. 1992 మధ్య ప్రాంతంలో ఏరియా కమిటీ సభ్యుని (ఏసీఎం) గా ప్రమోట్ అయ్యారు. ఏసీ సభ్యునిగా కేడర్ లకు రాజకీయాలు నేర్పిస్తూ, తాను కూడా సిద్ధాంత అధ్యయనం చేస్తూ పార్టీ ఇచ్చిన బాధ్యతలు నిర్వహించే స్థితికి ఎదిగారు. కా. రవి సిద్ధాంత, రాజకీయ, నిర్మాణపర కృషిని చూసిన పార్టీ 1993లో ఆయనను మణుగూరు దళానికి డిప్యూటీ కమాండర్ గా నియమించింది.

రాష్ట్రంలో మొదటి నిర్బంధ క్యాంపెయిన్‌ను వెన్నంటి 1991 నుంచి 1995 మధ్య రెండవ నిర్బంధ క్యాంపెయిన్ సాగుతున్న కాలం అది. వందలాది సంఘ నాయకులను బూటకపు ఎదురుకాల్పులలో హత్య చేస్తున్నారు. ఖమ్మం జిల్లా పగిడేరులో 14 మంది కామ్రేడ్స్ ను ఒకే ఘటనలో చంపివేసారు. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ మొదలయిన కేంద్ర బలగాలను మొహరించారు. 1992 మే నెలలో పార్టీని, ప్రజా సంఘాలను నిషేధించారు. బహిరంగ కార్యక్రమాలు నిలిచిపోయాయి. నిర్బంధం తీవ్ర స్థాయిలో అమలవుతున్నది. దళం కదలికలు అత్యంత అప్రమత్తంగా ఉండవలసిన స్థితి. ప్రజలను ఒత్తిడి చేసి దళాలను పట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న కా. రవి డిప్యూటీ కమాండర్ బాధ్యతలలో దళానికి రక్షణ ఏర్పాట్లు సరిగా ఉండేట్టు చూసేవారు.

పార్టీ అందిస్తున్న సైనిక మార్గదర్శకత్వాన్ని అర్థం చేసుకునేందుకు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్న సర్కులర్లను అధ్యయనం చేస్తూ, కేడర్లకు వివరిస్తూ దళంలో సైనిక క్రమశిక్షణ పెంపొందించేందుకు కృషి చేసారు. ఎదురుకాల్పుల నుంచి తప్పించుకుంటూ దళం ప్రజలలో నీళ్లల్లో చేపలా పని చేసింది. ప్రజలు నిర్బంధం మధ్యనే దళాలకు రహస్యంగా తిండి పెట్టడం, సమాచారం చెప్పడం, సమావేశాలకు హాజరు కావడం

అలవాటు చేసుకున్నారు. బూటకపు ఎదురుకాల్పులకు వ్యతిరేకంగా పోలీసులను దూషించడం నుంచి మొదలుకుని అనేక పద్ధతులలో తమ నిరసనను, ప్రతిఘటనను కొనసాగించారు. రైతాంగ యువకులు స్వతహాగా దాడులు నిర్వహించారు. దళాలతో కలిసి దాడుల్లో పాల్గొన్నారు. ఉద్యమం బలోపేతం అవుతూ, విస్తరిస్తూ వివిధ ప్రాంతాలకు కార్యకర్తలను పంపుతూ వచ్చింది. నాయకత్వ కామ్రేడ్స్ కూడా ఉద్యమ అవసరాల రీత్యా ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యి ఉద్యమ కృషి చేపట్టారు. ఈ క్రమంలో కా. రవి డివిజన్ కమిటీ సభ్యునిగా పదోన్నతి పొందారు.

ఉత్తర తెలంగాణా ఫారెస్ట్ డివిజన్ సభ్యునిగా

1994లో ఆయన ఉత్తర తెలంగాణా ఫారెస్ట్ డివిజన్ (ఎన్.టీ.ఎఫ్.డీ.) సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో నక్సలైట్ల అణచివేత పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రేహౌండ్స్ ప్రత్యేక పోలీసు బలగం విడువకుండా గ్రామాలలో గస్తీ చేస్తూ కూంబింగ్‌లు నిర్వహిస్తున్నది. అటువంటి నిర్బంధ పరిస్థితిలో రహస్య పని విధానాన్ని అలవరచుకుంటూ, అలవరుస్తూ డివిజన్ కమిటీ ప్రజలలో రాజకీయ, నిర్మాణపర, సైనిక కృషి కొనసాగించింది. రాష్ట్ర కమిటీ మార్గదర్శకత్వంలో, తన సహ కమిటీ సభ్యుల మద్దతుతో కా. రవి డివిజన్ ఉద్యమాన్ని నిర్బంధం మధ్యనే పురోగమింపజేసేందుకు ఎంతగానో శ్రమించారు. ఇందులో భాగంగా చిన్న పాటి గెరిల్లా చర్యలు అనేకం నిర్వహించారు. ఉద్యమంలో భాగంగా సాగుతున్న సైనిక చర్యలలో పార్టీ నిర్దేశించిన సైనిక విధానం అమలులో లోపాలను సరిదిద్దేందుకు డివిజన్ కమిటీ పూనుకుంది. అలాగే పని విధానంలో ముందుకు వస్తున్న తప్పుడు ధోరణులను, మహిళల పట్ల చులకన భావన మొదలయిన అన్యవర్గ ధోరణులను సరిద్దేందుకు కృషి చేసింది. ప్రజా పంథా అమలులో లోపాలను అధిగమించి పార్టీ బలోపేతం అయ్యేందుకు కృషి సాగింది.

1995లో జరిగిన పార్టీ అఖిల భారత ప్రత్యేక మహాసభ (ఏఐఎస్‌సీ) ఉద్యమ ప్రాంతాన్ని పునస్సంఘటితం చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం మేరకు ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ ఏర్పడింది. ప్రథమ మహాసభ జరుపుకున్న నూతన కమిటీ అఖిల భారత ప్రత్యేక మహాసభ అందించిన ఉద్యమ కర్తవ్యాలతో ముందుకు సాగింది. తెలంగాణాలో ఇతర జిల్లాలు నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మార్గదర్శకత్వంలో కొనసాగాయి. ఈ పునస్సంఘటితీకరణ క్రమాన్ని తరువాత కాలంలో ఆయా ప్రాంత డివిజన్ కమిటీలు, ఏరియా కమిటీలు ముందుకు తీసుకువెళ్లాయి. ఈ కృషిలో కా. రవి క్రియాశీలంగా పాలు పంచుకున్నారు. ఉత్తర తెలంగాణా స్పెషల్ జోన్‌గా అభివృద్ధి కాసాగింది. ఈ క్రమంలో పార్టీ కా. రవిని ఖమ్మం డివిజన్ కు బదిలీ చేసింది. 2000లో జరిగిన ఖమ్మం డివిజన్ మహాసభలో కా. రవి ఆ డివిజన్ కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.

ఇదే సంవత్సరం చివరిలో జరిగిన ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ మహాసభలో ఎస్.జెడ్.సీ.ఎంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభ గడచిన ఐదు సంవత్సరాలలో జరిగిన రాజకీయ, సైనిక, ఐక్య సంఘటనా కార్యకలాపాలను సమీక్షించింది. భూపోరాటాలపై ప్రత్యేకంగా కేంద్రీకరించాలని, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే లక్ష్యాన్ని మరింత బలంగా ముందుకు తీసుకువెళ్లాలని, ప్రజా పంథాను సూక్ష్మ స్థాయిలో సయితం అమలు చేయాలని, నిర్దిష్ట వర్గ పరిశీలన చేయాలని నిర్ణయించింది. భూపోరాటాలను ముందుకు తీసుకువెళ్లేందుకు అవలంబించవలసిన పద్ధతులను రూపొందించింది. వివిధ ప్రాంతాల అనుభవంతో కా. రవి ఈ చర్చలలో క్రియాశీలంగా పాలు పంచుకుని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించడంలో తన వంతు కృషి చేసారు. తరువాత కాలంలో గ్రామ స్థాయి నిర్మాణాలను, ప్రజా సంఘాలను, గ్రామ రాజ్య కమిటీలను బలోపేతం చేయడంలో, ప్రభుత్వం అమలు చేస్తున్న బూటకపు సంస్కరణల గురించి ప్రజలకు రాజకీయంగా అవగాహన కల్పించడం మొదలయిన కర్తవ్యాలతో ఉద్యమాన్ని పురోగమింపజేసేందుకు కృషి చేసారు. ఉత్తర తెలంగాణా స్పెషల్ జోన్ ప్రాంతంలో నిర్బంధం మధ్యనే ఉద్యమాన్ని సంఘటితం చేసుకునేందుకు కమిటీ కృషి చేస్తూ వచ్చింది. పట్టణాలలో వివిధ సెక్షన్స్‌లో విప్లవ కృషి కొనసాగించింది.

2003లో జరిగిన రెండవ మహాసభ ప్రథమ ప్లీనంలో శత్రు బహుముఖ దాడిపై లోతైన చర్చ జరిగింది. ఈ దాడిని ఎప్పటికప్పుడు సాధారణంగానూ, నిర్దిష్టంగానూ అంచనా వేయాలని, ప్రజా పునాదిని పెంపొందించుకోవాలని, సాయుధ ప్రతిఘటన కొనసాగించాలని నిర్ణయించింది. ఉత్తర తెలంగాణాను విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కృషి చేయాలన్న కర్తవ్యం మేరకు పార్టీ సంఘటితీకరణపై కేంద్రీకరించారు. కా. రవి పునాది స్థాయి నిర్మాణాలకు మార్గదర్శకత్వం అందిస్తూ ఈ కర్తవ్యాన్ని అమలు చేసేందుకు కృషి చేసారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో శాంతి చర్చల బృందం ప్రతినిధిగా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా విప్లవోద్యమానికి అపారమైన మద్దతు పెంపొందింది. విద్యార్థులు, మేధావులు, యువజనులు, మహిళలు, దళిత ప్రజలలో విప్లవోద్యమ ప్రభావం ఇనుమడించసాగింది. రాజ్యాధికారం కోసం పోరాటం చేయకుండా తమ సమస్యలు పరిష్కారం కావని ప్రజలు మరింత స్పష్టంగా అవగాహన చేసుకోసాగారు. మరో పక్క రాష్ట్ర పాలక వర్గాలలో వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. అంతిమంగా విధాన సభ ఎన్నికలు సమీపించాయి. ఈ ఎన్నికలలో నక్సలైట్ల పట్ల వైఖరి ఒక ప్రధాన అంశం అయింది. నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని, ప్రజలపై హింస విడనాడాలని పౌర, ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కొంత కాలంగా డిమాండ్ చేస్తూ ఉన్నాయి. ఈ రాజకీయ

వాతావరణాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడం కోసం, తాము గెలిస్తే నక్సలైట్లతో చర్చలు జరుపుతామని కాంగ్రెస్ ప్రకటించింది. ప్రజలలో ఉన్న అభీష్టాన్ని తీరుస్తున్నానని భ్రమపరిచే ఉద్దేశ్యంతో అధికారంలోకి వచ్చిన తరువాత మన పార్టీని చర్చలకు ఆహ్వానించింది.

2004 అక్టోబరులో జరిగిన ఈ శాంతి చర్చలలో పాలు పంచుకునేందుకు ఎన్.టీ.ఎస్.జడ్.సీ. నుండి కా. రవి ఎన్నికై ప్రాతినిధ్యం వహించారు. చర్చల ప్రక్రియ కోసం ఉత్తర తెలంగాణా ప్రాంత పరిస్థితి గురించిన నివేదికలను రూపొందించడంలోను, నిర్దిష్ట ప్రతిపాదనలు ముందుకు తీసుకురావడంలోనూ ఎస్‌జడ్‌సీ చేసిన కృషిలో కా. రవి భాగంగా ఉన్నారు. అమరులు అక్కిరాజు హరగోపాల్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ప్రభుత్వంతో చేసిన చర్చల కాలంలో విస్తృత ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగానే నూతన ఐక్య పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ సందర్భంలో 'చర్చల గణేష్'గా పేరు పడ్డారు.

నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ

చర్చల ప్రక్రియను నిజాయితీగా కొనసాగించకుండా అమెరికా సామ్రాజ్యవాదుల ఎల్ఐసీ వ్యూహాత్మక నిర్బంధ విధానాన్ని అనుసరించి ప్రభుత్వం బహుముఖ దాడిని తీవ్రతరం చేసింది. బూటకపు సంస్కరణలు, ఇన్ ఫార్మర్ వ్యవస్థ, సాయుధ బలగాల మోహరింపు జమిలిగా ఉద్యమంపై నకారాత్మక ప్రభావం వేయసాగాయి. ఈ క్యాంపెయిన్‌ను తిప్పికొట్టేందుకు కమిటీ ఎత్తుగడలు రూపొందిస్తూ నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. అయితే ఉద్యమం చెప్పుకోదగిన స్థాయిలో బలహీనపడింది.

నూతన పార్టీ ఐక్యతా క్రమాన్ని సంఘటితం చేసుకునేందుకు 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ లో కా. గణేష్ ఎన్.టీ.ఎస్.జెడ్.సీ. నుండి ప్రతినిధిగా హాజరయ్యారు. ఉత్తర తెలంగాణా, ఏఓబీలలో ప్రభుత్వ ఎల్ఐసీ పథకాలను అర్థం చేసుకుని అందుకు దీటుగా ఎత్తుగడలు రూపొందించుకోవడంలో విఫలం చెందామని కాంగ్రెస్ సమీక్షించింది. ఈ వైఫల్యాన్ని అధిగమించేందుకు ఎత్తుగడలు సూచించి, కర్తవ్యాలు రూపొందించింది. కాంగ్రెస్ కర్తవ్యాల అమలులో భాగంగా ఇదే సంవత్సరం సెప్టెంబరులో జరిగిన స్పెషల్ జోన్ మూడవ మహాసభ జరిగింది. ఈ మహాసభ దెబ్బ తింటున్న ప్రజా పునాదిని తిరిగి అభివృద్ధి చేసుకోవాలని, పార్టీ కమిటీలను సైద్ధాంతికంగా, రాజకీయంగా, సైనికపరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం దిద్దుబాటు ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. గ్రామ స్థాయి మిలిషియాను బలోపేతం చేసుకోవాలని, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రజా రాశులను సమీకరించాలని నిర్ణయించింది. ఈ కర్తవ్యాలను రూపొందించుకోవడంతో

పాటుగా ఆనాడు కేంద్ర కమిటీ సభ్యునిగా ఉత్తర తెలంగాణాకు నాయకత్వం వహిస్తుండిన జినుగు నరసింహారెడ్డి (జంపన్న) అనుసరించిన తప్పుడు పద్ధతులు, ఉదారవాద వైఖరులకు వ్యతిరేకంగా అమరులు కామ్రేడ్ కత్తి మోహనరావు, కా. గణేష్ మొదలయిన కొందరు కామ్రేడ్స్ గట్టి పోరాటం చేసారు. మహాసభ కర్తవ్యాల వెలుగులో సాగిన కృషిలోను, ఈ తప్పుల ప్రభావం నుంచి పార్టీని అధిగమింపజేసేందుకూ కమిటీ సభ్యులతో కలిసి కా. గణేష్ క్రియాశీలంగా పని చేసారు.

ఆంధ్రప్రదేశ్-ఒడిశా బార్డర్ స్పెషల్ జోన్ ఉద్యమ నాయకునిగా

2008లో కా. రవి ఉత్తర తెలంగాణ నుండి ఏఓబీకి బదిలీ అయ్యారు. అప్పటికి ఏఓబీ స్పెషల్ జోన్‌లో ఉద్యమం శత్రు నూతన పథకాలను ఎదుర్కొంటూ బలహీన స్థితిని అధిగమించేందుకు కృషి చేస్తున్నది. ఉత్తర తెలంగాణా అనుభవంతో, ఎల్ఐసీ విధానం ప్రభావం నుంచి ఉద్యమ ప్రజలను నిలబెట్టుకోవడంలో ఏఓబీ ఎస్‌జడ్‌సీలో భాగంగా కా. గణేష్ కృషి చేసారు. ఏఓబీకి వచ్చిన తరువాత తన పేరును ఉదయ్‌గా మార్చుకున్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు కా. సాకేత్ (అక్కిరాజు హరగోపాల్) నాయకత్వంలో ఎస్‌జడ్‌సీ సభ్యునిగా స్పెషల్ జోన్ కర్తవ్యాలను అమలు చేసేందుకు విశేష కృషి సలిపారు.

2009లో భారత పాలక వర్గాలు దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే ఉద్దేశ్యంతో ఆపరేషన్ గ్రీన్ హంట్ నిర్బంధ సైనిక క్యాంపెయిన్ ను ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్‌లో స్పెషల్ జోన్ పరిస్థితులకు అనుగుణంగా అవలంబించవలసిన ఎత్తుగడలను రూపొందిస్తూ ఉద్యమాన్ని నిలబెట్టేందుకు కృషి చేసారు. ఉద్యమ ప్రాంతాన్ని విస్తరించాలని ఎస్‌జడ్‌సీ నిర్ణయించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న ఒడిశా ప్రాంతం కట్ ఆఫ్ ఏరియాలో ప్రవేశించింది. ఈ ప్రాంతంలో ఉన్న ఒక ప్రాచీన తెగ అయిన బోండా ఆదివాసీ ప్రజలను కలవడం, పార్టీని పరిచయం చేయడం, వారి సమస్యలు తెలుసుకోవడం సాగిన క్రమంలో కా. ఉదయ్ భాగంగా ఉన్నారు, నాయకత్వం అందించారు. అలాగే ఈ ప్రాంతాన్ని దండకారణ్యంతో అనుసంధానం చేసేందుకు బైఫరిగూడ ప్రాంతానికి కూడా విస్తరింపజేసారు. మరో పక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాటి విశాఖ జిల్లాలో పాడేరు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమ కృషిని సంఘటితం చేసేందుకు కృషి చేసారు.

కమిటీ సభ్యులతో కలిసి, డీవీసీ, ఏసీలకు మార్గదర్శకత్వం అందిస్తూ, దెబ్బ తిన్న ప్రజా సంఘాలను, విప్లవ ప్రజా కమిటీలను తిరిగి బలోపేతం చేసేందుకు కృషి చేసారు. ఇందులో భాగంగా శత్రు బలగాల దూకుడును నిలువరించేందుకు కొన్ని ఆంబుష్‌లు జరిగాయి. ఈ చర్యల పథక రచనలో, మార్గదర్శకత్వంలో కా. ఉదయ్ భాగంగా ఉన్నారు. 2016లో కా. ఉదయ్ ఏఓబీ ఎస్.జెడ్.సీ. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి అమరులయ్యే వరకు కొనసాగారు.

కేంద్ర కమిటీలోకి

కా. ఉదయ్ 2017లో కేంద్ర కమిటీలోకి కో-ఆప్ట్ అయ్యారు. వర్గ పోరాటంలో, నిర్బంధంలో ఉద్యమాన్ని నిలబెట్టడంలో తన అనుభవంతో కేంద్ర కమిటీ సభ్యునిగా కృషి కొనసాగించారు. పెరిగిన బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వర్తించేందుకు అవసరమైన సైద్ధాంతిక అధ్యయనం చేస్తూ వచ్చారు. అప్పటికి కా. ఉదయ్ కు మధుమేహ వ్యాధి వచ్చింది. ఇది తీవ్ర స్థాయికి పెరగడంతో రోజూ ఇన్‌సులిన్ ఇంజెక్షన్ తీసుకోవలసి వచ్చేది. ఈ వ్యాధి శరీరానికి కలిగించే దుష్ప్రభావాల వల్ల ఇబ్బందులు ఎదురయినా అకుంఠిత విప్లవ దీక్షతో వాటిని అధిగమిస్తూ మొక్కవోని దృఢ సంకల్పంతో పని చేసారు.

43 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కా. ఉదయ్ ఉత్తర తెలంగాణ, ఏఓబీ ఉద్యమాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసారు. వర్గపోరాట, గెరిల్లాయుద్ధ నిర్వహణలో అపారమైన అనుభవాన్ని సంపాదించారు. తన అనుభవాన్ని కింది స్థాయి కేడర్ లకు అందించి, వారు స్వతంత్రంగా, చొరవగా పని చేసేందుకు తోడ్పడ్డారు. కా. సాకేత్, కా. ఉదయ్ సమన్వయంతో స్పెషల్ జోన్ ఉద్యమాన్ని పురోగమింపజేసేందుకు ఎస్‌జడ్‌సీకి మార్గదర్శకత్వం అందించారు.

కా. ఉదయ్ జీవిత సహచరి కామ్రేడ్ జిలానీ (మీనా) 2018 అక్టోబరులో ఒడిశా రాష్ట్రం మల్కన్ గిరి జిల్లాలో పోలీసులు చేసిన బూటకపు ఎదురుకాల్పులలో అమరులయ్యారు. ఉత్తర తెలంగాణా ఉద్యమంలో పని చేస్తున్న నాటి నుంచి రాజకీయ జీవితాన్ని పంచుకున్న కా. మీనా అమరత్వం కా. ఉదయ్ ను కలచివేసినప్పటికీ, తన కర్తవ్య నిర్వహణలో ఎటువంటి తేడా రానివ్వలేదు. ఎందరో కామ్రేడ్స్ అమరులవుతూ స్పెషల్ జోన్ ఉద్యమం కోసం ప్రాణాలు అర్పిస్తున్న పరిస్థితులలో వారితో పాటుగా కా. మీనా ఆదర్శాన్ని కూడా ముందుకు తీసుకువెళ్లడమే ఆమెకు నివాళి అని భావించారు. సహచర కామ్రేడ్స్‌ను ఓదార్చారు.

2021 చివర కాలంలో ఏఓబీలో ఈస్ట్ డివిజన్ లో, మల్కన్ గిరి జిల్లాలో నిర్బంధం తీవ్రతరమయింది. ఈ నిర్బంధంలో పోలీసు బలగాలను నిత్యం ఎదుర్కొంటూ అనేక సార్లు కాల్పులు జరుపుతూ తప్పించుకున్నారు కా. ఉదయ్. ఎదురుకాల్పులు రోజువారీ ఘటనలుగా మారిన పరిస్థితిలో కేడర్‌లలో విశ్వాసం కలిగిస్తూ వారికి మార్గదర్శకత్వం వహించారు. ఆ సంవత్సరం జరిగిన కేంద్ర కమిటీ సమావేశం తరువాత ఎస్‌జడ్‌సీ సమావేశం నిర్వహించుకునేందుకు కా. ఉదయ్, ఎస్‌జడ్‌సీ కమిటీ సభ్యులు జమయ్యారు. పనుల రీత్యా దండకారణ్యంలో ఉన్న కా. సాకేత్ వీరి వద్దకు వెళ్లవలసి ఉన్నది. అయితే నిర్బంధ పరిస్థితి రీత్యా ఆయనను అటు రావద్దని, తామే సరిహద్దు వరకు వస్తామని ఆయనకు తెలియజేసారు కా. ఉదయ్. ఈ సమయంలో సాయుధ బలగాలు వీరిని వెంటబడి తరిమాయి.

ఆ రకంగా అనుకోకుండానే ఏఓబీ నుంచి దండకారణ్యానికి వచ్చిన వీరు తిరిగి వెళ్లడానికి అనేక ఆటంకాలు ఏర్పడ్డాయి. సాయుధ బలగాలు సరిహద్దున ఉన్న ప్రాంతాలలో గట్టి నిఘా పెట్టారు. ఈ పరిస్థితులలో కేడర్‌లను నిలబెట్టుకునేందుకు రాజకీయ కృషి సలుపుతూనే తిరిగి వివిధ దారులలో ఏఓబీ స్పెషల్ జోన్ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఈ ప్రయత్నాల క్రమంలో నష్టాలు ఎదురయ్యాయి. ఊహించని అవాంతరాలు ఎదురయ్యాయి. 2024 మధ్య కాలం నుంచి ఏఓబీ బలగాలు తమ ప్రాంతానికి చేరుకోసాగాయి. అయితే ఏఓబీలో తిరిగి ఉద్యమం తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం సాయుధ బలగాలను పెద్ద ఎత్తున మొహరించి విడిచిపెట్టకుండా కూంబింగు నిర్వహించింది. ఈ కూంబింగులలో ఎస్‌జడ్‌సీ, డీవీసీ సభ్యులు అమరులయ్యారు. ఈ ప్రతికూలతలే కాకుండా ఆపరేషన్ కగార్‌లో దండకారణ్యంలోనూ పెరుగుతున్న తీవ్ర ప్రతికూలతల మధ్యనే కా. ఉదయ్, మరి కొందరు కలిసి 2024 చివరి కాలంలో ఏఓబీ తిరిగి వెళ్లారు. తీవ్ర నిర్బంధంలో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తూ 2025 జూన్ 18వ తేదీన మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో చుట్టివేత దాడిలో అమరులయ్యారు.

కార్మికవర్గ పుత్రుడు మన కా. గాజర్ల రవి

రైతు బిడ్డగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాల నుంచి ఎగిసి, వర్గ పోరాట కొలిమిలో ఎదిగి, దేశవ్యాప్త విప్లవోద్యమ నాయకునిగా అభివృద్ధి చెందారు కా. ఉదయ్. కా. ఉదయ్ ఒక నిజమైన కార్మికవర్గ పుత్రుడు. ఆయన నిలిపిన ఆదర్శాలు విప్లవ కేడర్‌లకు సదా అనుసరణీయంగా ఉంటాయి. ముఖ్యంగా తీవ్ర నిర్బంధంలో చెక్కు చెదరకుండా ఉండడం నేర్పుతాయి. శత్రు బహుముఖ దాడిని ఎదిరించి నిలవగల స్థైర్యం కలిగిస్తాయి. ఆపరేషన్ కగార్‌లో తీవ్రమైన నష్టాలు పొందుతూ కూడా మార్క్సిజం–లెనినిజం–మావోయిజం సిద్ధాంతం పట్ల, విప్లవ అంతిమ విజయం పట్ల అచంచల విశ్వాసంతో ఆయన పని చేసారు.

కా. ఉదయ్ అమరత్వం తరువాత ఆయన స్వగ్రామం వెలిశాలలో జరిగిన ఆయన అంతిమ యాత్ర సందర్భంగా విప్లవకారులకు చావు లేదు అన్న మాట మరోసారి రుజువయింది. కా. ఉదయ్ హత్యను తీవ్రంగా నిరసించిన విప్లవ, ప్రజాస్వామిక శక్తుల నుంచి, సమాజంలో వివిధ సమూహాల నుంచి భారత పాలక వర్గాలు అమలు చేస్తున్న క్రూర ఆపరేషన్ కగార్ పై మరింత తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమయింది. మావోయిస్టుల ప్రాణాలు తీయడం కాకుండా వారితో చర్చలు జరిపి ప్రజలపైన, వారిపైనా హత్యాకాండను నిలిపివేయాలని ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు డిమాండ్ చేసారు. గడచిన దశాబ్దాలలో ఆయన పని చేసిన ప్రాంతం నుంచి అంతిమ యాత్రకు తరలి వచ్చిన ప్రజలు ‘గణేష్ మా నాయకుడు. మాకు చాలా చేసారు. అందుకే ఇంత దూరమైనా కడసారి చూసేందుకు వచ్చాం’ అన్నారు. కా. గాజర్ల రవి ప్రజలలో నిలిచిపోయారు. ఆయన అమరజీవి.

భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు
కా. పతీరామ్ మాంఝీ (అనల్) కు అరుణారుణ జోహార్లు



2026 జనవరి 22 నాడు ఉదయం 6.30 గంటలకు ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్ భూమ్ జిల్లాలోని సారండా అడవులలో వందలాది పోలీసు బలగాలు చుట్టుముట్టి చేసిన దాడిలో వీరోచితంగా పోరాడుతూ 15 మంది మావోయిస్టు కామ్రేడ్లు అమరులయ్యారు. అందులో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడైన కా. పతీరామ్ మాంఝీ (అనల్) కూడా మరణించాడు. ఆయన మరణంతో భారత పీడిత ప్రజానీకం, మరీ ముఖ్యంగా ఝార్ఖండ్ ఆదివాసీలు మరొక ఉత్తమ మావోయిస్టు విప్లవకారుణ్ణి కోల్పోయారు. తన దాదాపు అరవై ఏళ్ల వయసులో కా. అనల్ నాలుగు దశాబ్దాలుగా విప్లవోద్యమానికి అంకితమై పనిచేసి విప్లవోద్యమానికి ఒక కేంద్ర నాయకుడిగా ఎదిగాడు.

కా. అనల్ చాలా చిన్న వయసులోనే అప్పటి ఎంసిసి నాయకత్వంలో జరిగిన పోరాటాలతో ప్రేరణ పొంది విప్లవోద్యమంలో చేరాడు. క్రమంగా అంచెలంచెలుగా ఒక సాధారణ కార్యకర్త నుండి విప్లవ నాయకుడిగా ఎదుగుతూ 2004లో సిపిఐ మావోయిస్టు పార్టీ ఏర్పడే నాటికి బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. పీపుల్స్‌వార్, ఎంసిసి లకు చెందిన బిహార్, ఝార్ఖండ్ లకు చెందిన రాష్ట్ర కమిటీలు కూడా విలీనమై నూతన బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ ఏర్పడిన తరువాత, అందులో సెక్రెటేరియట్ సభ్యుడిగా, సైనిక కార్యకలాపాలకు నాయకత్వం వహించడానికి ఏర్పడిన రాష్ట్ర సైనిక కమిషన్‌కు ఆయన ఇన్-చార్జ్ గా బాధ్యతలు నిర్వహించాడు. 2010 దశకంలో బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహించాడు. ఆ తరువాత ఉద్యమం వెనుకంజ వేసిన స్థితిలో బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ ప్రాంతాన్ని రెండుగా విభజించినప్పుడు తూర్పు ఝార్ఖండ్-తూర్పు బీహార్ ప్రాంత స్పెషల్ జోనల్ కమిటీకి కార్యదర్శిగా పనిచేశాడు. ఆ క్రమంలోనే పార్టీ కేంద్ర కమిటీలోకి కూడా కామ్రేడ్ అనల్‌ను కో-ఆప్ట్ చేసుకోవడం జరిగింది. ఆ తరువాత ఉద్యమాన్ని గడ్డుస్థితి నుండి బయట పడేయడానికి తన శాయశక్తులా కృషి చేశాడు. నిరంతరం ఆపరేషన్ అనకొండ వంటి క్రూరమైన ఆపరేషన్లు చేపట్టి సారండా ప్రాంతాన్నంతటినీ కేంద్ర, రాష్ట్ర బలగాలు చుట్టుముట్టి దాడులు చేస్తున్నా వెరువక, వెన్ను చూపక చివరి వరకు పోరాడుతూనే ఉన్నాడు. చివరికి అట్లా పోరాడుతూనే అమరుడయ్యాడు. ఒక సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి సిద్ధూ, కానూ, బిర్సా ముండాల వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకుపోతూ వారి పోరాట వారసత్వానికి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అనే శాస్త్రీయ సిద్ధాంతాన్ని జోడించి మన దేశ ఆదివాసీలతో సహా దేశ పీడిత ప్రజలందరినీ విముక్తి చేసే నూతన ప్రజాస్వామిక విప్లవ బాటలో తుది వరకూ పొరాడి అమరుడైన కా. పతిరామ్ మాంఝీ (అనల్) కు విప్లవ జోహార్లు.

దండకారణ్య ఉద్యమ రథసారథులలో ఒకరిగా ఉండి,

ఆపరేషన్ కగార్ నిర్బంధ సైనిక క్యాంపెయిన్‌లో విప్లవాన్ని అంటిపెట్టుకుని,

దేశ విప్లవోద్యమ నాయకునిగా అసువులు బాసిన

కామ్రేడ్ పాక హన్మంతు (గణేష్)కు ఎర్రర్ర జోహార్లు



ప్రపంచవ్యాప్త సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీల నుంచి పెద్ద ఎత్తున ద్రవ్య పెట్టుబడిని ఆహ్వానిస్తూ, దేశ ప్రాకృతిక వనరుల దోపిడీకి మార్గం సుగమం చేయడం కోసం భారత పాలక వర్గాలు జనవరి 2024 నుండి అమలు చేస్తున్న నిర్బంధ సైనిక క్యాంపెయిన్ ఆపరేషన్ కగార్‌లో భారత విప్లవోద్యమ మరో నాయకుడు కామ్రేడ్ పాక హన్మంతు (గణేష్, సోముడు, రూప) అమరులయ్యారు. 2025 డిసెంబర్ 25వ తేదీన ఒడిశా రాష్ట్రం కందమాల్ జిల్లాలో జరిగిన చుట్టివేత–నిర్మూలనా దాడిలో భారత దేశ పీడిత ప్రజల, జాతుల విముక్తి మార్గంలో కా. గణేష్ ప్రాణాలు అర్పించారు. 2025 జనవరిలో కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి కా. జైరాం (చలపతి), ఇదే సంవత్సరం సెప్టెంబరులో ఒడిశా రాష్ట్ర కమిటీకి మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర కమిటీ సభ్యుడు కా. మనోజ్ (మోడెం బాలకృష్ణ) శత్రు చుట్టివేత–నిర్మూలనా దాడిలో అమరులయిన తరువాత కా. గణేష్ మరణం ఆ రాష్ట్ర ఉద్యమానికి తీవ్రమైన నష్టం.

కా. గణేష్ తెలంగాణా రాష్ట్రం నల్లగొండ జిల్లాలో పేద రైతాంగ కుటుంబంలో జన్మించారు. కుటుంబంలో ఉన్న నలుగురూ రెక్కలాడిస్తేనే డొక్కలాడే ఆర్థిక స్థితి ఉండేది. తాత, నాయనమ్మ, తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని పెంచారు. కుటుంబ బీదరికం వల్ల అప్పు చేసి, వాటిని తీర్చడం కోసం ఇంటిల్లపాదీ చాలా కష్టం చేసేవారు. ఒక్కోసారి కుటుంబమంతా పస్తులుండేది. అయినప్పటికీ తల్లిదండ్రులు ఆయనను చదివించడమే కాకుండా, భవిష్యత్తుపై నమ్మకం నిలిపారు. చిన్నతనంలో కుటుంబ వ్యవసాయ పనులలో పాలు పంచుకుంటూనే కా. గణేష్ గ్రామంలో చదువు కొనసాగించారు. తోటి విద్యార్థులతో కలివిడిగా ఉంటూ, చదువుపై శ్రద్ధతో ప్రాథమిక విద్య పూర్తి చేసిన కా. గణేష్ పై చదువులకు కాలేజీకి వెళ్లారు. కాలేజీలో చదువుతున్నప్పుడు ఆయనకు రాడికల్ విద్యార్థి సంఘం పరిచయం అయింది. విద్యార్థి రాజకీయాలు దేశ రాజకీయాలతో ముడిపడి ఉన్నాయన్న అవగాహనతో పని చేస్తున్నది ఆర్ఎస్యూ.

ఆర్ఎస్యూతో పరిచయం ద్వారా కా. గణేష్ కు దేశ కాల పరిస్థితులపై అవగాహన ఏర్పడింది. చిన్న నాటి నుంచి పీడిత వర్గమైన రైతాంగం పరిస్థితులను స్వయంగా చూస్తూ ఈ పీడిత పరిస్థితులనుంచి విముక్తికి మార్గం విప్లవమేనని అర్థం చేసుకున్నారు. సమాజంలో వివిధ పీడిత వర్గాల, సెక్షన్‌ల సమస్యలు ముడిపడి ఉన్నాయన్న అవగాహనను ఏర్పరచుకున్నారు. తన కుటుంబ, గ్రామ పరిస్థితిని చూసి ఉన్న కా. గణేష్ దేశ పరిస్థితిని తేలికగా అర్థం చేసుకోగలిగారు. ఈ పరిస్థితులను మార్చి, పీడిత ప్రజలను విముక్తి చేసే మార్గంలో నడిపించేందుకు విప్లవంలో భాగం కావాలని భావించారు. ఆర్ఎస్యూలో పని చేస్తూ పార్టీ మార్గదర్శకత్వంలో సంఘం చేపట్టిన 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో భాగమయ్యారు. రైతు బిడ్డగా తాను అనుభవించి ఉన్న పరిస్థితి హెచ్చుతగ్గులుగా అంతటా

ఉండడం గమనించారు. పార్టీ అందించిన నూతన ప్రజాస్వామిక విప్లవ దృష్టికోణం నుంచి రైతాంగ సమస్యకు పరిష్కారాన్ని అర్థం చేసుకున్నారు. సోషలిజం-కమ్యూనిజం ధ్యేయంగా పని చేసే విప్లవ పార్టీలో చేరాలని సంకల్పించి పార్టీ ముందు ప్రతిపాదన ఉంచారు. 1980వ దశకం చివరి కాలంలో వృత్తిపర విప్లవకారునిగా మారారు.

ప్రారంభంలో అదే ప్రాంతంలో పని చేసిన కా. గణేష్ ఆ తరువాత ఆనాడు దండకారణ్యం స్పెషల్ జోన్‌లో భాగంగా ఈస్ట్ డివిజన్‌గా ఉన్న విశాఖపట్నం-తూర్పు గోదావరి జిల్లాల అటవీ ప్రాంతం మన్యంకు బదిలీ అయ్యారు. గెరిల్లా జోన్ పర్స్‌పెక్టివ్ ను రూపొందించుకున్న పార్టీ 1980 జులైలో మన్యంలో అడుగుపెట్టింది. మలేరియా డాక్టర్ల పేరుతో అమరులు కా. చంటి, కా. బసవరాజ్ మొదలయిన పార్టీ కార్యకర్తలు ప్రజలలో పని చేయసాగారు. క్రమంగా స్థానికులు, పట్టణ ప్రాంతాల విద్యార్థులు, యువత నుంచి భర్తీ కాసాగిన వారితో ఈస్ట్ డివిజన్‌లో దళాలు పెరుగుతూ వచ్చాయి. అటువంటి ఒక దళంలో కా. గణేష్ భాగమయ్యారు.మొదటిసారిగా ఆదివాసీ ప్రాంతంలోకి అడుగు పెట్టిన కా. గణేష్ పుట్టి పెరిగిన ప్రాంతానికి, ఆదివాసీ ప్రాంతానికి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకున్నారు. ఇది ఒక భిన్నమయిన మూలవాసీ జీవనం. వారి మతం, జాతి అంతా వేరు. కులం లేదు. కుయి, భగత, కొండరెడ్డిమొదలయిన వివిధ రకాల ఆదివాసులు ఇక్కడ నివసించేవారు. కా. గణేష్ ఆదివాసుల భాషను, ఆచారాలను, పండుగలను అర్థం చేసుకునేందుకు కృషి చేసారు. విద్యార్థి సంఘంలో ఉంటూ నేర్చుకున్న రాజకీయాలను సాయుధ దళాల కార్యకర్తగా సానబెట్టుకున్నారు.

దండకారణ్యంలోకి కా. గణేష్

కా. గణేష్ రాజకీయ ఎదుగుదల ఆయనను మరింత ముందుకు నడిపించింది. పార్టీ ఆయనను దండకారణ్యంలో దక్షిణ బస్తర్ ప్రాంతానికి బదిలీ చేసింది.తెలంగాణా నుంచి దండకారణ్యంలోకి ప్రవేశించిన విప్లవ పార్టీ కార్యకర్తలు అప్పటికి దళాలుగా ఏర్పడి, ప్రజలలో రాజకీయ ప్రచారం చేస్తున్నారు. పార్టీ రైతు కూలీ, మహిళా సంఘాలు, వాటి రేంజ్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలలో రాజకీయ చైతన్యం పెంపొందిస్తున్నది. గ్రామ అధికార వ్యవస్థ ప్రజలపై చేసే దోపిడీకి వ్యతిరేకంగా కార్యక్రమం నడిపిస్తున్నది. ఉద్యమాన్ని మరింత పురోగమింపజేస్తూన్నది. దక్షిణ బస్తర్ ప్రాంతం కుంట, కిష్టారం ప్రాంతాలలో ప్రజలను పీడిస్తున్న గ్రామ పెద్దలకు వ్యతిరేకంగా ప్రజల పోరాటాలు నడుస్తున్నాయి. ప్రజల జీవనానికి తీవ్ర ఆటంకంగా ఉంటూ, తమ పద్ధతులు మార్చుకోవడానికి సిద్ధపడని మొండి ఘటాలను కొందరిని ప్రజల కోరిక మేరకు ప్రజా గెరిల్లాలు తుడిచిపెడుతున్నారు. భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకున్న భూములను పార్టీ పేద రైతులకు పంచింది. భూమిపై అధికారం రావాలంటే, పార్టీ నాయకత్వంలో

విప్లవం చేయడమే మార్గం అని ప్రజలు అర్థం చేసుకున్నారు. భూమిపై ప్రజల హక్కును కాపాడుతున్న విప్లవోద్యమం ప్రజలలో వేళ్లూనుకుంటున్నది. అటవీ ఉత్పత్తుల రేట్ల పెంపు కోసం, అటవీ శాఖ అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

అటువంటి పోరాట వాతావరణంలో అడుగు పెట్టిన కా. గణేష్ ప్రజల నుంచి నేర్చుకుంటూ రాజకీయంగా ఎదిగారు. కోయ ప్రజల భాషను, సంస్కృతిని తెలుసుకుంటూ వారిలో పని చేయసాగారు. దళ సభ్యునిగా ప్రారంభమయిన కా. గణేష్ ఈ అనుభవంతో ఏరియా కమిటీ సభ్యునిగా ఎదిగారు. కొంత కాలం తరువాత పశ్చిమ బస్తర్‌కు బదిలీ అయ్యారు. ఈస్ట్ డివిజన్‌లో అటవీ ప్రాంత ఉద్యమంలో ప్రారంభ పాఠాలు నేర్చుకుని, దక్షిణ బస్తర్‌లో వర్గ పోరాట క్రమంలో, నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా ఉన్న కా. గణేష్ పశ్చిమ బస్తర్‌లో స్థానిక పరిస్థితిని అర్థం చేసుకోసాగారు. అప్పటికి మార్క్సిజం–లెనినిజం–మావోయిజం సిద్ధాంతాన్ని అధ్యయనం చేస్తూ ఉన్న కా. గణేష్ దాని వెలుగులో ఈ ప్రాంత ఉద్యమాన్ని అర్థం చేసుకునేందుకు, దానిని పురోగమింపజేసేందుకు కృషి చేసారు. తన సహచర కమిటీ సభ్యులు, అమరులు కా. రామన్న మొదలయిన వారితో కలిసి ప్రజలను వర్గ పోరాట మార్గంలో మరింత బలోపేతం చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

పశ్చిమ బస్తర్ గా నిర్మాణమయిన దక్షిణ బస్తర్, మాడ్ ప్రాంతాల మధ్య ఉన్న గంగలూరు, నేషనల్ పార్క్, ఖైరంగఢ్ ప్రాంతాలలో గ్రామంలో పెత్తనం చేస్తున్న అధికార వ్యవస్థపై పోరాటం జరిగింది. సంఘాలలో సంఘటితమయిన ప్రజలు అటవీ శాఖ అధికారుల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడారు. తునికాకు కూలి పెంపు కోసం పోరాటాలు చేసారు. ప్రజా వ్యతిరేక గ్రామ పెద్దలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రజలకు ఎంత మాత్రం తల ఒగ్గని వారిని గెరిల్లాలు తుదముట్టించారు. ఈ ఆచరణ క్రమంలో డివిజనల్ కమిటీ సభ్యునిగా పదోన్నతి పొందారు.

1995 నుంచి ఛత్తీస్‌గఢ్ (నాడు మధ్యప్రదేశ్) రాష్ట్ర ప్రభుత్వం వివిధ దశలలో 'జన జాగరణ్' పేరుతో ప్రజలపై నిర్బంధాన్ని అమలు చేసింది. పార్టీకి, విప్లవోద్యమానికి వ్యతిరేకంగా సభలు నిర్వహించి ప్రచారం చేసింది. ప్రజలలో విప్లవం పట్ల భయం సృష్టించేందుకు, వారిని విప్లవ మార్గం నుంచి దూరం చేసేందుకు ప్రయత్నించింది. ఈ కాలంలో పార్టీ ప్రజలలో నిరంతర రాజకీయ ప్రచారం గావిస్తూ జన జాగరణ్ క్యాంపెయిన్‌ను దోపిడీ పాలక వర్గాల అణచివేత రూపంగా బహిర్గతపరచింది. ఈ క్యాంపెయిన్‌ను ఓడించి ప్రజలను, ఉద్యమాన్ని నిలబెట్టింది. ఈ ఆచరణ కృషిలో కా. గణేష్ భాగంగా ఉంటూ ప్రజా యుద్ధంలో నిర్బంధం–ప్రతిఘటన మధ్య గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకున్నారు.

పశ్చిమ బస్తర్ మార్గదర్శిగా

విప్లవంలో రాజకీయ కృషి పునాదిగా ఉంటుందన్న అవగాహన ఉన్న పార్టీ ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం కార్యక్రమాలు చేపడుతూ వచ్చింది. వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో గెరిల్లా యుద్ధాన్ని శక్తి మేరకు తీవ్రతరం చేస్తూ వచ్చింది. కేంద్ర కమిటీ, డీకేఎస్‌జడ్‌సీల మార్గదర్శకత్వంలో పశ్చిమ బస్తర్ డివిజన్‌లో సహచర కమిటీ కామ్రేడ్స్‌తో కలిసి కా. గణేష్ ఈ కృషి సలిపారు. ప్రజా సంఘాలలో, ప్రజా పోరాటాలలో చురుకైన కార్యకర్తల నుంచి స్థానిక పార్టీ కమిటీలు బలపడ్డాయి. దళాలు ప్రభుత్వ సాయుధ బలగాలపై చిన్న పాటి సైనిక చర్యలు నిర్వహిస్తున్నాయి. ఇవి ప్రజలలో ఉత్సాహం కలిగిస్తూ, జల్-జంగల్-జమీన్ పై తమ హక్కుకు భరోసా కల్పిస్తున్నాయి. 2000 డిసెంబర్ 2వ తేదీన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) ఏర్పడింది. నిర్మాణపర, సైనిక కార్యక్రమాలన్నీ ఒక దళమే నిర్వహిస్తున్న దశ దాటి సైనిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎస్‌జీఎస్ లు ఏర్పాటు అయ్యాయి. ఈ స్పెషల్ గెరిల్లా స్క్వాడ్లను క్రమేపీ ప్లాటూన్లుగా ఎదిగించుకునే లక్ష్యంతో పార్టీ పని చేస్తున్నది.

నాటి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర మొదలయిన ప్రాంతాలలో పని చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్ వార్) దేశంలో ఇతర విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో ఐక్యమయ్యేందుకు కృషి చేయసాగింది. ఇందులో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పార్టీ యూనిటీతో చర్చలు జరిపింది. ఈ చర్చలు సఫలమై 1998లో రెండు పార్టీలు భాకపా (మా-లె) (పీపుల్స్ వార్) గా విలీనమయ్యాయి. ఈ విలీన క్రమాన్ని సంఘటితపరచుకునేందుకు పార్టీ కాంగ్రెస్ నిర్వహించింది. 2001లో జరిగిన కాంగ్రెస్ ప్రజా యుద్ధాన్ని పురోగమింపజేసేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నది. అప్పటికి ఏర్పడిన ప్రజా సైన్యం రక్షణలో ప్రజా రాజ్యాధికార అంగాలను నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పీసీ-క్రాంతికారీ జనతన సర్కార్)ల ఏర్పాటు ప్రారంభమయింది. ఈ కమిటీల ద్వారా ప్రజలలో ఆర్థిక, రక్షణ, వ్యవసాయ, అటవీ రక్షణ, న్యాయ, సాంస్కృతిక-విద్య-ప్రచార మొదలయిన శాఖల ద్వారా ఆయా కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన విధంగా వాటిని అభివృద్ధి చేసారు. స్థానిక స్థాయి కమిటీలు బలోపేతం అయ్యి, ఏరియా స్థాయి కమిటీలు ఏర్పడసాగాయి. ప్రజా సైన్యం క్రమంగా ఎదుగుతుందన్న విశ్వాసంతో కా. గణేష్ దీర్ఘ దృష్టితో తోటల పెంపకాన్ని ప్రోత్సహించారు. 'బెటాలియన్ ప్లాంటేషన్' పేరుతో భవిష్యత్తులో సంఖ్య రీత్యా పెరిగే పీఎల్‌జీఏ కోసం ఆహార, ఆయుధాల ఏర్పాట్లు చేసారు. డివిజన్ ఉద్యమ పురోగమనంలో కా. గణేష్ క్రియాశీలక భూమిక నిర్వహించారు.

2003లో దండకారణ్యం ప్లీనం జరిగింది. ఈ ప్లీనం ఉద్యమ రాజకీయ, నిర్మాణ

పరిస్థితిని సమీక్షించి, భవిష్యత్తు ఆచరణకు నిర్ణయాలు తీసుకుంది. ఉద్యమ గ్రామీణ ప్రాంతంలో, పోరాట ప్రాంతాలను ఆనుకుని ఉన్న మైదానాలలో పట్టణాలలో కార్మికవర్గం, పెటీబూర్జువా వర్గంలో రాజకీయ కృషికి చాలా ప్రాముఖ్యత ఉన్నదని, ప్రత్యేక శ్రద్ధతో ఈ రంగంలో కృషి చేయాలని ప్లీనం నిర్దేశించింది. ఎస్‌జీఎస్లను, ప్లాటూన్లను నిర్మించి, కంపెనీ నిర్మించే లక్ష్యంతో పని చేయాలని, ఆర్‌పీసీల పని విధానాన్ని పటిష్టం చేస్తూ విస్తరింపజేయడం ద్వారా గెరిల్లా బేస్ స్థాయి రాజ్యాధికార సంస్థల నిర్మాణానికి పూనుకోవాలని ప్లీనం నిర్ణయించింది. సిద్ధాంత అధ్యయనంతో పాటుగా నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనంపై కేంద్రీకరించాలని, గ్రామ స్థాయి పార్టీ నిర్మాణాల పని విధానాన్ని మెరుగుపరచుకోవాలని, ప్రజా పోరాటాలను విస్తృతంగా కొనసాగించాలని నిర్ణయించింది. పెంపొందుతున్న దండకారణ్య ఉద్యమానికి మార్గదర్శకత్వం అందించేందుకు స్పెషల్ జోనల్ కమిటీని బలోపేతం చేసుకుంది. ఈ ప్లీనంలో కా. గణేష్ కమిటీలోకి ఎన్నికయ్యారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కు బాధ్యునిగా పని చేస్తూ వచ్చారు.

కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతను మరింత ముందుకు తీసుకువెళుతూ భాకపా (మా–లె) (పీపుల్స్‌వార్) అప్పటికి కొన్ని సంవత్సరాల క్రితం ఎంసీసీఐ పార్టీతో ఆగిపోయిన ఐక్యతా చర్చలను కొనసాగించింది. ఈ చర్చలు ఫలప్రదమై 2004లో రెండు పార్టీలు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా విలీనమయ్యాయి. ఈ నూతన ఐక్య పార్టీ భారత దేశ పీడిత ప్రజలకే కాకుండా ప్రపంచ పీడిత ప్రజలకు ఒక ఆశా రేఖగా రూపొందింది. విప్లవ శక్తులు పార్టీ ఏర్పాటును అభినందించాయి. దోపిడీ పాలక వర్గాలు పార్టీ దేశ అంతర్గత భద్రతకు 'అతి పెద్ద ప్రమాదం'గా వర్ణించాయి. ఐక్య పార్టీ మార్గదర్శకత్వంలో పార్టీ, ప్రజా సైన్యం, ప్రజా సంఘాలు, ప్రజా రాజ్యాధికార అంగాల నిర్మాణాలతో ఉద్యమం బలోపేతం అవుతున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అటవీ ప్రాంతంలో ఉన్న ప్రాకృతిక వనరుల దోపిడీకి, గనుల తవ్వకాలకు వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికీ విప్లవోద్యమం అడ్డుగా ఉందని భావించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరుస నిర్బంధ క్యాంపెయిన్‌లు చేపట్టసాగాయి. అందులో మొట్టమొదటివి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సల్వాజుడుం, ఝార్ఖండ్ రాష్ట్రంలో సేంద్ర.

సల్వాజుడుంను ఓడించే కృషిలో

పశ్చిమ బస్తర్ కుట్రు ప్రాంతం కేంద్రంగా ప్రారంభమైన సల్వాజుడుం ప్రధానంగా పశ్చిమ బస్తర్, దక్షిణ బస్తర్ ప్రాంతాలలో నడిచింది. గ్రామంలో ప్రజా వ్యతిరేక శక్తులను కూడగట్టి పాలక వర్గాల బంటైన ఆదివాసీ మాంఝీ కుటుంబానికి చెందిన కాంగ్రెస్ నాయకుడే అయినప్పటికీ భాజపాకు సహకరిస్తూ వచ్చిన మహేంద్ర కర్మ ద్వారా భారత రాజ్యం ఈ క్యాంపెయిన్ ను నడిపింది. 1990వ దశకం నాటి జన జాగరణ్ అభియాన్‌కు

కొనసాగింపుగా సల్వాజుడుం కోయ-గోండు ఆదివాసుల తరతరాల జీవనాన్ని, సంస్కృతిని మట్టి గలిపేందుకు ప్రయత్నించింది. అంతేకాకుండా ఈ ప్రజా వ్యతిరేక శక్తులతో ప్రత్యేక పోలీసు అధికారి (ఎస్‌పీఓ) అనే పదవిని సృష్టించి, వారి ద్వారా ప్రజలపై నానా రకాల భీభత్సం చేసింది. ఉద్యమంలో బలమైన పాత్ర వహించిన గ్రామాలను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రజలను హత్య చేసారు, అరెస్టు చేసారు, మహిళలను అత్యాచారం చేసారు. ప్రజల ఇళ్లను, ధాన్యాన్ని, పశువులను కాలబెట్టారు. సల్వాజుడుం క్యాంపెయిన్ ప్రజలపై తీవ్ర దమనకాండను అమలు చేసింది.

ఈ నిర్బంధ క్యాంపెయిన్‌ను ఎదుర్కొనేందుకు దండకారణ్యం ఎస్‌జడ్‌సీ కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో ప్రత్యేక ఎత్తుగడలు చేపట్టింది. పార్టీ కమిటీలు ప్రజలను అంటిపెట్టుకుని ఉన్నాయి. ప్రజా సంఘాలు ప్రజల సమస్యలను నిత్యం తెలుసుకుంటూ వారికి తగిన సహాయ సహకారాలు అందించాయి. ఆర్‌పీసీలు గ్రామం నుంచి భయంతో పారిపోయిన వారి ఆస్తులను కాపాడి, వారు తిరిగి వచ్చేందుకు మార్గం వేసాయి. పిఎల్‌జిఏ బలగాలను కేంద్రీకృతం చేసి పార్టీ సాయుధ బలగాలపై, ఎస్‌పీఓల క్యాంపులపై పెద్ద దాడులకు మార్గదర్శకత్వం అందించింది. గ్రామ గ్రామాన మిలిషియా బలోపేతం అయింది. సెంట్రీ, పాట్రోలింగ్‌లు ప్రజలకు సాధారణ అంశంగా మారాయి. దీంతో పాటుగా దేశంలోను, ఇతర దేశాలలోనూ కమిటీ సల్వాజుడుం గురించి ప్రత్యేక ప్రచారం చేసింది. సాగుతున్న అత్యాచారాల గురించి వీడియో తయారు చేసి పంపింది. ప్రజలలో ఒక సెక్షన్‌ను మెజారిటీ ప్రజలకు వ్యతిరేకంగా నిలబెట్టిన ఈ క్యాంపెయిన్ పట్ల దేశ, విదేశాలలో తీవ్ర నిరసన వ్యక్తమయింది. ఇది అంతర్జాతీయ నియమాలకు విరుద్ధమని విమర్శలు వెల్లువెత్తాయి. పార్టీ మార్గదర్శకత్వంలో పిఎల్‌జిఏ చిన్న, మధ్య తరహా, పెద్ద సైనిక చర్యలతో, ప్రజల మద్దతుతో సల్వాజుడుం ఓడిపోయింది. సంవత్సరం తరువాత ప్రజలు తిరిగి బలహీనపడిన ఆర్‌పీసీలను, ప్రజా సంఘాలను పునస్సంఘటితం చేసుకున్నారు. ప్రజా జీవనం యథాతథ స్థితికి చేరుకుంది. పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలు బలోపేతం కాసాగాయి.

ఆదివాసులకు ప్రాణ, ధన నష్టాలను కలిగిస్తూ, తరతరాల రీతి రివాజులను నాశనం చేస్తూ భారత రాజ్యం అమలు చేసిన సల్వాజుడుం ఉద్యమంపై చర్చను రేకెత్తించింది. ప్రజలే పార్టీపై తిరగబడుతున్నారని, ఇది ఉద్యమ వైఫల్యం అని, సిద్ధాంతానికి కాలం చెల్లిపోయిందని పత్రికలలో చర్చలు సాగాయి. గ్రామ ప్రజలలో కొందరు వ్యతిరేకులుగా మారి సల్వాజుడుంలో చేరడం, విప్లవోద్యమం ఇక ఓడిపోయిందంటూ ప్రభుత్వాలు చేస్తున్న మానసిక యుద్ధంతో నిజమని నమ్మి, భయపడి కొందరు ఊరు విడిచి 'రాహత్ శిబిర్'లకు వెళ్లి ఉండడంతో పార్టీ కేడర్‌లలోకూడా ఈ పరిస్థితిపై చర్చ

సాగింది. ఈ స్థితిలో కా. గణేష్ తన అవగాహనను కమిటీ సభ్యులతో చర్చించి సల్వాజుడుం పునాది, నడిచిన తీరు, ప్రజా వ్యతిరేకులను పాలక వర్గాలు ఏ విధంగా సమీకరించుకోగలిగాయి మొదలయిన అంశాలను విశ్లేషిస్తూ వ్యాసాలు రాసారు. ఇవి గెరిల్లా జోన్‌లో కేడర్ లకు, ప్రజలకు మాత్రమే కాకుండా, దానికి బయట ఉన్న ప్రజలలో కూడా ప్రచారమయ్యాయి. ప్రభుత్వ దమనకాండకు ఉన్న వివిధ కోణాలను వివరించాయి.

2006లో దండకారణ్యం మహాసభ జరిగింది. పార్టీ కమిటీలను కింది నుంచి పై వరకు పటిష్టపరచుకోలిగామని, శత్రు నిర్బంధ క్యాంపెయిన్‌లను విఫలం చేయగలిగామని, ఏరియా స్థాయి రాజ్యాధికార సంస్థలను నిర్మించి విజయం సాధించామని, ప్రజా సంఘాలను బలోపేతం చేసుకోగలిగామని ప్లీనం సమీక్షించింది. అయితే ప్రజలను, మిలిషియాను సాయుధం చేయడంలో ఇంకా వెనకబడి ఉన్నామని, యుద్ధ సంసిద్ధతను పెంపొందించుకోవాలని, కేడర్‌లను నాయకత్వంలోకి ఎదిగించుకోవడం కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసి ఉన్నదని, విశాల ప్రజారాశుల్లో పనికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తించినప్పటికీ తగినంత కృషి జరగలేదని సమీక్షించింది. ఈ సమీక్షపై ఆధారపడి, రానున్న కాలంలో ఉన్నత స్థాయి జనతన సర్కార్లను నిర్మిద్దామని, నూతన విస్తరణ ప్రాంతాలను త్వరత్వరగా గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేద్దామని, విశాల మైదాన ప్రాంతాలను పోరాట ప్రాంతాలుగా తయారు చేయాలన్న రాజకీయ కర్తవ్యాలను రూపొందించుకుంది. పార్టీ సభ్యత్వాన్ని మరింత విస్తృతం చేద్దామని, అభేద్యమైన రహస్య పార్టీని నిర్మిస్తూ పటిష్టం చేయాలని, స్థానిక నాయకత్వాన్ని అన్ని స్థాయిలో అన్ని రంగాల్లో త్వరత్వరగాఎదిగించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని, పిఎల్‌జిఏను పటిష్టం చేసుకుంటూ శత్రు క్యాంపెయిన్‌లను ఓడించే లక్ష్యంతో పని చేయాలని, బెటాలియన్ నిర్మాణానికి కృషి చేయాలని నిర్ణయించింది. కార్మిక, విద్యార్థి, ఉద్యోగ, మేధావి సెక్షన్‌లలోకి విస్తరించేందుకు కృషి చేయాలని, ప్రజా సంఘాలను బలోపేతం చేసుకోవాలని నిర్దేశించింది. దండకారణ్య ఉద్యమానికి మార్గదర్శకత్వం అందించే స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా కా. గణేష్ మహాసభలో వివిధ అంశాలపై చర్చలలో పాల్గొని తగిన కర్తవ్యాలు రూపొందించుకునేందుకు దోహదపడ్డారు.

ఆపరేషన్ గ్రీన్ హంట్, సమాధాన్లను ప్రతిఘటిస్తూ

సల్వాజుడుంను ఓడించిన తరువాత కొన్ని సంవత్సరాలకు తిరిగి 2009 సెప్టెంబర్‌లో భారత రాజ్యం దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. ఈ నిర్బంధ క్యాంపెయిన్‌కు అమెరికా సామ్రాజ్యవాద ఎల్ఐసీ వ్యూహం ఆధారం. గ్రామంలో అధికార వ్యవస్థ ప్రతినిధులను తమ పక్షం తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూ ప్రజలపై అణచివేత చర్యలు చేపట్టింది. సాయుధ బలగాల

సంఖ్యను పెద్ద ఎత్తున పెంచింది. గ్రామంలో ఇన్‌ఫార్మర్‌లను తయారు చేసుకుని దళాల కదలికలను తెలుసుకుంటూ దాడులు చేసేందుకు ప్రయత్నించింది. పార్టీపై విప్లవోద్యమంపై దుష్ప్రచారం చేపట్టింది. ఈ బహుముఖ దాడిలో పార్టీ, సైన్యం, ఐక్య సంఘటన నిర్మాణాలు గణనీయంగా ప్రభావితం అయ్యాయి. ఉద్యమ స్థితిలో క్రమంగా మార్పు రాసాగింది.

ఈ పరిస్థితిని అంచనా వేసేందుకు ఎస్‌జడ్‌సీ 2011 సెప్టెంబర్‌లో ప్లీనం నిర్వహించింది. ఈ ప్లీనం దండకారణ్యం ఉద్యమం గడ్డు స్థితికి చేరుకుందని సమీక్షించింది.ఉద్యమంలో వచ్చిన ఈ నూతన స్థితిని కా. గణేష్ సైద్ధాంతికంగా అర్థం చేసుకుంటూ ఆచరణలో సరిదిద్దేందుకు చెప్పుకోదగిన కృషి చేసారు. పార్టీని, ముఖ్యంగా నాయకత్వాన్ని శత్రు దాడి నుంచి రక్షించుకుంటూ అన్ని స్థాయిల్లో పార్టీ కమిటీలను పటిష్టం చేసుకోవాలని, అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని, ప్రత్యేక ఎడ్యుకేషన్ క్యాంపెయిన్లను చేపట్టి రాజకీయ–నిర్మాణ–సైనిక పంథాపై, వర్గ పంథా–ప్రజా పంథాపై లోతైన అవగాహన కల్పించాలని, పార్ట్ టైం పార్టీ సభ్యులందరినీ క్రియాశీలంగా పని చేయించాలని, పట్టణ, మైదాన ప్రాంతాల్లో పార్టీని పునర్నిర్మించేందుకు దీర్ఘకాలిక పథకంతో కృషి చేయాలని నిర్ణయించింది.

2013లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం దండకారణ్యం ఉద్యమం గడ్డు స్థితిలో, బీహార్–ఝార్ఖండ్ ఉద్యమం తాత్కాలిక వెనకడుగులో ఉన్నాయని అంచనా వేసింది. పార్టీ వ్యాప్తంగా బోల్షివీకరణ క్యాంపెయిన్ నిర్వహించాలని తీర్మానించింది. ఈ మేరకు కేంద్ర కమిటీ, మధ్య రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ) విడుదల చేసిన సర్కులర్‌లను కేడర్‌లలోకి తీసుకువెళ్లడంలో కా. గణేష్ విశేష కృషి సలిపారు.

ఉద్యమ గడ్డు స్థితిని అధిగమించే కృషిలో

2015 ప్లీనం దండకారణ్యంలో విప్లవోద్యమం మరింత గడ్డు స్థితికి చేరుకుందని సమీక్షించింది. గత ప్లీనం కర్తవ్యాలను అమలు చేయడంలో కొంత మేరకు సఫలం అయినప్పటికీ ఇంకా పూర్తిగా అధిగమించవలసిన అవసరం ఉన్నదని గుర్తించింది. బోల్షివీకరణ క్యాంపెయిన్ నడిపి ఒక సెక్షన్ కేడర్‌లను ఎదిగించుకున్నామని, నాయకత్వ శక్తులను కాపాడుకోగలిగామని, పరిమిత వనరులతో గెరిల్లా యుద్ధం కొనసాగించామని, ప్రజా రాజ్యాధికార అంగాలను నిలబెట్టుకోగలిగామని సమీక్షించింది. అయితే దిద్దుబాటులో ఆశించిన ఫలితాలు లేవని, విశాల ప్రజారాశులలో పనిని సంఘటితం చేసుకోలేక పోయామని సమీక్షించింది. ఈ సమీక్ష ఆధారంగా, రానున్న కాలంలో పార్టీ కమిటీల సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని పెంపొందించుకోవాలని కర్తవ్యం రూపొందించుకుంది. అలాగే సైనిక రంగంలో ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఓడించే లక్ష్యంతో గెరిల్లా యుద్ధం కొనసాగించాలని, విస్తరణపై కేంద్రీకరించాలని నిర్ణయించింది. సామాజిక పరిశోధనను

కొనసాగించి విశాల ప్రజలను విప్లవోద్యమంలో సమీకరించే ఎత్తుగడలను అభివృద్ధి చేయాలని, దెబ్బతిన్న ప్రజా రాజ్యాధికార అంగాలను, ప్రజా సంఘాలను బలోపేతం చేసుకోవాలని, ఎత్తుగడల ఐక్య సంఘటనను నడిపే నాయకత్వ శక్తులను తయారు చేసుకోవాలని, బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్మించేందుకు, నూతన ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించేందుకు కృషి చేయాలని నిర్ణయించింది.

ఎస్‌జడ్‌సీ సెక్రటేరియట్ సభ్యునిగా, దక్షిణ సబ్ జోనల్ బ్యూరో బాధ్యునిగా కా. గణేష్ ఈ సమీక్షలో భాగంగా ఉన్నారు. దక్షిణ బస్తర్, దర్భ డివిజన్‌లలో ప్లీనం నిర్ణయాలను అమలు చేయడంలో మార్గదర్శకత్వం అందించారు. డివిజనల్ కమిటీ కార్యదర్శిగా కూడా ఉండడంతో పశ్చిమ బస్తర్‌లో ఎక్కువగా కృషి చేసారు. ఎస్‌జడ్‌సీలో తన సహచర కమిటీ సభ్యులతో కలిసి పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలను నిలబెట్టుకునేందుకు తీవ్రంగా కృషి చేసారు.

2016 నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పెట్ సెక్యూరిటీ వ్యవస్థను మరింతగా విస్తృతం చేస్తూ, బలోపేతం చేస్తూ అటవీ ప్రాంతంలో అడుగడుగునా సాయుధ బలగాల క్యాంపులు ఏర్పాటు చేయసాగాయి. ఈ బలగాలు ప్రహార్ పేరుతో సైనిక గస్తీని, కూంబింగ్‌లను తీవ్రతరం చేసాయి. ఈ క్రమంలో పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలు నష్టాలు చవి చూడసాగాయి. ఇటువంటి పరిస్థితులలో ఉద్యమాన్ని నిలబెట్టేందుకు కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో ఎస్‌జడ్‌సీ నిర్దిష్ట ఎత్తుగడలు చేపట్టింది. ఆయా డివిజన్‌లలో ఉన్న అవకాశాలను బట్టి ప్రచార–ఆందోళనా కార్యక్రమాలు చేపట్టింది. ప్రజా పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయసాగింది. విశాల ప్రజానీకంలో కృషి చేస్తూ వారి నుంచి ప్రజా పోరాటాలకు మద్దతు సంపాదించేందుకు పని చేసింది. ఈ కృషిలో భాగంగా కా. గణేష్ విద్యార్థులను, ఉద్యోగులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం సంఘటితమై పోరాడవలసిన మార్గం సూచించేవారు. వారు విప్లవంలో పాల్గొనవలసిన ఆవశ్యకతను వివరించేవారు. ప్రజల సమస్యలలో, దేశ రాజకీయ పరిణామాలకు సంబంధించిన విషయాలలో గొంతెత్తవలసిన బాధ్యతను గుర్తు చేసేవారు. చిరు వ్యాపారులను కలిసి వారి సమస్యలకు కారణాలను, పరిష్కార మార్గాలను వివరించేవారు. పీడిత కార్మిక, రైతాంగ ప్రజల సమస్యతో జోడించి వారి సమస్యలు పరిష్కారం అవుతాయన్న అవగాహనను పెంపొందించేవారు.

కేంద్ర కమిటీలోకి

ఉద్యమంలో ఎగుడు దిగుడులు, మలుపులు మెలికలు, ఆటుపోట్లు ఉంటాయన్న స్పష్టమైన అవగాహనతో ఎప్పటికప్పుడు కేంద్ర, స్పెషల్ జోనల్ కమిటీలు ఎత్తుగడలు రూపొందిస్తూ వచ్చినప్పటికీ శత్రు వర్గాలు అమెరికా సామ్రాజ్యవాద ఎల్ఐసీ వ్యూహాన్ని

అమలు చేయడంతో క్రమంగా ప్రతికూలతలు చోటు చేసుకున్నాయి. దేశవ్యాప్త విప్లవోద్యమం తాత్కాలిక వెనకడుగులోకి వెళ్లిందని 2018లో జరిగిన సమావేశంలో కేంద్ర కమిటీ సమీక్షించింది. ఇటువంటి క్లిష్ట సమయంలో కా. గణేష్ కేంద్ర కమిటీలోకి కోఆప్ట్ అయ్యారు. కాంగ్రెస్ తరువాత 14 సంవత్సరాల కార్యాచరణను సమీక్షించిన కేంద్ర కమిటీ రాజకీయ నిర్మాణ సమీక్షను రూపొందించింది. ఉద్యమ పరిస్థితిపై అంచనాతో కేంద్ర, తక్షణ, ప్రధాన కర్తవ్యాలను మార్చుకుంది. అలాగే ప్రజా యుద్ధ క్షేత్రాలను విస్తరించుకోవాలని నిర్ణయించింది.

అప్పటికి దేశంలో ఉత్తర రీజనల్ బ్యూరో, తూర్పు రీజనల్ బ్యూరో, మధ్య రీజనల్ బ్యూరోలు పని చేస్తున్నాయి. దక్షిణ-పశ్చిమ రీజనల్ బ్యూరోగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఉద్యమం వివిధ స్థాయిలలో సాగుతున్నది. కాంగ్రెస్‌కు ముందు, కొన్ని నెలల తరువాత నాయకత్వ అమరత్వం, అరెస్టులతో ఇక్కడ ఉద్యమ నాయకత్వం నష్టపోయింది. అంతేకాకుండా వ్యూహాత్మక ప్రాంత పరిస్థితులను మదింపు వేసుకున్న కర్నాటక రాష్ట్ర కమిటీ కేంద్ర కమిటీతో సంప్రతించి వ్యూహాత్మక ప్రాంతాన్ని మల్నాడ్ నుంచి మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ట్రైజంక్షన్ కు మార్చాలని నిర్ణయించింది. అమరులు కా. యోగేష్ (కుప్పు దేవరాజ్) నేతృత్వంలో 2018లో ఎన్నో వ్యయప్రయాసలకు, త్యాగాలకు ఓర్చి పార్టీ, పిఎల్‌జిఏ బలగాలు ఈ ప్రాంతానికి చేరుకున్నాయి. మూడు దళాలుగా ఏర్పడి వివిధ ఆదివాసీ జాతులుగా నివసిస్తున్న ఇక్కడి ప్రజలలో రాజకీయ కృషి చేయసాగాయి. పశ్చిమ ఘాటీ స్పెషల్ జోనల్ కమిటీ ఏర్పడింది. రాజకీయ-సైనిక క్యాంపెయిన్ (పీఎంసీ) నడిపింది. ఈ క్యాంపెయిన్ ప్రజలపై మంచి ప్రభావం వేసింది. అయితే అనంతరం అనేక మంది అరెస్టయ్యారు. ఉద్యమ పురోగమనం కోసం మరింత మంది నాయకత్వ కేడర్‌లను, యోధులను పంపాలని కేంద్ర కమిటీ నిశ్చయించింది. కొందరు కమాండర్, డీవీసీ స్థాయి కామ్రేడ్స్‌తో సహా కా. గణేష్‌ను బదిలీ చేసింది.ఆ కాలంలో అట్టప్పాడిలో ఒక ఎదురుకాల్పుల ఘటనలో ఒక ఎస్‌జడ్‌సీ కామ్రేడ్‌తో సహా నలుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. కబిని, భవానీ దళాలలో ఇద్దరు సీనియర్ నాయకత్వ కామ్రేడ్స్ ఏనుగుల దాడిలో అమరులయ్యారు. మరి కొందరు అరెస్టయ్యారు. దాంతో క్రమంగా పశ్చిమ ఘాటీ ప్రాంత ఉద్యమం సాపేక్షికంగా బలహీనపడింది. ఈ ప్రాంతంలో పని చేస్తున్న కేంద్ర కమిటీ కామ్రేడ్స్ అరెస్టు కావడంతో వారితో బంధాలు తెగిపోయాయి. సంబంధాలు తిరిగి నెలకొనే వరకు కా. గణేష్ దండకారణ్యంలో తాను ఉన్న డివిజన్‌లలో ఎస్‌జడ్‌సీకి మార్గదర్శకత్వం అందిస్తూ వచ్చారు. డీవీసీ కామ్రేడ్స్‌కు క్లాసులు చెప్పారు. తాను చిరకాలం పని చేసిన పశ్చిమ బస్తర్ డివిజనల్ కమిటీ పత్రికకు, అమరుల జీవిత చరిత్ర రాసేందుకు మద్దతు అందించారు.

2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం ఉద్యమ పరిస్థితిని అంచనా వేసింది. స్వీయాత్మక శక్తులను కాపాడుకోవడం ఒక ముఖ్యమైన కర్తవ్యంగా మందుకు వచ్చిందని గుర్తించింది. ఇందుకోసం కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేసింది. రెండు సంవత్సరాలు గడచినా తిరిగి పశ్చిమ ఘాటీ ప్రాంతంతో సంబంధాలు పునరుద్ధరించుకోవడం సాధ్యం కాని స్థితిలో కా. గణేష్‌ను ఒడిశాకు బదిలీ చేసింది. ఒడిశా రాష్ట్ర ఉద్యమాన్ని బలోపేతం చేయడమే కాకుండా, మహానది దాటి ఝార్ఖండ్ వైపుగా విస్తరించే కర్తవ్యాన్ని చేపట్టి ముగ్గురు కేంద్ర కమిటీ కామ్రేడ్స్ ఒక బృందంగా పని చేస్తూ, ఒడిశా రాష్ట్ర కమిటీకి మార్గదర్శకత్వం అందిస్తూ వచ్చారు. కేంద్ర కమిటీ సభ్యులు కా. జైరాం, కా. మనోజ్, వారితో పాటుగా మొత్తం ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు అమరులయ్యారు. ఈ తీవ్ర నష్టాలలో సయితం విప్లవ పంథాపై విశ్వాసంతో, ప్రజల పట్ల అంకితభావంతో ఉద్యమాన్ని నిలబెట్టేందుకు కేడర్‌లతో కలిసి కృషి చేస్తూ వచ్చారు కా. గణేష్. లొంగుబాట్లను గట్టిగా వ్యతిరేకించారు. భారత విప్లవ పంథాను దృఢంగా విశ్వసించారు. ఆపరేషన్ కగార్ కలిగిస్తున్న నష్టాల నుంచి పార్టీని బయటపడవేసేందుకు కేంద్ర కమిటీ రూపొందించిన ఎత్తుగడలను అమలు చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తూ వచ్చారు.ఈ క్రమంలోనే ఒడిశా రాష్ట్రం కందమాల్ జిల్లాలో జరిగిన మరో దాడిలో అమరులయ్యారు.

ఆదర్శ కమ్యూనిస్టు, స్నేహశీలి కా. గణేష్

కా. గణేష్‌ను లొంగిపొమ్మని కోరాలని ప్రభుత్వం ఆయన తండ్రిపై ఒత్తిడి తీసుకువచ్చినప్పుడు, తన కొడుకు ప్రజల విముక్తి కోసం నక్సలైట్‌గా పని చేయడాన్ని గర్వంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రజలను, దేశాన్ని ప్రేమించిన అటువంటి తల్లిదండ్రుల ప్రజాస్వామిక చైతన్యం పొందిన కా. గణేష్ విప్లవ జీవితంలో దానిని నిలుపుకున్నారు. పై, తన, కింది కమిటీ కామ్రేడ్స్ అందరితో ప్రజాస్వామికంగా వ్యవహరించేవారు. ఆయన సహచరి అనారోగ్యంతో బాధపడుతూ, అటవీ ప్రాంత వాతావరణానికి సర్దుకోలేక ఇబ్బందిపడుతున్నప్పుడు కా. గణేష్ ఆమెకు కావలసిన సహకారం అందించారు. రాజకీయంగా అర్థం చేయిస్తూ, చికిత్స చేయిస్తూ ఆమెను ఉద్యమంలో నిలబెట్టడానికి ప్రయత్నించారు. అయితే ఆమె కొంత కాలానికి ఉద్యమాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఆ తరువాత గడచిన దశాబ్దం పైగా కాలంలో కా. గణేష్ తిరిగి వివాహం చేసుకోలేదు.

కా. గణేష్ కవి, రచయిత. 'లహర్' పేరుతో అనేక కవితలు రాసారు. దండకారణ్యం ప్రాంతంలో ఉద్యమంపై సాగుతున్న నిర్బంధంపై, విస్థాపన కారణంగా ప్రజలకు కలిగే నష్టాలపై వ్యాసాలు రాసారు. డివిజన్ బాధ్యునిగా డివిజన్ పత్రికకు రిపోర్టులు, వ్యాసాలు రాయడమే కాకుండా కేడర్ లతో రాయించేందుకు ప్రయత్నించేవారు. రాయడం తెలియదని భావించే ఆదివాసీ కామ్రేడ్స్ కు ఎలా రాయాలో వివరిస్తూ వారిని ప్రోత్సహించేవారు.

ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడి కేడర్‌లకు రిపోర్టులు చెప్పడం, వారి నుంచి తీసుకోవడం చేసేవారు. తాను ఉండగా భర్తీ అయ్యి, వేరే ప్రాంతానికి బదిలీ అయ్యి పని చేస్తున్న కేడర్‌లను మరిచిపోకుండా డివిజన్ పరిస్థితులు తెలియజేస్తూ ఉండేవారు. కలిసినప్పుడు చెప్పేవారు. వారు తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు ప్రోత్సాహం ఇచ్చేవారు.

ప్రజల పట్ల అపారమైన ప్రేమ, విప్లవం పట్ల అంకితభావం, కమ్యూనిస్టు ఆదర్శం ఉన్న కార్యకర్త, నాయకుడు కా. గణేష్. పుట్టిన ప్రాంతం ఏదైనా విప్లవ కార్యకర్తగా వెళ్లిన చోటనల్లా ప్రజలతో మమేకమయ్యారు. వారి నుంచి నేర్చుకుంటూ వారికి నేర్పుతూ వారి నాయకునిగా ఎదిగారు. అధిక కాలం పని చేసిన పశ్చిమ బస్తర్‌లో దాదాపు ప్రతి గ్రామం ఆయనకు పరిచయమే. సాధారణ పరిచయాన్ని మించి కా. గణేష్ స్థానిక ప్రజల చరిత్రను, సంస్కృతిని తెలుసుకున్నారు. వారి ఆధ్యాత్మిక నమ్మకాలయిన 'పేన్, మాతల్'ల గురించిన జ్ఞానం సంపాదించారు. ఇంటి పేర్లతో ముడిపడి ఉన్నసామాజిక సంబంధాలను అర్థం చేసుకోగలిగేవారు. తాను మార్గదర్శకత్వం అందిస్తున్న కింది కమిటీల సభ్యులతో, తన వద్ద రక్షణగా ఉన్న గార్డ్ కామ్రేడ్స్ తో ఆయన స్నేహపూర్వకంగా మెలిగేవారు. వారి సాధకబాధకాలు, వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సమస్యలను అడిగి తెలుసుకుంటూ వారు తమ శక్తి మేరకు విప్లవం కోసం పని చేసేలా ప్రోత్సహించేవారు. కేడర్‌ల ఆసక్తిని బట్టి ఆయా విషయాలలో వారు మరింత తెలుసుకునేందుకు తోడ్పడేవారు. ఆ రకంగా ప్రజలలో కేడర్‌లలో కా. గణేష్ చిరకాలం ఒక స్ఫూర్తిగానిలిచి ఉంటారు.

ఐక్య సంఘటనకు మార్గదర్శి,

బడి పిల్లల ఉపాధ్యాయుడిగా ప్రారంభమై

భారత ప్రజల నాయకుడిగా ప్రజలలో నిలిచిపోయిన

కామ్రేడ్ ఖాతా రామచంద్రారెడ్డి (రాజు దాదా)కి

ఎర్రెర్ర జోహార్లు!



కామ్రేడ్ ఖాతా రామచంద్రారెడ్డి (విజయ్, రాజు దాదా, జూరు దాదా) 60 సంవత్సరాల క్రితం తెలంగాణా రాష్ట్రం సిద్ధిపేట జిల్లా కొహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించారు. చిన్న నాటి నుంచి చదువుపై కామ్రేడ్ రామచంద్రారెడ్డికి మక్కువ ఉండేది. ప్రాథమిక చదువు పూర్తయిన తరువాత ఉన్నత చదువు పూర్తి చేసారు. అక్షర జ్ఞానంతో పాటుగా సామాజిక, విజ్ఞాన శాస్త్రల పట్ల ఇష్టం పెరిగింది. చదువుపై మక్కువతో పాటుగా పది మందికీ చదువు నేర్పాలన్న తపన ఆయనలో కలిగింది. ఈ తపనతో చదువు పూర్తయిన తరువాత టీచర్ ట్రైనింగ్ పొందారు. ట్రైనింగ్ తరువాత 19 సంవత్సరాల వయసులోనే కరీంనగర్ జిల్లా కాటారం మండలం పెంచికలపేటలో ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరారు. తరువాత కాలంలో కొహెడ సమీపంలో వరికోలుకు బదిలీ అయ్యారు. చదువు పట్ల ఇష్టంతో ఉద్యోగం చేస్తూనే డిగ్రీ చదువు పూర్తి చేసారు.

ఆ కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పంచాయితీ రాజ్ టీచర్స్ యూనియన్ ఏర్పడి పని చేస్తుండేది. చదువుతో పాటుగా సమాజం గురించిన ఆలోచనలు కలిగి ఉన్న కా. రామచంద్ర ఈ యూనియన్ లో చేరారు. యూనియన్ ద్వారా, ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల ద్వారా సమాజం పట్ల ఆయనలో స్పృహ పెరిగింది. సామాజిక, వైజ్ఞానిక పుస్తకాలు చదివేవారు. సమాజాన్ని మరింతగా అర్థం చేసుకోసాగారు. తాను చదివిన విషయాలను తోటి ఉపాధ్యాయులతో పంచుకునేవారు. విద్యార్థులలో ఆసక్తి పెంచే విధంగా వివరించేవారు. యూనియన్‌లో క్రియాశీలకంగా పని చేయసాగారు. ఉపాధ్యాయుల సమస్యలపై యూనియన్ చేపట్టిన వివిధ ప్రచార-ఆందోళనా కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు. ఈ కార్యకలాపాల క్రమంలో కా. రామచంద్రకు నాటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)(పీపుల్స్ వార్) పరిచయం అయింది.

పార్టీ రాజకీయాలు కామ్రేడ్ రామచంద్రారెడ్డి ఆలోచనలను పదును పెట్టాయి. టీచర్స్ యూనియన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యునిగా, ఆ తరువాత రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎదిగారు. ఈ క్రమంలో పార్టీ ప్రొక్షన్ కమిటీ సభ్యునిగా పార్టీ నిర్మాణంలో భాగమయ్యారు. పార్టీ ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో ఉపాధ్యాయ రంగంలో రాజకీయ కృషి సాగిస్తూ రాజకీయంగా ఎదిగారు. ఈ కాలంలోనే ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. 1989లో విప్లవోద్యమంలో వృత్తి విప్లవకారులుగా భర్తీ అయ్యారు. కార్యాచరణ క్రమంలో కా. రామచంద్రా రెడ్డి ఏరియా కమిటీ స్థాయికి ప్రమోట్ అయ్యారు.

పార్టీ నిర్ణయం మేరకు ఆనాటి మధ్య ప్రదేశ్, తరువాత కాలంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పుర్‌లో పని చేయసాగారు. కా. రామచంద్రారెడ్డి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా ప్రాక్టీసు చేసేవారు. రాయ్‌పుర్, భిలాయ్, దుర్గ్ పట్టణాలలో యువజనులలో

కార్మికులలో, వివిధ సెక్షన్స్‌లో విజయ్ పేరుతో రాజకీయ కార్యకలాపాలు నిర్వహించారు. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ నాయకత్వంలో పని చేస్తూ వచ్చారు. 1996లో డివిజనల్ కమిటీ స్థాయికి ప్రమోట్ అయ్యారు. ఈ ప్రాంతానికి బాధ్యునిగా ఉన్న కమిటీ సభ్యుడు 1997లో లొంగిపోయారు. కా. విజయ్, తరువాత కాలంలో డీకేఎస్‌జడ్‌సీ సభ్యునిగా అమరుడయిన కామ్రేడ్ శ్రీకాంత్, మరొకరితో కలిపి పార్టీ జిల్లా కమిటీని నిర్మించింది. సంవత్సర కాలం తరువాత కా. శ్రీకాంత్‌ను, మరొక సభ్యుణ్ణీ పార్టీ దండకారణ్యం గెరిల్లా జోన్ ప్రాంతానికి బదిలీ చేసింది.

పట్టణోద్యమ నాయకుడు

ఆనాటి నుంచి కా. విజయ్ రాయ్‌పుర్ పట్టణ ఉద్యమ బాధ్యునిగా కొనసాగారు. చొరవతో కృషి సల్పుతూ ప్రజా సంబంధాలను వివిధ రూపాలలో సంఘటితం చేసారు. రాయ్‌పుర్ నుంచి భిలాయ్, దుర్గ్‌ల వరకు సంబంధాలను విస్తృతం చేసుకుని క్రమంగా నిర్మాణాలు చేసారు. ఈ కాలంలో ఈ ప్రాంతాలలో పార్టీ సెల్స్, వివిధ రంగాలలో యూనిట్స్ నిర్మాణమయ్యాయి. కొందరు వృత్తిపర విప్లవకారులుగా సంసిద్ధులయ్యారు. వారి ద్వారా మరిన్ని సెక్షన్స్‌లోకి చొచ్చుకుపోయారు. ఈ కృషిలో భాగంగా, అందుకు అత్యంత అవసరమైన సైద్ధాంతిక అధ్యయనం చేసారు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని ఆచరణకు జోడించి ఉద్యమ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేసారు.

2001లో భాకపా (మా-లె) (పీపుల్స్ వార్), భాకపా (మా-లె) (పార్టీ యూనిటీ)లు భాకపా (మా-లె) (పీపుల్స్‌వార్) గా విలీనం అయిన తరువాత పార్టీ కాంగ్రెస్ నిర్వహించింది. ఈ కాంగ్రెస్ నిర్ణయం మేరకు ఎంసీసీఐతో అప్పటికి నిలిచిపోయి ఉన్న ఐక్యతా చర్చలను పార్టీ కొనసాగించింది. ఈ నిర్ణయాత్మక మలుపులో ఎస్‌జడ్‌సీ మార్గదర్శకత్వంలో కా. విజయ్ పట్టణ నిర్మాణాన్ని మరింతగా విస్తృతపరిచారు. 2004లో రెండు పార్టీలు భాకపా (మావోయిస్టు)గా ఐక్యం కావడం పట్టణ ప్రాంత ఉద్యమానికి కూడా ఎంతగానో ఊపునిచ్చింది. కా. విజయ్ ఇనుమడించిన ఉత్సాహంతో రాజకీయ కృషి కొనసాగించారు. నూతన పార్టీ ముందుకు తీసుకువచ్చిన సమన్వయ కృషిని అత్యంత శ్రద్ధతో నిర్వహించారు.

2006లో ఎస్‌జడ్‌సీ దండకారణ్యం జోనల్ మహాసభ నిర్వహించ తలపెట్టింది. ఈ మహాసభ సన్నాహాలలో కా. విజయ్ పాలు పంచుకున్నారు. మహాసభకు ప్రతినిధిగా హాజరై వివిధ దస్తావేజులపై చర్చల్లో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఈ మహాసభలో కా. విజయ్ ఎస్‌జడ్‌సీ సభ్యునిగా ఎన్నికయ్యారు. కమిటీ నిర్ణయించిన మేరకు రాయ్‌పుర్‌లో పనిని కొనసాగించారు. ఇద్దరు పిల్లలతో సాధారణ కుటుంబంగా సమాజంలో కలగలిసిపోయి పార్టీ కార్యకలాపాలు నిర్వహించారు. పట్టణ ఉద్యమ నిర్మాణాన్ని మరింత పురోగమింపజేసారు.

నిర్మాణ కృషితో పాటుగా దండకారణ్యం గెరిల్లా జోన్ ప్రాంతంలో సాగుతున్న సాయుధ పోరాటానికి అవసరమైన ఆయుధాలు తదితర సామగ్రిని అందించడంలో విశేష కృషి సలిపారు. ఈ పని కోసం ఎంతో సాహసంతో, చొరవతో వివిధ రంగాలలో వ్యక్తులతో, వ్యాపారులతో సంబంధాలు నెలకొల్పుకున్నారు. ఎంతో చాకచక్యంగా సాయుధ పోరాట అవసరాలు తీర్చారు. సాయుధ పోరాటానికి పట్టణ ప్రాంతం నుంచి అందవలసిన సహాయం ఏ విధంగా ఉండాలన్న విషయంలో ఈ కృషి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. క్రమంగా పట్టణ నిర్మాణంలోకి పార్టీ మరి కొందరు సీనియర్ కామ్రేడ్స్‌ను బదిలీ చేసింది.

పట్టణ ప్రాంత ఉద్యమ నిర్మాణంలో ఉన్న కా. విజయ్ ఈ ప్రాంత చరిత్రను, సంస్కృతిని, వర్గ, కుల, మత అంశాలను లోతుగా అధ్యయనం చేసారు. హిందీ భాషపై పట్టు సాధించారు. స్థానికునిగా వ్యవహరించగలిగారు. అలాగే దేశంలో వివిధ రాష్ట్రాల చరిత్రలను, దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలను అధ్యయనం చేసారు. దీంతో పాటుగా, దండకారణ్యం ఉద్యమంలో భాగం అయిన నాటి నుంచి, తనకు ఉన్న ఉపాధ్యాయ అనుభవంతో కేడర్‌ల ప్రాథమిక, రాజకీయ విద్యపై కేంద్రీకరించారు. దండకారణ్యంలో ఏర్పడిన మొబైల్ ఎకడమిక్ స్కూల్ (మాస్), మొబైల్ పొలిటికల్ స్కూల్ (మొపోస్) విభాగాల అభివృద్ధికి కృషి చేసారు. ఈ స్కూళ్ల పాఠ్యాంశాలను రూపొందించడంలో, ఉపాధ్యాయులకు శిక్షణా పద్ధతులను అలవరచడంలో కా. విజయ్ కృషి ఎంతైనా ఉన్నది. ఈ క్రమంలో ఎస్‌జడ్‌సీ దండకారణ్యం విద్యా విభాగ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రాజకీయంగా, శిక్షణాపరంగా బలోపేతం కావడంలో కా. విజయ్ మార్గదర్శకత్వం చాలా ముఖ్యమైనది. ఎస్‌జడ్‌సీ సభ్యునిగా తన కమిటీ సభ్యులతో కలిసి కేడర్‌ల సైద్ధాంతిక, రాజకీయ అవగాహన పెంపొందించేందుకు కా. విజయ్ విశేష కృషి సలిపారు.

భాకపా (మావోయిస్టు) ఏర్పాటు తరువాత ఇరు పార్టీల అపారమైన రాజకీయ, నిర్మాణపర, సైనిక అనుభవాలను మరింతగా సంఘటితం చేసేందుకు పార్టీ కాంగ్రెస్ జరప తలపెట్టింది. ఈ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌కు కా. విజయ్ ప్రతినిధిగా ఎన్నికయ్యారు. భారత విప్లవోద్యమ చరిత్రలో ఒక ముఖ్య ఘటన అయిన ఈ కాంగ్రెస్‌లో జరిగిన సైద్ధాంతిక, రాజకీయ చర్చలలో, ఆచరణపరమైన మధింపులో కా. విజయ్ క్రియాశీలంగా పాల్గొన్నారు. పార్టీ పంథాతో విభేదిస్తూ ఒకరిద్దరు ప్రవేశపెట్టిన ప్రత్యామ్నాయ దస్తావేజుపై చర్చ జరిపిన కాంగ్రెస్, దాన్ని ఏకగ్రీవంగా తిరస్కరించింది. విప్లవోద్యమ సుదీర్ఘ ఆచరణను సరిగా అర్థం చేసుకున్న కా. విజయ్ ఈ అన్ని చర్చలలో పాలు పంచుకుంటూ పార్టీ మౌలిక పంథాను దృఢంగా నిలబెట్టడంలో తన వంతు కృషి చేసారు.

ఆ తరువాత కాలంలో కాంగ్రెస్ రూపొందించిన కేంద్ర, తక్షణ, ప్రధాన కర్తవ్యాల అమలుకు క్రియాశీలంగా కృషి సలిపారు.

నిర్బంధ క్యాంపెయిన్‌లకు వ్యతిరేకంగా

2005 మధ్యలో ప్రారంభమై దాదాపు సంవత్సర కాలం భారత రాజ్యం సాగించిన సల్వాజుడుం నిర్బంధ క్యాంపెయిన్ కాలంలో, గ్రామాలలో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగిస్తున్న అకృత్యాలను ప్రపంచం దృష్టికి తీసుకురావడంలో కా. విజయ్ ఎనలేని కృషి చేసారు. గెరిల్లా జోన్‌లో ఉన్న చేతనా నాట్య మంచ్ కార్యకర్తలు వివిధ గ్రామాలలో జరిగిన బూటకపు ఎదురుకాల్పులు, ప్రజలపై దాడులు, మహిళలపై అత్యాచారాలపై ఒక లఘు చిత్రం తయారు చేసారు. దీనికి వ్యాఖ్యానం జోడించి, రాతపూర్వక నివేదికతో సహా దేశ, విదేశాలలో విస్తృతంగా ప్రచారం చేసారు. సల్వా జుడుం క్యాంపెయిన్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌పీఓ పేరుతో ప్రత్యేక పోలీసు అధికారి పదవిని సృష్టించింది. వీరంతా గ్రామాలలో ప్రజా వ్యతిరేక వర్గానికి చెందిన ఆదివాసులు. ఒక ప్రాచీన తెగ సముదాయంలో కొద్ది మందిని తమ పక్షం తయారు చేసుకుని మెజారిటీ ప్రజలపై దాడికి ఉసిగొల్పడం అంతర్జాతీయ నియమాలకు విరుద్ధం. ఈ అంశాన్ని తీసుకుని, ఆదివాసుల రక్షణకు దోపిడీ రాజ్యం రూపొందించిన వివిధ చట్టాలు పేర్కొన్న హక్కులను తీసుకుని, మేధావులను, ప్రజాస్వామికవాదులను, దేశభక్తులను కదిలించడంలో కా.విజయ్ విశేష కృషి సలిపారు.

పని పుంజుకుంటున్న సమయంలో ఈ యంత్రాంగంలో పని చేస్తున్న ఒక వ్యక్తి అరెస్టయ్యి కోవర్ట్ గా మారడంతో 2008లో తీవ్ర నష్టం జరిగింది. కా. విజయ్ ఇంటిపై దాడి జరిగింది. ఆయన జీవిత సహచరిని, మరొక మహిళా కామ్రేడ్ ను అరెస్టు చేసారు, పిల్లలను విచారించారు. ఆ సమయంలో కా. విజయ్ కమిటీ పని మీద వేరే చోటుకు వెళ్లి ఉండడంతో అరెస్టు తప్పించుకున్నారు. కా. విజయ్ ప్రధాన ముద్దాయిగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆయుధాల కేసును సృష్టించింది. అలాగే సల్వా జుడుం అకృత్యాలపై ప్రచారం చేసిన వీడియో విషయంలో సీడీ కేసు పేరుతో మరొక కేసును సృష్టించింది. ఈ కేసులలో ఈ ఇద్దరు మహిళా కామ్రేడ్స్ తో పాటుగా మరి కొందరిని కూడా చేర్చింది.

దండకారణ్య ఉద్యమ పురోగమనం కోసం కృషి

రాయ్‌పుర్‌లో ఉన్న పట్టణ యంత్రాంగం దెబ్బ తిన్న నాటి నుంచి కా. రాజు దాదా దండకారణ్యం గెరిల్లా జోన్ ప్రాంతంలో ఉండి పని చేస్తూ వచ్చారు. 2007లో ఎస్‌జడ్‌సీ మాడ్, ఉత్తర బస్తర్‌లతో కూడుకుని ఉన్న ఉత్తర బ్యూరో డివిజన్‌లను పునస్సంఘటితం చేసింది. 2007 ఆగస్టులో తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీ ఏర్పడింది. 2008 ఏప్రిల్ లో దండకారణ్యం చేరుకుని రాజుగా పేరు మార్చుకున్న కా. విజయ్ ఈ

కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అంతవరకు పట్టణ ప్రాంతంలో పని చేస్తూ గెరిల్లా జోన్ లో నిర్మాణపర బాధ్యతలు స్వీకరించిన కా. రాజు దాదా ఇక్కడి అవసరాలకు అనుగుణంగా తన్ను తాను మలుచుకున్నారు. ముఖ్యంగా అంతవరకు పరోక్ష జ్ఞానంగా ఉన్న సైనిక రంగంలో ఇప్పుడు ప్రత్యక్ష భాగస్వామ్యం, మార్గదర్శకత్వం అందించవలసిన అవసరం ముందుకు వచ్చింది. ఇందుకోసం సైనిక సాహిత్యం అధ్యయనం చేయడమే కాకుండా సైనిక రంగంలో పని చేస్తున్న కామ్రేడ్స్ నుంచి నేర్చుకున్నారు. కార్యాచరణ క్రమంలో కమిటీ సెక్రటేరియట్ సభ్యునిగా ఎన్నికయ్యారు.

ప్రజల మద్దతుతో పీఎల్‌జీఏ సైనిక చర్యలతో పార్టీ మార్గదర్శకత్వంలో సల్వా జుడుంను ఓడించిన తరువాత పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా రంగాలు తిరిగి నిర్మాణం కాసాగాయి. ప్రజా యుద్ధం బలోపేతం కాసాగింది. సల్వా జుడుం కాలంలో విస్తృతం అయిన గెరిల్లా యుద్ధంలో ప్రజల భాగస్వామ్యం దాని తరువాత కాలంలో మరింతగా పెరిగింది. మిలిషియా కమాండ్ లు ఏర్పడ్డాయి. ఆత్మ రక్షణ కోసం గెరిల్లా యుద్ధం తప్పనిసరి అన్న స్పష్టత ప్రజలలో ఏర్పడింది. విప్లవోద్యమం పురోగమనంతో పాటుగానే భారత రాజ్యం దాన్ని తుడిచిపెట్టేందుకు 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో మరో నిర్బంధ క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్ అమెరికా సామ్రాజ్యవాదుల ఎల్‌ఐసీ వ్యూహాన్ని అనుసరించి అమలు చేసింది. విప్లవోద్యమంపై బహుముఖ దాడి చేపట్టింది. ఉద్యమ ప్రాంతాలలో వేల సంఖ్యలో సాయుధ బలగాలను మొహరించింది. వివిధ కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాల అధికారులు ప్రజలలో బలహీన శక్తులను తమకు ఇన్ ఫార్మర్ లుగా తయారు చేసుకున్నారు. మానసిక యుద్ధంలో భాగంగా విప్లవోద్యమంపై దుష్ప్రచారం సాగించారు. గ్రామంలో అధికార వ్యవస్థను తమ పక్షం తిప్పుకునేందుకు ప్రయత్నించారు. ఈ నిర్బంధ కాలంలో స్థానిక నిర్మాణాలు దెబ్బ తిన్నాయి. దోపిడీ వర్గాలకు, ప్రజలకు మధ్య వైరుధ్యాలు పెరిగాయి. ఉద్యమం సాపేక్షికంగా బలహీనపడింది.

2011 సెప్టెంబర్ లో దండకారణ్యం ప్లీనం జరిగింది. ఈ ప్లీనంలో చర్చ కోసం ఎస్‌జడ్‌సీ రాజకీయ నిర్మాణ సమీక్షను రూపొందించింది. పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటన అంశాలలో గడచిన ఐదు సంవత్సరాలలో జరిగిన పాజిటివ్, నెగిటివ్ అంశాలను మధించి స్వయం విమర్శనా పూర్వకంగా ప్లీనంకు సమర్పించింది. రానున్న కాలంలో చేపట్టవలసిన ఎత్తుగడల గురించి పేర్కొంది. దీనిపై ప్లీనం ప్రతినిధులు తీవ్రంగా చర్చించారు. మార్పులు, చేర్పులు సూచించారు. అలాగే ఉద్యమ స్థితి గురించి ప్లీనంలో లోతైన చర్చ జరిగింది. సెక్రటేరియట్ సభ్యునిగా స్టీరింగ్ కమిటీలో భాగమై, అధ్యక్ష మండలికి సహకరిస్తూ ఈ చర్చలు ఫలవంతం అయ్యే విధంగా కా. రాజు దాదా తన

కమిటీ సభ్యులతో కలిసి కృషి చేసారు. ఈ ప్లీనం దండకారణ్య ఉద్యమం గడ్డు స్థితికి చేరుకుందని సమీక్షించింది. ఈ గడ్డు స్థితిలో చేపట్టవలసిన ఎత్తుగడలను చర్చించి రూపొందించింది. ఈ మేరకు పార్టీ మార్గదర్శకత్వంలో కృషి సాగింది.

2013లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం దండకారణ్యం గడ్డు పరిస్థితిలోకి వచ్చిందని, బీహార్–ఝార్ఖండ్ తాత్కాలిక వెనకడుగులోకి వచ్చిందని అంచనా వేసింది. పార్టీని తిరిగి బలోపేతం చేసుకోవడం కోసం కార్మికవర్గేతర ధోరణులను సరిదిద్దేందుకు బోల్షివీకరణ క్యాంపెయిన్ చేపట్టాలని తీర్మానించింది. ఈ మేరకు, పెడ ధోరణులకు ఉన్న సైద్ధాంతిక పునాదిని, పీఎల్‌జీఏ ఆచరణలో ఈ ధోరణుల వ్యక్తీకరణల గురించి వివరిస్తూ మధ్య రీజనల్ బ్యూరో (సీఆర్ బీ) రెండు సర్కులర్ లు విడుదల చేసింది. ఈ సర్కులర్ లను కేడర్ లకు అర్థం చేయించి, వారిలో రాజకీయ అవగాహన పెంపొందించేందుకు ఆయా డివిజనల్ కమిటీలు అధ్యయన శిబిరాలు నిర్వహించాయి. ఈ శిబిరాలలో ఈ సర్కులర్ లపై, దండకారణ్య చరిత్రలో వివిధ కాలాలలో చేపట్టిన ఎత్తుగడల గురించి క్లాసులు, చర్చలు నిర్వహించాయి. కేడర్ ల నుంచి విమర్శలు కోరాయి. ఈ ప్రక్రియలో తన కమిటీ సభ్యులతో కలిసి కా. రాజు దాదా ఎస్‌జడ్‌సీ సభ్యునిగా క్రియాశీలక భూమిక పోషించారు. చర్చలు ఫలవంతంగా జరిగే విధంగా మార్గదర్శకత్వం అందించారు. బోల్షివీకరణ క్యాంపెయిన్ లో భాగంగా స్పెషల్ జోనల్ కమిటీ విడుదల చేసిన కేంద్రీకృత ప్రజాస్వామ్యం మొదలయిన అంశాలపై సర్కులర్ లు రూపొందించడంలో ముఖ్య పాత్ర వహించారు.

ఎస్‌జడ్‌సీ అధికార ప్రతినిధిగా

ఈ కాలంలోనే ప్రధానంగా తూర్పు బస్తర్ డివిజన్ కు మార్గదర్శకత్వం అందిస్తూనే కా. రాజు దాదా ఎస్‌జడ్‌సీ అధికార ప్రతినిధిగా కూడా వ్యవహరించారు. రాష్ట్రంలో ఆర్థిక, రాజకీయ అంశాలపై, ఉద్యమపర విషయాలపై, నిర్బంధంపై ఆయా సందర్భాలలో పత్రికా ప్రకటనలు జారీ చేసేవారు. ఇందుకోసం జరుగుతున్న పరిణామాలను ప్రత్యేకంగా అధ్యయనం చేస్తూ, తన కమిటీ సభ్యులతో చర్చించి, పార్టీ అవగాహనను ప్రజలకు తెలియజేసేవారు. అంతర్జాలం ద్వారా ఈ పని జరిపేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుని నిర్వహించారు. తనతో ఉన్న స్టాఫ్ కామ్రేడ్స్ కు అందులో తర్ఫీదు ఇచ్చారు. పార్టీ అవగాహనను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియపరచడానికి ఇది దోహదం చేసింది. ఈ బాధ్యతలతో పాటుగా దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఉత్తర సబ్ జోనల్ బ్యూరో బాధ్యునిగా బ్యూరో పరిధిలో ఉన్న తూర్పు బస్తర్, మాడ్, ఉత్తర బస్తర్, రాజ్ నందగావ్–కాంకేర్ బార్డర్ డివిజన్ లను సమన్వయించారు. ఆయా డివిజన్ ల నిర్దిష్ట పరిస్థితుల మేరకు ఆయా డివిజన్ కమిటీలకు మార్గదర్శకత్వం అందించారు. ఆ ప్రాంతాల ప్రజల

సమస్యలపై పోరాటాలు చేపట్టే విధంగా వారికి అవగాహన కల్పించారు.

సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడి పెద్ద ఎత్తున దేశంలోకి వచ్చి పడుతూ దేశ యావత్తు రంగాలనూ కబ్జా చేసుకోసాగింది. పీడిత వర్గాలు, జాతులు ఆర్థికంగా తీవ్ర ఇక్కట్ల పాలు కాసాగాయి. దేశ ప్రాకృతిక వనరులను దోచుకునేందుకు అడ్డంగా ఉన్న మావోయిస్టు ఉద్యమాన్ని తుదముట్టించాలని దేశ పాలక వర్గాలు ఒక దాని వెన్నంటి మరొక నిర్బంధ క్యాంపెయిన్ లను చేపట్టసాగాయి. ఈ క్రమంలో ఉద్యమం సాపేక్షికంగా మరింత బలహీనపడుతూ వచ్చింది. 2015 ప్లీనం ఉద్యమం మరింత గడ్డు పరిస్థితిలోకి వచ్చిందని సమీక్షించింది. ఈ మేరకు చేపట్టవలసిన ఎత్తుగడలను చర్చించింది. 2016 నుంచి 'ప్రహార్' పేరుతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ లు కొనసాగించింది. 2017లో 'సమాధాన్' పేరుతో మరో నిర్బంధ సైనిక క్యాంపెయిన్ ప్రారంభించింది. దండకారణ్యం గెరిల్లా జోన్ వ్యాప్తంగా సాగిన ఈ దాడులలో ప్రజలు, పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలు దెబ్బ తిన్నాయి. గ్రామ స్థాయి నిర్మాణాలలో మార్పులు వచ్చాయి. ఉద్యమంలో ప్రతికూలతలు పెరిగాయి. ఈ క్రమంలో కా. రాజు దాదా దండకారణ్యం ఉద్యమాన్ని నిలబెట్టేందుకు కమిటీ సభ్యులతో కలిసి కృషి చేసారు. తీర్మానాల అమలులో జరుగుతున్న పొరపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వాటి గురించి కేడర్ లకు అవగాహన కల్పిస్తూ వచ్చారు. ప్రజా పోరాటాలను పెంపొందించేందుకు విశేషంగా కృషి చేసారు.

2019 డిసెంబరులో డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శి కామ్రేడ్ రామన్న అనారోగ్యంతో అమరులయ్యారు. ఈ నష్టాన్ని భర్తీ చేసేందుకు సెక్రటేరియట్ సభ్యునిగా కా. రాజు దాదా కమిటీ సమన్వయ కృషిని కొనసాగిస్తూ వచ్చారు. 2020లో జరిగిన దండకారణ్యం స్పెషల్ జోనల్ ప్లీనంలో దండకారణ్య ఉద్యమ స్థితిపై అంచనా విషయంలో లోతైన చర్చ జరిగింది. ఉద్యమం ఆటులో ఉన్నదని ప్లీనం అంచనా వేసింది. ఈ ప్లీనంలో కా. రాజు దాదా కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ప్లీనం తరువాత జరిగిన ఎస్‌జడ్‌సీ సమావేశం ఉద్యమ కర్తవ్యాలు నెరవేర్చేందుకు నిర్దిష్ట ఎత్తుగడలు రూపొందించింది. అయితే క్రమంగా ఉద్యమంలో ప్రతికూలతలు పెరిగాయి. ఉద్యమం మరింతగా బలహీనపడుతూ వచ్చింది. స్థానిక నిర్మాణాలు లక్ష్యంగా రాజ్యం దాడులు చేసింది. వారిని రకరకాలుగా లొంగదీసుకునేందుకు ప్రయత్నించింది. ఈ నిర్బంధ చర్యలను తిప్పికొట్టేందుకు కమిటీ సభ్యునిగా కా. రాజు దాదా కృషి చేసారు.

క్రియాశీల నాయకుడు

డీకే ఎస్‌జడ్‌సీ సభ్యునిగా, సెక్రటేరియట్ సభ్యునిగా, తరువాత కార్యదర్శిగా కా. రాజు దాదా కమిటీకి సంబంధించిన రాత పనులను అనేకం నిర్వహించారు. ప్రధానంగా ప్రభాత్ పత్రికకు కొన్ని సంవత్సరాల పాటు సంపాదకత్వం వహించారు.

ప్రభాత్ సంపాదకవర్గంలో ఉంటూ 2025 మార్చి 31వ తేదీన ప్రభుత్వ సాయుధ బలగాలు పట్టుకుని, క్రూరంగా హత్య చేసిన అమరురాలు కామ్రేడ్ గుముడవెల్లి రేణుకకు అపారమైన మద్దతు అందించారు. కా. రేణుక స్వయం కృషికి తోడుగా క్రమంగా పత్రికను స్వతంత్రంగా నిర్వహించే విధంగా సహకరించారు. రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిణామాలపై వ్యాసాలు రాసారు. దీంతో పాటుగా కమిటీ రూపొందించిన సర్కులర్ లు, సందేశాలు రాయడంలో కా.రాజు దాదా ముఖ్య భూమిక నిర్వహించారు. అవసరమయిన అనువాదాలు చేసారు. కమిటీ అధికార ప్రతినిధిగా గుడ్సా ఉసెండీ పేరుతో పత్రికా ప్రకటనలు ఇచ్చేవారు. కొద్ది కాలం తరువాత ఈ బాధ్యతలు వేరొకరికి అందించిన కమిటీ, 2014లో అతను పార్టీ నుంచి పారిపోవడంతో ఈ బాధ్యతను తిరిగి కా. రాజు దాదాకు అప్పగించింది. ఆనాటి నుంచి అధికార ప్రతినిధి పేరు వికల్ప్ గా కొనసాగుతున్నది.

వివిధ సందర్భాలలో విప్లవోద్యమ మిత్రులకు నిర్బంధంపై, ప్రజల స్థితిగతులపై అపీల్ రాసి పంపించారు. ఉద్యమంపై నిర్బంధం గురించి, విస్తాపన గురించి వివిధ సదస్సులకు పత్రాలు తయారు చేసి పంపించారు. దండకారణ్యం ఉద్యమాన్ని గురించిన సమాచారాన్ని దేశ, విదేశీ మిత్రులకు అందించడంలో, వారి నుంచి ఉద్యమానికి మద్దతును కూడగట్టడంలో ముఖ్య భూమిక నిర్వహించారు. పట్టణ ప్రాంతంలో పని చేస్తున్నప్పుడు ఏర్పడిన విస్తృత పరిచయాలను పురస్కరించుకుని గెరిల్లా జోన్ ప్రాంతంలో పని చేస్తూనే వారి నుంచి ఉద్యమానికి సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేసారు.

తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో కా. రాజు దాదాకు పట్టు ఉండేది. అయితే హిందీలో రాయడమే సులభంగా భావించేవారు. కమిటీ సమన్వయంలో భాగంగా రాసే ఉత్తరాలు కూడా హిందీలోనే రాసేవారు. హిందీ నేర్చుకోవలసిన అవసరాన్ని కేడర్ లకు నొక్కి చెప్పేవారు, అందుకు ప్రోత్సహించేవారు. గెరిల్లా జోన్ లో ఉండసాగిన తరువాత గోండీ-కోయ భాషపై కూడా అంతే పట్టు సాధించారు. ఈ భాషకు లిఖిత వ్యాకరణం లేనప్పటికీ కేడర్ లు, ప్రజలతో మాట్లాడుతూ, చర్చిస్తూ స్థానిక భాషా నియమాలను అర్థం చేసుకున్నారు. తన కమిటీలో, విద్యా విభాగంతో లోతైన చర్చలు జరిపి, కేడర్‌ల మాతృభాషలో ప్రాథమిక, రాజకీయ పాఠ్యాంశాలను రూపొందించేందుకు కృషి చేసారు. నిరక్షరాస్యులుగా పార్టీలోకి భర్తీ అయిన కేడర్ లు ప్రాథమిక చదువు నేర్చుకునేందుకు, వారిలో చదువుపై ఆసక్తి పెరిగేందుకు ఈ సమిష్టి కృషి ఎంతగానో తోడ్పడింది.

కా. రాజు దాదా విస్తృత అధ్యయనం, వివిధ రంగాలలో పరిజ్ఞానం, విశాల ప్రాపంచిక దృష్టి కమిటీ అభివృద్ధికి దోహదం చేసింది. కార్యదర్శిగా సుదీర్ఘ కాలం కొనసాగిన కా. కోసా దాదాకు, ఆ తరువాత ఈ బాధ్యతలలోకి వచ్చిన కా. రామన్నకు కా. రాజు దాదా రాజకీయంగా, రాత పనులలో మద్దతు ఇచ్చేవారు. కమిటీ పనిని సాకల్యం చేసేవారు.

వివిధ అంశాలలో సలహాలు, సూచనల ద్వారా కమిటీ అభివృద్ధికి కృషి చేసారు. బహుళ రంగాలలో ఉన్న పరిచయం, పరిజ్ఞానాలను పెంపొందించుకుంటూ, కమిటీకి కూడా అందించేవారు. భిన్నాభిప్రాయాలను ఓపికగా చర్చించి, ఐక్య అవగాహనకు వచ్చేందుకు చేయవలసిన కృషిలో కా. రాజు దాదా ఆదర్శంగా నిలుస్తారు. ఎటువంటి భిన్నాభిప్రాయం వినడానికైనా వెనుకా ముందు ఆడేవారు కాదు. ఓపికగా విని, ఓపికగా తన అభిప్రాయం వివరించేవారు. పార్టీలో దిద్దుబాటు ఉద్యమాన్ని నడపడంలో, వివిధ అంశాలపై ఆరోగ్యకరమైన చర్చ నిర్వహించడంలో ఈ వైఖరి కమిటీకి ఉపకరించింది. అలాగే క్రమం తప్పకుండా రిపోర్టులు రాసి పంపడంలో ఉండే అలక్ష్యం గురించి తన, కింది స్థాయి కమిటీలతో చర్చించి, ఎప్పటికప్పుడు అందే విధంగా కృషి చేసారు.

కేంద్ర కమిటీలోకి

2020లో కా.రాజు దాదా కేంద్ర కమిటీలోకి కోఆప్ట్ అయ్యారు. దండకారణ్యం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కేంద్ర కమిటీ ఇచ్చిన బాధ్యతలను కూడా నెరవేర్చారు. దేశవ్యాప్త పార్టీ సమన్వయంలో కా. రాజు దాదా కీలక పాత్ర పోషించారు. కేంద్ర కమిటీ రూపొందించిన దస్తావేజులపై లోతుగా చర్చించేవారు. కుల సమస్యపై పార్టీ అవగాహనా దస్తావేజులో ఛత్తీస్‌గఢ్, పంజాబ్ మొదలయిన రా(ష్ట్రాలలో ఉన్న సత్నామీల గురించిన చేర్పు కా. రాజు దాదా సూచించినదే. దస్తావేజులలో గానీ సర్కులర్ లలో గానీ రాసిన విషయాలను, శైలిని విమర్శనాత్మకంగా చూసి తగిన సలహాలు, సూచనలు ఇచ్చేవారు. తద్వారా వాటిని సుసంపన్నం చేయడంలో తన వంతు పాత్ర నిర్వర్తించారు.

కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న కామ్రేడ్ కటకం సుదర్శన్ 2023 మే 31వ తేదీన అమరుడు కావడంతో కేంద్ర కమిటీ ఈ బాధ్యతను కా. రాజు దాదాకు అప్పగించింది. ఆనాటి నుంచి ఆయన ఈ బాధ్యతను కూడా నిర్వర్తిస్తూ వచ్చారు. దేశ, అంతర్జాతీయ అంశాలపై పార్టీ అవగాహనను తెలియజేస్తూ ప్రకటనలు ఇచ్చారు.

2023లో పూర్తి కాలం కేంద్ర కమిటీ సభ్యునిగా బాధ్యతలు చేపట్టి డీకే ఎస్‌జడ్‌సీ కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. తీవ్రతరమవుతున్న నిర్బంధంలో దేశవ్యాప్తంగా ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాలలో ఉన్న పార్టీ కమిటీల మధ్య సంబంధాలు తెగిపోయాయి. సమన్వయం కోసం సాగుతున్న కృషిని మరింతగా ముందుకు తీసుకువెళ్లేందుకు కేంద్ర కమిటీ కా. రాజు దాదాకు బాధ్యత అప్పగించింది. దాంతో ఆయన వివిధ స్పెషల్ ఏరియాలు, స్పెషల్ జోన్ లు, రా(ష్ట్రాలలో పార్టీ కమిటీలను సమన్వయించే బాధ్యతను చేపట్టారు. దీంతో పాటుగానే కేంద్ర కమిటీ పట్టణ ప్రాంత పనిని పునర్నిర్మించాలన్న బాధ్యత అప్పగించడంతో 2024 నవంబర్ లో గెరిల్లా జోన్ విడిచిపెట్టి వెళ్లారు. పరిమిత వనరులతోనే అయినా నూతన బాధ్యతలు చేపట్టేందుకు తగిన సన్నాహాలు చేసుకుంటూ

ఉన్న తరుణంలో ప్రభుత్వానికి కా. రాజు దాదా ఉనికి తెలిసింది. రాయ్‌పుర్ పట్టణంలో కా. రాజు దాదాను పట్టుకుని సరెండర్ కావాలని చిత్రహింసలు పెట్టారు. అందుకు ఆయన అంగీకరించలేదు. ఇదే ప్రాంతంలో పోలీసులు అరెస్టు చేసిన కా. కోసా దాదా కూడా అందుకు అంగీకరించకపోవడంతో, ఛత్తీస్‌గఢ్–మహారాష్ట్ర సరిహద్దున అడవిలోకి తీసుకువెళ్లి ఇద్దరినీ క్రూరంగా కాల్చి చంపారు. ఎదురుకాల్పుల కట్టు కథ అల్లారు.

ఐక్య సంఘటనా రంగ నిపుణుడు

విప్లవంలో మూడు మంత్రదండాలలో మూడవదిగా ఉండే ఐక్య సంఘటనలో భాగంగా ప్రజా పోరాటాలను పెంపొందించేందుకు కా. రాజు దాదా విశేష కృషి జరిపారు. ప్రజా పోరాటాల నిర్వహణలో సమగ్రమైన పథకంతో సమర్థవంతంగా వ్యవహరించారు. ప్రజా పోరాటాలు చేపట్టాలన్న అవగాహన ఉండి, మహాసభలు, ప్లీనాలలో చర్చించినప్పటికీ వాటిపై శ్రద్ధ వహించడంలో పార్టీ వెనుకబడే ఉన్నది. ఈ విషయంలో 2020 ప్లీనంలో లోతుగా చర్చించి వెనువెంటనే కార్యక్రమం చేపట్టింది ఎస్‌జడ్‌సీ. అప్పటికి కార్పొట్ సెక్యురిటీ పేరుతో నూతన పోలీసు క్యాంపులు వేస్తుండడంతో ప్రజలలో వీటి పట్ల తీవ్ర నిరసన వ్యక్తం కాసాగింది. తమ పంట భూములను నాశనం చేస్తున్న, తమ మనుగడకు నష్టదాయకంగా తయారవుతున్న ఈ క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా, సమరశీలంగా పోరాటాలు చేయసాగారు. ఈ పోరాటాలకు దిశా నిర్దేశం అందించడంలో కా. రాజు దాదా పాత్ర ఎంతైనా చెప్పుకోవలసినది.

భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ఆదివాసీ ప్రాంతాలలో యావత్తు గ్రామ ప్రజల భాగస్వామ్యం ఉండేలా 'గ్రామసభ'కు అందించిన అధికారాల గురించి పార్టీ కమిటీలకు, ప్రజలకు వివరించారు. పంచాయత్‌రాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్ ఆక్ట్ (పెసా) చట్టం గురించి హిందీ, గోండీ–కోయ భాషలలో కేడర్‌కు క్లాసులు చెప్పారు. ఈ అవగాహనతో ప్రజలు తమ ప్రాంతంలో జల్–జంగల్–జమీన్ పై హక్కులను బలంగా ముందుకు తీసుకురాగలిగారు. అలాగే ఎక్కడికక్కడ గ్రామసభలు ఏర్పాటు చేసుకుని, విస్థాపనకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేసారు. ఈ కృషితో దేశవ్యాప్తంగా అటవీ ప్రాంతాలలో ఆదివాసుల భూములపై వారికి ఉన్న హక్కు, ఈ హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్న తీరు స్పష్టంగా ప్రపంచానికి తెలియవచ్చాయి.

2020 ఫిబ్రవరి నుంచి తూర్పు బస్తర్ లో కడియమెట్ట గ్రామంలో నూతన పోలీసు క్యాంపునకు వ్యతిరేకంగా ప్రజల పోరాటం ఆరంభమయింది. అంతకు కొద్ది సంవత్సరాల క్రితం నుంచే ఈ ప్రాంతంలో ఆమ్ దాయి అనే కొండపై ఇనుప ఖనిజం కోసం గనులు తవ్వే ప్రభుత్వ–కార్పొరేట్ ప్రయత్నానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేస్తున్నారు. ఈ

పోరాటాలు కొనసాగుతుండగానే ప్రభుత్వం ఈ గనులకు రక్షణగా సాయుధ బలగాల క్యాంపులు వేయసాగింది. ప్రజల పోరాటానికి స్పందనగా వివిధ పౌరహక్కుల, మానవ హక్కుల సంఘాలు, సామాజిక కార్యకర్తలు వారి వద్దకు వెళ్లారు. వారి సమస్యలు, డిమాండ్ లు తెలుసుకుని వారికి అండగా నిలిచారు. ప్రజలను ఇందుకు ఉత్తేజపరచిన వారిలో పార్టీ నాయకునిగా కా. రాజు దాదా ప్రముఖ పాత్ర వహించారు. ఈ పునాదితో ఆ తరువాత కాలంలో ప్రభుత్వ సాయుధ బలగాలు తమ ధర్నా శిబిరాన్ని ఖాళీ చేయించినా, తమపై నిర్బంధం ప్రయోగించినా కూడా ప్రజలు గట్టిగా నిలబడ్డారు.

ఈ పోరాటం ప్రేరణగా దండకారణ్యం వ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజలు ఎక్కడికక్కడ పోరాటాలు చేపట్టసాగారు. దక్షిణ బస్తర్ నుంచి ఉత్తర బస్తర్ వరకు దాదాపు 40 ప్రాంతాలలో ఈ శిబిరాలు నడిచాయి. ప్రజలు సంఘాలు పెట్టుకున్నారు. క్యాంపుల ముందు, బ్లాక్ కార్యాలయాల ముందు ప్రదర్శనలు చేసారు. నిరంతరం పోరాటం చేసారు. ఇందులో 2021 మే నెలలో దక్షిణ బస్తర్ ప్రాంతంలో సిలింగేర్ గ్రామం వద్ద జరిగిన పోరాటం ప్రముఖమైనది. సిలింగేర్ పోరాటం క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజల పోరాటానికి చిహ్నంగా మారింది. దేశవ్యాప్తంగా మేధావులను, సామాజిక కార్యకర్తలను ఆకర్షించడమే కాకుండా వారు తమ ప్రాంతాలలో ఆదివాసీ ప్రజలకు మద్దతుగా సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు దారి తీసింది. ఈ పోరాటాలను అణచివేసేందుకు ప్రభుత్వం ఆదివాసీ నాయకులను అరెస్టు చేసింది. మొత్తంగా దేశంలో ఆదివాసుల విస్థాపనా అంశంపై తీవ్రమైన చర్చ సాగింది. దేశ రాజ్యాంగం ఆదివాసులకు అందించిన హక్కులకు విరుద్ధంగా జరుగుతున్న విస్థాపనకు వ్యతిరేకంగా ప్రజల మద్దతు కూడగట్టింది. ఈ యావత్తు క్రమంలో కా. రాజు దాదా పాత్ర చాలా ముఖ్యమైనది.

కేడర్‌ల, ప్రజల హృదయాలలో నిలిచిపోయిన కమ్యూనిస్టు

తమతో సన్నిహితంగా మెలిగే కా. రాజు దాదా అంటే కేడర్ లకు ఇష్టం. ఎన్ని పనులున్నా, సమావేశాలలో ఉన్నా కా. రాజు దాదా సమయం తీసుకుని పిన్న వయస్కులతో చర్చించేవారు. వారి విధుల నిర్వహణలో, వారు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో ఓపికతో సలహాలు, సూచనలు ఇచ్చేవారు. కా.రాజు దాదాతో ఏ విషయంపైనైనా స్వేచ్ఛగా మాట్లాడవచ్చునన్న నమ్మకం కేడర్ లలో ఉండేది. పై స్థాయి కామ్రేడ్ అయినా, కింది స్థాయి కామ్రేడ్ అయినా ప్రజాస్వామిక దృష్టితో వ్యవహరిస్తూ వారికి నేర్పడమే కాకుండా, వారి నుంచి నేర్చుకునేందుకు, తెలుసుకునేందుకు ప్రయత్నించేవారు. కేడర్ లలో లోతైన అవగాహన పెంపొందేలా కృషి చేసేవారు.

విప్లవ పంథా పట్ల అచంచల విశ్వాసంతో ఆఖరి శ్వాస వరకు విప్లవం కోసం తపించిన వ్యక్తి కా. రాజు దాదా. ఆపరేషన్ కగార్‌లో జరుగుతున్న తీవ్ర నష్టాల మధ్య

పని విధానాన్ని ఏ విధంగా మార్చుకోవాలన్న విషయంపై కేడర్ లకు ఆచరణయుతమైన సూక్ష్మ అంశాలను వివరిస్తూ ఆఖరు సమయంలో ఒక వివరమైన లేఖ రాసి పంపించారు. శాంతి చర్చల పట్ల స్పష్టంగా ఉన్నారు. ఆయుధాలు విడిచిపెట్టకూడదని, పార్టీ పంథా పట్ల దృఢ సంకల్పంతో పని చేయాలని కేడర్‌లను కోరారు. పరిస్థితికి అనుగుణంగా అత్యంత రహస్య పద్ధతులలో చిన్న స్థాయిలోనే అయినా పార్టీని, ప్రజా సైన్యాన్ని కొనసాగించాలని, ఒక్కరు మిగిలినా విప్లవం కోసం ఊపిరి ఊదాలని పేర్కొన్నారు. ప్రజా పోరాటాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. లొంగుబాట్లను తీవ్రంగా వ్యతిరేకించారు. అంతకంటే ఇంటికి తిరిగి వెళ్లి అరెస్టు కావడం మేలన్నారు. కమ్యూనిస్టు విలువలను కాపాడేలా మన కార్యాచరణ ఉండాలన్నారు. విప్లవ కృషి కొనసాగించేందుకు ఎటువంటి కవర్స్ లోనైనా ఉండి పని చేయాలన్నారు.

విప్లవ ఉత్తమ పుత్రుడు, పేదల, ఆదివాసుల శ్రేయోభిలాషి మన కామ్రేడ్ రాజు దాదా. ఉద్దండ కార్యకర్త, దక్షత గల నాయకుడు. సూక్ష్మ దృష్టి, దూర దృష్టితో పని చేసిన యోగ్యుడు. స్నేహశీలి. ఆయన రాజకీయ ఆచరణతో, కమ్యూనిస్టు ఆదర్శాలతో కా. రాజు దాదా విప్లవ ప్రజలలో, కేడర్ లలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ఆయన ఆచరించిన విలువలను అమలు చేస్తూ ప్రజల కోసం రాజకీయ కృషి చేయడమే కా. రాజు దాదాకు మనం ఇవ్వగలిగే నివాళి.

ఆదివాసీ ప్రజల ముద్దు బిడ్డ,
ప్రజా సైన్య యుద్ధ కళల పురోగమన యోధుడు
కామ్రేడ్ హిడ్మాకుఎర్రెర్ర జోహార్లు!



బస్తర్ ఆదివాసీ ప్రజల ముద్దు బిడ్డ, భారత దేశ పీడిత ప్రజల విముక్తి మార్గంలో ప్రజా సైన్య పురోగమనానికి గొప్ప దోహదం చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ హిడ్మాను భారత రాజ్యం2025 నవంబర్ 18వ తేదీన కాల్చి చంపింది. అప్పటికి ఎంతో కాలంగా కామ్రేడ్ హిడ్మాను వెంటాడుతూ 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ పట్టణంలో పట్టుకున్నారు. లొంగిపొమ్మని చిత్రహింసలు పెట్టి, ఓడిపోయి, చివరకు ఆయన సహచరి కామ్రేడ్ రాజె, మరి కొందరు ప్రజా సైనిక కేడర్ లతో కలిపి అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ప్రాంతానికి తీసుకువెళ్లి అత్యంత క్రూరంగా కాల్చి చంపారు. ఎదురుకాల్పుల కట్టుకథ అల్లారు. ఆపరేషన్ కగార్ లో భారత విప్లవానికి, పార్టీకి, ప్రజా సైన్యానికీ వెంటనే పూడ్చుకోలేని మరో పెద్ద నష్టం కామ్రేడ్ హిడ్మా అమరత్వం.

కామ్రేడ్ హిడ్మా 47 సంవత్సరాల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ బస్తర్ ప్రాంతంలో సుక్మా జిల్లా పువ్వర్తి గ్రామంలో మధ్య తరగతి ఆదివాసీ కుటుంబంలో జన్మించారు. వ్యవసాయం చేసుకుని జీవనం గడిపే ఆదివాసీ కుటుంబంలో అన్ని పనులలో పాలు పంచుకుంటూ జీవించారు కా. హిడ్మా. ఆదివాసీ ప్రాంతాలలో సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడంతో కా. హిడ్మాఎక్కువగా చదువుకోలేకపోయారు. కామ్రేడ్ హిడ్మాకు ఇంకా ఊహ తెలియక ముందే విప్లవోద్యమం బస్తర్ లో ప్రవేశించింది.ఆడుకునే వయసు వచ్చే సరికి విప్లవ పార్టీ సాయుధ దళాలు గ్రామాలకు వస్తూ ప్రజలలో రాజకీయాలు ప్రచారం చేయసాగాయి. చిన్న నాటి నుంచి విప్లవ గీతాలు వింటూ పాడుతూ పెరిగారు కా. హిడ్మా. ఆదివాసుల జీవనంలో ఉండే కష్టాలను, లేమిని కళ్లారా చూస్తూ పెరిగారు. తమ కాలంలో జంగ్లాత్ (అటవీ శాఖ) వాళ్ల నుంచి ఎదుర్కొన్న దెబ్బలు, తిట్లు, కోళ్లు, పందులు ఎత్తుకుపోవడం, ఇదేంటని ప్రశ్నించినందుకు ఎదురైన మరింత అన్యాయం గురించి తాత, తండ్రుల నుంచి విన్నారు.వ్యవసాయం చేయడానికి నీటి పారుదల లేక వర్షాధారిత పంటల ద్వారా ఏడాదికి సరిపడా ధాన్యం అందక కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు చూస్తూ ఉన్నారు.ఈ సమస్యలకు కారణాలను, వాటికి పరిష్కార మార్గాన్ని చూపిస్తున్న పార్టీ రాజకీయాలను అర్థం చేసుకుంటూ ఈ ఆదివాసీ బాలుడు పెరిగాడు.

చురుకుగా ఉండే కా. హిడ్మా గ్రామంలో అందరికీ అభిమాన పాత్రుడు. చిన్న తనంలో ఆదివాసీ బాలల సంఘంలో చేరి గ్రామ కమిటీ, దళం చెప్పిన పనులు చేస్తూ వచ్చారు. దళంఎప్పుడు వచ్చినా వెంట ఉంటూ వారి వద్ద సమాజం గురించి, దేశం గురించి తెలుసుకునేవారు. కౌమార దశలోకి అడుగిడిన తరువాత మిలిషియాలో చేరారు. గ్రామ రక్షణలో పాలు పంచుకుంటూ, అందుకు అవసరమయిన పద్ధతులు నేర్చుకుంటూ

వచ్చారు. తమ ముందు తరాల వాళ్లు పడిన ఇబ్బందులు తిరిగి రాకుండా ఉండాలంటే, ప్రజలకు అన్యాయం చేసే వారి చేతిలో అధికారం ఉండకూడదని, ప్రజల చేతిలోనే అధికారం రావాలని తెలుసుకున్నారు. అధికారం రావాలంటే, యుద్ధం చేసి సాధించుకోవాలన్న అవగాహన పార్టీ అందించింది.

వయసు పెరుగుతున్న కొద్దీ సైనిక కార్యకలాపాల వైపు మొగ్గిన కా. హిడ్మా క్రమంగా యుద్ధ కళలు నేర్చుకోసాగారు. మిలిషియాకు పార్టీ అందించే శిక్షణ పొందారు. ఒక పక్క కుటుంబ వ్యవసాయ పనులలో పాలు పంచుకుంటూనే దళంతో కలిసి చిన్న పాటి సైనిక చర్యలలో పాలు పంచుకోసాగారు.కేవలం ఉత్సాహంతో కాకుండా, ఈ చర్యల ప్రయోజనాన్ని, ప్రభావాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ కా. హిడ్మా తన ఆలోచనా పరిధిని విశాలం చేసుకున్నారు. పార్టీ దస్తావేజులు, పత్రికలు, పుస్తకాలు చదువుతూ, దేశ యావత్తు ప్రజల సమస్యలకు మూలం ఒకటేనని, ప్రజల విముక్తి విప్లవం ద్వారానే సాధ్యం అని తెలుసుకున్నారు. ఈ క్రమంలో పార్టీలో పూర్తి కాలం పని చేయాలని సంకల్పించుకున్నారు. తన ఆలోచనను పార్టీ ముందు ఉంచారు. 1997 డిసెంబర్‌లో కా. హిడ్మా పార్టీలో వృత్తిపర విప్లవకారునిగా భర్తీ అయ్యారు.

అప్పుడు దండకారణ్యం స్పెషల్ జోన్ లో గ్రామ స్థాయి పార్టీ కమిటీల నిర్మాణం జరుగుతున్నది. ప్రజా మిలిషియా నిర్మాణాలను పెంచుకునేందుకు, గ్రామ రాజ్య కమిటీలను పెంపొందిస్తూ, సంఘటితపరుస్తూ, ఉన్నత స్థాయి రాజ్య కమిటీల నిర్మాణానికి పునాదులు వేసేందుకు కృషి సాగుతున్నది. సైనిక రంగంలో స్పెషల్ గెరిల్లా దళాల నిర్మాణాన్ని పెంచుకునేందుకు, కంపెనీల నిర్మాణ లక్ష్యంతో ప్లాటూన్ ల నిర్మాణంపై, ప్లాటూన్లను సాధారణ నిర్మాణ రూపంగా మలుచుకునేందుకు కేంద్రీకరించి పని సాగుతున్నది. ఈ కృషిలో భాగంగా ప్లాటూన్లుగాఎదిగించుకునే లక్ష్యంతో ఉన్న ఒక ఎల్‌జీఎస్‌లో కా. హిడ్మాను భాగం చేసింది పార్టీ. దళ సభ్యుడిగా కా. హిడ్మా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) కార్యకలాపాలలో భాగమయ్యారు.

ఎల్‌జీఎస్ సభ్యుడిగా

ఎల్‌జీఎస్ సభ్యుడిగా ఉంటూ కా. హిడ్మా కమాండర్ మార్గదర్శకత్వంలో, సైనిక చర్యలు చేసేందుకు అవసరమైన శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవడంపై శ్రద్ధ పెట్టారు. రోజువారీ కసరత్తు చేసేవారు. సైనిక డ్రిల్స్‌ను, వివిధ విన్యాసాలను నేర్చుకుంటూ, సహచర యోధులతో కలిసి వాటిని సాధన చేసేవారు. కా. హిడ్మా ఆసక్తి గమనించిన కమాండర్, పై కమిటీ సభ్యులు ఆయన పట్ల శ్రద్ధ వహించి నేర్పేవారు. దళంలో సీనియర్ సభ్యులు ఆంబుష్ లు చేసేందుకు రెక్కీలకు వెళ్లేవారు. శత్రు కదలికలు తెలుసుకునేందుకు ప్రజలను

నిత్యం కలుస్తూండేవారు. వారికి ప్రజా సైన్య ఆవశ్యకతను వివరించేవారు. పార్టీ పిలుపుల మేరకు ఆయా విప్లవ దినాల, నిరసన దినాల సందర్భాలలో కలిసి ప్రజలలో ప్రచారం గావించేవారు. వీరితో కలిసి కా. హిడ్మా ఆ కార్యక్రమాలలో భాగం అయ్యేవారు.

పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ఎత్తుగడలు అమలు చేస్తూ వస్తున్నాయి. జాయింట్ కో-ఆర్డినేషన్ కమిటీ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలను అణచివేత చర్యల్లో సమన్వయం చేసింది. ప్రజలపై నిర్బంధం తీవ్రతరమయింది. అరెస్టులు, దాడులు, క్రూరమైన చిత్రహింసలు సాగాయి. పోలీసు లాకప్పులలో హత్యలు జరిగాయి. మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. ప్రజల, దళాల కదలికల గురించి తెలుసుకునేందుకు ఇన్ఫార్మర్లను తయారు చేసుకున్నారు. పోలీసు బలగాలలోకి స్థానికులను తీసుకోసాగారు. అధునాతన సాధన సంపత్తిని సమకూర్చారు. ఉద్యమ ప్రాంతాల్లో గూఢచారులను తిప్పడం, దుష్ప్రచారం చేయడం, లొంగుబాటు పథకాలను ప్రకటించడం, సంస్కరణలను అమలు చేయడం మొదలయిన చర్యలు చేపట్టారు. ఈ ప్రభుత్వ దాడిని తిప్పికొట్టేందుకు డీకే ఎస్‌జెడ్‌సి ప్రజలలో రాజకీయ ప్రచారం గావిస్తూనే సైనిక శిక్షణను కూడా పెంపొందించింది. ఈ శిక్షణా కార్యక్రమంలో కా. హిడ్మా విద్యార్థిగా పాలు పంచుకుని యుద్ధ కళలను మరింతగా నేర్చుకున్నారు.

శత్రు నిర్బంధానికి దీటుగా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం రూపొందుతూ దోపిడీ ప్రభుత్వ సాయుధ బలగాలకు గట్టి దెబ్బలు ఇవ్వసాగింది. సైనిక చర్యలతో పాటుగా డివిజన్ లో జరుగుతున్న ప్రజా పోరాటాలకు ఎల్ జీఎస్ లు అండగా నిలిచాయి. ఈ పోరాటాల ప్రచారంలో పాలు పంచుకుంటూ, దళ సభ్యులు ప్రజల కష్టాలకు మరింత సన్నిహితమయ్యారు. కా. హిడ్మా ప్రజా సమస్యల పరిష్కారానికి, సైనిక చర్యలకు మధ్య ఉండే సంబంధం గురించి అర్థం చేసుకోసాగారు. ప్రభుత్వం విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టి వేయాలని చేపట్టిన జన జాగరణ్ క్యాంపెయిన్‌లో చురుకుగా ఉన్న గ్రామ పెద్దలను ప్రజా పంచాయితీల ముందు ప్రవేశపెట్టి ప్రజాభిప్రాయం మేరకు వారికి రకరకాల శిక్షలు విధించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఉండడం కా. హిడ్మా వర్గ పంథా-ప్రజా పంథాకు ఆచరణలో అన్వయాన్ని అర్థం చేసుకునేందుకు ఉపయోగపడ్డాయి. పార్టీ మార్గదర్శకత్వంలో సాగుతున్న ఈ విప్లవ కార్యకలాపాల ప్రభావంతో ప్రజలు ఉద్యమంతో, పార్టీతో మరింత మమేకమవసాగారు. యువతీ యువకులు దళాలలోకి భర్తీ కాసాగారు.

ఆయుధాల ఉత్పత్తిలో శిక్షణ

ప్రజా సైన్యంలోకి భర్తీ పెరుగుతుంటే, వారిని సాయుధం చేయవలసిన అవసరం

ముందుకు వచ్చింది. పార్టీ ఆయుధాల ఉత్పత్తిపై కూడా కేంద్రీకరించింది. ఇందుకోసం పార్టీ కొందరు కేడర్ లను ఎంపిక చేసి శిక్షణకు పంపించింది. ఇందులో కా.హిడ్మా కూడా భాగం అయ్యారు. సంవత్సర కాలం పాటు శిక్షణ పొందిన కా. హిడ్మాకు ఆయుధాల ఉత్పత్తి, మరమ్మత్తుపై ఆసక్తి పెరిగింది. దళంలో ఉంటూ వివిధ తుపాకులుమరమ్మత్తు చేస్తూ వాటిపై అవగాహన పెంచుకున్నారు. శిక్షణ వల్ల గ్రెనేడ్స్, గ్రెనేడ్ లాంఛర్స్, మైన్స్ ఉపయోగం గురించిన జ్ఞానాన్ని కూడా పెంపొందించుకునే అవకాశం లభ్యమయింది.

నిర్బంధానికి ప్రతిఘటనగా 2001 నుంచి పార్టీ ఎత్తుగడల ప్రతి దాడి క్యాంపెయిన్ (టీసీఓసీ) లను ప్రారంభించింది. నిర్ణీత సమయంలో సైనిక చర్యలు చేపట్టసాగింది. మొదటి టీసీఓసీ తరువాత ప్రభుత్వం సైనికపరంగా అనేక నిర్ణయాలు తీసుకుని అమలు చేసింది. బస్తర్ లో బీజాపూర్, నారాయణపూర్ లను పోలీసు జిల్లాలుగా ప్రకటించి అదనపు బలగాలను మొహరించింది. ఉద్యమ ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పోలీసు స్టేషన్లలో పోలీసుల సంఖ్యను పెంచుకోవడం, ఫోర్టిఫికేషన్లను బలోపేతం చేసుకోవడంతో పాటుగా ఆధునిక ఆయుధాలు, కమ్యూనికేషన్ సెట్స్ లాంటివి సమకూర్చుకున్నారు. ప్రజలను చీల్చే లక్ష్యంతో సంస్కరణలను కూడా పెద్ద ఎత్తున చేపట్టారు. ప్రజల ప్రతిఘటన పెరుగుతుండడంతో సాయుధ బలగాలు మరింత క్రూరంగా ప్రజలపై, ప్రజా సంఘాల కార్యకర్తలపై దాడులు చేసాయి. అరెస్టులు, ప్రజలపై కాల్పులు సాధారణమయ్యాయి. వారపు సంతలను బంద్ పెట్టించారు. ఈ నిర్బంధానికి ప్రతిఘటనగా ప్రజలు, పీఎల్‌జీఏ దళాలు దొరికిన అవకాశాన్ని జారవిడుచుకోకుండా ప్రభుత్వ సాయుధ బలగాలపై దాడులు చేసాయి. వారి దూకుడును కొంత వరకు అడ్డుకున్నాయి. ఈ ఆచరణ క్రమంలో కా. హిడ్మా రాజకీయ పరిస్థితికి, సైనిక చర్యలకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2005 మధ్య కాలంలో సల్వాజుడుం పేరుతో నిర్బంధ క్యాంపెయిన్ ను చేపట్టాయి. సల్వాజుడుం ప్రధానంగా పశ్చిమ బస్తర్, దక్షిణ బస్తర్ ప్రాంతాలలో నడిచింది. జుడుం బస్తర్ లో సృష్టించిన అమానవీయ భీభత్సకాండ మున్నెన్నడూ ఎరుగని జనహననాన్ని ముందుకు తెచ్చింది. వందల గ్రామాలు కాలి బూడిదై వల్లకాడులుగా మారాయి. మూడు వందలకు పైగా మంది ప్రజలు ప్రాణాలు అర్పించారు. ఎంతో మంది మహిళలు అఘాయిత్యానికి గురయారు. కోట్లాది రూపాయల ప్రజల ఆస్తులు ధ్వంసమయాయి. వేలాది మంది ప్రజలు శత్రు శిబిరాలలో మగ్గారు. ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్‌పీఓ) అనే పదవిని సృష్టించి, ప్రజా వ్యతిరేక శక్తులను అందులోకి తీసుకుని,వారి ద్వారా ప్రజలపై నానా రకాల భీభత్సం చేసారు. ఉద్యమంలో బలమైన

పాత్ర వహించిన గ్రామాలను లక్ష్యంగా చేసుకున్నారు.

ఈ నిర్బంధ క్యాంపెయిన్ ను ఎదుర్కొనేందుకు కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో దండకారణ్యం ఎస్‌జడ్‌సీ ప్రత్యేక ఎత్తుగడలు చేపట్టింది. పార్టీ కమిటీలు ప్రజలను అంటిపెట్టుకుని ఉన్నాయి. ప్రజా సంఘాలు ప్రజల సమస్యలను నిత్యం తెలుసుకుంటూ వారికి తగిన సహాయ సహకారాలు అందించాయి. ఆర్‌పీసీలు గ్రామం నుంచి భయంతో పారిపోయిన వారి ఆస్తులను కాపాడి, వారు తిరిగి వచ్చేందుకు మార్గం వేసాయి. పీఎల్‌జీఏ బలగాలను కేంద్రీకృతం చేసి పార్టీ సాయుధ బలగాలపై, ఎస్‌పీఓల క్యాంపులపై పెద్ద దాడులకు మార్గదర్శకత్వం అందించింది. ఈ ప్రతి దాడులలో పదేడ వద్ద మైన్ ప్రూఫ్ వాహనాన్ని విస్ఫోటనం చేయడం ఒక నూతన అనుభవం. సాంకేతికతతో విప్లవోద్యమాన్నితుడిచివేయగలం అన్న పాలక వర్గాల దూకుడుకు ఇది అడ్డుకట్ట వేసింది. ప్రతిఘటనా క్రమంలోగ్రామ గ్రామానామిలిషియా బలోపేతం అయింది. సెంట్రీ, పాట్రోలింగ్ లు ప్రజలకు సాధారణ అంశంగా మారాయి. ఈ క్యాంపెయిన్ లో ప్రజలకు జరిగిన అన్యాయం చూసి కా. హిడ్మాలోవర్గ కసి మరింత పెరిగింది. సైనిక ప్రతిఘటనతో పాటుగా ప్రజలు రాజ్య హింసకు వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు, విప్లవ దినాల సందర్భంగా సభలు, ప్రజల పోరాటాలకు మద్దతుగా ప్రచారం మొదలయిన కార్యక్రమాలు చేపట్టారు. ఈ అన్నింటితో సన్నిహితంగా ముడి వేసుకుని ఉన్న కా. హిడ్మా, విప్లవంలో మూడు అద్భుత ఆయుధాల ఆవశ్యకత గురించి,వాటి సమన్వయం గురించి మరింత స్పష్టంగా అర్థం చేసుకున్నారు.

కంపెనీలోకి కా. హిడ్మా

2006లో దండకారణ్యం స్పెషల్ జోనల్ మహాసభ జరిగింది. ఈ సభ సల్వాజుడుం తరువాత పరిస్థితిని, 2003లో జరిగిన దండకారణ్యం స్పెషల్ జోన్ ప్లీనం నిర్దేశించిన కర్తవ్యాల అమలుగా సాగిన ఆచరణను సమీక్షించింది. 2004 జులైలో మాడ్ లో కంపెనీ-1, ఆ తరువాత పశ్చిమ బస్తర్ లో కంపెనీ-2 ఏర్పడ్డాయి. సల్వాజుడుం కాలంలో వచ్చిన అనుభవాన్ని సంఘటితీకరించుకుంటూ సైనిక కమాండ్లు సబ్జోనల్, డివిజన్ స్థాయిలలో ఏర్పడ్డాయి. గెరిల్లా బేసులుగా ఉన్న ప్రాంతాల్లో ఏరియా కమాండ్స్ కూడా ఏర్పడ్డాయి. ప్రజా మిలిషియా వేల సంఖ్యలో అభివృద్ధి అయింది. గ్రామ రక్షక దళాలు, ప్రజా రక్షక దళాలు నిర్మాణం కావడంతో పాటుగా మిలిషియాప్లాటూన్ స్థాయిలో ఉనికిలోకి వచ్చింది. జన్మిలీషియాస్క్వాడ్స్ కూడా నిర్మాణమయ్యాయి. ప్రజల రాజ్యాధికార అంగాలుగా స్థానిక జనతన సర్కార్లు ఏర్పడుతూ ఏరియా స్థాయికి ఎదిగాయి. డివిజన్ స్థాయి కమిటీల దిశగా పని చేయసాగాయి. ప్రజా పోరాటాల్లో ప్రజలు విస్తృతంగా కదిలారు.

ప్రజా సంఘాలు పటిష్టమై జోనల్ స్థాయి సంఘాలుగా అభివృద్ధి అయ్యాయి. ఐక్య కార్యాచరణ కమిటీల నాయకత్వంలో ఎత్తుగడల ఐక్య సంఘటనకు పునాదులు పడ్డాయి.

కా. హిడ్మా కంపెనీ-2లో భాగమయ్యారు. ఈ కంపెనీ వివిధ సైనిక చర్యలు నిర్వహించి ప్రజల విశ్వాసం చూరగొంది. రెండు కంపెనీల అనుభవంతోను, అప్పటికి ప్రభుత్వ దాడి తీవ్రతరం అవుతుండడంతో ముందుకు వచ్చిన అవసరాల దృష్ట్యానూ పార్టీ మూడవ కంపెనీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నూతనంగా ఏర్పడిన కంపెనీలో కా. హిడ్మా కమాండర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ కంపెనీ దక్షిణ బస్తర్ లో కేంద్రీకరించేది. ఎల్ జీఎస్ సభ్యునిగా, కమాండర్ గా, కంపెనీ-2లో పీపీసీ సభ్యునిగా గడించిన అనుభవంతో కా. హిడ్మా కంపెనీ-3కి సమర్థవంతమైన నాయకత్వం అందించారు. తన సహ కమిటీ సభ్యులు, యోధులతో కలిసి యుద్ధ కళలపై పట్టు సాధిస్తూ కంపెనీని సమర్థవంతమైన ఒక యూనిట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేసారు.

ఉర్పల్ మెట్ట ఆపర్చ్యునిటీ ఆంబుష్

యుద్ధ విన్యాసాల్లో గుణాత్మక మార్పుకు తొలి అడుగు ఉర్పల్ మెట్ట ఆంబుష్. ఉద్యమాన్ని వెన్నంటి నిర్బంధం తీవ్రతరం కాసాగింది. దక్షిణ బస్తర్ లో నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాయుధ బలగాలతో సమన్వయంతో ప్రజలపై నిత్యం దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులను నిలువరించేందుకు పీఎల్‌జీఏ నిరంతరం ప్రజల ద్వారా సమాచారం తెలుసుకుంటూ, శత్రువుపై దాడులు చేసేందుకు ప్రయత్నాలు చేస్తూ ఉంది. అది 2007 జూలై. దక్షిణ బస్తర్ ప్రాంతంలో రెండు, మూడు గ్రామాలపై ప్రభుత్వ సాయుధ బలగాలు దాడి చేసాయి. వారి కదలికలను గమనిస్తూ దాడి కోసం కేంద్రీకృతం అయి ఉన్న కంపెనీ-3, ప్లాటూన్-4లకు మిలిషియా కబురు అందించింది. సమాచారం తెలిసిన వెంటనే పీఎల్‌జీఏ బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. అప్పటికి సాయుధ బలగాలు తిరిగి వెళ్లే క్రమంలో ఉన్నాయి. ప్రజా సైన్య దళాలు వెంటబడి ఉర్పల్ మెట్ట అనే ప్రాంతంలో చుట్టుముట్టాయి. కాల్పులు చేస్తూ వారిని వెంబడించాయి. బలగాలు కూడా కాల్పులు చేస్తూ వేగంగా తమ క్యాంపుల, స్టేషన్‌ల దిశగా పరుగులు పెట్టసాగాయి. ఈ క్రమంలో పీఎల్‌జీఏ బలగాలలో ఒకరు నేలకు ఒరిగారు. కొందరు గాయపడ్డారు. అయినప్పటికీ ఏ మాత్రం చెక్కు చెదరకుండా పీఎల్‌జీఏ పోలీసులను దాదాపు స్టేషన్‌ల వరకు తరిమికొట్టింది. 21 ఆయుధాలు స్వాధీనం చేసుకుంది. అమరుడయిన కామ్రేడ్‌లను, గాయపడ్డ వారిని తీసుకునివెళ్లింది.

ఈ ఘటన ప్రజలపై గొప్ప ప్రభావం వేసింది. ప్రజా సైన్యం పట్ల మరింత విశ్వాసం పెరిగింది. ఆనాటి నుంచి దక్షిణ బస్తర్ ప్రాంతంలో ఎప్పుడు ప్రభుత్వ సాయుధ

బలగాలు గ్రామాలలోకి వచ్చినా ప్రజలు చాలా దూరాల నుంచి కూడా అన్నం, జావ పట్టుకుని దాడి జరుగుతున్న ప్రాంతానికి పరుగులు పెట్టడం ప్రారంభమయింది.

ఈ విజయాన్ని పురస్కరించుకుని కా. హిడ్మానాటి పార్టీ ప్రధాన కార్యదర్శికి ఒక లేఖ రాసారు. 'సరైన కమాండింగ్, విన్యాసాలు, యుద్ధ నైపుణ్యం, గురి చూసి కాల్చడం, చివరి శ్వాస వరకు గొప్ప ధైర్యంతో పోరాడడం విజయానికి ప్రధాన కారణాలు' అని అందులో పేర్కొన్నారు. దీనికి జవాబుగా కార్యదర్శి,'ఇటీవల (2007 ఫిబ్రవరిలో) జరిగిన ఐక్యతా కాంగ్రెస్-తొమ్మిదో కాంగ్రెస్ లో గెరిల్లా యుద్ధాన్ని చలన యుద్ధంగా మలచాలన్న కర్తవ్యాన్ని నిర్దేశించింది... ఈ విజయం ఈ కర్తవ్యాన్ని పరిపూర్తి చేసేందుకు మీరు చేసిన కఠిన పరిశ్రమ ఫలితం. సాగుతున్న ప్రజా యుద్ధంలో ఈ చర్యను ఒక నమూనాగా తీసుకుందాం...'అని రాసారు.

బెటాలియన్ కమాండర్‌గా కా. హిడ్మా

సల్వాజుడుం సైనిక నిర్బంధ క్యాంపెయిన్ ను ఓడించిన తరువాత భారత పాలక వర్గాలు తమ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం కోసం ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో 2009లో మరో సైనిక నిర్బంధ క్యాంపెయిన్ ను ప్రారంభించాయి. అమెరికా సామ్రాజ్యవాదుల ఎల్ఐసీ విధానాన్ని అనుసరించి అమలు చేసిన ఈ క్యాంపెయిన్ ను ప్రతిఘటించేందుకు ఎస్‌జడ్‌సీ ఎత్తుగడలు రూపొందించి అమలు చేసినప్పటికీ సాపేక్షికంగా మార్పు వచ్చింది. ఈ సమయంలో దక్షిణ బస్తర్ లో ఉన్న అనుకూల పరిస్థితిని పురస్కరించుకుని పార్టీ బెటాలియన్ నిర్మాణానికి పూనుకుంది. కంపెనీ-3 బలగాలకు మరి కొన్ని పీఎల్‌జీఏ బలగాలను జోడించి పీఎల్‌జీఏలో మొదటిసారిగా ఉన్నత ఫార్మేషన్‌గా 2009లో బెటాలియన్ నిర్మాణం ముందుకు వచ్చింది. కా. హిడ్మా బెటాలియన్‌కు కమాండర్‌గా, కా. రామన్న బెటాలియన్ పార్టీ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్ నిర్మాణంతో పీఎల్‌జీఏ గెరిల్లా యుద్ధ చర్యలలో ఎంతో ముందడుగు సాధించింది.

పీఎల్‌జీఏ బలగాలను సాయుధం చేయడం, పెద్ద చర్యలకు అవసరమైన మోర్టార్ షెల్స్, రాకెట్ లు తయారు చేసుకునే అవసరం ముందుకు వచ్చింది. పార్టీ దిశా నిర్దేశంలో, మార్గదర్శకత్వంలో, ఆయుధ ఉత్పత్తి విభాగంలో ఏడాది కాల అనుభవం పునాదిగా కా. హిడ్మా బెటాలియన్ యుద్ధ చర్యలను విజయవంతం చేయడం కోసం ఆయుధాల తయారీ కోసం ఎంతో చొరవ చేసారు. తెలంగాణా కమిటీ మద్దతుతో, వివిధ రకాల వనరుల ద్వారా, బెటాలియన్ పార్టీ కమిటీ, కమాండర్‌లు, యోధుల సహకారంతో ఆయుధాల, ప్రధానంగా బ్యారెల్ గ్రెనేడ్ లాంఛర్స్ (బీజీఎల్స్) తయారీకి ఏర్పాట్లు చేయసాగారు. ఈ కృషిని ఎంతగా ముందుకు తీసుకువెళ్లారంటే 2018 చివరి నాటికి

దక్షిణ బస్తర్ లో ఒక భారీ ఆయుధ ఉత్పత్తి యంత్రాంగం ఏర్పడింది. శత్రు గస్తీల మధ్యనే ఈ యూనిట్ నాలుగు సంవత్సరాల పాటు విజయవంతంగా నడిచింది.

2011లో జరిగిన దీకే నాలుగవ మహాసభ ప్రథమ ప్లీనం ఉద్యమం గడ్డు పరిస్థితిలోకి వచ్చిందని సమీక్షించింది. పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా నిర్మాణాలను రక్షించుకుంటూ బలోపేతం చేసుకునేందుకు కర్తవ్యాలు రూపొందించుకుంది. అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని, పార్టీ కమిటీల పని విధానాన్ని మెరుగుపరచుకోవాలని, పై నుంచి కింది వరకు నాయకత్వాన్ని ఎదిగించుకోవడానికి ప్రత్యేక ఎడ్యుకేషన్ క్యాంపెయిన్లను చేపట్టాలని నిర్ణయించింది. 2013లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం పార్టీ వ్యాప్తంగా బోల్షివీకరణ క్యాంపెయిన్ నిర్వహించాలని పిలుపు ఇచ్చిన మేరకు దండకారణ్యంలో ఆ క్యాంపెయిన్ జరిగింది.అయితే ఉద్యమ పురోగమనానికి అవసరమైన స్థాయిలో ఎత్తుగడల అమలులో ఫలితాలు సాధించలేకపోవడంతో ఉద్యమం మరింత బలహీనపడింది. 2015లో జరిగిన దండకారణ్యం నాలుగవ మహాసభ రెండవ ప్లీనం నాటికి ఉద్యమం మరింత గడ్డు స్థితికి చేరుకుంది. ప్రతికూలతలు, సవాళ్లు ఎన్ని ఉన్నప్పటికీ వాటిని అధిగమించి పురోగమించే అవకాశాలు ఉన్నాయని గుర్తించింది. గ్రీన్ హంట్ ను ఓడించేందుకు యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకోవాలని, విశాల ప్రజానీకంలో పని చేసేందుకు కేంద్రీకరించాలని, బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటనను నిర్మించాలని మొదలయిన కర్తవ్యాలను చేపట్టింది. ఈ కర్తవ్యాలను అమలు చేస్తున్న క్రమంలో 2016 నుంచి ప్రహార్ పేరుతో ఆపరేషన్లు నడుపుతున్న భారత రాజ్యం 2017 మే లో 'సమాధాన్' పేరుతో మరో నిర్బంధ సైనిక క్యాంపెయిన్‌ను చేపట్టింది. ఉద్యమ పురోగమనానికి కృషి జరిగినప్పటికీ ఉద్యమం బలహీన స్థితి నుంచి చెప్పుకోదగిన విధంగా బయటపడలేదు. ప్రతికూలతలను అధిగమించలేదు.

మినప-జీరగూడెం, ధర్మవరం-టేకులగూడెం

2020 ప్లీనం దండకారణ్యం ఉద్యమం ఆటులోకి వెళ్లిందని సమీక్షించింది. పార్టీ, ప్రజా సైన్యం, ఐక్య సంఘటనా రంగాలలో తప్పొప్పులను క్షుణ్ణంగా చర్చించి, ఎక్కడికక్కడ పరిస్థితికి తగిన విధంగా ఎత్తుగడలు చేపట్టాలని అవగాహనకు వచ్చింది. ఆ ప్రకారంగా దండకారణ్యం స్పెషల్ జోన్ లో వివిధ డివిజన్ లలో కృషి సాగింది. అయితే భారత రాజ్యం బహుముఖ వ్యూహంతో చేపడుతున్న నిరంతర దాడులలో ఉద్యమం, నిర్మాణం, స్వీయాత్మక శక్తులుతీవ్రమైన నష్టాలు పొందుతూ వచ్చాయి. ఈ కాలంలో మినప, జీరగూడెంఆంబుష్ లు శత్రువుకు భయం పుట్టించాయి. ఆ తరువాత ప్రభుత్వ సాయుధ బలగాలు సైనిక పద్ధతులను మార్చుకుని, ఇటువంటి ఘటనలకు అవకాశం ఇవ్వకుండా

జాగ్రత్తపడ్డాయి. పార్టీ మార్గదర్శకత్వంలో పీఎల్‌జీఏ గెరిల్లా యుద్ధంలో చిన్న, మధ్య రకం చర్యలపై కేంద్రీకరించింది. ఏమైనప్పటికీ బలాబలాలలో ఉద్యమానికి ప్రతికూలమైన మార్పు రాసాగింది.

2022 సెప్టెంబర్‌లో హర్యానాలోని సూరజ్ కుండ్ పట్టణంలో కేంద్ర గృహ మంత్రి అధ్యక్షతన, ప్రధాన మంత్రి అంతర్జాల మాధ్యమం ద్వారా ఉద్దేశించి మాట్లాడిన కేంద్ర, వివిధ రా(ష్టాల పోలీసు ఉన్నతాధికారుల, ప్రభుత్వ ఉన్నతాధికారుల 'చింతన్ శిబిర్' సమావేశం విప్లవోద్యమ నిర్మూలనను లోతుగా చర్చించి బలమైన పథకం రచించింది. ఈ క్యాంపెయిన్‌లో పార్టీకి, పీఎల్‌జీఏకి, ఐక్య సంఘటనా నిర్మాణాలకూ తీవ్ర నష్టాలు కలిగాయి. సంవత్సర కాలం తరువాత సూరజ్ కుండ్ పథక అమలును సమీక్షించిన భారత ప్రభుత్వం 2024 జనవరి నుంచి ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది. కగార్‌ను ఓడించడం కోసం చేపట్టవలసిన ఎత్తుగడలు, స్వీయాత్మక శక్తుల రక్షణకు అవలంబించవలసిన పద్ధతులను పేర్కొంటూ కేంద్ర కమిటీ ఫిబ్రవరిలో ఒక సర్కులర్ విడుదల చేసింది. అలాగే అవకాశం ఉన్న చోట పెద్ద సైనిక చర్యలు చేయాలని నిర్ణయించింది.

ఈ మేరకు 2024 జనవరి 16వ తేదీన దక్షిణ బస్తర్–తెలంగాణా సరిహద్దున ధర్మవరం గ్రామంలో ఉన్న మూడు ప్రభుత్వ సాయుధ బలగాల క్యాంపులపై పీఎల్‌జీఏ పెద్ద దాడి చేసింది. ఫిబ్రవరి 3వ తేదీన టేకులగూడెం వద్ద ఆంబుష్ చేసింది. ఈ రెండు దాడులలో శత్రు బలగాలు తీవ్రంగా నష్టపోయినప్పటికీ ప్రకటించలేదు. ఈ విజయాల మాట ఎలా ఉన్నప్పటికీ కగార్ లో ఉద్యమం అన్ని రకాలుగా అత్యంత తీవ్రమైన నష్టాలు పొందుతూ వచ్చింది. అన్ని రంగాలూ దెబ్బ తిన్నాయి. 2024 ఆగస్టులో కేంద్ర కమిటీ మరో సర్కులర్ విడుదల చేసింది. ఈ సర్కులర్‌లో స్వీయాత్మక శక్తుల రక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ, ప్రజలను అంటిపెట్టుకుని ఉండి పరిమితంగా పనులు చేయాలన్న దిశా నిర్దేశం చేసింది. ఈ ప్రకారం పని చేస్తూ, నాయకత్వ, కేడర్‌ల రక్షణ కోసం బూబీట్రాప్ (ఐఈడీ)లను ఏర్పాటు చేయడంపై కేంద్రీకరించారు. గస్తీలకు వచ్చే పోలీసు బలగాలను ఇవి తీవ్రంగా ఆటంకపరచాయి. కర్రెగుట్టల పైకి రిట్రీట్ అయిన సమయంలో ప్రతిఘటించేందుకు ఇవి ఉపయోగపడ్డాయి. దండకారణ్య ఉద్యమానికి నాయకత్వాన్ని అందించడానికి పూనుకున్న కా. హిడ్మా, కదలికలకు తీవ్రమైన ఆటంకాలు ఏర్పడ్డ పరిస్థితిలో వికేంద్రీకృతం అయ్యే ప్రయత్నం చేస్తున్న క్రమంలో శత్రు చేత చిక్కారు.

సరైన అంచనా, నిర్దిష్ట పథకం, సాహస నేతృత్వం

కా. హిడ్మా అంటే ప్రజలకు, పీఎల్‌జీఏ కేడర్‌లకు గొప్ప హామీ, శత్రు బలగాలకు

చెడ్డ భయం. సైనిక చర్యల విజయాలకు కా. హిడ్మా ఒక్కడే కారణం అంటూ ప్రభుత్వం అతన్ని లక్ష్యం చేసుకుంది. అయితే కా. హిడ్మా హిడ్మా అయినందుకే ఈ విజయాలు సాధించలేదు. దేశం పట్ల, ప్రజల పట్లా అపారమైన ప్రేమ కలిగి ఉండి, మార్క్సిజం–లెనినిజం–మావోయిజం సిద్ధాంతం ఆవశ్యకతను అర్థం చేసుకుని, అధ్యయనం చేసి, దాని వెలుగులో రాజకీయ పరిస్థితిని అవగాహన చేసుకుని పార్టీ మార్గదర్శకత్వంలో, ఉద్యమావసరాలకు అనుగుణంగా అన్వయించిన ఒక అంకితబద్ధ విప్లవ కార్యకర్త అయినందుకే ఆయన విజయవంతమైన సైనిక చర్యలకు నేతృత్వం వహించగలిగారు.

దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో భాగంగా కా. హిడ్మాలో పెంపొందిన సైనిక నిపుణతకు నిదర్శనంగా చెప్పుకోగలిగిన కొన్ని ఘటనలలో 2010 ముకరం ఆంబుష్ ఒకటి. 76 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలను తుడిచిపెట్టి భారత పాలక వర్గాలను భయకంపితులను చేసిన ఈ ఘటనకు అమరుడు, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బీఆర్ మార్గదర్శకత్వంలో కా. హిడ్మా నేతృత్వం వహించారు. నిరంతర పోలీసు గస్తీలతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న ప్రజలకు రక్షణగా పోలీసు బలగాల దూకుడును నిలువరించేందుకు, టీసీఓసీ చేపట్టిన కాలంలో ప్రజల సహకారంతో పీఎల్‌జీఏ బెటాలియన్, ద్వితీయ బలగాలు కలిసి పథకం రచించి అదను కోసం వేచి ఉన్నాయి. చింతల్నార్ నుంచి వచ్చి పోతున్న పోలీసు బలగాల కదలికల గురించి సమాచారం తెలుసుకున్న ఆపరేషనల్ కమాండ్ తక్షణమే బలగాలను తీసుకుని ఆ ప్రాంతానికి వెళ్లింది. పోలీసు బలగాలను వెంట తరుముతూ, ఒకానొక చోట చుట్టుముట్టింది. ఫైర్ ఎండ్ మూవ్‌మెంట్ విన్యాసాలతో వారిని గట్టి దెబ్బ తీసింది. ఈ చర్య విజయవంతం చేయడంలో బెటాలియన్ లో కమాండర్‌లు, సభ్యులు, ద్వితీయ బలగాల కమాండర్‌లు అందరూ సాహసోపేతంగా పాల్గొన్నారు. నలుగురు యోధులు అమరులయ్యారు.

2017 ఏప్రిల్‌లో బుర్కపాల్ ఆంబుష్ మరో ప్రముఖ ఘటన. బుర్కపాల్ గ్రామంలో వంతెన నిర్మించేందుకు రక్షణగా వచ్చిన పోలీసులపై దాడి చేయాలని పీఎల్‌జీఏ పథకం వేసింది. వారు ఊహించని సమయంలో జరిగిన దాడితో గందరగోళానికి గరి అయ్యారు. ఇందులో 25 మంది చనిపోయి, 7గురు గాయపడ్డారు. 2020లో మినప ఆంబుష్ ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా గెరిల్లా బేస్‌లోకి చొరబడి దాడి చేసిన పోలీసు బలగాలపై చేసింది. ఈ ఆంబుష్‌లో దండకారణ్యంలో బెటాలియన్, ద్వితీయ, పునాది బలగాలు, తెలంగాణా బలగాలు కలిపి జాయింట్ కమాండ్ నేతృత్వంలో పాల్గొన్నాయి. ఎల్మగొండ గ్రామంపై దాడి చేసి మినప వైపు వెళుతున్న పోలీసు బలగాలపై చేసిన ఈ ఆంబుష్ లో 19 మంది కమాండోలు చనిపోగా మరో 20 మంది గాయపడ్డారు. పీఎల్‌జీఏ పోలీసు

బలగాల నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకుంది. 2022 నాటికి నక్సలైట్లను నిర్మూలిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న 'సమాధాన్' దాడులకు ఇది గట్టి దెబ్బ. ఈ ఆంబుష్‌లో మరో ముఖ్యమైన అంశం ఏమంటే, భారత సైన్య స్పెషల్ యూనిట్లు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలతో కలిసి పాలు పంచుకున్నప్పటికీ పీఎల్‌జీఏ విజయం సాధించడం. 2021 ఏప్రిల్ లో (స్టెకింగ్ ఫోర్స్ తో సహా రెండు వేల మంది కిరాయి అర్ధ సైనిక, పోలీసు, కమాండో బలగాలు దక్షిణ బస్తర్ జీరగూడెం గ్రామ అటవీ ప్రాంతంలోకి చొరబడి భారీ దాడికి దిగాయి. ఈ దాడిని పీఎల్‌జీఏ బలగాలు ప్రతిఘటించాయి. ఈ వీరోచిత ప్రతిదాడిలో 28 మంది పోలీసులు చనిపోయారు, 31 మంది గాయపడ్డారు, పట్టుబడ్డ ఒక సీఆర్‌పీఎఫ్ పోలీసును ఆ తరువాత విడిచిపెట్టారు. ఈ ఆంబుష్ లో పీఎల్‌జీఏ ఆయుధాలు, తూటాలు, సైనిక సామగ్రిని స్వాధీనం చేసుకుంది.

వైమానిక దాడిని తిప్పి కొట్టిన బెటాలియన్

2018 మధ్యలో 'ఆపరేషన్ హిడ్మా' పేరుతో దాడితో ప్రారంభించి ఆ తరువాత కాలంలో చేసిన డ్రోన్ దాడుల వరకు భారత రాజ్యం తమ సాయుధ బలగాలపై దూకుడుగా వస్తూ సింహస్వప్నంగా మారిన బెటాలియన్‌ను లక్ష్యం చేసుకుంది. నడిచి, లేదా వాహనాలపై వచ్చే బలగాలు దెబ్బ తింటుండడంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని 2021 నుంచి వైమానిక దాడులు నిర్వహించసాగాయి. మొదటిసారిగా 2021 సంవత్సరం ఏప్రిల్ నెలలో ఆచూకీ కనిపెట్టి దక్షిణ బస్తర్ బొత్తలంక–పాలగూడెం గ్రామాల మధ్య డ్రోన్లతో దాడి చేసింది. పీఎల్‌జీఏ బలగాలు మకాం మార్చడంతో దాడికి గురి కాలేదు. ప్రజలకు కూడా నష్టం వాటిల్లలేదు. 2022 ఏప్రిల్‌లో డ్రోన్లతో అర్ధరాత్రి పెద్ద దాడి చేసారు. నిర్దిష్ట సాంకేతిక, మానవ సమాచారంతో మూడు ప్రదేశాలలో చేసిన ఈ దాడిలో కార్యకర్తలకు, ప్రజలకు ప్రాణనష్టం జరగలేదు. వస్తు సామగ్రి, అటవీ ఉత్పత్తుల నష్టం కలిగింది.

2023 జనవరి 11వ తేదీన మరింత పెద్ద ఎత్తున డ్రోన్‌లు, హెలికాప్టర్‌లతో దాడి చేసారు. హఠాత్తుగా జరిగిన ఈ దాడితో పీఎల్‌జీఏ బలగాలు ఆశ్చర్యానికి గురి అయినప్పటికీ త్వరలోనే తేరుకుని ప్రతి దాడికి దిగాయి. ప్రతి దాడిలో భారత వాయు సేన గరుడ కమాండోలు ముగ్గురు చనిపోయారు. ఒక హెలికాప్టర్ తీవ్రంగా ధ్వంసమై, అతి కష్టంతో సమీపంలో ఉన్న నూతన పోలీసు క్యాంపులో దిగింది. ఈ వైమానిక దాడిలో బెటాలియన్ కు చెందిన ఒక మహిళా సభ్యురాలు అమరురాలయింది. ఈ యావత్తు దాడుల ప్రత్యక్ష కమాండింగ్‌లో కా. హిడ్మాది ముఖ్య పాత్ర. అందుకే ప్రభుత్వాలు

చేపడుతున్న నిర్బంధ క్యాంపెయిన్ లను విఫలం చేయడంలో ముందు పీఠీన నిలిచిన బెటాలియన్ ను, దాని కమాండర్ అయిన కా. హిడ్మాను అంతమొందించడానికి చాలా తీవ్రంగా ప్రయత్నం చేస్తూ వచ్చింది భారత రాజ్యం. ఈ యుద్ధంలో అంతిమంగా నిరాయుధంగా పట్టుబడ్డ కా. హిడ్మా వీరునిగానే అమరులయ్యారు.

బహుముఖ కర్త కా. హిడ్మా

ఉద్యమం కోసం బహుముఖాలుగా అభివృద్ధి చెందారు కా. హిడ్మా. సైనిక చర్యలలో పీఎల్‌జీఏ సభ్యులు గాయపడుతున్నారు. పట్టణ ప్రాంతాలలో ఆసుపత్రులకు పంపడం ప్రమాదకరం. అందువల్ల స్థానిక ప్రజా వైద్య విధానాన్ని తీసుకుని, శాస్త్రీయంగా ఒక పద్ధతిని అభివృద్ధి చేసేందుకు కా. హిడ్మా చొరవ చేసారు.పీఎల్‌జీఏలో వైద్యులుగా శిక్షణ పొంది విధులు నిర్వహించే కామ్రేడ్స్‌కు గ్రామాలలో మూలికా వైద్యం తెలిసిన వారి వద్ద నుంచి శిక్షణ ఇప్పించడమే కాకుండా, తాను కూడా నేర్చుకునే ప్రయత్నం చేసారు. ఇంగ్లీషు మందులపై కూడా అవగాహన పెంచుకున్నారు. గాయాలను బట్టి అల్లోపతి వైద్య విధానంలో ఉండే మందులు, మూలికల నుంచి తయారు చేసిన మందులు వాడుతూ గాయపడ్డ పీఎల్‌జీఏ సైనికులు తిరిగి యుద్ధ రంగంలోకి వచ్చే విధంగా కృషి చేసారు. ఇలా గాయపడ్డ వారి చికిత్స, విశ్రాంతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. శత్రువుపై చేసే యుద్ధ చర్యలలో సాహసంగా పోరాడేందుకు ఈ వ్యవస్థ కూడా యోధులకు హామీనిచ్చేది. మూలికా వైద్యంతో పాటుగా కా. హిడ్మా హోమియోపతి వైద్యంలో కూడా నైపుణ్యం సంపాదించారు. బెటాలియన్ సభ్యులకే కాకుండా, గ్రామ ప్రజలు కూడా అనారోగ్యం ఉన్నప్పుడు చికిత్స కోసం కా. హిడ్మాను సంప్రతించేవారు.

మాతృభాష తప్ప మరో భాష ఎరుగని కా. హిడ్మా హిందీ భాషపై శ్రద్ధ పెట్టారు. క్రమంగా మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత అధ్యయనం హిందీలో చేయగలిగేంత పట్టు సంపాదించారు. బెటాలియన్‌ను పీఎల్‌జీఏ ప్రధాన బలగంగా నడుపుతూ కా. హిడ్మా కేడర్‌ల అవగాహనను పెంపొందించేందుకు పత్రిక కూడా నడిపారు.'పీఎల్‌జీఏ చేతనా ప్రచార్ బుక్ లెట్' పేరుతో నడిచిన బెటాలియన్ పత్రిక కోసం ఒక సంపాదక వర్గాన్ని ఏర్పాటు చేసి దానికి మార్గదర్శకత్వం అందించారు. అమరుల జీవిత చరిత్రలతో పాటుగా, ప్రధానంగా వివిధ సైనిక చర్యల సమీక్షలు, యుద్ధ కళల గురించిన అవగాహనను అందించేందుకు కృషి చేసారు. అమరుల గురించి, సైనిక చర్యల అనుభవాల గురించి బెటాలియన్ సభ్యుల రచనలు కూడా ఈ పత్రికలో ప్రచురించేవారు.

కా. హిడ్మా చివరి వరకు అకుంఠిత విప్లవ దీక్షతో, పీడిత ప్రజల విముక్తి పట్ల

అంకితభావంతో, విప్లవ పంథా పట్ల దృఢ విశ్వాసంతో దీర్ఘకాలిక ప్రజా యుద్ధ క్రమంలో పార్టీ కమిటీలో, ప్రజా సైన్యంలో వివిధ స్థాయిలలో పని చేసారు. దేశం పట్ల, పీడిత ప్రజల పట్లా అవ్యాజమైన ప్రేమతో, వారి విముక్తి కోసం విప్లవం చేయాలన్న మొక్కవోని దృఢ సంకల్పంతో కా. హిడ్మా పోలీసు చిత్రహింసలను ఎదిరించి నిలబడ్డారు. ఎందరో శత్రువుకు లొంగిపోతూ విప్లవాన్ని విడిచివెళుతున్న తరుణంలో, శత్రువుకు వెన్ను చూపని వీర యోధుడు మన కా. హిడ్మా. మరణంలోనూ శత్రువును గడగడలాడించి అమరజీవులయ్యారు. ఆశయ సాధన కోసం శత్రు చేతిలో సయితం అచంచలంగా నిలిచిన కా. హిడ్మా ప్రజల హృదయాలలో ఎన్నటికీ నిలిచిపోతారు.

విప్లవంలో మూడు అద్భుత ఆయుధాలలో ఒకటైన ప్రజా సైన్యం యుద్ధకళలలోను, ఆయుధాల ఉత్పత్తిలోనూ అభివృద్ధి చెందడానికి అవిశ్రాంత కృషి సలిపినకాకలు తీరిన యోధుడు కామ్రేడ్ హిడ్మా యుద్ధ రంగం నుంచి నిష్క్రమించినా ప్రజా యుద్ధ ఆచరణలో నిత్యం కదలాడుతూనే ఉంటారు.

సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు కా. సహదేవ్ సొరేన్ కు విప్లవ జోహార్లు



కా. సహదేవ్ సొరేన్ కూడా అనేక మంది ఝార్ఖండ్ ఆదివాసీ కామ్రేడ్ల వలె చిన్నతనంలోనే విప్లవోద్యమంలోకి వచ్చాడు. గిరిడీహ్ ప్రాంతానికి చెందిన కా. సహదేవ్ ఉన్నత బాధ్యతలు స్వీకరించిన తరువాత గిరిడిహ్ జిల్లాకు ఆనుకొని ఉన్న జముయి, ముంగేర్ జిల్లాలోని మైదాన ప్రాంత పల్లెలు, అటవీ గ్రామాలలోని పల్లెలను విప్లవోద్యమంలో సంఘటిత పరిచే బాధ్యతలు చేపట్టాడు. తన సహచర కామ్రేడ్స్‌తో పాటు అక్కడ జోనల్ కమిటీ సభ్యుడిగా ఆ తరువాత రీజనల్ కమిటీ సభ్యుడిగా అక్కడ ఆర్గానిజేషనల్ కర్తవ్యాలను, సైనిక కర్తవ్యాలను కూడా చేపట్టే బాధ్యత నిర్వహించాడు. సైనిక చర్యలలో దిట్ట. ఎన్నో సైనిక చర్యలలో పాల్గొన్నాడు, ఎన్నింటికో నాయకత్వం వహించాడు. నూతన సిపిఐ మావోయిస్టు పార్టీ ఏర్పడిన తరువాత 2007 లో కాంగ్రెస్ జరపాలని సిసి నిర్ణయించింది. అప్పటికే ప్రభుత్వ ఇంటలిజెన్స్ వర్గాలకు కూడా కాంగ్రెస్ జరగబోతున్నదని తెలుసు. దానిపై దాడి చేసి మొత్తం మావోయిస్టు నాయకత్వాన్నే మట్టుపెట్టాలనేది వారి ప్లాన్. వాళ్ళకు ఏమాత్రం తెలియకుండా వాళ్ళు ఊహించని చోట నిర్వహించడం ఒక పెద్ద సవాలు. అప్పటి ప్రధాన కార్యదర్శి కా. గణపతి, అమరుడు కా. కిషన్ దా సంప్రదింపులు జరుపుకొని జముయి అడవులలో కాంగ్రెస్ జరపాలని నిర్ణయించారు. అది సాపేక్షికంగా చిన్న అడవి. దానిని పెద్ద ఎత్తున బలగాలు చుట్టుముడితే నష్టాలు చాలా తీవ్రంగా ఉంటాయి. అది దండకారణ్యం వంటిదో, సారండా వంటిదో అడవి కాదు. అక్కడ కాంగ్రెస్ వంటి అత్యంత ముఖ్యమైన సమావేశం జరపడానికి దేశమంతటి నుండి వచ్చే ప్రతినిధులను రిసీవ్ చేసుకొని విజయవంతంగా పదిహేను ఇరవై రోజుల పాటు కాంగ్రెస్ నిర్వహించి మళ్ళీ ప్రతినిధులను విజయవంతంగా బయటకు పంపించడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఆ కర్తవ్యాన్ని విజయవంతంగా నెరవేర్చే కర్తవ్యాన్ని అమరుడు కా. వివేక్, కా. సహదేవ్ నిర్వహించారు. అక్కడి ప్రజలపై, టెర్రైన్ పై అంత పట్టు కా. సహదేవ్‌కు.

ఆ కాంగ్రెస్ జరిగిన కొద్ది రోజులకే పొలిట్ బ్యూరో సభ్యుడైన కా. సునిర్మల్ అరెస్ట్ అయ్యాడు. రెండేళ్ల పాటు రాంచీ తదితర జైళ్ళలో గడిపాక ఒక కేసు నిమిత్తం లక్కిసరాయ్ కోర్టుకు తీసుకు వచ్చినప్పుడు పథకం వేసి కా. సునిర్మల్ ఎస్కార్ట్ పై పిఎల్‌జిఏ సైనికులు దాడి చేసి ఆయనను విడిపించుకొని పోయారు. ఆ దాడికి నాయకత్వం వహించిన వాళ్ళలో కా. సహదేవ్ ముఖ్యుడు. ఆ తరువాత 2012 ఆగస్టులో స్వయంగా కా. సహదేవ్ అరెస్ట్ అయి గిరిడిహ్ జైల్లో గడిపాడు. కానీ అక్కడి సహచరులతో కలిసి బయటి కామ్రేడ్స్ సహాయంతో తప్పించుకోవాలని ప్లాన్ చేసుకున్నారు. అరెస్టయిన మూడు నెలలలోనే నవంబర్ 2012 లో వ్యాన్‌లో పకడ్బందీ ఎస్కార్ట్‌తో కోర్టుకు తీసుకెళుతుండగా దానిపై విజయవంతంగా దాడిచేసి శత్రు నిర్బంధ శిబిరం నుండి వీరోచితంగా తప్పించుకొని

మళ్ళీ విప్లవానికి అంకితమయ్యాడు. ఆ తరువాత బిజే సాక్ సభ్యుడిగా, తరువాత కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగి చివరి వరకు విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తూ, చివరికి సెప్టెంబర్ 2025 లో గిరిడిహ్ ప్రాంతంలోనే ఒక ఎన్‌కౌంటర్ లో వీరోచితంగా పోరాడుతూ అమరుడయ్యాడు.

ఆ గొప్ప గెరిల్లా సైనిక వీరునికి, సిపిఐ మావోయిస్టు కేంద్రకమిటీ నాయకునికి విప్లవ జోహార్లు.



2026 అమరవీరుల సంస్మరణ దినం (జూలై 28) సందర్భంగా... 'ఆపరేషన్ కగార్' ప్రారంభమైన తర్వాత వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన కొంత మంది కేంద్ర కమిటీ (CC) నాయకుల సంక్షిప్త జీవిత చరిత్రలను ఈ సంకలనం ద్వారా మీ ముందుకు తెస్తున్నాము. ప్రపంచ సోషలిస్ట్ విప్లవంలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించే మహత్తర లక్ష్యం కోసం గత రెండేళ్లలో సుమారు 900 మంది యోధులు అమరులయ్యారు.

వీరంతా విభిన్న విప్లవ తరాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, గత ఐదు దశాబ్దాలుగా ఉద్యమాన్ని విభిన్న స్థాయిల్లో నడిపించారు.

అమరులైన కామ్రేడ్లు శ్రామికవర్గ ఎర్రజెండాను చేతబూని మృత్యువుకు ఎదురొడ్డి నిలిచారు. వారి జీవితాన్ని, వారి బలిదానాన్ని అధ్యయనం చేస్తే మనం ఎన్నో విషయాలను నేర్చుకుంటాము. వారి త్యాగాల నుండి పొందే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో విప్లవాన్ని పునర్నిర్మించడానికి కృషి చేయాలి. మన ప్రియతమ నేతల స్మృతులు విప్లవ శ్రేణులను నిరంతరం నడిపిస్తాయి.

ఈ మహోన్నత విప్లవ నేతల జీవితాలే భారతదేశంలో విప్లవ మార్గాన్ని తెలుసుకోవడానికి, దానిని ముందుకు తీసుకెళ్లడానికి ఒక బలమైన పునాది. కాబట్టి, విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడానికి ఈ అమరవీరుల జీవిత చరిత్రలను లోతుగా అధ్యయనం చేద్దాం. వారు చూపిన వెలుగుల బాటలో పయనిద్దాం. వారి రక్తంతో తడిసిన ఆ ఎర్రజెండాను మరింత ఎత్తుకు ఎగురవేస్తూ, వర్గ పోరాటాలను తీవ్రతరం చేస్తూ విప్లవోద్యమాన్ని నిర్మించడమే ఆ అమరులకు మనం అర్పించే నిజమైన నివాళి!

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)